

'నా అక్కలూ..చెల్లెళ్లు...తమ్ముళ్ల కళ్లలో వెలుగులు చూసినపుడే నా నిజమైన పుట్టిన రోజు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 17 సంచిక: 180

శుక్రవారం 14-3-2025

SIMULTANEOUSLY PRINTED AT CHENNAI | DELHI | VIJAYAWADA | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



భువిపై విరిసే ఇంద్రధనుస్సు

హోలీ సందర్భంగా ప్రత్యేక కథనాల సమాహారం - 11లో



మళ్లీ పసిడి పరుగు

ఢిల్లీలో 10 గ్రాముల బంగారం ధర రూ.89,450కి చేరిక - 13లో



డీ-డాకింగ్ సక్సెస్

ఇప్పటికే అనుసంధానం(డాకింగ్) ద్వారా ఒక్కటిగా జతకూడిన స్పెడెక్స్ ఉపగ్రహాలను ఇస్రో విజయవంతంగా వేరు చేసింది.

వివరాలు 6లో ▸



తమిళనాడులో 'రూ'పాయి రగడ

తమిళనాడు ప్రభుత్వం 'దేవనాగరి'లో ఉండే రూపాయి సింబల్‌ను బడ్జెట్ లోగో నుంచి తొలగించి.. తమిళ అక్షరం 'రూ'ను చేర్చింది.

వివరాలు 6లో ▸



బ్రిటిష్ మహిళపై అత్యాచారం

ఢిల్లీలోని ఓ హోటల్‌లో బ్రిటిష్ మహిళపై అత్యాచారం జరిగింది. ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

వివరాలు 6లో ▸



రన్యా రావు ఇళ్లపై ఈడీ దాడులు

బంగారం అక్రమ రవాణా కేసులో పట్టుబడిన కన్నడ నటి రన్యా రావు, ఆమె సన్నిహితుల ఇళ్లలో ఈడీ సోదాలు చేపట్టింది.

వివరాలు 6లో ▸

రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం

కూటమి ప్రభుత్వ పాలనపై గవర్నర్ జస్టిస్ నజీర్‌కు వైఎస్సార్‌సీపీ ఫిర్యాదు

ప్రజాస్వామ్యాన్ని ముఖ్యమంత్రి అపహాస్యం చేస్తున్నారు 2లో

ఒక వర్గానికి మాత్రమే మేలు చేయాలని అనడం దారుణం

సమాజంలో వివక్ష పెంచేలా సీఎం చంద్రబాబు వ్యాఖ్యలు

తక్షణం జోక్యం చేసుకోవాలి.. గవర్నర్‌కు వైఎస్సార్‌సీపీ విజ్ఞప్తి

రాష్ట్రంలో ప్రస్తుతం నెలకొన్న పరిణామాలపై గవర్నర్‌కు వినతిపత్రం అందజేసిన వైఎస్సార్‌సీపీ ప్రతినిధి బృందం



పల్నాడు జిల్లా పిన్నెల్లిలో గ్రామ బహిష్కరణకు గురైన ప్రజల గోడు వింటున్న మాజీ సీఎం వైఎస్ జగన్

అధైర్యపడొద్దు.. అండగా ఉంటా

నాయకులు, కార్యకర్తలు, మద్దతుదారులకు ధైర్యం చెప్పిన వైఎస్ జగన్

గురజాల నియోజకవర్గం పిన్నెల్లిలో గ్రామ బహిష్కరణకు గురైన దళిత, బీసీ, మైనార్టీ కుటుంబాలకు అండగా ఉంటామని భరోసా 2లో

పార్టీ కార్యాలయంలో వైఎస్ జగన్‌ను కలసిన పల్నాడు గ్రామాల ప్రజలు

న్యూస్‌రీల్

ఇంటర్‌లో కొత్త గ్రూప్ ఎంబైపీసీ



వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఇంటర్ విద్యలో పలు మార్పులు రానున్నాయి. జూన్ 1కి బదులు ఏప్రిల్ ఒకటి నుంచే ప్రభుత్వ జూనియర్ కాలేజీలు ప్రారంభమవుతాయి. మ్యాథ్స్-ఏ, బీ కలిపి ఒక సబ్జెక్టు.. బోటనీ-జువాలజీని కలిపి మరొక సబ్జెక్టుగా మార్చారు. 6 సబ్జెక్టులతో ఎంబైపీసీ గ్రూప్‌ను ప్రవేశపెట్టనున్నారు.

వివరాలు 14లో ▸

రేపటి నుంచి ఒంటిపూట బడులు



సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని పాఠశాలలకు ఈనెల 15 నుంచి ఒంటిపూట బడులు ప్రారంభం కానున్నాయి. ఏప్రిల్ 23 వరకు కొనసాగుతాయి. విద్యార్థులకు ఉదయం 7.45 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు తరగతులు నిర్వహిస్తారు. పదో తరగతి పరీక్షలు జరిగే పాఠశాలల్లో మాత్రం.. ఆ పరీక్షలు ముగిసే వరకు మధ్యాహ్నం 1.15 నుంచి 5 గంటల వరకు తరగతులు ఉంటాయి.

సెకీ ఒప్పందం రద్దు కుదరదు

ఎట్టకేలకు శాసనసభలో సీఎం చంద్రబాబు ఒప్పుకోలు



- ఇన్నాళ్లూ గత ప్రభుత్వం, వైఎస్ జగన్‌పై దుష్ప్రచారం
- ఇది అత్యంత చౌక ఒప్పందమని నిపుణుల ప్రశంసలు
- విద్యుత్ నియంత్రణ మండలీ సబబేనని పేర్కొంది
- దీంతో ఒప్పందం కొనసాగిస్తామని సామాజిక ఆర్థిక సర్వేలో సర్కారు వెల్లడి.. తప్పని పరిస్థితిలో ఇప్పుడు అసెంబ్లీ వేదికగా సీఎం స్పష్టీకరణ 2లో

పంచాయతీ ఎన్నికల జాప్యం..

ప్రజా సంక్షేమానికి విఘాతం



■ వివిధ రాష్ట్రాల్లో పంచాయతీ ఎన్నికల జాప్యం కారణంగా ప్రజాభివృద్ధికి విఘాతం కలుగుతోందని పంచాయతీరాజ్ వ్యవహారాలకు సంబంధించిన పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ఆందోళన వ్యక్తం చేసింది. సకాలంలో ఎన్నికలు నిర్వహించకపోవడంతో కేంద్రం నుంచి రావాల్సిన అభివృద్ధి నిధులు నిలిచిపోయాయని గుర్తు చేసింది. సకాలంలో ఎన్నికలు నిర్వహించేలా తగు చర్యలు చేపట్టాలని సిఫార్సు చేసింది. 6లో

ఈడీబీలో భారీ వేతనాలతో

22 మంది నియామకం

- కాంట్రాక్టు విధానంలో ఐదుగురు అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్లు 10లో
- పది మంది జనరల్ మేనేజర్లు, ఏడుగురు మేనేజర్ల నియామకానికి కూటమి ప్రభుత్వం అనుమతి
- అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్‌లకు నెలకు రూ.2.50 లక్షల నుంచి రూ.5 లక్షలు
- జనరల్ మేనేజర్లకు రూ.2 లక్షల నుంచి రూ.2.50 లక్షలు.. మేనేజర్లకు రూ.1.50 లక్షల నుంచి రూ.2 లక్షల వేతనం

క్లుప్తంగా...

మహిళల భద్రతకు శక్తి టీమ్‌లు

- డీజీపీ హరీశ్‌ కుమార్‌ గుప్తా



సాక్షి, అమరావతి: మహిళా భద్రత, సైబర్‌ నేరాల కట్టడి, డ్రగ్స్‌ నియంత్రణకు అధిక ప్రాధాన్యమిస్తున్నామని డీజీపీ హరీశ్‌ కుమార్‌ గుప్తా తెలిపారు. మంగళగిరిలోని రాష్ట్ర పోలీసు ప్రధాన కార్యాలయంలో ఆయన గురువారం విలేకరులతో మాట్లాడారు. మహిళల భద్రత కోసం శక్తి యాప్‌ను ఇప్పటికే ఆవిష్కరించామని చెప్పారు. రాష్ట్రంలో 164 శక్తి టీమ్‌లను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. సైబర్‌ నేరాల కట్టడికి ప్రత్యేకంగా సైబర్‌ వింగ్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. దర్యాప్తు, ఫోరెన్సిక్‌ విభాగం, శిక్షణ, ప్రజల్లో అవగాహన కల్పించడం మొదలైన కార్యక్రమాలను ఈ విభాగం చేపడుతుందన్నారు. ఇందుకోసం ప్రత్యేక హెల్ప్‌లైన్‌ నంబరును అందుబాటులోకి తెస్తామన్నారు. గతంలో ఉన్న పోలీస్‌ సేవా యాప్, ఇతర యాప్‌లను ప్రభుత్వ వాట్సాప్‌ గవర్నెన్స్‌ విధానంతో అనుసంధానిస్తామని చెప్పారు. ఇటీవల అఖిల భారత పోలీసు క్రీడల్లో పతకాలు సాధించిన పోలీసు సిబ్బందికి డీజీపీ హరీశ్‌ కుమార్‌ గుప్తా సర్టిఫికెట్లు ప్రదానం చేసి అభినందించారు.

ఐదుగురు ఎమ్మెల్సీలు ఏకగ్రీవంగా ఎన్నిక

సాక్షి, అమరావతి: ఎమ్మెల్యేల కోటాలో ఐదు ఎమ్మెల్సీ స్థానాలకు అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు రిటర్నింగ్‌ అధికారి ఆర్‌.వనితా రాణి ప్రకటించారు. గురువారంతో నామినేషన్ల ఉపసంహరణకు గడువు ముగిసింది. ఐదు స్థానాలకు పోటీలో ఉన్న ఐదుగురు అభ్యర్థులు కొణిదెల నాగేంద్రరావు(నాగబాబు), బీద రవిచంద్ర, బి.తిరుమలనాయుడు, కావలి గ్రీష్మ ప్రసాద్, సోము వీర్రాజు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు రిటర్నింగ్‌ అధికారి ప్రకటించారు. కాగా, ఐదుగురు ఎమ్మెల్సీలుగా ఎన్నికైనట్లు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్‌ యాదవ్‌ గెజిట్‌ నోటిఫికేషన్‌ విడుదల చేశారు.

2023-24లో జాతీయ సగటును మించి ఏపీలో విద్యుత్‌ సరఫరా

- ఇటీవల రాజ్యసభలో వెల్లడించిన కేంద్ర విద్యుత్‌ మంత్రిత్వ శాఖ

సాక్షి, అమరావతి: 2023–24 ఆర్థిక సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్‌ గ్రామీణ, పట్టణాల్లో జాతీయ సగటును మించి విద్యుత్‌ సరఫరా చేసినట్టు ఇటీవల రాజ్యసభలో కేంద్ర విద్యుత్‌ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. 2023–24 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రాల వారీగా సగటు రోజువారీ విద్యుత్‌ సరఫరా గంటలను కేంద్ర విద్యుత్‌ మంత్రిత్వ శాఖ రాజ్యసభలో తెలిపింది. గ్రామీణ ప్రాంతాల్లో జాతీయ సగటు రోజుకు విద్యుత్‌ సరఫరా 22 గంటలు చేయగా.. ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం 23.9 గంటలు చేసినట్టు పేర్కొంది. అలాగే పట్టణాల్లో జాతీయ సగటు రోజుకు విద్యుత్‌ సరఫరా 23.4 గంటలు చేయగా.. ఏపీలో మాత్రం 23.9 గంటలు సరఫరా చేసినట్టు తెలిపింది. దేశంలో రాష్ట్రాలతో పోల్చితే గ్రామీణ ప్రాంతాల్లో రోజుకు విద్యుత్‌ సరఫరా చేయడంలో ఏపీ నాలుగో స్థానంలో నిలిచింది. ఈ విషయంలో గోవా, మహారాష్ట్ర, గుజరాత్‌ మొదటి మూడు స్థానాల్లో నిలిచాయి. 2023–24 ఆర్థిక సంవత్సరంలోగ్రామీణ ప్రాంతాల్లో సగటు విద్యుత్‌ సరఫరా నాగాలాండ్, జమ్మూ–కాశ్మీర్, ఉత్తరప్రదేశ్, హరియాణ రాష్ట్రాల్లో 20 గంటల కంటే తక్కువగా ఉంది.

అధైర్యపడొద్దు.. అండగా ఉంటా

గురజాల నియోజకవర్గంలో నాయకులు, కార్యకర్తలకు ధైర్యం చెప్పిన వైఎస్‌ జగన్‌

మాచవరం మండలం పిన్నెల్లిలో గ్రామ బహిష్కరణకు గురైన దళిత, బీసీ, మైనార్టీ కుటుంబాలకు అండగా ఉంటామని భరోసా



గురజాల నియోజకవర్గ నాయకులతో మాట్లాడుతున్న వైఎస్‌ జగన్‌

సాక్షి అమరావతి, సాక్షి ప్రతినిధి, గుంటూరు: టీడీపీ కూటమి అధికారంలోకి రాగానే వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులు, మద్దతుదారులపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని పార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి మండిపడ్డారు. కూటమి సర్కారు అధికారంలోకి వచ్చిన అనంతరం పల్నాడు జిల్లాలో గ్రామ బహిష్కరణకు గురైన దళిత, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన దాదాపు 400 కుటుంబాలకు చెందిన బాధితులు వైఎస్‌ జగన్‌ను గురువారం పార్టీ కేంద్ర కార్యాలయంలో కలుసుకున్నారు. మాచవరం మండలం పిన్నెల్లి, తురకపాలెం, మాదినపాడు, చెన్నాయపాలెం, కొత్తగణేశునిపాడు గ్రామాలకు చెందిన వారంతా మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్‌ జగన్‌ను కలిశారు. టీడీపీ నేతలు ఎన్నికల ఫలితాల అనంతరం వైఎస్సార్‌సీపీ సానుభూతి పరులపై, ఇళ్లపై దాడులకు తెగబడి అక్రమ కేసులు బనాయించి పోలీసు స్టేషన్ల చుట్టూ తిప్పుతున్నారని తెలిపారు. ఈ అకృత్యాలను భరించలేక గ్రామాలు విడిచి ఇతర ప్రాంతాల్లో తల దాచుకుంటున్నట్లు ఆవేదన వ్యక్తంచేశారు. స్వగ్రామాలకు దూరంగా గడుపుతుండటంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు చెప్పారు. వైఎస్సార్‌సీపీ సానుభూతి పరులనే కారణంతో తమను ఊరి నుంచి బహిష్కరించారని, గ్రామంలోకి వస్తే చంపేస్తామని టీడీపీ కూటమి నేతలు బెదిరిస్తున్నారని పిన్నెల్లి గ్రామానికి చెందిన బాధిత కుటుంబాల సభ్యులు వైఎస్‌ జగన్‌ ఎదుట వాపోయారు. 'అధైర్యపడొద్దు.. మీకు అన్ని విధాలా అండగా ఉంటాం..' అని వారికి వైఎస్‌ జగన్‌ ధైర్యం చెప్పారు. బాధిత కుటుంబాలకు అండగా నిలిచి వారికి పూర్తి న్యాయ సహాయం అందిస్తామని భరోసా ఇచ్చారు. కాగా, వచ్చే రెండు నెలల్లో 'చలో పిన్నెల్లి' కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ సిద్ధమవుతోంది. గ్రామ బహిష్కరణపై న్యాయపరంగా కూడా హైకోర్టులో పోరాడుతోంది.

దహన సంస్కారాలకూ నోచుకోని దుస్థితి



టీడీపీ శ్రేణుల దురాగతాలతో గ్రామం విడిచి వెళ్లి వేరే ప్రాంతంలో ఉంటున్నాం. మా కుటుంబ సభ్యుడు మృతి చెందినా స్వగ్రామానికి వెళ్లే పరిస్థితి లేక మేం తలదాచుకుంటున్న ప్రాంతంలోనే దహన సంస్కారాలు పూర్తి చేశాం. ఇంతకన్నా దారుణం మరొకటి ఉండదు. టీడీపీ నాయకుల దౌర్జన్యాలకు అడ్డుకట్ట పడేదెప్పుడో తెలియడం లేదు. మాకు రక్షణ కల్పించాలని కోరుతున్నా.

– అమరావతి హసన్‌ (బుజ్జి), పిన్నెల్లి, వైఎస్సార్‌సీపీ నాయకుడు

మహిళలపైనా దాడులు..



ఎన్నికల ఫలితాలు వెలువడ్డ వెంటనే టీడీపీ శ్రేణులు వైఎస్సార్‌సీపీ సానుభూతి పరుల నివాసాలపై మూకుమ్మడి దాడులకు తెగబడ్డాయి. ఇంట్లో ఉన్న మహిళలను సైతం దౌర్జన్యంగా లాక్కొచ్చి దాడి చేశారు. టీడీపీ శ్రేణుల అఘాయిత్యాలతో ఆర్థికంగా, శారీరకంగా నష్టపోయాం. బంధువుల నివాసాల్లో కుటుంబ సభ్యులతో తలదాచుకుంటున్నాం. మాకు రక్షణ కల్పించండి.

– రత్తయ్య, కొత్తగణేశునిపాడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు

ఆర్థికంగా నష్టపోయాం



టీడీపీ శ్రేణుల అఘాయిత్యాలతో కుటుంబంతో సహా గ్రామాన్ని విడిచి వేరే ప్రాంతాల్లో తలదాచుకుంటున్నాం. ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నాం. మా పొలాలు సాగు చేసుకోలేక నష్టపోతున్నాం. మాకు న్యాయం చేయాలి.

– పిక్కిలి కొండలు, పిన్నెల్లి గ్రామం, వైఎస్సార్‌సీపీ నాయకుడు

రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం

చంద్రబాబు ప్రభుత్వంపై గవర్నర్‌కు వైఎస్సార్‌సీపీ ఫిర్యాదు



గవర్నర్‌ను కలిసి వినతిపత్రాన్ని ఇచ్చిన అనంతరం మీడియాతో మాట్లాడుతున్న శాసనమండలిలో ప్రతిపక్షనేత బొత్స సత్యనారాయణ. పక్కన మాజీ మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు తదితరులు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా కూటమి పాలన సాగుతోందని, తక్షణం జోక్యం చేసుకోవాలని గవర్నర్‌ జస్టిస్‌ అబ్దుల్‌ నజీర్‌ను వైఎస్సార్‌సీపీ ప్రతినిధి బృందం కోరింది. రాష్ట్రంలో నెలకొన్న పరిణామాలపై గురువారం గవర్నర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించింది. అనంతరం రాజ్‌భవన్‌ బయట పలువురు మాజీ మంత్రులు, వైఎస్సార్‌సీపీ నేతలతో కలిసి శాసన మండలిలో ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ మీడియాతో మాట్లాడారు. ఇటీవల గంగాధర నెల్లూరులో సీఎం చంద్రబాబు మాట్లాడుతూ అన్ని పనులు టీడీపీవారికే చేయాలని, వైఎస్సార్‌సీపీ వారికి పనులు చేస్తే పాముకు పాలు పోసినట్లేనని చేసిన తీవ్ర వ్యాఖ్యలను గవర్నర్‌ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఎలాంటి వివక్ష లేకుండా సమ దృష్టితో పాలన అందిస్తానంటూ రాజ్యాంగంపై ప్రమాణం చేసిన సీఎం చంద్రబాబు, దానికి విరుద్ధంగా చేసిన వ్యాఖ్యలపై తక్షణం చర్యలు తీసుకోవాలని గవర్నర్‌ను కోరినట్లు చెప్పారు. ప్రజాస్వామ్య స్ఫూర్తికి వ్యతిరేకంగా చంద్రబాబు పాలన సాగిస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ సంక్షేమాన్ని అందుకునే లబ్ధిదారులకు పార్టీలు, వర్గాలు ఉండవని అన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన ప్రమాణాలతో అర్హతను బట్టి పథకాలను వర్తింపజేస్తారని, చంద్రబాబు మాత్రం ఒక వర్గానికి మాత్రమే మేలు చేయాలని, కొందరిపట్ల వివక్ష చూపించాలంటూ చేసిన వ్యాఖ్యలు దారుణమని బొత్స మండిపడ్డారు.

ఇలా ఏ నాయకుడూ మాట్లాడలేదు..

స్వాతంత్య్రం వచ్చిన తర్వాత ఇప్పటివరకు ఏ రాజకీయ నాయకుడు కూడా చంద్రబాబులా మాట్లాడలేదని బొత్స తప్పుబట్టారు. ఏ రాజకీయ పార్టీ అయినా వారి సిద్ధాంతాలు, విధానాల ప్రకారం పనిచేస్తుందని, రాష్ట్రంలోని మొత్తం ప్రజలకు మేలు చేయాలని లక్ష్యంగా పెట్టుకుంటారని పేర్కొన్నారు. ఏ పార్టీ కూడా వ్యక్తిగత ఎజెండాతో పనిచేయదని, కానీ, ముఖ్యమంత్రి పదవిలో ఉన్న చంద్రబాబు దానికి భిన్నంగా చేసిన వ్యాఖ్యలు, ఆయన అనుసరిస్తున్న విధానాలపై తక్షణం స్పందించాలని గవర్నర్‌ను కోరామని తెలిపారు.

సామాన్యుల అవసరాలపైనా రాజకీయమా?

సామాన్యుల అవసరాలకు కూడా రాజకీయ రంగు పులమడం దారుణమని బొత్స సత్యనారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిపక్ష పార్టీగా ప్రజల ప్రయోజనాల కోసం ప్రభుత్వంపై వైఎస్సార్‌సీపీ ఒత్తిడి తెస్తూనే ఉంటుందని స్పష్టం చేశారు. కూటమి సర్కారు మెడలు వంచి ప్రజలకు ప్రయోజనాలు కలిగించేలా వ్యవహరిస్తామని బొత్స సత్యనారాయణ తెలిపారు.

జర్నలిస్టులనూ వదలరా?

రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, సోషల్‌ మీడియా యాక్టివిస్టులు, చివరికి జర్నలిస్టుల పైన కూడా తప్పుడు కేసులు పెడుతున్నారని బొత్స సత్యనారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని కూడా గవర్నర్‌ దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. గవర్నర్‌ను కలిసిన వారిలో ఎమ్మెల్యేలు బి.వి రూపాక్షి, తాటిపర్తి చంద్రశేఖర్, ఎమ్మెల్సీలు మొండితోక అరుణ్‌కుమార్, తోట త్రిమూర్తులు, లేళ్ల అప్పిరెడ్డి, రుహుల్లా, మాజీ మంత్రులు విడదల రజిని, వెలంపల్లి శ్రీనివాసరావు, మేరుగు నాగార్జున, కారుమూరు వెంకట నాగేశ్వరరావు, విజయవాడ మేయర్‌ రాయన భాగ్యలక్ష్మి, గుంటూరు మేయర్‌ కావటి మనోహర్‌ నాయుడు తదితరులు ఉన్నారు.

అసెంబ్లీ ఎన్నికల అనంతరం పల్నాడు ప్రాంతంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై టీడీపీ మూకల దాడులకు ఇదొక తార్కాణం



వనవాసంలో 'పిన్నెల్లి' ప్రజలు

కూటమి ప్రభుత్వం రాగానే రెడ్‌బుక్‌ రాజ్యాంగం అమలు

- గ్రామం నుంచి వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుల బహిష్కరణ
- వందల కుటుంబాలు ఊరు వదలాల్సిన దుస్థితి
- నిరాకరించిన వారిపై దాడులు.. చేతులెత్తేసిన పోలీసులు
- ఇప్పటికీ గ్రామంలోకి రాలేని పరిస్థితి.. వలస కూలీలుగా కొందరు.. బంధువుల ఇళ్లలో మరికొందరు

సాక్షి, నరసరావుపేట: రెడ్‌బుక్‌ రాజ్యాంగాన్ని అమలు చేస్తున్న టీడీపీ కూటమి ప్రభుత్వంలో.. కట్టుబట్టలతో సొంత ఊరిని వీడిన పల్నాడు జిల్లా గురజాల నియోజకవర్గం పిన్నెల్లి గ్రామస్తులు వనవాసం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రాత్రికి రాత్రి ఊరు వదిలి వెళ్లిపోవాలని టీడీపీ నేతలు హుకుం జారీ చేశారు. కాదన్న వారి ఇళ్లపై మూకుమ్మడిగా దాడి చేసి విధ్వంసం సృష్టించారు. కాపాడాల్సిన పోలీసులు తామేమీ చేయలేమని చేతులెత్తేశారు. టీడీపీ నేతలకే వత్తాసు పలుకుతూ గ్రామం వీడి వెళ్లిపోవాలని బాధితులకు సలహాలిచ్చారు. స్వయంగా పల్నాడు ఎస్పీ గ్రామంలో పర్యటించి వెళ్లిన గంటల వ్యవధిలోనే మరోసారి వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులపై దాడులకు తెగబడ్డా చూసీచూడనట్లు వ్యవహరించారు. దీంతో వందలాది కుటుంబాలు పుట్టిన ఊరిని వదిలి వేరే ప్రాంతాలకు వలస వెళ్లాయి. ఇప్పటికీ పిన్నెల్లి వాసులు సొంతూరికి రాలేని దుస్థితి నెలకొంది.

వలస కూలీలుగా....

పదుల ఎకరాల వ్యవసాయ భూమి ఉన్న రైతులు సైతం టీడీపీ మూకల దాడులకు భయపడి వేరే ప్రాంతాల్లో వలస కూలీలుగా బతుకీడుస్తున్నారు. హైదరాబాద్, గుంటూరు, నరసరావుపేట, పిడుగురాళ్ల, దాచేపల్లి తదితర చోట్ల పనులు చేసుకుంటూ కుటుంబాలను పోషిస్తున్నారు. ఒకప్పుడు బాగా బతికిన రైతులు ఇప్పుడు అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మెన్‌లుగా గడుపుతున్నారు. వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులకు చెందిన పొలాలను ఇతరులు సాగు చేయనివ్వకుండా బీడు పెట్టారు. కొందరి భూములను దౌర్జన్యంగా ఆక్రమించారు.

అంత్యక్రియలకూ అనుమతించలేదు..

పిన్నెల్లి నుంచి వలస వెళ్లిన వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులను కనీసం కుటుంబ సభ్యుల అంత్యక్రియలకు సైతం రానివ్వకుండా టీడీపీ నేతలు రాక్షసానందం పొందుతున్నారు. పిన్నెల్లికి చెందిన షేక్‌ అల్లా బక్ష్‌ అనారోగ్య కారణాలతో మృతి చెందగా ఆయన శవాన్ని గ్రామానికి తరలించేందుకు టీడీపీ నేతలు ఒప్పుకోకపోవడంతో గుంటూరులోనే అంత్యక్రియలు పూర్తి చేయాల్సి వచ్చింది. మాదుగుల అల్లు చనిపోతే కనీసం నలుగురు కూడా లేకుండా అంతిమ సంస్కారాలు పూర్తి చేయాల్సి వచ్చింది.

ఆస్తులు ధ్వంసం..

ఎన్నికల ఫలితాలు వెలువడగానే పిన్నెల్లిలో వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు, సానుభూతిపరులు గ్రామంలో బతకలేని పరిస్థితి ఏర్పడింది. వైఎస్సార్‌సీపీకి చెందిన వారెవరూ గ్రామంలో ఉండటానికి వీల్లేదని గ్రామంలో దండోరా వేయించారంటే టీడీపీ నేతల దురాగతాలు ఏ స్థాయిలో ఉన్నాయో ఊహించవచ్చు. ఇప్పటికి 400కు పైగా కుటుంబాలు పిన్నెల్లి గ్రామంలోకి రాలేని పరిస్థితి నెలకొంది. వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులను గ్రామం నుంచి వెళ్లగొట్టే క్రమంలో టీడీపీ నేతలు వారి ఇళ్లను, ఫర్నిచర్‌ను ధ్వంసం చేశారు.

సెకీ ఒప్పందం రద్దు కుదరదు

శాసనసభలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఎట్టకేలకు ఒప్పుకోలు

సాక్షి, అమరావతి: గత ప్రభుత్వ హయాంలో కుదుర్చుకున్న సెకీ ఒప్పందాన్ని రద్దు చేయడం కుదరదని, గ్రీన్‌ ఎనర్జీతోపాటు అణు విద్యుత్‌ ఉత్పత్తిపై కూడా దృష్టి సారిస్తున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు గురువారం శాసనసభలో ప్రకటించారు. ఒప్పందాలపై సంతకాలు పెట్టాక వెనక్కి తీసుకుంటే పెనాల్టీలు కట్టడంతోపాటు విశ్వసనీయత పోతుందని, అందువల్ల వాటిని కొనసాగించాల్సిన పరిస్థితి నెలకొందని శాసనసభ సాక్షిగా చెప్పుకొచ్చారు. గత ప్రభుత్వ పనితీరును ప్రశంసిస్తూ రూ.2.49కే యూనిట్‌ విద్యుత్‌ ఇస్తామని సెకీ ముందుకు రావడంతోనే అప్పట్లో ఈ ఒప్పందం జరిగిందని, పైగా విద్యుత్‌ సరఫరా చార్జీలు లేకపోవడం కలిసొచ్చే అంశమని ఎంతో మంది నిపుణులు.. ఎంతగా చెప్పినా వినిపించుకోని కూటమి ప్రభుత్వం కొద్ది నెలలుగా విషం చిమ్మిన విషయం తెలిసిందే. ఈ ఒప్పందం ద్వారా మాజీ ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌ ఏదో పెద్ద తప్పు చేసినట్లు ఎల్లో మీడియాలో పుంఖాను పుంఖాలుగా తప్పుడు కథనాలు రాయించి దుష్ప్రచారం చేశారు. తుదకు ఏపీ విద్యుత్‌ నియంత్రణ మండలి ఈ ఒప్పందం సబబే అని స్పష్టంచేసింది. ఈ ఒప్పందాన్ని కొనసాగిస్తున్నట్లు మొన్నటి సామాజిక ఆర్థిక సర్వేలోనూ ప్రభుత్వం ప్రకటించింది. ఇక తప్పని పరిస్థితుల్లో సీఎం చంద్రబాబు సైతం గురువారం విద్యుత్‌ రంగంపై సభలో జరిగిన చర్చలో ఈ విషయంపై స్పష్టత ఇచ్చారు.

విద్యుత్‌ రంగాన్ని గాడిన పెట్టాం

విద్యుత్‌ రంగాన్ని తొమ్మిది నెలల్లోనే గాడిన పెట్టామని, విద్యుత్‌ కొనుగోలు ధరను తగ్గించడం ద్వారా రానున్న కాలంలో విద్యుత్‌ ధరలను పెంచకూడదన్నది తమ లక్ష్యమని ముఖ్యమంత్రి తెలిపారు. 'క్లీన్‌ ఎనర్జీ పాలసీ ప్రకటించాక రూ.5.19 లక్షల కోట్ల పెట్టుబడులకు సంబంధించి ఎంఓయూలు కుదుర్చుకున్నాం. తద్వారా రాష్ట్రంలో 3.66 లక్షల మందికి ఉద్యోగాలు వస్తాయి. రాబోయే ఐదేళ్లలో రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించడమే ప్రభుత్వ లక్ష్యం. అధికారంలోకి వస్తే విద్యుత్‌ చార్జీలు పెంచబోమని చెప్పాం. ఆ మాటకు కట్టుబడి ఉన్నాం. యూనిట్‌ విద్యుత్‌ కొనుగోలు ధర రూ.5.16 నుంచి రూ.4.80కి తగ్గించేందుకు ప్రయత్నం చేస్తున్నాం. గత ప్రభుత్వంలో తొమ్మిది సార్లు విద్యుత్‌ చార్జీలు పెంచి రూ.32 వేల కోట్ల భారం మోపారు. సోలార్‌ విద్యుత్‌ వాడక పోవడంతో రూ.9 వేల కోట్లు నష్టపోయాం' అని తెలిపారు.

ఎమ్మెల్యేలు చొరవ తీసుకోవాలి

రాబోయే రోజుల్లో విమానాలు, ఓడలు కూడా గ్రీన్‌ ఎనర్జీతో నడిచేలా రాబోతున్నాయని సీఎం అన్నారు. 500 గిగా వాట్ల గ్రీన్‌ ఎనర్జీని ఉత్పత్తి చేస్తామని ప్రధాని మోదీ చెప్పారని, అందులో మనం 160 గిగావాట్లు టార్గెట్‌గా పెట్టుకున్నామని తెలిపారు. పీఎం సూర్యఘర్‌ ముఫ్తీ బిజిలీ యోజన్‌ కింద ప్రతి ఇంట్లో కరెంట్‌ ఉత్పత్తి చేసుకోవచ్చన్నారు. 20 లక్షల ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు ఉచితంగా సూర్య ఘర్‌ కింద 2 కిలోవాట్ల విద్యుత్‌ ఉత్పత్తికి రాయితీ అందిస్తామన్నారు. బీసీలకు కేంద్రం రూ.60 వేలు సబ్సిడీ ఇస్తుంటే, దానికి అదనంగా మరో రూ.20 వేల సబ్సిడీ కలిపి మొత్తంగా రూ.80 వేలు ఇస్తామని చెప్పారు. ఒక్కో నియోజకవర్గానికి 10 వేల ఇండ్లపై సోలార్‌ రూఫ్‌టాప్‌ల ఏర్పాటుపై ఎమ్మెల్యేలు చొరవ తీసుకోవాలని సూచించారు.



మహిళా ఎస్‌ఐ జుట్టు పట్టుకుని జులుం..

మద్యం మత్తులో యువకుల దాష్టీకం



తప్పతాగండి.. ఇష్టానుసారం వ్యవహరించండంటూ కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో ఊరూరా, వీధి వీధిన మద్యం వరద పారిస్తోంది. 24/7 మద్యం లభిస్తుండటంతో అరాచక శక్తులు పేట్రేగిపోతున్నాయి. ఎదుట ఉన్న వారు ఎవరన్న కనీస విచక్షణ లేకుండా దాడులకు తెగబడుతుండటం పరిపాటిగా మారింది. విజయనగరం జిల్లా వేపాడ మండలం గుడివాడలో మంగళవారం రాత్రి వేణుగోపాలస్వామి తీర్థం సందర్భంగా ఏర్పాటు చేసిన రికార్డింగ్‌ డ్యాన్స్‌లో తప్పతాగిన యువకులు కొందరు డ్యాన్సర్లతో అసభ్యంగా ప్రవర్తించారు. బందోబస్తు విధుల్లో ఉన్న ఎస్‌ఐ దేవి ఇలా చేయడం తగదంటూ వారిని వారించారు. దీంతో మాకే అడ్డుచెబుతావా.. అంటూ ఆ యువకులు ఆమె జుట్టు పట్టుకుని పక్కకు ఈడ్చేశారు. ఫోన్‌ లాక్కుని.. ఆమె చేతులు లాగుతూ, దుర్భాషలాడుతూ దాడి చేశారు. ఆమె భయంతో పక్కనే ఉన్న ఓ ఇంట్లోకి వెళ్లి తలుపులు వేసుకున్నారు. అప్పటికీ శాంతించని ఆ యువకులు గేట్లు లాగుతూ, పూల కుండీలు విసిరేసి బీభత్సం సృష్టించారు. ఆమె ఫోన్‌ చేసి పరిస్థితి చెప్పడంతో అదనంగా పోలీసులు వచ్చి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. ఈ మాయదారి మద్యం వల్లే ఇలా జరిగిందంటూ మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. – సాక్షి నెట్‌వర్క్‌

మహిళా ఎస్‌ఐపై దౌర్జన్యానికి పాల్పడుతున్న వీడియో కోసం ఈ క్యూఆర్‌ కోడ్‌ స్కాన్‌ చేయండి

గంటా కొడుకు.. 'అధికార' దర్జా

హెచ్‌ఎం కుర్చీలో కూర్చొని శాంతి భద్రతలపై సమీక్ష



అధికారంలోకి వచ్చిందే పెత్తనం చెలాయించడానికన్నట్లు టీడీపీ నాయకులు వ్యవహరిస్తున్నారు. ప్రజా ప్రతినిధి కాకపోయినా తండ్రి హోదాను అడ్డుపెట్టుకుని భీమిలి టీడీపీ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తనయుడు రవితేజ రెచ్చిపోయారు. గురువారం సాయంత్రం మధురవాడ చంద్రంపాలెం జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన రివ్యూ మీటింగ్‌లో ఆయన హెచ్‌ఎం కుర్చీలో కూర్చుని లా అండ్‌ ఆర్డర్‌పై సమీక్ష నిర్వహించారు. హైస్కూల్‌ ఉపాధ్యాయులు, పాఠశాల కమిటీ, జీవీఎంసీ జోనల్‌ కమిషనర్, పీఎం పాలెం లా అండ్‌ ఆర్డర్‌ పోలీసులకు దిశా నిర్దేశం చేశారు. అనంతరం వారంతా ఇది కూటమి మహిమ అంటూ గుసగుసలుపోయారు. – మధురవాడ

పరిశ్రమల స్థాపనపై దృష్టి పెట్టండి

- పెట్టుబడుల ప్రోత్సాహక మండలి సమావేశంలో సీఎం ఆదేశం
- రూ.1,21,659 కోట్ల పెట్టుబడులకు ఆమోదం తెలిపిన ఎస్ఐపీబీ



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో పెట్టుబడులపై ఒప్పందం చేసుకున్న పరిశ్రమలు వెంటనే స్థాపించేలా చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. ఇప్పటికే ఆమోదం తెలిపిన, ఒప్పందాలు చేసుకున్న ప్రాజెక్టుల పురోగతిని నిత్యం పరిశీలించాలన్నారు. గురువారం సచివాలయంలో పెట్టుబడుల ప్రోత్సాహక మండలి (ఎస్ఐపీబీ) సమావేశం జరిగింది. అధ్యక్షత వహించిన సీఎం చంద్రబాబు గత ఎస్ఐపీబీ సమావేశాల్లో ఆమోదం పొందిన ప్రాజెక్టులు, వాటి పురోగతిపై సమీక్ష జరిపారు. పరిశ్రమలు, విద్యుత్, పర్యాటకం వంటి రంగాల్లో మొత్తం 10 సంస్థలు రూ.1,21,659 కోట్ల పెట్టుబడి పెట్టేందుకు ముందుకురాగా సమావేశం ఆమోదం తెలిపింది. తద్వారా 80,104 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కలుగుతాయని అధికారులు తెలిపారు. రాష్ట్రంలోని ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఒక ఎంఎస్ఎంఈ పార్క్ చొప్పున మొత్తం 175 ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటు చేయాలని సీఎం ఆదేశించారు. తొలివిడతగా జిల్లాకు ఒకటి చొప్పున 26 జిల్లాల్లో తక్షణం 26 ఎంఎస్ఎంఈ పార్కులు నెలకొల్పేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటికే ప్రతిపాదించిన రతన్‌టాటా ఇన్నోవేషన్ కేంద్రాలను నెల రోజుల్లో 5 సెంటర్లు నెలకొల్పాలని కోరారు.

ఎస్ఐపీబీ ఆమోదించిన ప్రాజెక్టుల వివరాలివీ

1. ప్రీమియర్ ఎనర్జీస్ లిమిటెడ్: నాయుడుపేటలో రూ.1,742 కోట్ల పెట్టుబడులు, 2 వేల ఉద్యోగాలు.
2. దాల్మియా సిమెంట్స్: వైఎస్సార్ జిల్లాలో రూ.2,883 కోట్ల పెట్టుబడులు, 354 ఉద్యోగాలు.
3. లులూ గ్లోబల్ ఇంటర్నేషనల్: విశాఖపట్నంలో రూ.1,500 కోట్ల పెట్టుబడులు.
4. సత్యవేడు రిజర్వ్ ఇన్‌ఫ్రాసిటీ ప్రైవేట్ లిమిటెడ్: శ్రీసిటీలో రూ.25 వేల కోట్ల పెట్టుబడులు, 50 వేల ఉద్యోగాలు.
5. ఇండోసోల్ సోలార్ ప్రైవేట్ లిమిటెడ్: రూ.58,469 కోట్ల పెట్టుబడులు, 13,050 ఉద్యోగాలు.
6. బాలాజీ యాక్షన్ బిల్డ్‌వెల్ ప్రైవేట్ లిమిటెడ్: రూ.1,175 కోట్లు, 1,500 ఉద్యోగాలు.
7. ఏపీ ఎన్జీఈఎల్ హరిత్ అమ్రిత్ లిమిటెడ్: అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో రూ.22 వేల కోట్ల పెట్టుబడులు, 8,300 ఉద్యోగాలు.
8. ఆస్త్రా గ్రీన్ ఎనర్జీ వెంచర్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్: అన్నమయ్య, కడప జిల్లాలు, రూ.8,240 కోట్లు, 4 వేల ఉద్యోగాలు.
9. మేఫెయిర్ బీచ్ రిసార్ట్స్, కన్వెన్షన్: రూ.400 కోట్ల పెట్టుబడులు, 750 ఉద్యోగాలు.
10. ఒబెరాయ్ విలాస్ రిసార్ట్: రూ.250 కోట్ల పెట్టుబడులు, 150 ఉద్యోగాలు.

టీడీపీ ఎమ్మెల్సీని విచారణ కమిటీలో నియమించండి

- 'మండలి'లో టీడీపీ ఎమ్మెల్సీపై బొత్స చురక
- అప్పట్లో నిర్మాణ సంస్థలకు రూ.2వేల కోట్లు అడ్వాన్సులిచ్చేసారని టీడీపీ ఆరోపణ
- అలా ఏమీ చెల్లించలేదన్న మంత్రి సారథి



సాక్షి, అమరావతి : గత ప్రభుత్వంలో జగనన్న కాలనీల్లో నిధుల దుర్వినియోగం జరిగిందంటూ గురువారం మండలిలో టీడీపీ ఎమ్మెల్సీలు ప్రశ్నలు వేశారు. వీటికి గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి బదులిస్తూ.. విజిలెన్స్ దర్యాప్తు చేయిస్తున్నామన్నారు. అయినా కూడా టీడీపీ ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు గత ప్రభుత్వంపై ఆరోపణలు చేయసాగారు. దీంతో.. ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ స్పందిస్తూ.. విచారణ కమిటీలో టీడీపీ ఎమ్మెల్సీ రామారావును నియమించాలని చురకంటించారు. ప్రభుత్వం మీది, అధికారులు మీ వాళ్లే మీరేంచేసినా చెల్లుతుందని ఎద్దేవా చేశారు. ఒకపక్క విచారణ జరుగుతుండగా మాజీ సభ్యులపై సభలో ఆరోపణలు చేయడం మంచి సంప్రదాయం కాదన్నారు. అంతకుముందు రామారావు మాట్లాడుతూ.. ఆప్షన్-3 కింద ఇళ్లు నిర్మించే సంస్థలకు గత ప్రభుత్వంలో రూ.రెండు వేల కోట్లు అడ్వాన్స్ కింద ఇచ్చేశారని ఆరోపించారు. అయితే అడ్వాన్స్‌లు చెల్లించలేదని మంత్రి సారథి స్పష్టంచేశారు.

కలెక్టర్‌కు చెబితే కనీస స్పందనలేదు..

భీమవరంలో కొందరు కాంట్రాక్టర్లు ఇళ్లు నిర్మిస్తామని లబ్ధిదారుల నుంచి డబ్బు వసూళ్లుచేసినట్లు తన దృష్టికి వచ్చిందని మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు అన్నారు. ఈ అంశంపై ఆర్నెల్ల క్రితం జిల్లా కలెక్టర్‌కు తాను ఫిర్యాదుచేస్తే నేటికీ కనీస స్పందనలేదన్నారు. చైర్మన్ హోదాలో ఉన్న తన ఫిర్యాదునే పట్టించుకోకపోతే ఎలా అని అసహనం వ్యక్తం చేశారు. రెండుసార్లు కలెక్టర్‌కు లేఖ రాయడంతో పాటు, నాలుగుసార్లు ఫోన్లు చేశానన్నారు. ఫిర్యాదుపై తీసుకున్న చర్యలను తిరిగి తెలియజేసే బాధ్యత కలెక్టర్‌కు లేదా అని మండిపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని కాలనీల్లో ఇదే పరిస్థితి నెలకొందని మంత్రి కొలుసు అనగా.. 'నేను రాష్ట్రవ్యాప్తంగా ఇవే పరిస్థితులున్నాయని చెప్పలేదు.. కేవలం భీమవరం ఘటన గురించే మాట్లాడాను.. నా మాటలు రాష్ట్రానికి ఆపాదించొద్దు' అని మంత్రికి చైర్మన్ చురకలు వేశారు.

టీడీపీ ఎమ్మెల్సీ ప్రశ్నకు బదులివ్వని మంత్రి

జవాబుకు బదులు ఎస్ఐపీబీ చరిత్రను వివరించిన టీజీ భరత్

సాక్షి, అమరావతి : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక రూ.3.10 లక్షల కోట్లతో 31 కంపెనీల ఏర్పాటుకు ఎస్ఐపీబీ ఆమోదం తెలిపినట్లు ప్రభుత్వం చెబుతోందని, వీటిలో ఎన్ని పరిశ్రమలు ప్రారంభించారో చెప్పాలని టీడీపీ ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు గురువారం 'మండలి'లో ప్రశ్నించారు. దీనికి పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ సమాధానం చెప్పకుండా.. 2015లో ఎస్ఐపీబీని ప్రారంభించారని, కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక దానికి ఆక్సిజన్ లభించిందంటూ చరిత్ర చెప్పారు. అలాగే, తమ ప్రభుత్వం ఏర్పాటైన నాటి నుంచి ఇప్పటికి రూ.5 లక్షల నుంచి రూ.6 లక్షల పెట్టుబడులకు ఒప్పందాలు కుదిరాయన్నారు. డీపీఆర్ ప్రకారం ప్రాజెక్టులు పూర్తిచేయని 200 ఒప్పందాలు రద్దుచేశామని వెల్లడించారు. 20 ఎకరాలపైన భూములు కేటాయించి, ప్రాజెక్టులు పూర్తిచేయని ఒప్పందాలను త్వరలో రద్దుచేయడానికి కసరత్తు చేస్తున్నామంటూ అసలు ప్రశ్నకు సమాధానం చెప్పకుండా దాటవేశారు. ఇక పెట్టుబడులకు ముందుకొచ్చే యువ పారిశ్రామికవేత్తలతో ఏపీఐఐసీ అధికారులు వ్యవహరిస్తున్న తీరు అవమానకరంగా ఉందని మరో టీడీపీ ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి ఆరోపించారు.

నిరాశలో విద్యుత్ ఉద్యోగులు

- సమస్యల పరిష్కారంపై ఏదీ తేల్చని హెచ్ఆర్ కమిటీ
- అసంతృప్తి వ్యక్తంచేసిన సంఘాలు

సాక్షి, అమరావతి : విద్యుత్ సిబ్బంది సమస్యలపై ఉద్యోగ సంఘాలు ఒత్తిడిచేయడంతో గురువారం విద్యుత్‌సౌధలో సమావేశమైన హెచ్ఆర్ కమిటీ.. వారి డిమాండ్లపై ఎటూ తేల్చకుండా సమావేశాన్ని అర్ధంతరంగా ముగించేయడం సిబ్బందిని తీవ్రనిరాశకు గురిచేసింది. ట్రాన్స్‌కో జేఎండీ కీర్తి చేకూరి నేతృత్వంలో విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కం)ల సీఎండీలు సంతోషరావు, భాస్కర్, పృథ్వీతేజ్ సమక్షంలో హెచ్ఆర్ కమిటీ సమావేశం జరిగింది. దాదాపు 70 పెండింగ్ సమస్యలపై చర్చించేందుకు విద్యుత్ సంస్థల్లోని అన్ని సంఘాల నేతలను ఆహ్వానించారు. కానీ, కొన్నింటిపై మాత్రమే మొక్కుబడిగా చర్చించారు. సమావేశంలో ఎలాంటి నిర్ణయాలు ప్రకటించకపోవడంతో యూనియన్ నేతలు పెదవి విరిచారు. కొంతమంది అధికారులు దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి కనీస సమయం కేటాయించకపోగా ఉన్న నిబంధనలను మారుస్తూ కొత్త సమస్యలు సృష్టిస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. రాష్ట్రంలో టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చాక ఇంతవరకూ తమను పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేయడంపై ఉద్యోగ సంఘాలు తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేశాయి.

ఈ నెలలో చిన్నారుల కోసం రెండు ఆధార్ క్యాంపులు

సాక్షి, అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా బర్త్ సర్టిఫికెట్ ఉన్నప్పటికీ, ఆధార్ కార్డులు లేని ఆరేళ్ల లోపు చిన్నారులు 1,86,709 మంది ఉన్నట్లు గ్రామ వార్డు సచివాలయాల శాఖ గుర్తించింది. వీరితో పాటు ఆధార్‌లో తమ వివరాలు అప్‌డేట్ చేసుకోని వారు దాదాపు 52.02 లక్షల మంది ఉన్నట్లు పేర్కొంది. మార్చి నెలలో రెండు విడతలుగా నాలుగు రోజుల చొప్పున సచివాలయాల్లో ఆధార్ క్యాంపులు నిర్వహించాలని నిర్ణయించింది. ఈ నెల 19వ తేదీ నుంచి 22 తేదీ వరకూ, అలాగే 25వ తేదీ నుంచి 28వ తేదీ మధ్య ఈ ఆధార్ క్యాంపుల నిర్వహణ జరగనుంది. గ్రామ వార్డు సచివాలయ శాఖ డైరెక్టర్ శివప్రసాద్ ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు. క్యాంపులు నిర్వహించే సమయంలో సంబంధిత సచివాలయాల డిజిటల్ అసిస్టెంట్లతో పాటు వార్డు ఎడ్యుకేషన్ డెవలప్‌మెంట్ సెక్రటరీలను ఇతర బాధ్యతల నుంచి మినహాయించాలని ఈ ఆదేశాల్లో జిల్లాల కలెక్టర్లకు సూచించారు.

మెరిట్ కం రోస్టర్ పద్ధతిలోనే టీచర్ల సీనియారిటీ జాబితా

ఉపాధ్యాయ సంఘాలతో సమావేశంలో విద్యాశాఖ అధికారుల ప్రకటన



సాక్షి, అమరావతి: ఉపాధ్యాయుల పదోన్నతులకు సంబంధించి అన్ని జిల్లాల్లో సీనియారిటీ లిస్టులు మెరిట్ కం రోస్టర్ పద్ధతిలోనే తయారు చేస్తారని విద్యా శాఖ అధికారులు స్పష్టంచేశారు. ఈ జాబితాల్లో ఏవైనా తప్పులు ఉంటే వెంటనే తెలియజేయాలని చెప్పారు. గుర్తింపు పొందిన ఉపాధ్యాయ సంఘాలతో విద్యా శాఖ డైరెక్టర్ విజయరామరాజు గురువారం సమావేశం నిర్వహించారు. పలు అంశాలపై సంఘాలు వెలిబుచ్చిన సందేహాలకు వివరణ ఇచ్చారు. ప్రతి జిల్లాలో స్కూల్ అసిస్టెంట్ నుంచి హెడ్‌మాస్టర్ ప్రమోషన్‌కు అర్హత గల అందరు ఎస్ఏల సీనియారిటీ జాబితా ప్రదర్శిస్తారని తెలిపారు. డీఈవో పూల్ పండిట్ల ప్రమోషన్ విషయమై కోర్టు కేసు ఆధారంగా ముందుకెళ్తామని తెలిపారు. పేరెంట్ కమిటీల నిర్ణయం మేరకే మోడల్ ప్రైమరీ స్కూల్స్ ఏర్పాటు చేస్తామని, ప్రస్తుతానికి హైస్కూల్ ప్లస్‌లను కొనసాగించాలని నిర్ణయించామని తెలిపారు. ఎయిడెడ్ నుంచి ప్రభుత్వ, జిల్లా పరిషత్‌లో విలీనమైన వారికి విలీనం అయ్యేటప్పుడు ఉత్తర్వుల్లో ఉన్న నిబంధనల మేరకే సర్వీస్ వెయిటేజీ ఇస్తామని చెప్పారు. ప్రభుత్వ కళాశాలల్లో ఇంటర్మీడియట్ తరగతులు ప్రైవేటు కళాశాలల మాదిరిగానే ఏప్రిల్ నెలలోనే ప్రారంభిస్తామని తెలిపారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి పాఠశాలలకు, ఇంటర్ కళాశాలలకు ఒకే తరహా సెలవులు ఉండేలా చూస్తామన్నారు.

'యాక్సిస్' ఒప్పందాలపై బహిరంగ విచారణ

26న కర్నూలులో నిర్వహించనున్న ఏపీఈఆర్సీ

సాక్షి, అమరావతి : యాక్సిస్ ఎనర్జీ వెంచర్స్ ప్రైవేట్ లిమిటెడ్ పవన, సౌర (హైబ్రిడ్) విద్యుత్ కొనుగోలు ఒప్పందం (పీపీఏ)పై ఈనెల 26న బహిరంగ విచారణ చేపట్టనున్నట్లు ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్సీ) గురువారం వెల్లడించింది. యాక్సిస్ సంస్థతో ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కం) 400 మెగావాట్లకు పీపీఏ కుదుర్చుకున్న విషయం విదితమే. దీనికి అనుమతినివ్వాలంటూ డిస్కం పిటిషన్‌ను ఏపీఈఆర్సీ జనవరి 29న విచారణకు స్వీకరించింది. ప్రజలు తమ అభ్యంతరాలు తెలియజేసేందుకు 21 రోజులపాటు అవకాశం కల్పిస్తూ విచారణను ఫిబ్రవరి 18కి వాయిదా వేసింది. ఆ గడువు కూడా పూర్తవ్వడంతో వచ్చిన అభ్యంతరాలకు డిస్కం, యాక్సిస్ సంస్థ వివరణ ఇచ్చాయి. అనంతరం ఏపీఈఆర్సీ సూచనల మేరకు పీపీఏపై కొన్ని మార్పులుచేసి ఈనెల 12న డిస్కం మళ్లీ పీపీఏ పిటిషన్‌ను సమర్పించింది. ఈ నేపథ్యంలో బహిరంగ విచారణ తేదీని ఏపీఈఆర్సీ గురువారం ప్రకటించింది.

ఆదర్శవంతురాలు 'మొల్ల': మంత్రి సవిత

సాక్షి, అమరావతి: తెలుగు సాహిత్యంలో కవయిత్రి మొల్లమాంబ (మొల్ల) చెరగని ముద్ర వేశారని రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత కొనియాడారు. మొల్ల జయంతి సందర్భంగా రాష్ట్ర సచివాలయంలో గురువారం ఆమె చిత్రపటానికి పూలమాల వేసి మంత్రి నివాళులర్పించారు. తెలుగు సాహిత్యంలో మొల్ల రచనలకు ప్రత్యేకమైన స్థానం ఉందన్నారు.

జగన్ కష్టకాలంలో వెళ్లిపోతారా!?

- పదవులు అనుభవించి కన్నతల్లి లాంటి పార్టీపై నిందలు మోపుతారా?
- మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్



సాక్షి, విశాఖపట్నం : వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉన్నప్పుడు పదవులు అనుభవించి.. పార్టీ కష్టకాలంలో కన్నతల్లి లాంటి పార్టీని వదిలివెళ్లిపోతారా? అంటూ మాజీమంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ మండిపడ్డారు. మొన్నటి ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలిచి జగన్ రెండోసారి సీఎం అయ్యుంటే వీళ్లంతా ఇలాగే మాట్లాడే వారేనా? పార్టీని వీడి వెళ్లిపోయే వారేనా? అని ఆయన ప్రశ్నించారు. రాజకీయాల్లో నిత్యం అధికారంలో ఉండటం సాధ్యంకాదన్నారు. నగరంలోని పార్టీ కార్యాలయంలో గురువారం అమర్‌నాథ్ మీడియాతో మాట్లాడుతూ.. విజయసాయిరెడ్డి తాజాగా విజయవాడలో మాట్లాడిన మాటలు చూస్తుంటే ఆయన వ్యవసాయం చేయబోవడంలేదని.. రాజకీయమే చేస్తారని స్పష్టంగా అర్థమైందన్నారు. ఆయనకు ఒకరి మీద మనసు విరిగిపోయిందంటే ఇంకొకరిపై ప్రేమ పుట్టిందనే అనుకోవాలన్నారు.

యువత పోరుతో ప్రభుత్వం కళ్లు తెరవాలి..

ఇక ఎన్నికలకు ముందు విద్యార్థులకు, యువతకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో టీడీపీ కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని.. ఈ నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ నిర్వహించిన 'యువత పోరు' విజయవంతమైందన్నారు. ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా పింఛన్లు, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ వంటి సంక్షేమ కార్యక్రమాలను కొనసాగించి తీరాల్సిందేనన్నారు. అధికారంలోకి వచ్చి 10 నెలలైనా ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకపోవడంతో పేద విద్యార్థులు చదువులకు దూరమవుతున్నారని అమర్‌నాథ్ మండిపడ్డారు. విద్యాదీవెన, వసతిదీవెనకు సంబంధించి మొత్తంగా రూ.7,100 కోట్లు ఇవ్వాల్సి ఉండగా ప్రభుత్వం రూ.2,600 కోట్లే కేటాయించడం దారుణమన్నారు. ఇక కాకినాడ సీపోర్ట్ వ్యవహారంలో తప్పు జరిగిందా! లేదా! అనేది దర్యాప్తు సంస్థలు నిర్ధారిస్తాయని, మనం పేర్లు చెప్పినంత మాత్రాన వారంతా నిందితులు అయిపోతారా? అని అమర్‌నాథ్ ప్రశ్నించారు.

ఆరోగ్యశ్రీ, ఈహెచ్ఎస్ కింద అందని వైద్యం

- పీడీఎఫ్ ఎమ్మెల్సీల ఆందోళన
- సేవలు సక్రమంగా అందుతున్నాయని మంత్రి అనడం విడ్డూరం
- నెట్‌వర్క్ ఆస్పత్రులకు రూ.4,600 కోట్ల బకాయిలు : వైఎస్సార్‌సీపీ

సాక్షి, అమరావతి : ఆరోగ్యశ్రీ, ఈహెచ్ఎస్ లబ్ధిదారులకు రాష్ట్రంలో నగదు రహిత వైద్య సేవలు లభించడంలేదని పీడీఎఫ్ ఎమ్మెల్సీలు శాసన మండలిలో గురువారం ఆందోళన వ్యక్తంచేశారు. ప్రభుత్వం బకాయిలు పెట్టడంతో నగదు రహిత వైద్య సేవలకు ప్రైవేట్ కార్పొరేట్ ఆస్పత్రులు తిరస్కరిస్తున్నాయన్నారు. ప్రశ్నోత్తరాల సమయంలో పీడీఎఫ్ ఎమ్మెల్సీ ఐ. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఈహెచ్ఎస్, ఆరోగ్యశ్రీ సేవలు సక్రమంగా అందుతున్నాయని మంత్రి సమాధానం చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. తమ ప్రీమియంను చెల్లించుకునే ఉద్యోగులు, పెన్షనర్లకు ఈహెచ్ఎస్ పథకం అక్కరకు రావడం లేదని ఆరోపించారు. నగదు రహిత వైద్య సేవలకు ఆస్పత్రులు ఒప్పుకోవడంలేదని, రీయింబర్స్‌మెంట్ చేసుకోవాలని సూచిస్తున్నాయన్నారు. ఇక ఎయిడెడ్ విద్యా సంస్థల్లో పనిచేసే ఉద్యోగులకు ఈహెచ్ఎస్ వర్తింపజేయాలని కోరారు. ఎమ్మెల్సీ లక్ష్మణరావు మాట్లాడుతూ.. ప్రభుత్వం బకాయిలు పెట్టడంతో రోగుల పట్ల ఆస్పత్రులు పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయన్నారు. వైద్య సేవల్లో నిర్లక్ష్యం వహించిన ఆస్పత్రులపై ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందా అని ప్రశ్నించారు.

బకాయిలతో ఆస్పత్రుల ఇబ్బంది..

ఇక వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ.. ప్రభుత్వం నెట్‌వర్క్ ఆస్పత్రులకు రూ.4,600 కోట్లు బకాయి పెట్టిందన్నారు. దీంతో ఇటీవల మూడునెలల పాటు యాజమాన్యాలు సమ్మె చేశాయన్నారు. బిల్లులు బకాయి పెట్టడంతో ఈఎంఐలు, ఉద్యోగుల వేతనాల చెల్లింపులకు ఆస్పత్రుల యజమానులు ఇబ్బందిపడుతున్నారన్నారు. అయితే, ఫిబ్రవరి నెలాఖరుకు ఆరోగ్యశ్రీ కింద రూ.1,937 కోట్లు, ఈహెచ్ఎస్ కింద రూ.31.78 కోట్లు బకాయిలు ఉన్నాయని ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు.

ప్రభుత్వ సలహాదారుగా డాక్టర్ నోరి దత్తాత్రేయుడు

సాక్షి, అమరావతి: ప్రముఖ క్యాన్సర్ వైద్య నిపుణులు డాక్టర్ నోరి దత్తాత్రేయుడిని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సలహాదారుగా (నివారణ, అఫర్డబుల్ క్యాన్సర్ కేర్) కేబినెట్ హోదాలో నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

జన్యు ఎడిటింగ్ పద్ధతిలో కొత్త వంగడాల అభివృద్ధి

డాక్టర్ ఎంఎస్ రెడ్డి సూచన

తాడేపల్లిగూడెం: జన్యు ఎడిటింగ్ పద్ధతి ద్వారా అధిక నిల్వ సామర్థ్యం, మెరుగైన నాణ్యతా ప్రమాణాలు కలిగిన పండ్లు, పువ్వులు, కూరగాయలకు సంబంధించి కొత్త వంగడాలను (జాతులను) అభివృద్ధి చేయవచ్చని పీజీపీఆర్ ఆసియా సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ ఎంఎస్ రెడ్డి చెప్పారు. డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం సమీపంలోని వెంకట్రామన్నగూడెంలో గురువారం 'అన్యదేశ పంటలు- హైబ్రీడ్, హరిత భవిష్యత్ కోసం ప్రపంచ వాణిజ్యం, సుస్థిర సాంకేతికతలు' అనే అంశంపై అంతర్జాతీయ సదస్సు జరిగింది. వర్సిటీ ఉపకులపతి డాక్టర్ కె.గోపాల్ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ రెడ్డి ఈ సందర్భంగా మాట్లాడుతూ విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్న పలు రకాల పండ్లు, పువ్వులు, కూరగాయలు మన దేశంలో కూడా ఇక్కడి వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా సాగు చేస్తే, మంచి దిగుబడులు ఇస్తాయన్నారు. సదస్సులో వర్చువల్‌గా వివిధ దేశాలకు చెందిన శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.



బ్రోచర్లను విడుదల చేస్తున్న డాక్టర్ ఎంఎస్ రెడ్డి, చిత్రంలో వీసీ కె.గోపాల్ తదితరులు

ఆంధ్ర వర్సిటీలో అవకతవకలపై విజిలెన్స్ విచారణ

శాసనసభ ప్రశ్నోత్తరాల్లో మంత్రి లోకేశ్

సాక్షి, అమరావతి : 2019–24 మధ్య ఆంధ్ర విశ్వవిద్యాలయంలో పలు అవకతవకలు జరిగాయంటూ ప్రభుత్వానికి అనేక ఫిర్యాదులు అందాయని మంత్రి లోకేశ్ తెలిపారు. గురువారం శాసనసభ ప్రశ్నోత్తరాల్లో ఆయన మాట్లాడుతూ.. అప్పటి వీసీ పీవీజీడీ ప్రసాద్‌రెడ్డి, ఇతరులపై ఆరోపణలు ఉన్నాయన్నారు. 'వాటిపై విజిలెన్స్ విచారణ జరిపించాలని పలువురు సభ్యులు అడిగారు. కాబట్టి 60 రోజుల్లో విజిలెన్స్ విచారణ పూర్తి చేసి, నివేదిక ఇవ్వాలని సభ తరుపున ఆదేశాలు జారీ చేస్తాం. తప్పు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. ఈ ఆరోపణలపై ఇప్పటికే ఇన్‌చార్జి వైస్ చాన్స్‌లర్ కమిటీ నియమించారు' అని చెప్పారు.

ఐటీడీఏల విభజన జరగలేదు : మంత్రి సంధ్యారాణి

రాష్ట్రంలో జిల్లాల పునర్విభజన జరిగినప్పటికీ, ఐటీడీఏల విభజన జరగలేదని.. గిరిజన ప్రాంత ప్రజలు ఇంతకు ముందులాగే ఐటీడీఏను ఉపయోగించుకోవచ్చని మంత్రి గుమ్మడి సంధ్యారాణి చెప్పారు. శ్రీకాకుళం జిల్లా పాతపట్నం నియోజకవర్గంలోని మెళియపుట్టి మండలంలో కొత్త ఐటీడీఏ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం వద్ద ప్రతిపాదన ఉందని, అయితే అక్కడ ఇప్పటికే ఐటీడీఏ డీడీ కార్యాలయం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

పరిశీలనలో వైకుంఠపురం బ్యారేజీ : మంత్రి నిమ్మల

ఎన్డీయే ప్రభుత్వం వచ్చాక ప్రకాశం బ్యారేజీకి ఎగువన వైకుంఠపురం బ్యారేజీ నిర్మాణ ఆవశ్యకతను గుర్తించామని మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. ఆ బ్యారేజీ నిర్మాణం ప్రభుత్వ పరిశీలనలో ఉందన్నారు. అది పూర్తయితే గుంటూరు–హైదరాబాద్‌కు మధ్య 40 కి.మీ దూరం తగ్గుతుందన్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో గుండ్రేవుల ప్రాజెక్టు కోసం రూ.4,530 కోట్లతో సవరించిన డీపీఆర్ తయారు చేశామని తెలిపారు.

ఈ శ్రమ్ పోర్టల్‌లో 83.69 లక్షల మంది : మంత్రి సుభాష్

అసంఘటిత కార్మికులను ఆదుకునేందుకు కేంద్రం రూపొందించిన ఈ శ్రమ్ పోర్టల్‌లో మన రాష్ట్రానికి చెందిన 83,69,051 మంది కార్మికులు పేర్లు నమోదు చేసుకున్నారని మంత్రి వాసంశెట్టి సుభాష్ తెలిపారు. 1.50 కోట్ల మందిని చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు.

సాక్షి
శుక్రవారం, 14 మార్చి 2025

ఖాకీ రాజ్యం కళ్లు తెరవదా!

వ్యక్తి హక్కును తృణీకరించి అరాచకం రాజ్యమేలేచోట వ్యక్తికిగానీ, సమాజానికిగానీ రక్షణ ఉండదంటాడు ఆఫ్రో–అమెరికన్ రచయిత ఫ్రెడరిక్ డగ్లస్. జనాన్ని అన్ని విధాలా ఏమార్చి తొమ్మిది నెలల క్రితం అందలం ఎక్కిన కూటమి సర్కారు వల్ల ఆంధ్రప్రదేశ్‌లో అక్షరాలా ఆ పరిస్థితే కొనసాగుతోంది. ఎన్నికల్లో అడ్డూ ఆపూ లేకుండా ఇచ్చిన హామీలేమయ్యాయని అడిగితే... వరస వైఫల్యాలను ఎండగడితే... తప్పుడు ప్రచారాలను నిలదీస్తే... జైళ్లు నోళ్లు తెరుచుకుంటున్నాయి. ప్రాథమిక హక్కయిన భావప్రకటనా స్వేచ్ఛ బందీ అవుతోంది. అడుగడుగునా పౌరుల హక్కులను హరిస్తున్న పోలీసుల తీరును సహించబోమని రాష్ట్ర హైకోర్టు ఇప్పటికి మూడు సందర్భాల్లో ఆగ్రహం వ్యక్తం చేసింది. అయినా ఈ తోలు మందం ప్రభుత్వానికి వివేకం కలిగినట్టు లేదు. అందుకే మంగళవారం జస్టిస్ రావు రఘునందన్ రావు, జస్టిస్ మన్మథరావులతో కూడిన ధర్మాసనం మరో రెండు కేసుల్లో పోలీసులకు అక్షింతలు వేయాల్సివచ్చింది. పోలీసులైనాసరే చట్టానికి లోబడే వ్యవహరించాలని చీవాట్లుపెట్టింది. ఊహల ఆధారంగా కేసులు పెట్టడం, బెయిల్ రాకుండా తప్పుడు సెక్షన్లు బనాయించటం సహించబోమంది. చిన్న తప్పులే కదా అని వదిలేస్తే రేపు కోర్టుల్లోకొచ్చి కూడా అరెస్టు చేస్తారంది. ఈ వ్యాఖ్యలు చాలు... ఏపీలో పాలన ఎంత నిరంకుశంగా ఉందో చెప్పడానికి!

మనసంటే తెలియని, మనుషులంటే లక్ష్యంలేని కూటమి నాయకులకూ, కార్యకర్తలకూ మూడు నాలుగేళ్ల తర్వాత ఇప్పుడు మనోభావాలు దెబ్బతింటున్నాయి! అంటురోగం ప్రబలినట్టు, ఊరంతా ఒకేసారి పూనకాలు వ్యాపించినట్టు వీరంతా ఉన్నట్టుండి ఫిర్యాదులు చేస్తున్నారు. ఏమైంది వీళ్లకు? ఇదే తీరు కొనసాగిస్తే చట్టాన్ని సవరించి ఇలాంటి కేసుల్లో మొదటగా ఫిర్యాదీదారులను సైకియాట్రిస్టుల దగ్గరకు పంపాలని... ఎన్నాళ్లుగా మనోభావాలు దెబ్బతిని వున్నాయో, పర్యవసానంగా వారిలో కనబడిన వైపరీత్యాలేమిటో కుటుంబసభ్యుల నుంచి తెలుసుకోవాలనీ నిబంధనలు చేర్చాలన్న డిమాండ్ బయల్దేరినా ఆశ్చర్యం లేదు. ఆ పనిచేస్తే ఇలాంటివారి రోగం కుదురుతుంది. అధికారంలో ఉన్నవారి మెప్పు పొందేందుకు ఫిర్యాదు అందిందే తడవుగా వెనకా ముందూ చూడకుండా పోలీసులు అరెస్టులకు దిగుతున్నారు. గొలుసు కేసులతో వందలాది కిలోమీటర్ల దూరంలోవుండే పోలీస్ స్టేషన్లకు మార్చి మార్చి తిప్పుతున్నారు. ఎవరిపై ఎన్ని కేసులు పెడుతున్నారో గమనిస్తే ఎవరంటే పాలకులు వణుకుతున్నారో అర్థమవుతుంది. ప్రముఖ సినీ రచయిత పోసాని కృష్ణమురళి సంగతే తీసుకుంటే, 67 ఏళ్ల ఆ పెద్దమనిషిపై లెక్కకు మిక్కిలి కేసులు పెట్టారు. ఒకటి రెండు కేసుల్లో బెయిల్ వచ్చిన వెంటనే మరో కేసు తగిలించి అరెస్టు చేస్తున్నారు. గుండెకు శస్త్ర చికిత్స చేయించుకుని పలు అనారోగ్య సమస్యలతో ఉన్న పోసానిని కేసుల పేరుతో వందల మైళ్లు తిప్పుతున్నారు.

సోషల్ మీడియా కార్యకర్త అవుతు శ్రీధర్ రెడ్డిపై పెట్టిన కేసు గమనిస్తే పోలీసుల అత్యుత్సాహం అర్థమవుతుంది. ఒక కేసులో మేజిస్ట్రేట్ ఆయన రిమాండ్‌ను తిరస్కరించి విడుదల చేయాలని ఆదేశించిన వెంటనే పోలీసులు అతి తెలివి ప్రదర్శించి తిరిగి అవే ఆరోపణలతో ఆయనను మరోసారి అరెస్టు చేశారు. ఈసారి న్యాయస్థానం ఆయన్ను రిమాండ్‌కు తరలించింది. ఈ విషయంలో పోలీసుల పనితీరును హైకోర్టు ధర్మాసనం నిశితంగా విమర్శించింది. ఘాటు వ్యాఖ్యలు చేసింది. ఇష్టానుసారం అరెస్టు చేయటం, చట్టనిబంధనలను తుంగలో తొక్కడం చెల్లదని పేర్కొంది. ఈ విషయంలో యాంత్రికంగా వ్యవహరించినందుకు మేజిస్ట్రేట్‌ను తప్పుబట్టింది. తాచెడ్డ కోతి వనమంతా చెరచినట్టు పోలీసుల తీరు వల్ల కిందిస్థాయి న్యాయస్థానాలకు సైతం మందలింపులు తప్పటం లేదు. నిర్బంధంలోకి తీసుకున్న వ్యక్తికి ఎందుకు అరెస్టు చేస్తున్నారో చెప్పరు. ఆయన బంధువులకు సమాచారం ఇవ్వరు. అసలు ఆయనపై వున్న కేసులేమిటో చెప్పరు. ఇవి పాటించలేదని తెలిశాక కూడా యాంత్రికంగా రిమాండ్‌కు పంపుతున్న వైనాన్ని ధర్మాసనం ప్రత్యేకించి ప్రస్తావించింది. ఈ ధోరణి సరికాదని మందలించింది. మాదిగ మహాసేన వ్యవస్థాపక అధ్యక్షుడు కొరిటిపాటి ప్రేమ్ కుమార్ అరెస్టు విషయంలో కూడా న్యాయమూర్తులు ఈ విధంగానే స్పందించారు. వ్యంగ్యంగా, ప్రతీకాత్మకంగా రూపొందించిన ఒక చిన్న రూపకం పోలీసులకు అభ్యంతరకరంగా తోచింది. అంతే... నిరుడు డిసెంబర్‌లో అర్ధరాత్రి దాటాక రెండున్నర గంటలకు కర్నూలు పోలీసులు తలు పులు బద్దలుకొట్టి ప్రేమ్‌కుమార్ భార్యాపిల్లలను వేరే గదిలో బంధించి ఆయన్ను ఈడ్చుకెళ్లారు. హాస్యాస్పదమైన విషయమేమంటే వినయ్‌కుమార్ దగ్గర దొరికిన రూ. 300 అక్రమ వసూళ్లట! పైగా సంఘటిత నేరాలకు పాల్పడ్డారంటూ ఆరోపించి బీఎన్ఎస్‌లోని సెక్షన్ 111 బనాయించారు. ఈ రెండు కేసుల విషయంలో మాత్రమే కాదు... ఇంతకు మునుపు మరో మూడు కేసుల్లో కూడా పోలీసుల తీరును హైకోర్టు తప్పుబట్టింది. డీజీపీని రప్పించాల్సివస్తుందని హెచ్చరించింది. అయినా పోలీసుల తీరు మారడం లేదు.

ఈ తెలివితక్కువ చర్యల్ని ఘనకార్యాలుగా భావిస్తూ పాలకులు సిగ్గువిడిచి ఊరేగుతున్నారు. తమకు ఎదురులేదని విర్రవీగుతున్నారు. అలవిమాలిన హామీలిచ్చి, ఈవీఎంలను నమ్ముకుని, డబ్బు సంచులు గుమ్మరించి అందలం ఎక్కిన కూటమి ఇకముందూ ఇదే దోవలో అధికారాన్ని శాశ్వతం చేసుకోవచ్చని కలలు కంటోంది. తప్పు మీద తప్పు చేస్తూ పోతోంది. ఈ క్రమంలో పోలీసులను ఉపయోగించుకుని సంఘటిత నేరాలకు పాల్పడుతోంది. ఎల్లకాలమూ ఈ వ్యవహారం సాగదు. జనం నిజం గ్రహించారు. కీలెరిగి వాత పెట్టే రోజు ఎంతో దూరంలో లేదు.

చేజారుతున్న విత్తన స్వాతంత్య్రం

విశ్లేషణ



డా॥ దొంతి నరసింహా రెడ్డి

వ్యవసాయంలో విత్తనాల సమస్య రోజు రోజుకూ తీవ్రమవుతున్నది. హరిత విప్లవం పేరిట మొదలుపెట్టిన పరిణామం విత్తనాలతోనే మొదలైంది. అధిక దిగుబడి వంగడాల హామీతో ఇది మొదలై, క్రమంగా రైతులను విత్తనాలకు దూరం చేసింది. 1960వ దశకంలో మొదలు పెట్టిన ఈ మార్పు 2025 నాటికి తీవ్రరూపం దాల్చింది. ఆహార నాణ్యత దిగజారడానికి విత్తనాలలో వచ్చిన మార్పులే కారణం. దేశీ విత్తనాలను తులనాడి, భారత వ్యవసాయాన్ని హీనపరిచి తెచ్చిన హరిత అధిక దిగుబడి వంగడాలు క్రమంగా రైతుల విత్తన స్వావలంబనను హరించాయి.



- ఒకప్పుడు రైతు తన విత్తనాలు దాచుకుని వాడే రోజులలో విత్తనాల మీద సున్నా ఖర్చు ఉండేది. తన విత్తనాల మీద పరిజ్ఞానం ఉండేది. ఆధునిక విత్తనాల వల్ల సాగు ఖర్చు పెరిగింది.
- మిర్చి, పత్తి, వరి, గోధుమ, టమాట వంటి పంటలలో నాసి రకం విత్తనాల వల్ల లాభపడుతున్నది ప్రైవేటు కంపెనీలు! నష్టపోతున్నది రైతులు!
- విత్తనాల మీద స్వావలంబన అత్యంత మౌలికమైన అవసరం. రైతుల పరిజ్ఞానం పెంచే విధంగా విత్తన వ్యవస్థను నిర్మించాలి. విత్తన జన్యుసంపదను కలుషితం కాకుండా కాపాడాలి.

రసాయనాల దిగుబడి

విదేశీయుల ప్రోత్సాహంతో ప్రవేశపెట్టిన వంగడాలు అధిక దిగుబడి ఇవ్వడానికి ప్రధాన కారణం రసాయన ఎరువులు. రసాయన ఎరువులు ఉపయోగించని పరిస్థితులలో ఈ వంగడాలు ఉపయోగపడలేదు, ఉపయోగపడవు. ఆ విధంగా మొదలుపెట్టిన రసాయన ఎరువుల వాడకం ఇప్పుడు విధిగా, అత్యధికంగా ఉపయోగించాల్సిన పరిస్థితికి వచ్చింది. ఒకప్పుడు ఎకరాకు ఒకటో రెండో ఎరువుల బస్తాల వాడకం నుంచి ఇప్పుడు 15 బస్తాలు వాడే దుఃస్థితికి రైతు చేరుకున్నాడు. పరిశోధన చేసి ప్రవేశపెట్టిన హైబ్రిడ్ లేదా అధిక దిగుబడి వంగడాలు, ఎరువులు, కీటకనాశక రసాయనాల ఉపయోగాన్ని కూడా పెంచాయి. ఈ రకం విత్తనాలు మొదట్లో అధిక దిగుబడి చూపినా క్రమంగా ఉత్పాదకత తగ్గింది. దిగుబడి పెరిగి తగ్గుతోందని గుర్తించి ఒక కొత్త వాదన ప్రవేశపెట్టారు శాస్త్రవేత్తలు. విత్తనాలు ఎప్పటికప్పుడు మార్చాలి. మార్చితేనే దిగుబడి!

ఏ ఆధునిక విత్తనంలోనూ నూరు శాతం అంకురోత్పత్తి ఉండదు. దాంతో మభ్యపెట్టే సిఫారసు మొదలైంది. ఎకరాకు ఎన్ని గింజలు వెయ్యాలి? సాధారణంగా ఒక్కో పంటకు ఒక్క కొలమానం ఉంటుంది. ఆధునిక విత్తనాల్లో అంకురోత్పత్తి వంద శాతం ఎప్పుడూ ఉండదు కనుక ఈ కొలమానంలో మార్పులు తెచ్చి ఎకరాకు ఎక్కువ విత్తనాలు వాడే విధంగా సిఫారసు చేయడం మొదలు పెట్టారు. వరి పంటకు కొందరు రైతులు ఎకరాకు 18 నుంచి 20 కిలోలు వాడుతుంటే, పరిజ్ఞానం ఉన్న రైతులు కేవలం 250 గ్రాముల దేశీ వరి విత్తనాలు వాడుతున్నారు. ఎంత తేడా! మిర్చి, పత్తి, వరి, గోధుమ, టమాట వంటి పంటలలో నాసి రకం విత్తనాల వల్ల లాభపడుతున్నది ప్రైవేటు కంపెనీలు, నష్టపోతున్నది రైతులు.

పోయిన జ్ఞానం, నమ్మకం

ఆధునిక విత్తనాల వల్ల సాగు ఖర్చు పెరిగింది. ఒకప్పుడు రైతు తన విత్తనాలు దాచుకుని వాడే రోజులలో విత్తనాల మీద సున్నా ఖర్చు ఉండేది. రైతుకు తన విత్తనాల మీద పరిజ్ఞానం ఉండేది. వేరే రైతు దగ్గర తెచ్చుకున్నా నమ్మకం ఉండేది. రైతు తన విత్తనాలు కోల్పోయి ఆధునిక విత్తనాలకు అలవాటు పడ్డ తరువాత విత్తనాల మీద జ్ఞానం, నమ్మకం పోయినాయి. ఆధునిక విత్తనాలకు చీడ పీడ బెడద పెరిగింది. దానికి పరిష్కారంగా కీటక నాశనిల వాడకం పెరిగింది. వాటి వల్ల ఖర్చు పెరిగింది. ప్రమాదకరమైన రసాయనాలు కాబట్టి వాటిని వాడే క్రమంలో రైతు ఆరోగ్యం ప్రమాదంలో పడింది. ఫలితంగా వలసలు, ఆత్మహత్యలు. వ్యవసాయ కూలీ కుటుంబాలతో మొదలైన వలసలు రైతులను కూడా తాకాయి. ఇంకొక వైపు ఎరువులు, విత్తనాలు, వ్యవసాయం మీద సలహాలు ఇచ్చే కంపెనీలు పెరిగాయి. వాటి వార్షికాదాయం యేటా పెరుగుతున్నది.

బహుశా నార్మన్ బోర్లాగ్ కూడా ఈ పరిణామం ఊహించి ఉండక పోవచ్చు. బోర్లాగ్ ప్రవేశపెట్టిన 'అధిక దిగుబడినిచ్చే' విత్తనాలకు ఖరీదైన ఎరువులే కాక, ఎక్కువ నీరూ అవసరం. వ్యవసాయ ఉత్పత్తిలో అద్భుతాలు లేవు అని చెప్పిన ఈ వ్యక్తి, ప్రపంచానికి ఆహార భద్రత సాధించాలని మొదలు పెట్టిన 'ఆధునిక విత్తనాల' వ్యవసాయం జీవ వైవిధ్యాన్ని, జీవనోపాధులను నాశనం చేస్తున్న విషయం పట్ల స్పందించలేదు. 'అధిక వంగడాల' వల్ల దిగుబడి పెరుగుతుందనే ఏకైక సూత్రం మీద పని చేసిన ఆ మహానుభావుడు తద్వారా నిర్మాణమైన 'దోపిడీ' వ్యవస్థ గురించి ఆలోచించలేదు.

పెద్ద కంపెనీల గుప్పిట్లో...

ఇప్పుడు 'ఆధునిక విత్తనాలు' రైతుల చేతులలో లేవు. విత్తన, పెస్టిసైడ్ కంపెనీల గుప్పిట్లో ఉన్నాయి. 'మేధో హక్కుల సంపత్తి' పేరిట రక్షణ పొంది విత్తన మార్కెట్లను సురక్షితం చేసుకున్నాయి. ఎప్పటికప్పుడు దిగుబడులు తగ్గిపోతున్న నేపథ్యంలో యేటా కొత్త 'విత్తనాలు' మార్కెట్లో ప్రవేశపెట్టి అటు ప్రభుత్వాలనూ, ఇటు రైతులనూ మభ్యపెడుతూ తమ వ్యాపారాన్ని కొనసాగిస్తున్నాయి. మన దేశంలో విత్తనాలు, ప్రకృతి వనరుల మీద మేధో సంపత్తి హక్కులు పొందే అవకాశం లేదు కనుక ఇతర మార్గాలలో తమ వ్యాపారాన్ని సుస్థిరం చేసుకుంటున్నారు. పెద్ద కంపెనీలు సిండికేట్ అయ్యి చిన్న కంపెనీలను గుప్పిట్లో పెట్టుకుంటున్నాయి. మార్కెట్ ఒప్పందాలు చేసుకుని దేశీ, చిన్న కంపెనీలకు 'బంధనాలు' వేశారు. ప్రభుత్వం ఏదన్నా 'చర్య' చేపడితే కోర్టుకు వెళతారు. విత్తన కంపెనీలు కేంద్ర ప్రభుత్వం, వివిధ రాష్ట్ర ప్రభుత్వాల మీద వేసిన కేసులు కొన్ని వందల సంఖ్యలో ఉన్నాయి.

రైతులలో విత్తనాల విజ్ఞానం కొండలా పెరగాల్సిందిపోయి, ప్రైవేటు గుత్తాధిపత్యం వల్ల వారికి అందడం లేదు. రానురాను విత్తన విజ్ఞానాన్ని రహస్యంగా మార్చుతున్నాయి విత్తన కంపెనీలు. ఇక్రిసాట్, ఇర్రి వంటి అంతర్జాతీయ సంస్థలు విత్తన పరిశోధనల సాకుతో భారతీయ జన్యు సంపద తీసుకుని, క్రమంగా ప్రైవేటు పెట్టుబడిదారులకు అందజేస్తున్నాయి. 1966 తరువాత నిర్మాణమైన ప్రభుత్వ విత్తన వ్యవస్థ పూర్తిగా కుప్పకూలింది. ఇప్పుడు ఉన్న సంస్థలు, కమిటీల పరిశోధనలు ఉత్సవ పాత్రకే పరిమితమై, పరోక్షంగా ప్రైవేటు కంపెనీల ప్రయోజనాలను కాపాడుతున్నాయి. ప్రభుత్వ రంగంలో ఏదో జరుగుతున్న భ్రమ కల్పించటానికి ఉపయోగపడుతున్నాయి.

వ్యాపార సరళీకరణ లక్ష్యంగా పెట్టుకున్న ప్రభుత్వాలు ప్రజల ఆరోగ్యానికి, దేశాభివృద్ధికి మూలమైన విత్తన రంగాన్ని ప్రైవేటుపరం చేస్తూ, ఉన్న ఒకే ఒక చట్టాన్ని అమలు చేయడం లేదు. 1966లో ప్రభుత్వం రంగంలో చేసే విత్తనాల నాణ్యత, సరఫరా మీద శాస్త్రీయ నియంత్రణకు తెచ్చిన విత్తన చట్టం ప్రైవేటు విత్తనాలకు వర్తింపజేయడానికి సిద్ధంగా లేదు. 2004లో ఒక కొత్త చట్టం తెచ్చే ప్రయత్నం ప్రైవేటు విత్తన కంపెనీల వ్యాపార వెసులుబాటును సరళీకృతం చేయడానికే అని ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో 20 యేళ్ల తరువాత కూడా అది రూపుదాల్చలేదు. ఇప్పటి వరకు ప్రతిపాదించిన 4, 5 ముసాయిదాలు రైతుల ప్రయోజనాలు కాపాడటానికీ, భారత దేశంలో ఉన్న అపర విత్తన సంపద స్వచ్ఛతను పరిరక్షణకూ ఉద్దేశించినవి కావు. రైతులు, కంపెనీల ప్రయోజనాల మధ్య కంపెనీల పక్షం వహిస్తున్న కేంద్రం కొత్త చట్టం తేవడానికి భయపడుతున్నది.

విత్తనాల మీద స్వావలంబన అత్యంత మౌలికమైన అవసరం. రైతులకు విత్తన స్వాతంత్య్రం కోసం రాష్ట్రాలు చట్టాలు తేవాలి. రైతుల పరిజ్ఞానం పెంచే విధంగా విత్తన వ్యవస్థను నిర్మించాలి. విత్తన జన్యుసంపదను కలుషితం కాకుండా కాపాడాలి. పర్యావరణానికి, జన్యుసంపదకు హాని చేసే విత్తనాలను ప్రవేశపెట్టే కంపెనీలు, సంబంధిత వ్యక్తుల మీద క్రిమినల్ చర్యలు చేపట్టాలి. గ్రామీణ స్థాయి నుంచి విత్తనాలను రైతులు స్వేచ్ఛగా ఇచ్చి పుచ్చుకునే పద్ధతులను ప్రోత్సహించాలి.

వ్యాసకర్త వ్యవసాయ రంగ నిపుణులు

సోషల్ మీడియా

రంగుల పండుగ



హోలీ – ప్రపంచంలోనే అత్యంత పెద్దదైన రంగుల పండుగ. ప్రేమ, వసంతం, చెడు మీద మంచి విజయాన్ని ఉత్సవం చేసే హిందూ పండుగ. భారత్‌లోనూ, ప్రపంచమంతా ఉన్న భారతీయ స్నేహితులకు హోలీ శుభాకాంక్షలు.

– వాల్టర్ జె. లిండర్, ఇండియాలో జర్మనీ రాయబారి

మంచి నెల



రమదాన్ మంచి అలవాట్లు చేసుకునే నెల. ఈ నెలతో వచ్చే మంచినంతా అలవర్చుకోండి. అలా చేసుకునే మంచి అలవాట్లు, మంచి విలువలు, మంచి పని తాలూకు ప్రతిఫలం మీరు తప్పక పొందుతారు.

– ముఫ్తి మెంక్, ఇస్లాం బోధకుడు

అంత తిరుగుతున్నారా?



జమ్ము కశ్మీర్ శాసన సభ్యులు అరుదైన ఐక్యతను చూపుతూ తమ వేతనం (1,60,000) కనీసం తమ కార్ల పెట్రోల్‌కు కూడా చాలడం లేదని ఏకస్వరంతో చెబుతున్నారు. చూస్తుంటే అందరూ 24/7 కార్ల మీద ప్రపంచ యాత్ర చేస్తున్నట్టున్నారు!

– గౌహర్ గిలానీ, కాలమిస్ట్

భాషా నాటకం



మీ పిల్లలు, మనవలు ఏడాదికి 1–2 లక్షల రూపాయల ఫీజుండే ఇంటర్నేషనల్ స్కూల్స్‌లో చదువుతారు. అక్కడ లాంగ్వేజ్ ఆప్షన్స్‌లో హిందీ, ఫ్రెంచ్, స్పానిష్ ఉంటాయి. కానీ టీవీ చర్చల్లో మాత్రం జాతీయ విద్యా విధానం తమిళనాడు మీద ఎలా భారం మోపుతున్నదో మాట్లాడుతారు. తమిళనాడు అనేది నిజమైన అసంబద్ధ నాటకరంగం.

– సుమంత్ రామన్, టీవీ హోస్ట్

అవి చవక



ఒలింపిక్స్ కోసం ఒక నెలలో 30 బిలియన్ డాలర్లు, ఒక్క బుల్లెట్ ట్రెయిన్ నడపడం కోసం 20 బిలియన్ డాలర్లు వెచ్చించడానికి ఇండియా సిద్ధంగా ఉంది. కానీ ఆరోగ్యం, జీవిత బీమాల మీద ఉమ్మడిగా 2 బిలియన్ డాలర్ల జీఎస్టీని మాఫీ చేయడానికి మాత్రం సిద్ధంగా లేదు. భారతీయుల ఆరోగ్యం, జీవితాలకు విలువ లేదు!

– మనోజ్ అరోరా, ఫైనాన్షియల్ ప్లానర్

చివరికి మిగిలిందేమిటి?

రామ నామ జపముచే మున్ను వాల్మీకి. / బోయదయ్యు బాపదయ్యే! / కులము ఘనము కాదు గుణమే ఘనమ్మురా / విశ్వదాభిరామ వినురవేమ! అని వేమన వందల సంవత్సరాల క్రితమే చెప్పినప్పటికీ ఈనాటికీ ఆ పద్య భావం పెడచెవిన పెట్టబడుతోంది. వేమన, కులం కాదు 'గుణమే' ముఖ్యమన్నాడు. 'మంచి అన్నది మాల అయితే మాల నేనవుతాను' అని గురజాడ అన్నారు. ఇవేమీ పట్టించుకోని మిర్యాలగూడకు చెందిన అమృత తండ్రి మారుతీరావు 2018లో దళితుడైన ఆమె భర్త ప్రణయ్‌ను పాశవికంగా పరువు పేరుతో హత్య చేయించాడు. ఇలాంటివారు దేశమంతా ఎందరో ఉన్నారు.

ఆరేళ్ల తర్వాత నల్లగొండ జిల్లా సెషన్స్ కోర్ట్ ఇచ్చిన తీర్పు... మనిషి కంటే కులమే గొప్పదని నమ్మే హైందవ నాగరాజులకు చెంప దెబ్బనే చెప్పాలి. ఈ అంశం సమాజానికి ఎన్నో విషయాలను మరోసారి బహిర్గతం చేసింది. మరీ ముఖ్యంగా తల్లిదండ్రులు–పిల్లల బాంధవ్యాలు ఎలా ఉండాలి, ఎలా ఉండకూడదు అనేదాన్ని సుస్పష్టం చేసింది. ఈ మధ్యకాలంలో రచయిత డా॥ స్టీఫెన్ ఆర్... ఒక పనిని ప్రారంభించే ముందు, దాని ముగింపును దృష్టిలో పెట్టుకోవాలని పేర్కొన్నారు. అమృత తండ్రి మారుతీరావులో మొదలైన అల్లుణ్ణి హత్య చేయించాలనే ఆలోచన నేడు కొన్ని కుటుంబాల శోకానికి కారణమైంది. కన్న కూతురిపై అపారమైన ప్రేమను పెంచుకున్న మారుతీ రావు జీవితాన్ని కోల్పోయాడు. అతని భార్య భర్తను కోల్పోయింది. అతని కూతురు తండ్రిని కోల్పోయింది. ఇటు అమృత భర్తను కోల్పోయింది. ఆమెకు పుట్టిన బిడ్డకు కన్నతండ్రి లేకుండా పోయాడు. మొదటి ముద్దాయికి ఉరిశిక్ష ఖరారు అయింది. మిగిలిన వారికి జీవిత ఖైదు విధించబడింది. ఒక్క మాటలో చెప్పాలంటే అందరికీ శూన్యమే మిగిలింది.

నరేంద్ర మోదీ గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు అహ్మదాబాద్‌లో హరేన్ పాండ్యా హత్య కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్నటువంటి అస్గర్ అలీ ఈ కేసులో కూడా నిందితుడు కావడం సామాన్య మనిషికి ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. ఇలాంటి వ్యక్తులకు అసలు బెయిల్ మంజూరు కాకుండా చూడవలసిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. 'పరువా, కులమా... మీ చిరునామా ఎక్కడ' అంటూ వెతికితే... దానికి సాహిత్యకారుల రచనల్లో సమాధానం దొరుకుతుంది. 'ఎంచి చూడగా మనుజులందున మంచి– చెడులు అను రెండే కులములు' అన్నాడు మహాకవి. సాటి మనిషిని మనిషిగా చూడలేని మనిషి మనోమందిరాలు 'అపరిశుభ్ర విసర్జన శాలలుగానే' మిగిలిపోతాయి. దీని ప్రక్షాళనకై అంతరంగ పారిశుద్ధ్య కార్మికులు కావాలి.

– డా॥ ఉడుము ఝాన్సీ । తెలుగు అధ్యాపకురాలు, ఆర్జీయూకేటీ, నూజివీడు

కాలం చెల్లిన చైనా 'చేప కథ'

అభిప్రాయం



జాన్‌సన్ చోరగుడి

ఏ శాస్త్రంలోని నూతన ఆవిష్కరణ అయినా సామాజిక శాస్త్ర పర్యావరణ గీటురాయి మీద దాని మానవీయ విలువను నిర్ధారించుకోక తప్పదు. 2004 డిసెంబర్‌లో 'ఇన్ఫర్మేషన్ కమ్యూనికేషన్ టెక్నాలజీ' (ఐసీటీ) మన బడుల్లో పాఠంగా మొదలయింది. అది మొదలు గత రెండు దశాబ్దాలలో దానికి మొలకెత్తిన చిలవలు పలవలు... ఊడలు దిగిన భ్రమనులైన పరిస్థితుల్లో, మన మానసిక వైఖరులు మన మానవీయ విలువలను ఎలా ప్రభావితం చేస్తున్నాయి? అన్నప్పుడు కొంచెం తేడాతో అందరం అందులో మునకలు వేయడం అయితే నిజం. మనకంటే ముందే ఈ అనుభవమున్న సంపన్న దేశాల్లో దీని పర్యవ సానాలపై అధ్యయనం మొదలయింది కనుక ఈ ప్రపంచీకరణ కాలంలో ఆ కొలమానాలు మనమూ వాడుకోవచ్చు.

గత పదేళ్ళలో పెరిగిన 'సోషల్ మీడియా' మన మీద పెంచుతున్న ఒత్తిడితో ఏర్పడిన 'ఇన్ఫర్మేషన్ ఎకో సిస్టం'లో ఇప్పుడు మనం ఉన్నాం. అదొక నూతన పర్యావరణంగా మారి, మన ఆలోచనలు అభిప్రాయాలు అందుకు అనుగుణంగా మార్చుతూ, మూడు రంగాలలో మన జీవితాల్ని అది ప్రభావితం చేస్తున్నదని ఫిబ్రవరి 2023లో ఎవాన్ కుహెన్ ఒక వెబ్సైట్‌కు రాసిన 'వాట్ ఈజ్ ఇన్ఫర్మేషన్ ఎకో సిస్టం?' వ్యాసంలో అంటారు. గుర్తించిన ఆ మూడింటిలో 'సివిల్ సొసైటీ' (పౌరసమాజం) ఒకటి. ఈ పరిశీలన వెలుగులో కొత్త రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్ 'పౌర సమాజం' సంగతి ఏమిటి? మన పండితులు పామరుల అభిప్రాయాలపై ఎటువంటి 'సమాచార' పర్యావరణ ప్రభావం ఉంది. ప్రభావశీలురైన ముగ్గురు ప్రముఖులు 2025 ఫిబ్రవరిలో వెలుబుచ్చిన అభిప్రాయాలలో నుంచి వాటిపై 'సమాచార పర్యావరణ' ప్రభావం ఏ మేర ఉందో చూద్దాం.

ఫిబ్రవరి మొదటివారంలో ప్రభుత్వ కార్యదర్శులతో ఏర్పాటుచేసిన ఒక సమీక్ష సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ – "మీరు ఫిర్యాదుల పరిష్కారం మొదటి ప్రాధాన్యతగా చూడాలి, రెవెన్యూశాఖ నుంచి భూ కబ్జాలు వల్ల లా అండ్ ఆర్డర్ సమస్యలు తలెత్తుతున్నాయి. డాక్యుమెంట్స్ ఫోర్జరీ ఎక్కువ అయిపోయింది... వీటిని మీరు ఎలా పరిష్కరిస్తారు అనేది మీకే వదిలి పెడుతున్నాను" అన్నారు. ఇది విన్నాక ఈ ధోరణి మూలాలు ఎక్కడ ఎందుకు మొదలయింది వెతికితే, రాజధాని హైదరాబాద్ నుంచి విజయవాడకు మారిన 2015 తర్వాత నుంచి రాజకీయం అంటేనే 'భూమి విలువ' అన్నట్టుగా మారింది. "అమరావతిలో అన్నీ పోను ఎనిమిది వేల ఎకరాలు మిగులుతాయి, ఎకరం 20 కోట్లు చొప్పున అమ్మితే 160 కోట్లు వస్తాయి..." తరహా మాటలు అధికార కేంద్రాల నుంచి వస్తే, 'సోషల్ మీడియా' దానికి విస్తృత ప్రచారం ఇచ్చింది.



ఇప్పుడు తెనాలి ప్రాంతానికి చెందిన ఏ.పి. 'ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డెవలప్మెంట్ స్టడీస్' చైర్మన్ ప్రొఫెసర్ ఎస్. మహేంద్ర దేవ్ కూడా విశాఖలో– "కొత్త రాష్ట్రానికి అమరావతి వంటి 'గ్రీన్ ఫీల్డ్ కేపిటల్' ఉండడం అవసరం" అంటూ పనిలో పనిగా –"ఉచితాలు అనుచితం" అని కూడా అనేశారు. పోనీ అది నిజమనుకుందాం. మరి వారే "బాపట్ల సమీపాన 20 ఏళ్ళనాడు ఆగిపోయిన 'వాన్ పిక్' ఈ పదేళ్లలో పూర్తి అయివుంటే, 'ఉచితాలు' తీసుకునేవారు అవి మాని అక్కడే ఏదో ఒక 'లేబర్' పని చేసుకుని బతికేవారు" అని కూడా అనొచ్చు కదా? చివరికి ఏమైంది గత పదేళ్ళలో 'రాజధాని' చుట్టూ 'సోషల్ మీడియా' వ్యాప్తి చేసిన 'ఇన్ఫర్మేషన్ ఎకో సిస్టం' కింద నలిగి కేంద్ర హోంశాఖ నియమించిన శివరామకృష్ణన్ కమిషన్ నిపుణుల అభిప్రాయాలు ఇటువంటి ప్రకటనల కింద సమాధి అయ్యాయి.

రిజర్వ్ బ్యాంకు మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు కూడా ఇదే విశాఖ నుంచి ఉచితాలు గురించి – 'ఫ్రీబీస్' ఎందుకు? అంటూ ఎప్పుడో పాతదైన 'చైనా వారి చేప' కథ చెప్పారు. అది చైనాలో నిజమేమో. ఇక్కడ 'చేపలు' పట్టడం నేర్పడం కోసం పెట్టిన 'స్కిల్ డెవలప్మెంట్ ప్రోగ్రాం' ఏమైందో చూశాం. అయినా – 'ఫ్రీబీస్' ఎందుకు? అంటే, ఈ 'ఉచితాలు' పొందే వారు కూడా ఏమంత సంతోషంగా ఏమీ లేరు. కారణం కళ్ళముందు సంపన్న వర్గాల వద్దకు చేరుతున్న సంపద, వారి విజయగాథలు, వైభవంగా జరిగే వారి పెళ్ళిళ్ళు, ఫ్యామిలీ ఫంక్షన్స్... వాటి గురించి 'సోషల్ మీడియా' కథలుగా చెబుతుంటే వింటూ, తమకు అందే అరకొరను వాళ్ళు తూకం వేస్తున్నారు. అధికార కేంద్రాలకు దగ్గరయితే, అక్రమ ఆదాయ వనరులు ఎలా పెరుగుతాయో 'సోషల్ మీడియా' వారికి నిత్యం కళ్ళకు కట్టిస్తున్నది.

విషయం ఏమంటే, ప్రభుత్వ పరిపాలనలోకి 'టెక్నాలజీ' వచ్చాక, అవినీతికి చిల్లులున్న చీకటి మార్గాలు మూతపడి ఆదాయ వనరులకు గండి పడితే, ప్రత్యామ్నాయాన్ని ప్రకృతి వనరుల్లో వెతుక్కుంటున్నారు. అభివృద్ధి మారుమూల గ్రామాలకు ప్రవేశిస్తుంటే, బయటకు వెళుతున్న మట్టి, కంకర చూస్తున్నదే. వాటి వివరాలు 'సోషల్ మీడియా' 24 గంటలూ జనానికి చూపిస్తున్నది. ఈ అక్రమ లావాదేవీల చిట్టా సామాన్యుడికి అరచేతిలో 'ఫోన్'లో దొరుకుతుంటే, ప్రభుత్వం అరాకొరా ఉచితంగా ఇచ్చే రొట్టె ముక్కను ఇవ్వాలా వద్దా? అంటూ మళ్ళీ అదే పాత చర్చ అంటే, వారి వద్ద పాండిత్యం పరిహాసం అవుతుందేమో!


వ్యాసకర్త అభివృద్ధి – సామాజిక అంశాల వ్యాఖ్యాత

కామ దహనం



ఫాల్గుణ పూర్ణిమ నాడు ఈ దేశమంతా పులకించి, రంగుల జల్లులలో తడిసి ముద్దవుతుంది. హోలీ వేడుకల వెల్లువలో ఓ పూటంతా ఒళ్ళు మరిచి పోతుంది. ఒకప్పుడు హోలీ ఉత్తర భారతానికే పరిమితమై ఉండేది. ఇప్పుడు దేశంలోని అన్ని భాగాలకూ విస్తరించింది. విదేశాలకూ వ్యాపించింది.

హోలీ అంటే ఔత్తరాహులకు దీపావళి తరవాత అంతటి పండగ. పెద్ద పండగ. ఈ పండగ వెనక ఎన్నెన్నో కథలూ, గాథలూ, ఐతిహ్యాలూ ఉన్నాయి. దక్షిణ భారత సంప్రదాయంలో ఫాల్గుణ పూర్ణిమ 'కాముడి పున్నమి'. దీని వెనక ఉన్న పురాణ కథ కామదహనం కథ. మహత్తరమైన తన ప్రతాపాన్ని మహాదేవుడి మీద చూపబోయిన మన్మథుడు, ఫాలాక్షుడి నేత్రాగ్నిలో ముందు భస్మమైపోయి, తిరిగి ఆయన కటాక్షంతోనే సజీవుడైన కథ. శివుడి ఉద్దేశ్యం కాముడిని నిర్మూలించటం కాదు, నిగ్రహించటం!



కామం, అంటే ఇంద్రియ విషయాల మీద కోరిక! లోక సమ్మతమైన పురుషార్థమే. ధర్మ అవిరుద్ధమైన కామానికి దివ్యత్వం ఉంది. అయితే, కామం జీవుడి వశంలో ఉంటే అది ఆనందాన్నిస్తుంది. జీవుడు కామం వశంలోకి వెళ్ళిపోతే, అది వినాశన హేతువవుతుంది.

'మనిషి చేసే అన్ని పాపాలకూ కారణం కామమే. అది రజో గుణం నుండి పుడుతుంది. దాని వెనకనే క్రోధం ఉంటుంది. అద్దాన్ని మురికి కప్పినట్టు, గర్భస్థ శిశువును మావి కప్పినట్టు, జీవుడి జ్ఞానాన్ని కామం కప్పేస్తుంది. కామం తీరని ఆకలి. ఆరని అగ్ని. అది జీవుడి పరమ శత్రువు' అంటుంది గీత నిర్ద్వంద్వంగా.

కాబట్టి, హోలీ ముచ్చటలన్నీ ముగిసిన తరువాత, స్థిమితంగా కూర్చొని, కామరూపమైన దుర్జయమైన అంతః శత్రువును నియంత్రించి, నిగ్రహించటం మీద కొంత ధ్యాస పెట్టాలి అన్నది కాముని పున్నమి సందేశంగా స్వీకరించటం క్షేమకరం.

అందరికీ హోలీ పూర్ణిమ శుభాకాంక్షలు!

– ఎం. మారుతి శాస్త్రి

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, ఫాల్గుణ మాసం, **తిథి:** పౌర్ణమి ఉ.11.29 వరకు, తదుపరి బహుళ పాడ్యమి, **నక్షత్రం:** ఉత్తర పూర్తి (24 గంటలు), **వర్జ్యం:** ప.1.31 నుండి 3.15 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.35 నుండి 9.23 వరకు, తదుపరి ప.12.35 నుండి 1.23 వరకు, **అమృత ఘడియలు:** రా.11.56 నుండి 1.40 వరకు; **రాహుకాలం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **యమగండం:** ప.3.00 నుండి 4.30 వరకు, **సూర్యోదయం:** 6.14, **సూర్యాస్తమయం:** 6.05.

క్లుప్తంగా...

పోసానికి నోటీసులిచ్చి వివరణ తీసుకోండి

బాపట్ల పోలీసులకు హైకోర్టు ఆదేశం



సాక్షి, అమరావతి: సోషల్ మీడియా పోస్టుల వ్యవహారంలో సినీనటుడు పోసాని కృష్ణమురళికి హైకోర్టు ఊరటనిచ్చింది. ఆయనకు బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 35(3) కింద నోటీసులు జారీచేసి వివరణ తీసుకోవాలని బాపట్ల పోలీసులను ఆదేశించింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ నూనెపల్లి హరినాథ్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. పోసాని కృష్ణమురళి టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడిని దూషించారని, ఆయనపై చర్యలు తీసుకోవాలని బాపట్లకు చెందిన వి.విజయ్‌కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు పోసానిపై కేసు నమోదు చేశారు. ఈ కేసును కొట్టేయాలంటూ పోసాని గురువారం హైకోర్టులో అత్యవసర పిటిషన్ దాఖలు చేశారు. పోసాని విషయంలో పీటీ వారెంట్ అమలు కానందున ఆయనకు సెక్షన్ 35(3) కింద నోటీసు ఇచ్చి వివరణ తీసుకోవాలని న్యాయమూర్తి ఆదేశించారు.

ఓబుళాపురం ఆందోళనల కేసు కొట్టివేత

విజయవాడ లీగల్: ఓబుళాపురం గనుల వద్ద ఆందోళన చేసిన కేసులో టీడీపీ నాయకులపై నమోదైన కేసును ప్రజాప్రతినిధుల కోర్టు గురువారం కొట్టివేసింది. 2007లో డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి సీఎంగా ఉన్న సమయంలో టీడీపీ నేతలు 144 సెక్షన్ ఉల్లంఘించి ఓబుళాపురం గనుల పరిశీలనకు వెళ్లి, అధికారుల విధులకు ఆటంకం కలిగించారని అచ్చెన్నాయుడు, దేవినేని ఉమా, నాగం జనార్దనరెడ్డి, ఎర్రబెల్లి దయాకరరావు, గోవిందప్ప, పడాల అరుణ, నిమ్మకాయల చినరాజప్ప, వై.వి.రాజేంద్రప్రసాద్ సహా 21 మందిపై కేసు నమోదు చేశారు. 18 ఏళ్ల సుదీర్ఘ కాలం విచారణ తరువాత టీడీపీ నేతలపై నమోదు చేసిన కేసును కొట్టివేస్తూ ప్రజాప్రతినిధుల కోర్టు న్యాయమూర్తి సిరిపురపు శ్రీదేవి తీర్పునిచ్చారు.

నాపై కేసుల్లో సెక్షన్ 35(3) ప్రకారం నడుచుకునేలా ఆదేశాలివ్వండి

హైకోర్టులో వల్లభనేని వంశీ పిటిషన్

సాక్షి, అమరావతి/విజయవాడ లీగల్: మైనింగ్ విషయంలో కృష్ణా జిల్లా గన్నవరం పోలీసులు నమోదు చేసిన కేసుల్లో తనకు బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 35(3) ప్రకారం నోటీసులు ఇచ్చి వివరణ తీసుకునేలా ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ హైకోర్టులో పిటిషన్‌లు దాఖలు చేశారు. ఈ వ్యాజ్యాలపై జస్టిస్ నూనెపల్లి హరినాథ్ విచారణ జరిపారు. వంశీ తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ, పోలీసులు నమోదు చేసిన సెక్షన్లన్నీ ఏడేళ్ల లోపు శిక్ష పడేవేనన్నారు. అందువల్ల సెక్షన్ 35(3) ప్రకారం నోటీసులు ఇచ్చి వివరణ తీసుకునేలా ఆదేశాలు జారీ చేయాలని కోరారు. పోలీసుల తరఫున ప్రభుత్వ న్యాయవాది ఎ.జయంతి వాదనలు వినిపించారు. రెండు పక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి తదుపరి విచారణను 17కి వాయిదా వేశారు. ఇదిలా ఉండగా, సత్యవర్ధన్ కిడ్నాప్, బెదిరింపుల కేసులో మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై విచారణను విజయవాడలోని ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక న్యాయస్థానం 17కి వాయిదా వేసింది.

ఆ ప్రాంతాల్లో పర్యాటకాన్ని అభివృద్ధి చేయండి

కేంద్ర మంత్రికి వైఎస్సార్‌సీపీ ఎంపీ తనూజ వినతి



సాక్షి, న్యూఢిల్లీ: గిరిజన ప్రాంతాల్లో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయాలని కేంద్ర ఫిషింగ్, పోర్టులు, వాటర్‌వేస్ మంత్రి సర్బానంద సోనోవాల్‌కు వైఎస్సార్‌సీపీ ఎంపీ తనూజ రాణి విజ్ఞప్తి చేశారు. గురువారం ఢిల్లీలో కేంద్ర మంత్రితో ఆమె భేటీ అయ్యి..గిరిజన ప్రాంతాల్లో పర్యాటక రంగానికి అనేక సదుపాయాలు ఉన్నాయని వివరించారు. జలపాతాలు, నదులు, నీటి వనరులకు నిలయంగా గిరిజన ప్రాంతాలు ఉన్నట్లు తెలిపారు. జెట్టీలు, బోట్ ర్యాంప్‌ల ద్వారా జలమార్గాలను అభివృద్ధి చేయాలని కోరారు. సహజ సౌందర్యం, జీవన వైవిధ్యాన్ని ప్రదర్శించే క్రూయిజ్‌లు, కయాకింగ్, పక్షుల పరిశీలన వంటి పర్యాటక కార్యకలాపాలను ప్రోత్సహించాలని విజ్ఞప్తి చేశారు.

భూ రికార్డులు, సవరణల అప్పిలేట్ అథారిటీగా ఆర్డీవో

సాక్షి, అమరావతి : రెవెన్యూ శాఖలో భూముల రికార్డుల నిర్వహణ, సవరణలకు అప్పిలేట్ అథారిటీగా ప్రస్తుతం ఉన్న డీఆర్వోని ఉపసంహరించి, ఆ స్థానంలో ఆర్డీవోలను నియమించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు 'ఏపీ భూమి హక్కులు, పట్టాదారు పాస్ పుస్తకాల చట్టం' సవరణ బిల్లుకు శాసన సభ గురువారం మూజువాణి ఓటుతో ఆమోదం తెలిపింది. ప్రశ్నోత్తరాల కార్యక్రమం అనంతరం మంత్రి అనగాని సత్యప్రసాద్ ఈ బిల్లును సభలో ప్రవేశపెట్టారు. ఈ బిల్లు తేవడంలో ప్రభుత్వ ఉద్దేశాలను మంత్రి వివరించారు. డీఆర్వోలను అప్పిలేట్ అథారిటీగా నియమించడం వల్ల వారిపై పని భారం పెరిగి, 4,566 అప్పీల్స్ పెండింగ్‌లో ఉన్నాయని, ఇది రైతులకు, అప్పీలుదారులకు ఇబ్బందికరంగా మారిందని చెప్పారు.


బాల్య వివాహాల భారతం

కట్టడి సరే.. ఏటా మరింత పెరుగుదల



ఆధునిక సమాజంగా చెప్పుకుంటున్నప్పటికీ, దేశంలో బాల్య వివాహాల పూర్తి స్థాయి కట్టడి జరగడంలేదు. పైగా ఏడాదికేడాది ఈ సంఖ్య పెరుగుతుండడం మరో ఆసక్తికర అంశం. అధికారికంగానే లెక్కలు వందల్లో ఉన్నాయంటే, అనధికారికంగా పరిస్థితి ఎంత తీవ్రంగా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. రాజ్యసభలో తాజాగా కేంద్ర స్త్రీ, శిశుసంక్షేమ మంత్రిత్వ శాఖ ఈ గణాంకాలను వెల్లడించింది.

- సాక్షి, అమరావతి




అత్యధికంగా బాల్య వివాహాలు జరుగుతున్న రాష్ట్రాలు

రాష్ట్రం	2018	2019	2020	2021	2022
కర్ణాటక	73	111	184	273	215
అసోం	88	115	136	155	163
తమిళనాడు	67	46	77	169	155
పశ్చిమబెంగాల్	70	68	98	105	121
మహారాష్ట్ర	13	20	50	82	99
ఒడిశా	22	22	24	64	46
హరియాణా	21	20	33	33	37

ఆధారం: కేంద్ర స్త్రీ, శిశు సంక్షేమ మంత్రిత్వ శాఖ

మంత్రిత్వ శాఖ పేర్కొన్న అంశాల్లో ముఖ్యమైనవి



బాల్య వివాహాలు అరికట్టేందుకు, వీటితో సంబంధం ఉన్న వారిపై కఠిన చర్యలు తీసుకునేందుకు వీలుగా బాల్య వివాహాల నిషేధ చట్టంలోని సెక్షన్‌లో సవరణలు తీసుకుని రావడం జరిగింది.

ఈ సవరణతో రాష్ట్ర ప్రభుత్వాలకు బాల్య వివాహాల నిషేధం అమలు వ్యవహారాల అధికారులను నియమించుకునే అధికారాన్ని కల్పించారు.

బాల్య వివాహాలను నిరోధించేందుకు చర్యలు తీసుకోవడంతో పాటు నిబంధనలను ఉల్లంఘించే వ్యక్తులపై విచారణ జరిపి చర్యలు తీసుకునే అధికారాలను రాష్ట్ర ప్రభుత్వాలకు కల్పించారు.

బాల్య వివాహాలను ప్రోత్సహించవద్దని, అటువంటి వారికి సహకరించడం వంటి చర్యలు చేయవద్దని స్థానిక నివాసితులకు తెలియజేయడంతో పాటు బాల్య వివాహాల వల్ల ఉత్పన్నమయ్యే దుష్ప్రభావాల గురించి అవగాహన కల్పించడం, బాల్య వివాహాల సమస్యపై సమాజాన్ని చైతన్యవంతం చేయడం అధికారుల విధులు.

ఈ అధికారులందరూ సంబంధిత రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ప్రత్యక్ష నియంత్రణలో పనిచేస్తారు.

బాల్య వివాహాలను నిరుత్సాహపరచడంతో పాటు లింగ సమానత్వం కోసం బేటీ బచావో- బేటీ పఢావో పథకాన్ని 'మిషన్ శక్తి' పేరుతో కేంద్ర అమలు చేస్తోంది.

బాల్య వివాహాల నిరోధించేందుకు జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఎప్పటికప్పుడు అవగాహన కార్యక్రమాలను చేపడుతోంది.

వెరిఫికేషన్ పేరిట లక్షలాది పింఛన్ల తొలగింపు

శాసన మండలిలో ప్రభుత్వంపై వైఎస్సార్‌సీపీ మండిపాటు

- గతేడాది జూన్ నాటికి రాష్ట్రంలో పింఛన్ లబ్ధిదారులు 65.18 లక్షలు
- ఈ ఏడాది ఫిబ్రవరి నాటికి 63.59 లక్షలకు తగ్గిన వైనం
- ఈ లెక్కన ఏకంగా 1.58 లక్షల పింఛన్లపై వేటు
- కూటమికి ఓటు వేయలేదని తొలగిస్తున్న దుస్థితి
- పది నెలల్లో కొత్తగా ఒక్క పింఛన్ కూడా ఇవ్వని ప్రభుత్వం
- ఆడ బిడ్డ నిధి ఎప్పటి నుంచి ఇస్తారని నిలదీత



తోట త్రిమూర్తులు | రమేశ్ యాదవ్ | అరుణ్‌కుమార్

సాక్షి, అమరావతి : పది నెలల కూటమి పాలనలో కొత్తగా ఒక్క సామాజిక భద్రతా పింఛన్ కూడా మంజూరు చేయకపోగా, ఏకంగా లక్షల మంది పింఛన్లను తొలగించారని వైఎస్సార్‌సీపీ ధ్వజమెత్తింది. అభాగ్యులకు పింఛన్లు తొలగించడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేసింది. సామాజిక భద్రతా పింఛన్లపై వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీలు అడిగిన ప్రశ్న గురువారం మండలిలో చర్చకు వచ్చింది. ఈ సందర్భంగా సెర్ప్ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ 2024 జూన్ నాటికి రాష్ట్రంలో 65,18,496 మంది పింఛన్ లబ్ధిదారులుండగా, ఈ ఏడాది ఫిబ్రవరికి ఆ సంఖ్య 63,59,907కు తగ్గిందని.. గత ఏడాది జూన్ నుంచి 14,967 పింఛన్లు మాత్రమే తొలగించామన్నారు. మంత్రి సమాధానం పట్ల ప్రతిపక్ష సభ్యులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఏకంగా 1.58 లక్షల పింఛన్లు తగ్గడం కళ్లెదుటే కనిపిస్తుంటే కేవలం 14 వేలే తొలగించామని మంత్రి చెప్పడం దుర్మార్గమని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు మండిపడ్డారు. వెరిఫికేషన్ పేరిట ప్రభుత్వం వృద్ధులు, వికలాంగులు, మంచంపై నుంచి లేవలేని స్థితిలో ఉన్న వారి పింఛన్లు తొలగించడం అన్యాయమని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతిపక్ష పార్టీ వారికి ఎలాంటి మేలు చేయొద్దని సాక్షాత్తు ముఖ్యమంత్రే చెబుతుండటంతో ఇష్టానుసారం పింఛన్లు తొలగిస్తున్నారని మండిపడ్డారు. మరో ఎమ్మెల్సీ రమేశ్ యాదవ్ మాట్లాడుతూ.. కూటమికి ఓటు వేయలేదన్న కక్షతో గ్రామాల్లో పింఛన్లు తొలగిస్తున్నారని ఆరోపించారు. తమ ప్రభుత్వంలో కులం, మతం, ప్రాంతం, రాజకీయం చూడకుండా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి పింఛన్ ఇచ్చామన్నారు. 2019 నాటికి 53,85,776 పింఛన్ లబ్ధిదారులు ఉంటే, 2024 నాటికి 65,18,496కు పెరిగినట్టు వివరించారు. ఎమ్మెల్సీ మొండితోక అరుణ్‌కుమార్ మాట్లాడుతూ.. గతంలో పింఛన్ అర్హతకు సిక్స్ స్టెప్ వెరిఫికేషన్ ఉండేదని, ఇప్పుడు దాన్ని 13-స్టెప్ వెరిఫికేషన్‌గా మార్చారన్నారు. ఈ సందర్భంగా మంత్రి కొండపల్లి జోక్యం చేసుకుంటూ 13-స్టెప్ వెరిఫికేషన్ లేదన్నారు. దీంతో పింఛన్ వెరిఫికేషన్ కోసం ప్రభుత్వం రూపొందించిన 13 అంశాలను మొండితోక అరుణ్‌కుమార్ సభలో చదివి వినిపించారు. సదరం సర్టిఫికెట్‌కు 15 రోజుల గడువు పెట్టారని, అయితే స్లాట్ దొరకడానికే నెలలు పడుతోందన్నారు. ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్రంలో కొత్త పింఛన్లు ఎప్పటి నుంచి మంజూరు చేస్తారని అడిగారు. కార్యాచరణ రూపొందిస్తున్నామని, త్వరలో దరఖాస్తుల స్వీకరిస్తామని మంత్రి కొండపల్లి తెలిపారు.

'ఆడ బిడ్డ నిధి' అంతేనా?



వరుదు కళ్యాణి



టి.కల్పలత

'ఆడ బిడ్డ నిధి' పథకాన్ని ఎప్పటి నుంచి అమలు చేస్తారో చెప్పాలని వైఎస్సార్‌సీపీ మహిళా ఎమ్మెల్సీలు వరుదు కళ్యాణి, టి.కల్పలత ప్రభుత్వాన్ని నిలదీశారు. ఈ పథకం అమలుపై నిర్దిష్ట కాల పరిమితిపై స్పష్టత ఇవ్వాలన్నారు. ప్రశ్నోత్తరాల సమయంలో వారు మాట్లాడుతూ.. ఆడబిడ్డలకు తమ ప్రభుత్వం రాగానే నెలకు రూ.1500 ఇస్తామని చంద్రబాబు ఇచ్చిన హామీని గుర్తు చేశారు. ఒక ఇంట్లో ఎంత మంది మహిళలుంటే అంతమందికీ వర్తింపజేస్తామని ప్రచారం చేశారన్నారు. పది నెలలైనా పథకం ఊసే లేదని, కనీసం సమీక్ష కూడా నిర్వహించలేదని, ప్రభుత్వ వైఖరి ఏమిటో స్పష్టం చేయాలని నిలదీశారు. దీనిపై మంత్రి శ్రీనివాస్ స్పందిస్తూ మరికొంత సమయం పడుతుందంటూ సమాధానం దాటవేశారు.

లోకేశ్‌పై కేసు నమోదు చేయాలి

వైఎస్ జగన్, మాజీ మంత్రులపై ఐ-టీడీపీ అసభ్యకర పోస్టులు తొలగించాలి

- కోర్టులో వైఎస్సార్‌సీపీ నేత చవ్వా రాజశేఖర్‌రెడ్డి ప్రైవేట్ కేసు

అనంతపురం: 'వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మాజీ మంత్రులు ఆర్కే రోజా, విడదల రజినీలపై సభ్య సమాజం తలదించుకునేలా ఐ-టీడీపీ సామాజిక మాధ్యమాల్లో పోస్టింగ్‌లు పెడుతోంది. ఇదంతా ఏపీ విద్యాశాఖ మంత్రి లోకేశ్ కనుసన్నల్లోనే జరుగుతోంది. అందువల్ల ఐ-టీడీపీకి నేతృత్వం వహిస్తున్న లోకేశ్‌పై కేసు నమోదు చేయాలి' అని అనంతపురానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత చవ్వా రాజశేఖర్‌రెడ్డి కోర్టుకు విన్నవించారు. ఈ మేరకు ఆయన గురువారం అనంతపురం అదనపు జూనియర్ సివిల్ జడ్జి, జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో ప్రైవేట్ కేసు దాఖలు చేశారు. ఐ-టీడీపీపై, లోకేశ్‌పై కేసు నమోదు చేయాలని గతంలో అనంతపురం టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో చవ్వా ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేయకపోవడంతో కోర్టులో ప్రైవేటు కేసు దాఖలు చేశారు. ఆ పోస్టులను వెంటనే తొలగించేలా ఆదేశాలివ్వాలని కోర్టుకు విన్నవించారు.

డీబీటీకి రూ. 24,596 కోట్లు ఇచ్చారట!

- శాసన సభకు ప్రభుత్వం లిఖితపూర్వకంగా జవాబు
- 19-24 మధ్య డీబీటీ పథకాల కోసం వివిధ శాఖలకు రూ. 1.97 లక్షల కోట్లు విడుదల చేసినట్టు వెల్లడి

సాక్షి, అమరావతి : చంద్రబాబు ప్రభుత్వం వచ్చాక గత ఏడాది జూన్ నుంచి ఇప్పటి వరకు (గురువారం వరకు) రాష్ట్ర బడ్జెట్ నుంచి వివిధ పథకాల కింద ప్రత్యక్ష ప్రయోజన బదిలీ (డీబీటీ) విధానం ద్వారా సంబంధిత శాఖలకు రూ. 24,596.21 కోట్లు విడుదల చేసినట్టు ప్రభుత్వం శాసన సభకు లిఖితపూర్వకంగా తెలిపింది. వైఎస్సార్‌సీపీ సభ్యులు ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, బి. విరూపాక్షి, తాటిపర్తి చంద్రశేఖర్, దాసరి సుధ అడిగిన ప్రశ్న గురువారం శాసన సభ ప్రశ్నోత్తరాల కార్యక్రమంలో చర్చకు రాగా.. ఆర్థిక మంత్రి ఈ మేరకు లిఖితపూర్వకంగా సమాధానమిచ్చారు. 2019-20 ఆర్థిక సంవత్సరం నుంచి 2023-24 ఆర్థిక సంవత్సరం వరకు డీబీటీ విధానం ద్వారా వివిధ పథకాల కింద సంబంధిత శాఖలకు రాష్ట్ర బడ్జెట్ నుంచి ప్రభుత్వం రూ. 1,97,722.65 కోట్లు విడుదల చేసినట్టు ఆ జవాబులో పేర్కొన్నారు.

మాది స్కీమ్.. మీది స్కామ్

- 2014 నుంచి జరిగిన కుంభకోణాలపై చర్చకు మేము సిద్ధం
- అప్పటి అక్రమాలపై ప్రశ్నిస్తుంటే ఎందుకు భుజాలు తడుముకుంటున్నారు?
- శాసన మండలిలో అధికార పక్షం తీరును ఎండగట్టిన ప్రతిపక్షం



బొత్స | కుంభా రవిబాబు | మాధవరావు

సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమం కోసం అనేక పథకాలను ప్రవేశ పెడితే, వాటిని స్కాములుగా చిత్రీకరించేందుకు టీడీపీ ప్రయత్నం చేస్తోందని శాసన మండలిలో వైఎస్సార్‌సీపీ సభ్యులు మండిపడ్డారు. స్కాములన్నీ చేసింది టీడీపీ ప్రభుత్వమేనని ధ్వజమెత్తారు. ధైర్యం ఉంటే 2014-19 మధ్య టీడీపీ ప్రభుత్వంలో జరిగిన అవినీతిపై వేసిన సిట్ నివేదికలను బయటపెట్టాలని డిమాండ్ చేశారు. గురువారం శాసనన మండలిలో '2019-24 మధ్య జరిగిన కుంభకోణాలు'పై లఘు చర్చ జరిగింది. టీడీపీ సభ్యురాలు అనురాధ చర్చను ప్రారంభిస్తూ గత ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. దీంతో విపక్ష సభ్యులు అడ్డుపడి.. ప్రభుత్వానికి ధైర్యం ఉంటే విచారణ చేసి, మాట్లాడాలని అనడంతో ఆమె నీళ్ల నమిలారు. విశాఖలో విజయసాయిరెడ్డి బినామీ పేర్లతో భూములు కొన్నారని, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, సజ్జల రామకృష్ణారెడ్డి అటవీ భూములను ఆక్రమించారంటూ ఆమె విమర్శలకు దిగారు. సభలో లేని వ్యక్తుల పేర్లు ఎలా ప్రస్తావిస్తారంటూ వైఎస్సార్‌సీపీ సభ్యులు అరుణ్‌కుమార్, రమేష్‌యాదవ్ మండిపడ్డారు. అవి ఆక్రమించిన భూములు కాదని స్థానిక కలెక్టర్లు నివేదిక కూడా ఇచ్చారని స్పష్టం చేశారు.

దెయ్యాలు వేదాలు వల్లించినట్టుంది..

వైఎస్సార్‌సీపీ సభ్యుడు కుంభా రవిబాబు మాట్లాడుతూ.. కుంభకోణాలపై టీడీపీ మాట్లాడుతుంటే దయ్యాలు వేదాలు వల్లించినట్టుందని అన్నారు. ఆనాడు ఓటుకు కోట్లు కుంభకోణంలో చిక్కుకుని రాత్రికి రాత్రే సర్దుకుని విజయవాడకు వచ్చేశారని చంద్రబాబు ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. అప్పటి నుంచి ఏపీలో స్కాములపర్వం మొదలెట్టి, రాష్ట్రాన్ని అవినీతిలో నంబర్ 1గా నిలబెట్టారని మండిపడ్డారు. రాజధాని పేరుతో అంతర్జాతీయ స్థాయిలో రియల్ ఎస్టేట్ స్కామ్ చేశారని దుయ్యబట్టారు. నైపుణ్యాభివృద్ధి పేరుతో ప్రజాధనాన్ని దోచేసిన కేసులో చంద్రబాబును న్యాయస్థానం జైల్లో పెట్టిందన్నారు. విచారణకు సహకరించకుండా ఆయన పీఏను దేశాలు దాటించేశారని ఎద్దేవా చేశారు. రాజధాని ప్రకటనకంటే ముందే టీడీపీ నాయకులు బినామీ పేర్లతో దళితులు, నిరుపేదల అసైన్డ్ భూములను చౌకగా కొట్టేశారన్నారు. హెరిటేజ్ పేరిట కూడా 14 ఎకరాలు కొన్నారన్నారు. పోలవరాన్ని చంద్రబాబు ఏటీఎంలా వాడుకున్నారని 2019 ఎన్నికల్లో ప్రధాని మోదీనే చెప్పారని అన్నారు. రూ.150 కోట్లు కూడా ఖర్చవ్వని తాత్కాలిక సచివాలయం, అసెంబ్లీ భవనాలకు రూ.1,115 కోట్లు వెచ్చించారంటే ఎంత అవినీతి జరిగిందో స్పష్టమవుతోందని అన్నారు.

23 సీట్లకు ఎందుకు పడిపోయింది?

రాజధానిలో అవినీతికి పాల్పడకపోతే 2019 ఎన్నికల్లో టీడీపీ 23 సీట్లకు ఎందుకు పడిపోయిందని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు ప్రశ్నించారు. పోర్టులు, స్కిల్ కాలేజీలు, వర్సిటీల నిర్మాణం, భారీగా కంపెనీలను తేవడం స్కాములు ఎలా అవుతాయని అన్నారు. 2019-24 మధ్య కుంభకోణాలపై చర్చకు నోటీసిస్తే పాతవన్నీ తోడటం సరికాదంటూ మంత్రి అచ్చెన్నాయుడు అడ్డుపడ్డారు. స్కిల్ కేసులో చంద్రబాబుకు క్లీన్‌చిట్ ఇచ్చేసినట్టు చెప్పుకొచ్చారు. దీనిపై ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ స్పందిస్తూ.. అధికారపక్ష సభ్యులు పేపర్ల కథనాలు చూపించి కుంభకోణాలు అంటున్నారని, ఒక్క దానిపైనైనా రుజువులు చూపారా అని నిలదీశారు.

విశాఖ భూములపై సిట్ నివేదిక బయటపెట్టండి

టీడీపీ ప్రభుత్వం 2016లో విశాఖ భూములపై వేసిన సిట్ నివేదికను బయట పెట్టాలని బొత్స డిమాండ్ చేశారు. అందులోని వ్యక్తులు ఎవరైనా రాజకీయాలకు అతీతంగా శిక్షించాలని అన్నారు. అందులో విలువైన దసపల్లా భూములున్నాయని, ఎందుకు భుజాలు తడుముకుంటున్నారని అధికారపక్షాన్ని నిలదీశారు. గత ప్రభుత్వాధినేత భూ బకాసురుడిగా మారి అనుయాయులతో కలిపి దోపిడీ చేశారని మంత్రి అనగాని సత్యప్రసాద్ అనడంతో బొత్స తీవ్రంగా స్పందించారు. ఇలాంటి దుష్ట సంప్రదాయాన్ని ప్రదర్శిస్తున్న సభలో ఉండలేం అంటూ వాకౌట్ చేశారు.

ఆధారాల్లేకుండా బురదజల్లుడా?

మండలిలో ఇవాళ జరిగిన ప్రశ్నోత్తరాల్లోగానీ, స్వల్పకాలిక చర్చలోగానీ ప్రభుత్వం నుంచి నిర్దిష్ట సమాధానాలు రాలేదని బొత్స చెప్పారు. మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ మీద, తమ నాయకుడి మీద ఆధారాల్లేకుండా ఆరోపణలు చేసినందునే సభ నుంచి వాకౌట్ చేశామన్నారు.

> మేము భారత్‌లో అడుగుపెట్టిన తర్వాత బీహార్‌లో వ్యాపారం చేయాలంటే దుర్భర పరిస్థితులు ఉంటాయని వినిపించింది. అన్ని విమానాశ్రయాల్లో ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో ఏపీ నంబర్ 1 అని చూశాం. కానీ, ఐదేళ్లలో మాకు బీహార్ చక్కటి ప్రణాళిక, సుపరిపాలనతో దూసుకెళ్తుండగా, ఏపీ పూర్తి అయోమయంగా, అవగాహన లేకుండా ఉంది. ఏపీలో అనిశ్చిత పరిస్థితుల దృష్ట్యా మాకు వచ్చిన రాజధాని డిజైన్ ప్రతిపాదనలను విరమించుకుని బయటకు వెళ్లిపోయాం..
>
> -జపాన్ ఆర్కిటెక్చర్ సంస్థ సీఈవో వారి మేగజైన్‌లో ఏప్రిల్ 2017 సంచికలో రాసిన వ్యాసంలో చెప్పిన ఈ వివరాలను మండలిలో వైఎస్సార్‌సీపీ సభ్యుడు కుంభా రవిబాబు ప్రస్తావించారు.

విశ్వసనీయత లేని వ్యక్తి డొక్కా: కొమ్మూరి



సాక్షి, అమరావతి: పదవీ వ్యామోహంతో సీఎం చంద్రబాబు ప్రాపకం పొందడం కోసమే డొక్కా మాణిక్య వరప్రసాద్ వైఎస్సార్‌సీపీ పైన, వైఎస్ జగన్ పైన అవాకులు చవాకులు పేలుతున్నారని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ వర్కింగ్ ప్రెసిడెంట్ కొమ్మూరి కనకారావు మండిపడ్డారు. ఆయన గురువారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. పదవుల కోసం నిత్యం పార్టీలు మారే విశ్వసనీయత లేని నాయకుడు డొక్కా అని ఆగ్రహం వ్యక్తంచేశారు. లోకేశ్ రెడ్ బుక్‌లో డొక్కా పేరు కూడా ఉందని, వైఎస్సార్‌సీపీని ఎంత తిట్టినా పదవులు రావని అన్నారు. డొక్కా డబ్బిస్తేనే వైఎస్సార్‌సీపీలో పదవులిచ్చారా అని ప్రశ్నించారు. కులాన్ని వాడుకుని పదవులన్నీ అనుభవించి, మాదిగల సమస్యలపైన ఏరోజూ మాట్లాడని డొక్కా మాదిగ కుల ద్రోహి అని మండిపడ్డారు. పదవి కోసం వైఎస్ జగన్ వ్యక్తిత్వాన్ని హననం చేయాలని చూస్తే సహించేది లేదని కనకారావు హెచ్చరించారు.

పోలవరంలో బట్రెస్ బెర్మ్ పనులు ప్రారంభం

సీపేజీ నియంత్రణ లక్ష్యంగా పనులు



సాక్షి, అమరావతి: పోలవరం ప్రాజెక్టులో ఎగువ కాఫర్ డ్యామ్ సీపేజీ(లీకేజీ నీరు) నియంత్రించేందుకు పీవోఈ (అంతర్జాతీయ నిపుణుల కమిటీ), కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) సూచనల మేరకు బట్రెస్ డ్యామ్ కాకుండా బట్రెస్ బెర్మ్ (రాతి మట్టికట్ట) నిర్మాణాన్ని అధికారులు గురువారం ప్రారంభించారు. ఎగువ కాఫర్ డ్యామ్ పొడవునా 40 మీటర్ల వెడల్పు, 8 మీటర్ల ఎత్తుతో రాళ్లు, మట్టితో బట్రెస్ బెర్మ్ నిర్మించనున్నారు. ఇది ఎగువ కాఫర్ డ్యామ్‌కు సపోర్టుగా నిలుస్తూ పటిష్టం చేస్తుందని.. సీపేజీని నియంత్రించడానికి ఉపయోగపడుతుందని అధికార వర్గాలు తెలిపాయి. సీడబ్ల్యూసీ ఆమోదించిన డిజైన్ ప్రకారం గోదావరి ప్రవాహాన్ని మళ్లించేలా స్పిల్ వే, స్పిల్ ఛానల్, ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌లను పూర్తి చేసి, స్పిల్ వే మీదుగా నదీ ప్రవాహాన్ని మళ్లించాక ప్రధాన (ఎర్త్ కమ్ రాక్ ఫిల్) డ్యామ్ పునాది డయాఫ్రం వాల్ (డీ వాల్) పనులు చేపట్టాలి. ఆ తర్వాత ప్రధాన డ్యామ్ పనులు చేపట్టాలి.

టీడీపీ సర్కారు తప్పిదాల వల్లే..

2016-18 మధ్య గోదావరి ప్రవాహాన్ని మళ్లించకుండానే ప్రధాన డ్యామ్ గ్యాప్-2లో డీ వాల్ పనులను అప్పటి టీడీపీ సర్కార్ పూర్తి చేసింది. 2017, 2018 గోదావరి వరద డీ వాల్ మీదుగా ప్రవహించడంతో కోతకు గురై దెబ్బతిందని పీవోఈ తేల్చింది. పీవోఈ సూచన మేరకు.. దెబ్బతిన్న దానికి 6 మీటర్ల ఎగువన కొత్త డీ వాల్ నిర్మాణ పనులను అధికారులు ప్రారంభించారు. ఎగువ కాఫర్ డ్యామ్ పునాది నిర్మాణంలోనూ 2018-19లో టీడీపీ సర్కార్ తప్పులు చేసింది. ఎగువ కాఫర్ డ్యామ్ పునాది జెట్ గ్రౌటింగ్ వాల్(జే వాల్)ను 40 మీటర్ల లోతు నుంచి నిర్మించాలి. కానీ.. టీడీపీ సర్కార్ 20 మీటర్ల లోతు నుంచి వేసింది. దీని వల్లే ఎగువ కాఫర్ డ్యామ్‌లో సీపేజీ అధికంగా ఉందని పీవోఈ తేల్చింది.

ముస్లింలపై విద్వేషపూరిత వ్యాఖ్యలు తగవు

- ముస్లింల మనోభావాలు దెబ్బతీస్తున్న వారిపై చర్యలు తీసుకోండి
- సీఎం, డిప్యూటీ సీఎంకు ముస్లిం హక్కుల పరిరక్షణ సమితి విజ్ఞప్తి

సాక్షి, అమరావతి: ముస్లింలపై విద్వేషపూరిత వ్యాఖ్యలు తగవని, వారి మనోభావాలను దెబ్బతీస్తున్న వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని ముస్లిం హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు షేక్ నాగుల్ మీరా విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, బీజేపీ అధ్యక్షురాలు పురందేశ్వరికి గురువారం ఆయన బహిరంగ లేఖ విడుదల చేశారు. ముస్లింలను కించపరిచేలా మాట్లాడిన నంద్యాల జిల్లా బీజేపీ అధ్యక్షుడు అభిరుచి మధుపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయకపోగా మరోవైపు మాటల దాడిని నిలువరించడంలో చోద్యం చూస్తున్న చంద్రబాబుపై ముస్లింలు పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేశారని నాగుల్ మీరా పేర్కొన్నారు.

భద్రాద్రి రామాలయంలో అర్చకుల నిరసన

వసంతోత్సవ అంకురార్పణ ఆలస్యం

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి ఆలయంలో గురువారం సాయంత్రం అర్చకులు నిరసనకు దిగడంతో.. మూడున్నర గంటలు ఆలస్యంగా రాత్రి 10 గంటలకు అంకురార్పణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. వివరాలివి. రామాలయ ఉప ప్రధాన అర్చకుడు అమరవాది శ్రీనివాసరామానుజాచార్యుల కుమార్తె రెండు రోజుల క్రితం ఆలయం నుంచి ఒక సంచితో వెళ్తుండగా స్పెషల్ ఫోర్స్ సిబ్బంది తనిఖీ చేశారు. సంచిలో ఓ పూల దండ, మూడు కండువాలు, రెండు జాకెట్ పీసులు, రూ.500 నోటును సిబ్బంది గుర్తించారు. దీనిపై అధికారులు ఈవోకు నివేదిక అందజేశారు. క్రమశిక్షణ చర్యల్లో భాగంగా ఆమె.. ఉప ప్రధాన అర్చకుడిని డిప్యుటేషన్‌పై పర్ణశాలకు పంపించారు. కాగా, ఫాల్గుణ పౌర్ణమి సందర్భంగా ఆలయంలో శుక్రవారం తలంబ్రాలు కలిపే ప్రక్రియతో పాటు వసంతోత్సవం జరగనున్నాయి. ఈ కార్యక్రమాలకు బ్రహ్మగా వ్యవహరించాల్సిన ఉప ప్రధాన అర్చకుడు శ్రీనివాస రామాజానుచార్యులు లేకపోవడంతో.. ప్రధానార్చకులు, ఇతర వైదిక సిబ్బంది కార్యక్రమాన్ని ప్రారంభించడానికి నిరాకరించారు. ఈ సందర్భంగా అర్చకులు, ఈవో నడుమ వాదోపవాదాలు జరిగాయి. స్పెషల్ ఫోర్స్ సిబ్బంది, ఏఈవో శ్రవణ్‌కుమార్ ఇచ్చిన నివేదిక ఆధారంగానే శ్రీనివాసరామానుజాచార్యులుపై క్రమశిక్షణ చర్యలు తీసుకున్నామని ఈవో స్పష్టం చేశారు. అయినా అర్చకులు తగ్గకపోవడంతో, బ్రహ్మగా వ్యవహరించాల్సిన శ్రీనివాసరామానుజాచార్యులును ఆహ్వానిస్తున్నట్లు ఈవో ప్రకటించారు. దీనంతటిపై విచారణ జరిపించి కమిషనర్‌కు నివేదిక అందజేస్తానని హామీ ఇవ్వడంతో అర్చకులు శాంతించారు. శ్రీనివాసరామాను జాచార్యులు రాగానే అంకురార్పణ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

స్పేస్ ఎక్స్ ప్రయోగం నేటికి వాయిదా



కేప్ కనవెరాల్: అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్)లో చిక్కుకుపోయిన నాసా వ్యోమగాములు సునీతా విలియమ్స్, బుచ్ విల్మోర్‌లను భూమిపైకి తీసుకువచ్చే స్పేస్ఎక్స్ ప్రయోగం వాయిదాపడింది. ప్రయోగానికి నాలుగు గంటల ముందు లాంచ్‌ప్యాడ్‌లోని కీలకమైన హైడ్రాలిక్ వ్యవస్థలో లోపాన్ని గుర్తించిన కెన్నడీ స్పేస్ సెంటర్ అధికారులు ఫాల్కన్ రాకెట్ ప్రయోగాన్ని వాయిదా వేస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఐఎస్ఎస్‌కు వెళ్లాల్సిన వ్యోమగాములు అప్పటికే క్యాప్సూల్‌లోకి చేరారని, లోపాన్ని సరిదిద్దేందుకు నిపుణులు ప్రయత్నిస్తున్నారని, శుక్రవారానికి ప్రయోగాన్ని వాయిదా వేసినట్లు నాసా ప్రకటించింది. అమెరికా, జపాన్, రష్యాలకు చెందిన వ్యోమగాములను ఐఎస్ఎస్‌కు చేర్చి, గతేడాది జూన్ నుంచి అక్కడే ఉండిపోయిన సునీత, విల్మోర్ తిరిగి తీసుకురావడమే ఈ మిషన్ లక్ష్యం.

15న హోలీ కారణంగా హిందీ పరీక్ష రాయలేని వారికి మరో అవకాశం: సీబీఎస్ఈ

న్యూఢిల్లీ: ఈ నెల 15వ తేదీన హోలీ పండుగ కారణంగా హిందీ పరీక్ష రాయలేని 12వ తరగతి విద్యార్థులకు మరో అవకాశం ఇస్తామని సీబీఎస్ఈ గురువారం తెలిపింది. 'దేశంలోని చాలా ప్రాంతాల్లో 14న హోలీ పండుగ జరగనుంది. కొన్ని చోట్ల 15వ తేదీన ఈ పండుగ జరుపుకోనున్నారు లేదా 15వ తేదీన కూడా కొనసాగనుంది. పండుగ కారణంగా 15వ తేదీన హిందీ పరీక్ష రాయలేని 12వ తరగతి విద్యార్థుల కోసం మరో రోజు పరీక్ష నిర్వహిస్తాం'అని సీబీఎస్ ఎగ్జామినేషన్ కంట్రోలర్ సన్యం భరద్వాజ్ చెప్పారు. మిగతా పరీక్షలు షెడ్యూల్ ప్రకారమే జరుగుతాయన్నారు. జాతీయ, అంతర్జాతీయ క్రీడా పోటీల్లో పాల్గొనే విద్యార్థుల తోపాటే వీరు కూడా పరీక్ష రాస్తార న్నారు.

సిసోడియా, జైన్‌లపై కేసుకు రాష్ట్రపతి అనుమతి

న్యూఢిల్లీ: ఢిల్లీలో ప్రభుత్వ పాఠశాలల తరగతి గదుల నిర్మాణంలో రూ.2,000 కోట్ల మేర కుంభకోణం జరిగిందన్న ఆరోపణలపై ఆప్ నేతలు మనీశ్ సిసోడియా, సత్యేందర్ జైన్‌లపై కేసు నమోదుకు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము అనుమతి మంజూరు చేశారు. ఈ ఆరోపణలపై దర్యాప్తు చేపట్టిన సెంట్రల్ విజిలెన్స్ కమిషన్(సీవీసీ), 2022లో నివేదికను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి అందజేసింది. భారీగా అవకతవకలు జరిగాయని సీవీసీ అందులో పేర్కొంది. కుంభకోణం జరిగిన సమయంలో ఢిల్లీలోని కేజ్రీవాల్ ప్రభుత్వంలో సిసోడియా, జైన్‌లు మంత్రులుగా ఉన్నారు.

మద్యంపై టారిఫ్‌ల యుద్ధం

అమెరికా విస్కీపై 50 శాతం సుంకం విధిస్తామన్న యూరప్ దేశాలు

- నిర్ణయాన్ని వెంటనే రద్దు చేయాలని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ డిమాండ్
- లేకపోతే యూరప్ మద్యంపై 200 శాతం సుంకం విధిస్తామని హెచ్చరిక

వాషింగ్టన్: అమెరికా, యూరప్ మధ్య టారిఫ్‌ల యుద్ధం మరింత ముదురుతోంది. ఇరుపక్షాలు సై అంటే సై అంటున్నాయి. తగ్గేదేలే అన్నట్లుగా దూకుడుగా వ్యవహరిస్తున్నాయి. అమెరికా నుంచి దిగుమతి అయ్యే విస్కీపై యూరప్ దేశాలు బుధవారం ఏకంగా 50 శాతం టారిఫ్ విధించడం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు తీవ్ర ఆగ్రహం తెప్పించింది. ఈ నిర్ణయాన్ని వెంటనే రద్దు చేయకపోతే ఫ్రాన్స్ సహా యూరప్ దేశాల నుంచి దిగుమతి అయ్యే అన్ని రకాల వైన్స్, షాంపేన్స్, ఇతర ఆల్కహాలిక్ ఉత్పత్తులపై 200 శాతం సుంకం విధిస్తామని హెచ్చరించారు. దీనివల్ల యూరప్ మద్యం అత్యంత ఖరీదుగా మారిపోతుందని, అంతిమంగా అమెరికాలో స్వదేశీ వైన్, షాంపేన్ వ్యాపారం లాభపడుతుందని తేల్చిచెప్పారు. ఈ మేరకు గురువారం సోషల్ మీడియాలో ట్రంప్ పోస్టు చేశారు. యూరప్ నుంచి వచ్చే స్టీల్, అల్యూమినియంపై 25 శాతం టారిఫ్ విధిస్తూ అమెరికా ప్రభుత్వం తొలుత నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. ఈ టారిఫ్ రద్దు చేయాలని యూరప్ దేశాలు కోరినా ట్రంప్ యంత్రాంగం లెక్కచేయలేదు. దాంతో ప్రతీకార సుంకాలకు తెరతీసిన యూరప్ దేశాలు అమెరికా ఉత్పత్తులను లక్ష్యంగా చేసుకున్నాయి. 28 బిలియన్ డాలర్ల విలువైన అమెరికా పడవలు, మోటార్‌బైక్‌లపై వచ్చేనెల నుంచి సుంకాలు విధించబోతున్నట్లు ప్రకటించాయి. అమెరికా విస్కీని సైతం వదిలిపెట్టలేదు. 50 శాతం టారిఫ్ విధిస్తున్నట్లు తాజాగా ప్రకటించాయి. అందుకు పోటీగా యూరప్ మద్యంపై 200 శాతం టారిఫ్‌ను విధించడం ఖాయమని ట్రంప్ ప్రకటించడం చూస్తే పరిస్థితి చెయ్యి దాటిపోతున్నట్లు తెలుస్తోంది. టారిఫ్‌ల వ్యవహారం చివరకు భీకరమైన వాణిజ్య యుద్ధానికి దారితీసినా ఆశ్చర్యం లేదని నిపుణులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.



విస్కీపై సుంకం అసహ్యంగా ఉంది: ట్రంప్

తమ విస్కీపై యూరప్ దేశాలు 50 శాతం టారిఫ్‌ను ప్రకటించడం పట్ల అమెరికా మద్యం పరిశ్రమ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. యూరప్‌కు విస్కీ ఎగుమతులు మళ్లీ పెంచాలని ఇటీవలే నిర్ణయించామని, ఈ టారిఫ్‌ల వల్ల అది నెరవేరే అవకాశం లేదని అమెరికా డిస్టిల్డ్ స్పిరిట్స్ కౌన్సిల్ సీఈఓ క్రిస్ స్వాగ్నర్ చెప్పారు. బుధవారం యూరప్ నుంచి ప్రకటన వెలువడిన వెంటనే ట్రంప్ స్పందించారు. వైట్‌హౌస్ ఓవల్ ఆఫీసులో మాట్లాడారు. యూరప్ సుంకాలపై తగిన విధంగా బదులిస్తానని చెప్పారు. అన్నట్లుగానే గురువారం బాంబు పేల్చారు. 200 శాతం సుంకాలు అంటూ గట్టిగా బదులిచ్చారు. ప్రపంచంలోనే అత్యంత దారుణమైన పన్నులు, సుంకాలు యూరప్ దేశాల్లో ఉన్నాయని ఆరోపించారు. అమెరికా నుంచి దోచుకోవాలన్న యావ తప్ప మరొకటి లేదని యూరప్ దేశాల ప్రభుత్వాలపై ధ్వజమెత్తారు. ఆఖరికి విస్కీపై కూడా టారిఫ్ విధించడం అత్యంత అసహ్యంగా ఉందన్నారు.

టారిఫ్ ప్లాన్లు ఆగవు


టారిఫ్‌లలో ఉన్న సమస్య ఏమిటంటే అవి మరిన్ని టారిఫ్‌లకు దారితీస్తాయని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. అమెరికా, యూరప్ మధ్య ఈ టారిఫ్‌ల రగడ ఇప్పట్లో ఆగే సూచనలు కనిపించడం లేదు. ఒక్కసారి అందులో కూరుకుపోతే బయటపడడం అంత సులభం కాదు. తమ టారిఫ్ ప్రణాళికలను సమీప భవిష్యత్తులో ముగించే అవకాశం లేదని ట్రంప్ ఇప్పటికే సంకేతాలిచ్చారు. అంతర్జాతీయ ఒత్తిళ్లకు సైతం ఆయన తలొగ్గడం లేదు. పైగా అదనపు టారిఫ్‌లు ఉంటాయని చెబుతున్నారు. ఇండియా, చైనా సహా పలు దేశాల ఉత్పత్తులపై విధించిన సుంకాలు ఏప్రిల్ 2 నుంచి అమల్లోకి రాబోతున్నాయి.

అమెరికా మద్యం కంపెనీలకు ఇక్కట్లు: డొనాల్డ్ ట్రంప్ అధికారంలో ఉన్నప్పుడల్లా అమెరికా మద్యం కంపెనీలు ఇబ్బందులకు గురవుతున్నాయి. ఎందుకంటే ఇతర దేశాలు అమెరికా మద్యంపై టారిఫ్‌లు వసూలు చేస్తున్నాయి. అమెరికాలోని కెంటకీ, టెన్నెస్సీ రాష్ట్రాల్లో విస్కీ కంపెనీలు అధికంగా ఉన్నాయి. గతేడాది జరిగిన అధ్యక్ష ఎన్నికల్లో ఈ రెండు రాష్ట్రాలు ట్రంప్‌నకే మద్దతు పలికాయి. అయినా ట్రంప్ ఆ దిశగా ఆలోచించకపోవడం గమనార్హం. అమెరికా మద్యంపై పొరుగుదేశం కెనడా ఇప్పటికే సుంకాలు విధించింది. ఇతర దేశాల ఉత్పత్తులపై ట్రంప్ విధిస్తున్న టారిఫ్‌లపై అమెరికాలోని జాక్ డేనియల్స్ కంపెనీ సీఈఓ బ్రౌన్ ఫార్మన్ ఇటీవల ఆగ్రహం వ్యక్తంచేశారు. తాము ఉత్పత్తి చేసిన విస్కీని ఇతర దేశాల్లో విక్రయించకుండా చేస్తున్నారని ఆక్షేపించారు.

డీ-డాకింగ్ సక్సెస్

- విజయవంతంగా విడిపోయిన స్పెడెక్స్ జంట ఉపగ్రహాలు
- తొలి ప్రయత్నంలోనే సఫలమైన ఇస్రో

సాక్షి బెంగళూరు: ఖగోళంలో భవిష్యత్ అంతరిక్ష ప్రయోగాలకు ఉపకరించే కీలక సాంకేతికతను ఇస్రో విజయవంతంగా పరీక్షించింది. ఇప్పటికే అనుసంధానం(డాకింగ్) ద్వారా ఒక్కటిగా జతకూడిన స్పెడెక్స్ ఉపగ్రహాలను ఇస్రో బుధవారం తొలిప్రయత్నంలోనే విజయవంతంగా వేరు చేసింది. స్పెడెక్స్ ఉపగ్రహాల డీ-డాకింగ్(విడదీత) ప్రక్రియ సజావుగా సాగిందని కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ గురువారం 'ఎక్స్' వేదికగా ప్రకటించారు. ''చందమామపై పరీక్షలు, మానవ సహిత వ్యోమనౌక ప్రయాణాలు, చంద్రయాన్-4, గగన్‌యాన్ ప్రయోగాలకు బాటలు వేస్తూ ఛేజర్ (ఎస్‌డీఎక్స్01), టార్గెట్ (ఎస్ డీఎక్స్02) శాటిలైట్లతో డీ-డాకింగ్ సాంకేతికతను పరీక్షించాం. ఇస్రో బృందానికి అభినందనలు. ఈ ఘనత ప్రతి ఒక్క భారతీయుడి ఎదను ఉప్పొంగేలా చేసింది'' అని మంత్రి తన 'ఎక్స్' ఖాతాలో పోస్ట్‌చేశారు. ఇప్పటికే ఇటీవల డాకింగ్ సాంకేతికతను పరీక్షించి ఆ టెక్నాలజీని అందిపుచ్చుకున్న దేశాల సరసన నిలిచిన భారత్ తాజాగా డీ-డాకింగ్ సాంకేతికతనూ ఒడిసిపట్టి అంతరిక్ష రంగంలో మరోసారి తన సత్తా చాటింది. డాకింగ్ సాంకేతికతను పరీక్షించేందుకు గత ఏడాది డిసెంబర్ 30వ తేదీన ఇస్రో స్పేడెక్స్ మిషన్‌ను ప్రయోగించింది. ఇందులో భాగంగా ఛేజర్ (ఎస్‌డీఎక్స్01), టార్గెట్ (ఎస్‌డీఎక్స్02) శాటిలైట్లను వేర్వేరు కక్ష్యల్లో నింగిలోకి ప్రవేశపెట్టింది. ఇవి కొద్దిరోజుల వ్యవధిలో దశలవారీగా చాలా నెమ్మదిగా ఒకే లక్ష్యంలోకి చేరుకున్నాక వీటి అనుసంధానం(డాకింగ్) కోసం ప్రయత్నించారు. పలుమార్లు విఫలయత్నంచేసి ఎట్టకేలకు ఈఏడాది జనవరి 16వ తేదీన విజయవంతంగా వాటి డాకింగ్‌ను పూర్తిచేసింది. స్పేడెక్స్ మిషన్‌లో భాగంగా వీటిని డీ-డాకింగ్ సైతం చేయాల్సి ఉంది. డాకింగ్‌ను విజయవంతం చేసేందుకు పలుమార్లు ప్రయత్నించిన ఇస్రో.. డీ-డాకింగ్‌ను మాత్రం తొలి ప్రయత్నంలో పూర్తిచేయడం విశేషం. శాటిలైట్లు, మాడ్యూళ్ల వంటి వస్తువులను అంతరిక్షంలో అనుసంధానం చేయగల్గితేనే భవిష్యత్తులో సొంతంగా అంతరిక్ష ప్రయోగ కేంద్రంవంటి వాటిని అంతరిక్షంలో నిర్మించగలం. '' 45 డిగ్రీల కోణంలో 460 కిలోమీటర్ల వృత్తాకార కక్ష్యలో అన్‌డాకింగ్ ప్రక్రియను గురువారం విజయవంతంగా పరీక్షించిన నేపథ్యంలో తదుపరి ప్రయోగాలను త్వరలో మొదలుపెట్టబోతున్నాం. విడిపోయాక ఈ రెండు ఉపగ్రహాలు పూర్తి 'ఆరోగ్యవంతం'గా ఉన్నాయి. డీ-డాకింగ్‌కు మార్చి 10 నుంచి 25వ తేదీ వరకు అనువైన సమయం. అందుకే ఈ సమయంలోనే డీ-డాకింగ్ చేపట్టాం. బెంగళూరు, లక్నో, మారిషస్‌లోని గ్రౌండ్ స్టేషన్ల నుంచి నియంత్రిస్తూ ఈ అన్‌డాకింగ్‌ను పూర్తిచేశాం'' అని ఇస్రో ప్రకటించింది. '' ఇస్రో శాస్త్రవేత్తలకు అంతరిక్షంలో కూడా హద్దే లేదు. భారత ఘనత అంతరిక్షంలో మరోసారి ప్రభవించింది. డీ-డాకింగ్‌ను పూర్తిచేసిన ఇస్రో బృందానికి నా అభినందనలు. దేశం సొంతంగా అంతరిక్ష కేంద్రం నిర్మించుకోవాలన్న ప్రధాని మోదీ కల సాకారమయ్యేందుకు ఇస్రో బాటలువేసిందని గర్వపడాల్సిన క్షణమిది'' అని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా ఆనందం వ్యక్తంచేశారు.



డీడాకింగ్ తర్వాత విడిపోయిన ఉపగ్రహాలు

తమిళనాడులో 'రూ'పాయి రగడ

- బడ్జెట్ లోగో నుంచి దేవనాగరి గుర్తు తొలగింపు
- తమిళ అక్షరం 'రూ'ను చేర్చిన స్టాలిన్ ప్రభుత్వం
- ఆగ్రహం వ్యక్తం చేసిన బీజేపీ.. మూర్ఖపు చర్య అని ధ్వజం

చెన్నై: తమిళనాడులో త్రిభాషా వివాదం రగులుకుంటున్న నేపథ్యంలో రాష్ట్ర బడ్జెట్ లోగో నుంచి రూపాయి గుర్తును ప్రభుత్వం తొలగించడం సంచలనాత్మకంగా మారింది. దేవనాగరి లిపిలో ఉండే సింబల్‌ను 2025-26 బడ్జెట్ లోగో నుంచి తొలగించి, తమిళ అక్షరం 'రూ'ను చేర్చారు. బడ్జెట్‌ను తమిళనాడు ఆర్థిక శాఖ మంత్రి తంగం తెన్నరసు శుక్రవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టబోతున్నారు. బడ్జెట్ లోగోను ప్రభుత్వం గురువారం విడుదల చేసింది. రూపాయిని సూచిస్తూ దేశమంతటా ఉపయోగించే గుర్తు ఇందులో లేకపోవడం చర్చనీయాంశంగా మారింది. తమిళంలో రూపాయిని రూబాయి అంటారు. తమిళ 'రూ' అక్షరం మాత్రమే లోగోలో కనిపిస్తోంది. అంతేకాకుండా 'అందరి కోసం అంతా' అనే మాట చేర్చారు. అధికార డీఎంకే నినాదమైన సమీకృత ప్రభుత్వ మోడల్‌ను ఇది సూచిస్తోంది. బడ్జెట్ లోగో నుంచి దేవనాగరి గుర్తును తొలగించడం పట్ల తమిళనాడు బీజేపీ అధ్యక్షుడు అన్నామలై ఆగ్రహం వ్యక్తంచేశారు. ముఖ్యమంత్రి స్టాలిన్ మూర్ఖుడిలా వ్యవహరిస్తున్నాడని మండిపడ్డారు. దేవనాగరి గుర్తును మన కరెన్సీ నోట్లపై ముద్రించారని, దేశవ్యాప్తంగా అందరూ ఇదే ఉపయోగిస్తున్నారని తెలిపారు. ఈ సింబల్‌ను డీఎంకే మాజీ ఎమ్మెల్యే ధర్మలింగం తనయుడైన ఉదయకుమార్ రూపొందించారని గుర్తుచేశారు. అలాంటి సింబల్‌ను బడ్జెట్ లోగో నుంచి మాయం చేయడం ఏమిటని ప్రశ్నించారు. దేవనాగరి సింబల్‌తో ఉన్న 2024-25 బడ్జెట్ లోగోను సోషల్ మీడియాలో ఆయన పోస్టు చేశారు. స్టాలిన్ ప్రభుత్వ తీరు చాలా విచారకరమని బీజేపీ సీనియర్ నేత తమిళిసై సౌందరరాజన్ అన్నారు. జాతీయ సమగ్రత, ఐక్యతను డీఎంకే వ్యతిరేకిస్తోందని ఆరోపించారు. ఇప్పటికిప్పుడు లోగోను మార్చేయాల్సిన అవసరం ఏమొచ్చిందని మండిపడ్డారు. తాజా వివాదంపై డీఎంకే అధికార ప్రతినిధి శరవణన్ అన్నాదురై స్పందించారు. లోగోలో తమిళ అక్షరాన్ని వాడకుండా నిషేధిస్తూ చట్టమేదీలేదని పేర్కొన్నారు. తమిళ అక్షరాన్ని చేరిస్తే తప్పేంటని నిలదీశారు. ఇండియన్ కరెన్సీ సింబల్‌ను 2010 జూలై 10వ తేదీ నుంచి కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తీసుకొచ్చిన సంగతి తెలిసిందే.

కాల్పుల విరమణకు ఓకే కానీ..

పరిష్కరించుకోవాల్సిన అంశాలున్నాయి: పుతిన్



మాస్కో: నెలల తరబడి రక్తమోడుతున్న ఉక్రెయిన్ రణక్షేత్రాల్లో శాంతి పవనాలు వీయొచ్చనే ఆశలు రేకెత్తుతున్నాయి. అమెరికా ప్రతిపాదించిన '30 రోజుల కాల్పుల విరమణ ఒప్పందం' సుసాధ్యమయ్యేలా ఉందని రష్యా అధ్యక్షుడు పుతిన్ వ్యాఖ్యానించారు. మాస్కో నగరంలో గురువారం పత్రికా సమావేశంలో పుతిన్ మాట్లాడారు. '' తొలుత 30 రోజుల కాల్పుల విరమణ ఒప్పందం జరగాలంటూ అమెరికా చేస్తున్న ప్రతిపాదన అద్భుతంగా ఉంది. సబబైంది కూడా. ఈ ప్రతిపాదనకు మేం సూత్రప్రాయంగా, సైద్ధాంతికంగా అంగీకారం తెలుపుతున్నాం. అయితే యుద్ధంలో ఇంకా పరిష్కరించుకోవాల్సిన అంశాలు ఉన్నాయి. వాటిని చర్చించాలి'' అని పుతిన్ అన్నారు. అమెరికా ప్రత్యేక రాయబారి స్టీవ్ విట్కోఫ్ మాస్కో నగరానికి గురువారం విచ్చేసిన వేళ కాల్పుల విరమణ ప్రతిపాదనకు పుతిన్ సానుకూలంగా స్పందించడం గమనార్హం. ''అమెరికా మిత్రులు, సంబంధిత భాగస్వాములతో రష్యా ఈ విషయమై విస్తృతస్థాయిలో సమాలోచనలు చేయాల్సి ఉంది. ఈ కాల్పుల విరమణ ఒప్పందానికి తూట్లు పడకుండా, ఉల్లంఘనలు జరక్కుండా చూసుకునే ఒక వ్యవస్థను తొలుత సిద్ధంచేయాలి. దీంతోపాటు ఈ 30 రోజుల కాల్పుల విరమణ సమయాన్ని ఉక్రెయిన్ దుర్వినియోగం చేయకుండా చూడాలి. అంటే ఈ 30 రోజుల్లో సరిహద్దులకు అదనపు బలగాలను మోహరించడం, మరింతగా ఆయుధాలను సమకూర్చుకోవడం వంటివి చేయకుండా నిరోధించాలి. యుద్ధాన్ని తాత్కాలికంగా ఆపాలనే ప్రతిపాదనలను మేం అంగీకరిస్తాం. అయితే ఈ తాత్కాలిక కాల్పుల విరమణ అనేది శాశ్వత శాంతికి బాటలు వేయాలి. ఈ సంక్షోభానికి మూలాలను తొలగించగలగాలి. యుద్ధానికి శాశ్వతంగా తెరపడాలి'' అని పుతిన్ అన్నారు. సంక్షోభానికి మూలకారణాలను రూపుమాపాలని పుతిన్ గతంలోనూ వ్యాఖ్యానించారు. జెలెన్‌స్కీ సారథ్యంలో కొలువుతీరిన ప్రభుత్వం సైతం సంక్షోభానికి కారణమని పుతిన్ గతంలో పరోక్షంగా అన్నారు. నాటో విస్తరణతోపాటు ఉక్రెయిన్‌కు నాటో సభ్యత్వం ఇచ్చే ప్రతిపాదననూ పుతిన్ వ్యతిరేకిస్తున్నారు.

థాంక్యూ ట్రంప్

''ఉక్రెయిన్ సమస్యకు పరిష్కారం వెతికేందుకు శతథా కృషిచేస్తూ, ఈ అంశంపై ప్రత్యేకంగా దృష్టిసారించిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు నా కృతజ్ఞతలు. ఎంతో మంది ప్రాణాలు పోవడానికి కారణమైన ఈ యుద్ధానికి ముగింపు పలికేందుకు తమ వంతు కృషిచేస్తున్న చైనా, భారత్, బ్రెజిల్, దక్షిణాఫ్రికా అగ్రనేతలకూ నా కృతజ్ఞతలు'' అని పుతిన్ అన్నారు.

మళ్లీ రష్యా వశమైన సుడ్జా టౌన్

మాస్కో: ఉక్రెయిన్‌పై యుద్ధంలో రష్యా క్రమంగా పైచేయి సాధిస్తోంది. ఒకవైపు శాంతి ప్రయత్నాలు జరుగుతుండగానే, మరోవైపు ఉక్రెయిన్ ఆధీనంలో ఉన్న తమ భూభాగాలను తిరిగి స్వాధీనం చేసుకుంటోంది. రష్యా సరిహద్దు అయిన కర్స్క్ ప్రాంతంలోని అతిపెద్ద పట్టణం సుడ్జా మళ్లీ రష్యా సేనల చేతుల్లోకి వచ్చింది. అక్కడి నుంచి ఉక్రెయిన్ సైన్యాన్ని తమ బలగాలు తరిమికొట్టినట్లు రష్యా ప్రభుత్వం గురువారం ప్రకటించింది. కర్స్క్‌లోని తమ సైనిక కమాండర్లను రష్యా అధినేత పుతిన్ బుధవారం కలిశారు. ఆ తర్వాత గంటల వ్యవధిలో సుడ్జా టౌన్ రష్యా వశం కావడం గమనార్హం. సుడ్జా పట్టణం ఉక్రెయిన్-రష్యా సరిహద్దుకు అత్యంత సమీపంలో ఉంది. రష్యా పరిధిలోకి వచ్చే ఈ పట్టణాన్ని గతంలో ఉక్రెయిన్ సేనలు ఆక్రమించాయి. ఇక్కడ 5,000 మంది నివసించేవారు. యుద్ధం మొదలైన తర్వాత చాలామంది ఇతర ప్రాంతాలకు వలసవెళ్లారు. యుద్ధంలో తాము కోల్పోయిన భూభాగాన్ని మళ్లీ స్వాధీనం చేసుకోవడం అతిపెద్ద విజయంగా రష్యా సైనిక వర్గాలు భావిస్తున్నాయి. అయితే, దీనిపై ఉక్రెయిన్ అధికార వర్గాలు ఇంకా స్పందించలేదు.

ఢిల్లీ హోటల్‌లో బ్రిటిష్ మహిళపై అత్యాచారం

న్యూఢిల్లీ: ఢిల్లీలోని మహిపాల్‌పూర్ ప్రాంతంలోని ఓ హోటల్‌లో బ్రిటిష్ మహిళపై వేధింపులు, అత్యాచారం జరిగాయి. ఘటనలకు సంబంధించి పోలీసులు ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. బ్రిటన్‌కు చెందిన ఓ మహిళ నెల క్రితం ముంబైకి వచ్చింది. కొంతకాలం గోవాలో కూడా ఉంది. అంతకుముందే, దాదాపు నెలన్నర క్రితం తూర్పు ఢిల్లీకి చెందిన కైలాశ్ (24) అనే వ్యక్తితో సామాజిక మాధ్యమాల ద్వారా పరిచయం ఏర్పడింది. ఢిల్లీకి వచ్చినప్పుడు ఇద్దరూ కలుసుకోవాలని నిర్ణయించుకున్నారు. మంగళవారం రాత్రి ఆమె ఢిల్లీకి చేరుకుంది. మహిపాల్‌పూర్‌లోని ఓ హోటల్‌లో రూం బుక్ చేసుకుని, అక్కడికి వెళ్లింది. ఆ సమయంలో లిఫ్టులోనే హోటల్ ఉద్యోగి ఒకడు ఆమెను వేధించాడు. అనంతరం, హోటల్‌కు వచ్చిన కైలాస్ రూంలో ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డాడు. బాధిత మహిళ బుధవారం పోలీసు లకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు వేధించిన హోటల్ ఉద్యోగిని, కైలాశ్‌ను అరెస్ట్ చేశారు. ఈ మేరకు రెండు వేర్వేరు కేసులు నమోదు చేశారు. నిందితులిద్దరికీ ఎటువంటి సంబంధం లేదని పోలీసులు తెలిపారు. కైలాశ్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్న పోలీసులు ఇంకెవరినైనా ఇలాగే ట్రాప్ చేశాడా అనే విషయం పరిశీలిస్తున్నారు. ఘటనపై బ్రిటన్ రాయబార కార్యాలయానికి సమాచారం అందించారు.

సైన్యం విజయం ఉత్తదే

- కాల్పులు కొనసాగుతున్నాయి
- పాక్ సైన్యానికి భారీ నష్టం వాటిల్లింది
- జాఫర్ ఎక్స్‌ప్రెస్ ప్రయాణికులు మా అధీనంలో ఉన్నారు
- బలూచిస్తాన్ లిబరేషన్ ఆర్మీ ప్రకటన

ఇస్లామాబాద్: జాఫర్ ఎక్స్‌ప్రెస్‌ను హైజాక్ చేసిన మిలిటెంట్లందరినీ మట్టుబెట్టామంటూ పాకిస్తాన్ సైన్యం చేసిన ప్రకటనను బలూచిస్తాన్ లిబరేషన్ ఆర్మీ (బీఎల్ఏ) గురువారం ఖండించింది. ఆపరేషన్ ఇంకా ముగియలేదని, సైన్యంపై కాల్పులు కొనసాగుతున్నాయని వెల్లడించింది. యుద్ధక్షేత్రంలో విజయం సాధించినట్లు సైన్యం చెప్పుకుంటోందని, అందులో ఎంతమాత్రం నిజం లేదని వివరించింది. తమ దాడిలో పాక్ భద్రతా బలగాలకు భారీగా నష్టం వాటిల్లినట్లు స్పష్టంచేసింది. ఇప్పటికే పాక్ సైనికులు చాలామంది మరణించారని పేర్కొంది. శత్రువుపై యుద్ధం ఆపే ప్రసక్తే లేదని తేల్చిచెప్పింది. ఈ మేరకు బీఎల్ఏ ఒక ప్రకటన జారీ చేసింది. చాలామంది ప్రయాణికులు తమ అధీనంలోనే ఉన్నారని ప్రకటించింది. మంగళవారం 440 మంది ప్రయాణికులతో క్వెట్టా నుంచి పెషావర్ వెళ్తున్న జాఫర్ ఎక్స్‌ప్రెస్‌ను బలూచిస్తాన్ మిలిటెంట్లు హైజాక్ చేసిన సంగతి తెలిసిందే. 33 మంది మిలిటెంట్లను అంతం చేశామని, 21 మంది ప్రయాణికులు, నలుగురు భద్రతా సిబ్బంది మరణించారని, మిగిలిన ప్రయాణికులను క్షేమంగా విడిపించామని పాక్ సైన్యం బుధవారం వెల్లడించింది. అయితే, పాక్ సైన్యం తప్పుడు ప్రచారంతో ప్రజలను మభ్యపెట్టాలని చూస్తోందని బీఎల్ఏ ఆరోపించింది. యుద్ధ నియమాలు, అంతర్జాతీయ నిబంధనలు దృష్టిలో పెట్టుకొని.. రైలులో ఉన్న కొందరు సైనికులను తామే వదిలేశామని వెల్లడించింది. సైన్యం తమపై పోరాటం చేయలేక సామాన్య బలూచ్ పౌరులను వేధిస్తోందని విమర్శించింది. జైళ్లలో ఉన్న తమ మిలిటెంట్లను వదిలిపెడితే రైలులో మిగిలి ఉన్న సైనికులు, ప్రయాణికుల విడుదల చేస్తామని బీఎల్ఏ ప్రతిపాదించింది. తమ మాట వినకపోతే జరగబోయే పరిణామాలకు పాక్ ప్రభుత్వమే బాధ్యత వహించాలని తేల్చిచెప్పింది. బలూచిస్తాన్‌లో యుద్ధవాతావరణం నెలకొన్న ప్రాంతాలను సందర్శించేందుకు జర్నలిస్టులకు అనుమతి ఇవ్వాలని ప్రభుత్వానికి సూచించింది. ఇక్కడి పరిస్థితులు ఏమిటో బాహ్య ప్రపంచానికి తెలియాల్సిన అవసరం ఉందని బీఎల్ఏ స్పష్టం చేసింది.

రన్యా రావు ఇళ్లపై ఈడీ దాడులు

బనశంకరి: బంగారం అక్రమ రవాణా కేసులో పట్టుబడిన నటి రన్యా రావు, ఆమె సన్నిహితుల ఇళ్లలో గురువారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) సోదాలు చేపట్టింది. బెంగళూరులోని ల్యావెల్లి రోడ్డులోని రన్యా రావు ఇల్లు, కోరమంగళ, జయనగర, బసవనగుడి తదితర ప్రాంతాల్లోని ఆమె బంధుమిత్రుల నివాసాల్లో అధికారులు సోదాలు జరిపారు. రన్యా రావు విదేశాలకు వెళ్లడానికి విమానం టికెట్లు బుక్ చేసింది ఎవరు, ఈ టూర్లకు సాయం చేసిందెవరు, ఆమె వ్యవహారాల్లో ఎవరెవరి పాత్ర ఎంత? అనే విషయాలను తేల్చడానికి ఈ సోదాలు జరిపిన అధికారులు కొన్ని ఆధారాలు లభ్యమైనట్లు సమాచారం. బంగారం దందా చాలా పెద్దస్థాయిలో, దేశవ్యాప్తంగా ఉండి ఉండొచ్చని ఈడీ అనుమానిస్తోంది. రన్యా రావును కస్టడీలో విచారించిన డీఆర్ఐ అధికారులు ఆమె ఆప్తుడు, పారిశ్రామికవేత్త తరుణ్ రాజ్‌ను ప్రశ్నిస్తున్నారు. ఆమెపై డీఆర్ఐ కేసు నమోదుచేసి విచారిస్తుండగా, సీబీఐ రంగంలోకి దిగడం తెలిసిందే. ఈ రెండింటి ఆధారంగా తాజాగా ఈడీ మనీలాండరింగ్ కేసు నమోదు చేసింది. ఈ నెల 3న దుబాయ్ నుంచి బెంగళూరులోని కెంపెగౌడ విమానాశ్రయానికి వచ్చిన రన్యా రావు వద్ద డీఆర్ఐ అధికారులు రూ.12.56 కోట్ల విలువైన బంగారం కడ్డీలను స్వాధీనం చేసుకోవడం తెల్సిందే.

థరూర్ సీపీఎంలో చేరబోరు: కారత్

న్యూఢిల్లీ: కాంగ్రెస్ సీనియర్ నేత, ఎంపీ శశిథరూర్ సీపీఎం పార్టీలో చేరతారంటూ వస్తున్న వార్తలను ఆ పార్టీ తాత్కాలిక సమన్వయకర్త ప్రకాశ్ కారత్ తోసిపుచ్చారు. ఆయన పార్టీ వీడుతున్నట్లు ఎలాంటి సంకేతాలు ఇవ్వలేదన్నారు. కేవలం కేరళలో స్టార్టప్‌లు సాధిస్తున్న గణనీయమైన ప్రగతి గురించి మాత్రమే మాట్లాడారని చెప్పుకొచ్చారు. శశిథరూర్ సాధారణ వ్యక్తి కాదని ప్రశంసించిన కారత్.. ఆయన నిక్కచ్చి అభిప్రాయాలు కొన్నిసార్లు కాంగ్రెస్‌కు అసౌకర్యాన్ని కలిగిస్తాయన్నారు. కేరళలో ఎల్‌డీఎఫ్ ప్రభుత్వం సాధిస్తున్న పారిశ్రామికాభివృద్ధిని ప్రశంసిస్తూ థరూర్ గత నెలలో ఓ ఆంగ్ల పత్రికలో వ్యాసం రాశారు. ఇది రాజకీయ దుమారం రేపింది. కాంగ్రెస్ దానిపై ప్రశ్నల వర్షం కురిపించగా.. సీపీఎం వ్యాసాన్ని స్వాగతించింది. అయితే తాను ప్రభుత్వాన్ని ప్రశంసించలేదని, కేవలం స్టార్టప్ రంగంలో రాష్ట్ర ప్రగతిని ఎత్తి చూపానని థరూర్ స్పష్టం చేశారు. ఆ తరువాత మలయాళంలో ఓ పాడ్‌కాస్ట్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో కేరళలో పార్టీ నాయకత్వ బాధ్యతలకు తాను అర్హుడినని ప్రకటించారు. సంసిద్ధతను సైతం వ్యక్తం చేశారు. ఈ ప్రకటన కాంగ్రెస్‌లో ఒక వర్గాన్ని కలవరపరిచింది. అయితే తన వ్యాఖ్యలను తప్పుగా చిత్రీకరించారంటూ థరూర్ మీడియాపై మండిపడ్డారు.

పంచాయతీ ఎన్నికల జాప్యం.. సంక్షేమానికి విఘాతం

- అన్ని రాష్ట్రాల్లో సకాలంలో పంచాయతీ ఎన్నికలు జరిపేలా కేంద్రం చర్యలు చేపట్టాలి
- కేంద్రానికి పంచాయతీరాజ్ పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సిఫార్సులు

సాక్షి, న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో పంచాయతీ ఎన్నికల జాప్యం కారణంగా ప్రజాభివృద్ధికి విఘాత కలుగుతోందని పంచాయతీరాజ్ వ్యవహారాలకు సంబంధించిన పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ఆందోళన వ్యక్తంచేసింది. సకాలంలో ఎన్నికలు నిర్వహించకపోవడంతో కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన అనేక అభివృద్ధి నిధులు నిలిచిపోయాయని గుర్తుచేసింది. సకాలంలో ఎన్నికలు నిర్వహించేలా కేంద్ర పంచాయతీరాజ్ మంత్రిత్వ శాఖ తగు చర్యలు చేపట్టాలని స్టాండింగ్ కమిటీ సిఫార్సు చేసింది. ఈ మేరకు సప్తగిరి శంకర్ ఉలక నేతృత్వంలోని పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖలకు సంబంధించిన పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ తమ డిమాండ్ ఫర్ గ్రాంట్స్ (2025-26) నివేదికను బుధవారం పార్లమెంట్‌కు సమర్పించింది. ఇందులో పంచాయతీ ఎన్నికల అంశాన్ని ప్రధానంగా ప్రస్తావించింది. '73వ రాజ్యాంగ సవరణ ద్వారా అన్ని రాష్ట్రాలు గ్రామ స్థాయిలో ప్రతి ఐదేళ్లకు ఒకసారి పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించడం తప్పనిసరి. రాజ్యాంగంలోని ఆర్టికల్ 243ఈ(3) ప్రకారం పంచాయతీ ఎన్నికలను ఆ గ్రామపంచాయతీ కాలపరిమితి ముగిసేలోపు లేదంటే రద్దయ్యాక ఆరు నెలల వ్యవధిలోపు పూర్తి చేయాలి. ఒక రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికలను సకాలంలో నిర్వహించడం అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు కచ్చితంగా పాటించాల్సిన రాజ్యాంగపరమైన నిబంధన' అని కమిటీ పేర్కొంది. '' పుదుచ్చేరి (2011), కర్ణాటక (2021), మహారాష్ట్ర (2022), మణిపూర్ (2022), లక్షద్వీప్ (2022), అస్సాం(2023), జమ్మూకశ్మీర్ (2023), లద్దాఖ్ (2023)లలో వివిధ కారణాల వల్ల పంచాయతీ ఎన్నికలు నిర్వహించలేదు. తెలంగాణ, తమిళనాడు, ఉత్తరాఖండ్‌లలో 2024 ఏడాదిలోనే ఎన్నికలు నిర్వహించాల్సి ఉన్నా ఇంకా నిర్వహించలేదు'' అని కమిటీ తెలిపింది. ఈ విషయంలో సంబంధిత రాష్ట్ర హైకోర్టు, ఎన్నికల కమిషన్ రాష్ట్ర ఎన్నికల సంఘానికి పంచాయతీ ఎన్నికలను వీలైనంత త్వరగా నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశాయని తెలిపింది. పంచాయతీ ఎన్నికలు నిర్వహించడంలో జాప్యం వల్ల గ్రామ అభివృద్ధి ప్రాజెక్టులు, పథకాలకు కోట్ల రూపాయల కేంద్ర ప్రభుత్వ గ్రాంట్లు ఆగిపోయాయని పేర్కొంది. ''ఈ గ్రాంట్లు, నిధులు మంజూరు పంచాయతీలకు సకాలంలో సాకారం అయి ఉంటే ఆయా గ్రామాల ప్రజలు వివిధ సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధి ఫలాలను అందుకుని ఉండేవారు'' అని కమిటీ వ్యాఖ్యానించింది. స్థానిక సంస్థలకు ఎన్నికలు జరగని కారణంగా నిధుల లభ్యత లేకపోవడంతో గ్రామాల్లో ప్రజల పరిస్థితి మెరుగ్గా లేదని రాష్ట్రాల పర్యటనల్లో తేలినట్లు కమిటీ పార్లమెంట్ దృష్టికి తెచ్చింది. రాష్ట్ర ప్రభుత్వాలు పంచాయతీ ఎన్నికలను సకాలంలో నిర్వహించేలా పంచాయతీరాజ్ మంత్రిత్వ శాఖ సత్వరం అత్యున్నత స్థాయి చర్యలు చేపట్టాలని కమిటీ సిఫార్సు చేసింది.

'ఉపాధి'కి నిధులు పెంచాలి

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి నిధులు పెంచాలని, కార్మికుల కనీస వేతనాలను పెంచాలని కమిటీ కేంద్రానికి సిఫార్సు చేసింది. ' గతంతో పోలిస్తే 2025-26 ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌లోనూ గ్రామీణ ఉపాధి పథకానికి కేటాయింపులు తగ్గాయి. ఇప్పుడు కేవలం రూ.86,000 కోట్ల కేటాయింపులు చేశారు. గ్రామాల్లో తీవ్ర పేదరికం, నిరుద్యోగాన్ని ఎదుర్కొంటున్న గ్రామీణులకు ఉపాధిహామీ పథకం ఇన్నాళ్లూ కీలకమైన రక్షణచక్రంగా నిలిచింది. కరోనా కాలంలో కోట్లాది మంది పేదలను ఈ పథకం ఆదుకుంది. అణగారిన వర్గాలకు ఉపాధిని కల్పించే ఈ పథకాన్ని సమర్థంగా అమలు చేసేందుకు తగినంత బడ్జెట్ కేటాయింపులు చేయడం చాలా అవసరం. అందుకే ఈ పథకానికి కేటాయింపులు సమధికంగా పెంచాలి. ఈ మేరకు ఆర్థిక మంత్రిత్వ శాఖపై గ్రామీణాభివృద్ధి శాఖ ఒత్తిడి తీసుకురావాలి'' అని కమిటీ సిఫార్సు చేసింది. పెరుగుతున్న జీవన వ్యయం, గ్రామీణ కార్మికుల ఆర్థిక పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని రోజువారీ వేతన రేట్లు తగిన విధంగా సవరించాలని సూచించింది.

సాక్షి 24|7 తమిళనాడు

TAMILNADU

శుక్రవారం । 14 । మార్చి । 2025

కారు కొనుగోలుకు.. పార్కింగ్ సర్టిఫికెట్ తప్పనిసరి

కొరుక్కుపేట: చెన్నైలో కొత్త కార్లు కొనుగోలు చేసే వారు రిజిస్ట్రేషన్‌ను చేసుకోవాలంటే కార్ పార్కింగ్ సదుపాయం అందుబాటులో ఉందన్న రుజువును సమర్పించాల్సి ఉంటుంది. చెన్నై మెట్రోపాలిటన్ ట్రాన్స్‌పోర్ట్ కమిషన్ బుధవారం విడుదల చేసిన కొత్త నివేదికలో.. ఇకపై చెన్నైలో కార్లు కొనుగోలు చేసేవారు కూడా పార్కింగ్ స్థలం ఉన్నట్లు పత్రాలను సమర్పించేలా ఆదేశాలు జారీ చేయాలని ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. నిజానికి రోజురోజుకూ చెన్నైలో కార్లు కొనే వారి సంఖ్య ఒకవైపు పెరుగుతూనే ఉంది. మరోవైపు పార్కింగ్ చేయడానికి స్థలం తగ్గుతోంది. 2022 జనాభా లెక్కల ప్రకారం చెన్నైలో దాదాపు 92 లక్షల కార్లు ఉన్నాయి. వీటిలో 30 లక్షల కార్లకు పార్కింగ్ సౌకర్యం లేదు. దీన్ని నివారించేందుకు ఈ మేరకు చర్యలు తీసుకోవాలని చెన్నై మెట్రోపాలిటన్ ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ సిఫార్సు చేసింది.

న్యూస్‌రీల్

చెన్నై సెంట్రల్ రైల్వే స్టేషన్‌లో 10 కిలోల గంజాయి సీజ్

• కోవై యువకుడి అరెస్టు

తిరువొత్తియూరు: ఆంధ్ర నుంచి ఎక్స్‌ప్రెస్ రైలు ద్వారా గంజాయిని తరలించిన కోవైకి చెందిన యువకుడిని పోలీసులు అరెస్టు చేసి అతని వద్ద నుంచి 10 కిలోల గంజాను స్వాధీనం చేసుకున్నారు. వివరాలు.. చెన్నై సెంట్రల్ రైల్వే స్టేషన్లో గురువారం ఉదయం పోలీసులు నిఘా చేస్తున్నారు. ఈక్రమంలో 1వ ప్లాట్‌ఫారానికి షాలిమార్ ఎక్స్‌ప్రెస్ వారాంతపు ప్రత్యేక రైలు వచ్చి ఆగింది. రైల్వే పోలీస్ ఇన్‌స్పెక్టర్ గోవింద రాజ్ ఆధ్వర్యంలో పోలీసులు తనిఖీలు చేశారు. ఆ సమయంలో ఓ యువకుడి వద్ద ఉన్న సంచిలో 10 కిలోల గంజాయి ఉన్నట్లు తెలిసింది విచారణలో అతను కోవై జిల్లా మాదం పట్టి మహాలక్ష్మి ఆలయ వీధికి చెందిన సురేష్ కుమార్ (26) అని ఆంధ్ర నుంచి అతను గంజాయి తీసుకొస్తున్నట్లు తెలిపాడు. అతని వద్ద నుంచి పోలీసులు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. సురేష్‌ను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచి పుళల్ జైలుకు తరలించారు.

క్యూఎస్ వరల్డ్ వర్సిటీ ర్యాంకింగ్స్‌లో 'వీఐటీ'కి చోటు

కొరుక్కుపేట: ప్రపంచవ్యాప్తంగా ఉన్న యూనివర్సిటీలను వివిధ అంశాల వారీగా అంచనా వేసే క్యూఎస్ ర్యాంకులు-2025 విడుదలయ్యాయి. ఈ క్యూఎస్ వరల్డ్ యూనివర్సిటీ ర్యాంకింగ్స్-2025లో ప్రతిష్టాత్మక విద్యాసంస్థ అయిన వేలూరు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (వీఐటీ) స్థానం దక్కించుకుంది. 14 పాఠ్యాంశాల బోధనలో అగ్ర శ్రేణి విశ్వవిద్యాలయాల సరసన వీఐటీ నిలవడం విశేషం. డేటా సైన్స్ అండ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) పాఠ్యాంశాలకు సంబంధించి.. ఏకంగా ప్రపంచంలోని టాప్-100 విశ్వవిద్యాలయాల జాబితాలో చోటు దక్కించుకుంది. అంతర్జాతీయ విద్యావిశ్లేషకుడు క్వాక్వారెల్లి సైమండ్స్ ఈ జాబితాను బుధవారం విడుదల చేశారు. ప్రపంచ వ్యాప్తంగా 1700 విశ్వవిద్యాలయాల్లో 55 రకాల పాఠ్యాంశాలపై సమగ్ర విశ్లేషణ చేపట్టి క్యూఎస్ వరల్డ్ యూనివర్సిటీ ర్యాంకింగ్స్-2025 ఎడిషన్‌ను రూపొందించారు. ఈ అధ్యయనంలో వీఐటీ అద్భుత ప్రతిభను ప్రదర్శించింది. 4 పాఠ్యాంశాల ర్యాంకులను మెరుగుపర్చుకోవడంతోపాటు మరో 8 పాఠ్యాంశాల ర్యాంకులను యథాతథంగా కాపాడుకోగలిగింది. మరో రెండు పాఠ్యాంశాలు తొలి సారి ర్యాంకింగ్ జాబితాలో చోటు సంపాదించుకున్నాయి. ఈ సందర్భంగా వీఐటీ వర్సిటీ నిర్వాహకులు హర్షం వ్యక్తం చేశారు.

వీఐటీలో బోధిస్తున్న పాఠ్యాంశాలకు దక్కిన పాయింట్లు

ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ 142, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్ 110, డేటా సైన్స్ అండ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ 51-100, ఇంజినీరింగ్ - ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ 151-200, ఇంజినీరింగ్- మెకానికల్, ఏరోనాటికల్ అండ్ మానుఫ్యాక్చరింగ్ 201-250, ఇంజినీరింగ్ - కెమికల్ 251 - 300, న్యాచురల్ సైన్సెస్ 362, మెటీరియల్ సైన్స్ 151-200, మ్యాథమెటిక్స్ 201-250, స్టాటిస్టిక్స్ అండ్ ఆపరేషనల్ రీసెర్చ్ 251-275, కెమిస్ట్రీ 301-350, ఫిజిక్స్ అండ్ అస్ట్రానమీ 401-450, ఎన్విరాన్‌మెంట్ సైన్సెస్ 451-500, బయోలాజికల్ సైన్సెస్ 351-400, అగ్రికల్చరర్ అండ్ ఫారెస్ట్రీ 351-400, బిజినెస్ అండ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ 551-600 పాయింట్లు దక్కించుకుంది.

అవినాశిలో దారుణం

• ఫాంహౌస్‌లో దంపతుల హత్య



ఘటనా స్థలంలో దర్యాప్తు చేస్తున్న పోలీసులు. (ఇన్‌సెట్) పళనిస్వామి, పర్వతం దంపతులు

సేలం: తిరుప్పూర్ జిల్లాలోని అవినాశి సమీపంలో రైతు దంపతుల హత్య దిగ్భ్రాంతికి గురిచేసింది. తిరుప్పూర్‌లోని అవినాశి సమీపంలోని తులుక్కముత్తూర్ పంచాయతీలోని ఊంజపాలయం గ్రామంలోని ఒక తోట ఇంట్లో పళనిస్వామి (84), అతని భార్య పర్వతం (70) అనే దంపతులు నివసిస్తున్నారు. వారి పిల్లలు వివాహం చేసుకుని విదేశాల్లో నివసిస్తున్నప్పటికీ, ఈ దంపతులు తోట ఇంట్లో ఒంటరిగా ఉంటున్నారు. ఈ క్రమంలో గురువారం చాలా సేపు ఆ జంట ఇంటి నుంచి బయటకు రాలేదు. అనుమానం వచ్చిన పొరుగింటి వారు చూడగా.. ఆ జంట దారుణంగా హత్యకు గురైనట్లు గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. పోలీసులు వారి మృతదేహాలను స్వాధీనం చేసుకుని శవపరీక్ష కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

కోడి గొడవ కారణంగానే..

పోలీసుల ప్రాథమిక విచారణలో అదే ప్రాంతంలో నివసిస్తున్న రమేష్ (46) వివాహం కాలేదు. ఇతని కోడి పళనిస్వామి ఇంటికి వద్దకు చేరి అరుస్తూ ఉన్నట్టు, ఈ విషయంగా పళనిస్వామి, పర్వతం దంపతులు రమేష్‌తో అప్పుడప్పుడూ గొడవపడుతూ వచ్చారని తెలిసింది. ఈ క్రమంలో బుధవారం కూడా వీరి మధ్య గొడవ ఏర్పడగా రమేష్ కత్తితో పళనిస్వామి, పర్వతంను హత్య చేసి, బైక్‌పై పరారైనట్లు తెలిసింది. ఈమేరకు పోలీసులు రమేష్‌ను అదుపులోకి తీసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్థిక నివేదికను విడుదల చేస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్



ప్రణాళిక సంఘం సమావేశంలో మాట్లాడుతున్న సీఎం స్టాలిన్



అభివృద్ధికి.. పంచతంత్రం

విద్య, వైద్యం, ఆరోగ్యం, పోషకాహారం, జీవనోపాధి వంటి ఐదు అంశాలను మెరుగు పరిచేందుకు నిర్మాణాత్మక కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని సీఎం స్టాలిన్ కోరారు. దీనిని సమగ్రంగా అమలు చేయడానికి ప్రభుత్వానికి మద్దతుగా నిలవాలని రాష్ట్ర ప్రణాళికా సంఘానికి సూచించారు.

- ఐదు సామాజిక అంశాల్లో మెరుగుదలే కీలకం
- రాష్ట్ర ప్రణాళిక సంఘానికి సీఎం స్టాలిన్ సూచన

సాక్షి, చెన్నై: సచివాలయంలో సీఎం స్టాలిన్ అధ్యక్షతన గురువారం రాష్ట్ర ప్రణాళిక సంఘం సమావేశం సాగింది. 2024-25 సంవత్సరానికి సంబంధించిన ఆర్థిక సర్వేను ఈ సందర్భంగా ప్రణాళిక కమిషన్ వర్గాలు సీఎం స్టాలిన్‌కు అందజేశారు. అలాగే సీఎం అల్పాహార పథకం - ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులపై ప్రభావం గురించి తుది నివేదిక, 10- 12 తరగతి పబ్లిక్ పరీక్షల విధానాలపై అధ్యయనం, చెన్నై పరిసర ప్రాంతాలలో వలసదారులు- కార్మికుల జీవితంపై అధ్యయనం వంటి అంశాలపై పరిశోధన నివేదికలను సమర్పించారు. అనంతరం, రాష్ట్ర ప్రణాళిక కమిటీ తాత్కాలిక ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ జె. జయరంజన్ బృందం కార్యకలాపాలు, గత సమావేశంలో ఆదేశాలు, నిర్ణయాలు, సిఫార్సుల అమలు గురించి సమీక్షించారు. అధ్యయనాలు, ఫలితాలు, మార్గదర్శకత్వం, ప్రాజెక్టులత్లో సాధారణ ప్రజలపై కలిగే ప్రభావాలు, దానివల్ల కలిగే ప్రయోజనాలను కూడా ఈ సమావేశంలో సీఎం విశదీకరించారు. రాష్ట్ర ప్రణాళిక సంఘం అమలు చేసిన ప్రత్యేక ప్రాజెక్టులు తమిళనాడు ఇన్నోవేషన్ ఇనిషియేటివ్స్ ప్రాజెక్ట్, రిసోర్స్‌ఫుల్ సర్కిల్స్ వంటి ప్రాజెక్టు పనులపై ప్రస్తుతం జరుగుతున్న అధ్యయనాలను ప్రస్తావించారు. ఈ సందర్భంగా సీఎం స్టాలిన్ మాట్లాడుతూ అభివృద్ధి అంటే సామాజిక న్యాయం, సమానత్వం, ఆత్మగౌరవం, భాషా, జాతి వంటి అంశాల గురించి ప్రస్తావిస్తూ రాష్ట్ర స్వయం ప్రతిపత్తిపై ఆధారపడ్డ అంశాలను గుర్తుచేశారు. తమిళనాడులోని అన్ని వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి ప్రణాళిక, సమాంతర అభివృద్ధిని సాధించే లక్ష్యంతో అమలు చేయాలని కోరారు. రాష్ట్ర ప్రణాళిక సంఘం అందించిన వివిధ పరిశోధన నివేదికలు, విధాన ముసాయిదాలను ప్రస్తవిస్తూ, వాటిని విభాగాలు ప్రభుత్వ కార్యదర్శులు అమలు చేశారా లేదా, ఈ ప్రణాళికల సిఫార్సులను వారి విభాగాలలో సరిగ్గా అమలు చేయడానికి ఈ కమిటీ తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు. ప్రధానంగా విద్య, వైద్యం, ఆరోగ్యం, పోషకాహారం, జీవనోపాధిని మెరుగు పరిచేందుకు నిర్మాణాత్మక కార్యాచరణ ప్రణాళికలను రూపొందించి, అమలు చేయాలని ఆదేశించారు. ప్రభుత్వానికిమద్దతుగా నిలవాలని, సిఫార్సులే కాదు సలహాలు ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో ప్రణాళిక కమిటీ కార్యనిర్వాహక ఉపాధ్యక్షుడు, డిప్యూటీ సీఎం ఉదయనిధి స్టాలిన్, తాత్కాలిక ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ జె. జయరంజన్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మురుగానందం, అదనపు ప్రధాన కార్యదర్శి రమేష్ చంద్ మీనా, ముఖ్యమంత్రి అదనపు ప్రధాన కార్యదర్శి ప్రదీప్ యాదవ్, ఆర్థికశాఖ ప్రధాన కార్యదర్శి ఉదయచంద్రన్, కమిటీ సభ్యులు ప్రొఫెసర్ రాముడు. శీనువాసన్, ప్రొఫెసర్ సుల్తాన్ అహ్మద్ ఇస్మాయిల్, కె. దీనబంధు, శాసనసభ సభ్యుడు డాక్టర్ ఎలిలన్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఎలిగంలో జరిగిన మీడియా సమావేశంలో రాష్ట్ర ఆర్థిక నివేదికలోని అంశాలను జయరంజన్ వివరించారు.

మెట్రో అధికారులతో..

మెట్రో ప్రాజెక్టు అధికారులతో సీఎం స్టాలిన్ సమావేశమయ్యారు. చెన్నైలో ఫేజ్-2 పనులు, కోవై, మదురై, తిరుచ్చి వంటి నగరాలమెట్రో రైలు ప్రాజెక్టుల అమలుకు తీసుకున్న చర్యల గురించి చర్చించారు. సాధ్యాసాధ్యాలతో పాటూ రైల్వేమార్గం, స్టేషన్లు వంటి అన్ని అంశాలతో సమగ్ర నివేదిక రూపకల్పనకు చర్యలు తీసుకున్నారు. కోయంబత్తూరు, మదురైలలో త్వరితగతిన ప్రాథమిక పనులు ముగించి మెట్రో రైలు కుసంబంధించి అన్నిరకాల పనులపై దృష్టి పెట్టాలని అధికారులను సీఎం ఆదేశించారు.

బడ్జెట్‌కు వేళాయె!

2025-2026 సంవత్సరానికి గాను తమిళనాడు అసెంబ్లీలో బడ్జెట్ దాఖలుకు ఆర్థిక మంత్రి తంగం తెన్నరసు సిద్ధమయ్యారు. శుక్రవారం ఆర్థిక పద్దును దాఖలు చేయనున్నారు. శనివారం రైతు సంక్షేమాన్ని కాంక్షించే బడ్జెట్‌ను వ్యవసాయ మంత్రి ఎంఆర్‌కే పన్నీరు సెల్వం సభలో సమర్పించనున్నారు. 2026లో అసెంబ్లీ ఎన్నికలనేపథ్యంలో పూర్తిస్థాయిలో చివరి బడ్జెట్ దాఖలుకు ఇదే అవకాశం కావడంతో జనరంజక పథకాలు, ప్రకటనలు ఉండవచ్చు అన్న ఊహాగానాలు జోరందుకున్నాయి.

- నేడు సభలో ప్రవేశపెట్టనున్న ఆర్థికశాఖ మంత్రి
- రేపు వ్యవసాయ బడ్జెట్
- ప్రజాకర్షకంగా ఉండే అవకాశం
- ఎల్‌ఈడీ తెరలతో ప్రత్యక్ష ప్రసారం



సాక్షి, చెన్నై: డీఎంకే ప్రభుత్వం అధికారంలోకి వచ్చినానంతరం ఇప్పటి వరకు మూడుసార్లు పూర్తిస్థాయి బడ్జెట్‌ను అసెంబ్లీలో దాఖలు చేసింది. ఈ ఏడాది మే నాటికి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు సంవత్సరాలు పూర్తి కానుంది. ఈ కాలంలో ప్రజల్ని ఆకర్షించే పథకాలను హోరెత్తించారు. ప్రధానంగా విద్యార్థి, మహిళలు, యువతీ, యువకుల సంక్షేమాన్ని కాంక్షిస్తూ అమలు చేసిన పథకాలు డీఎంకేకు మరింత బలంగా మారాయి. ఈ పథకాలే గత ఏడాది జరిగిన లోక్‌సభ ఎన్నికలలో రాష్ట్రంలోని అన్ని స్థానాలనూ డీఎంకే కూటమి క్లీన్‌స్వీప్ చేయడానికి మార్గాన్ని చూపించాయి. ప్రస్తుతం రాష్ట్రంలో డీఎంకే కూటమి బలం పెరగడమే కాదు, సీఎం స్టాలిన్ పలుకుబడి సైతం పెరిగినట్టు సర్వేలు స్పష్టం చేస్తూ వస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో 2026 అసెంబ్లీ ఎన్నికల ద్వారా గెలుపుతో మళ్లీ అధికార పీటాన్ని దక్కించుకునే విధంగా సీఎం స్టాలిన్ వ్యూహాలకు పదును పెట్టారు.

జనరంజకంగా..

2025-2026 ఆర్థిక నివేదికను జనరంజకంగా తీర్చిదిద్ది ప్రకటించేందుకు చర్యలు చేపట్టారు. ఇదే పూర్తిస్థాయి బడ్జెట్ దాఖలుకు చివరి అవకాశం కావడంతో 2026 అసెంబ్లీ ఎన్నికలకు పునాదిని మరింత పటిష్టం చేసుకునే రీతిలో కొత్త పథకాలు, ప్రాజెక్టులను బడ్జెట్ ద్వారా ప్రకటించేందుకు రెడీ అయ్యారు. 2026 మార్చి నాటికి ఎన్నిక లప్రక్రియ మొదలయ్యే అవకాశాలతో మధ్యంతర బడ్జెట్‌ను ఆ సమయంలో దాఖలు చేయడానికి వీలుంటుంది. అందుకే తాజా బడ్జెట్‌ను ప్రజాకర్షణ లక్ష్యంగా మలిచే విధంగా ఇప్పటికే ఆర్థికమంత్రి తంగం తెన్నరసు కసరత్తులు పూర్తి చేశారు. 2025-26 సంవత్సరానికి గాను బడ్జెట్ సమావేశాలు శుక్రవారం ప్రారంభం కానుంది. ఉదయం 9.30 గంటలకు సభ మొదలు కాగానే,బడ్జెట్‌ను ఆర్థిక మంత్రి తంగం తెన్నరసు దాఖలు చేయనున్నారు. ఆ తర్వాత అసెంబ్లీ వ్యవహారాల కమిటీ సమావేశం కానుంది. ఇక శనివారం వ్యవసాయ బడ్జెట్‌ను ఆ శాఖ మంత్రి ఎంఆర్‌కే పన్నీరు సెల్వం సభలో సమర్పించనున్నారు. అధికారులతో రోజూ సమావేశాలు, సమీక్షలు ఇప్పటికే ఆయన పూర్తి చేసి రైతులను ఆకర్షించే బడ్జెట్‌ను సిద్ధం చేసి ఉన్నట్టు సంకేతాలు వెలువడ్డాయి. అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో ఆపరిసరాలలో భద్రతను కట్టుదిట్టం చేశారు. ఇక సభలో డీఎంకేను ముప్పుతిప్పలు పెట్టే విధంగా అన్నాడీఎంకే, పీఎంకే, బీజేపీలు వ్యూహాలకు పదును పెట్టి ఉన్నాయి. శాంతిభద్రతల వైఫ్యలం, టాస్మాక్‌లో ఈడీ దాడులు, అవినీతి వంటిఅంశాలను అస్త్రంగా చేసుకుని సభను స్తంభింపజేసే దిశగా కార్యాచరణలో ఆ పార్టీలు ఉన్నాయి. ఇదిలా ఉండగా ఆర్థిక బడ్జెట్‌ను ప్రజలందరికి తెలియజేసే విధంగా ప్రత్యక్ష ప్రసార ఏర్పాట్లు జరిగాయి. చెన్నైలో 100 చోట్ల ఎల్‌ఈడీ స్క్రీన్ల ద్వారా ప్రసారం చేయడానికి చర్యలు తీసుకున్నారు. పార్కులు, బీచ్‌లు, జన సంచారం అధికంగా ఉండే ప్రాంతాలలో వీటిని ఏర్పాటు చేశారు. అలాగే రాష్ట్రంలోని ఇతర 24 కార్పొరేషన్లలో 48 చోట్ల,137 మునిసిపాలిటీలలో 274 చోట్ల, 425 పట్టణ పంచాయతీలలో 936 చోట్ల ప్రత్యక్ష ప్రసారాలకు ఏర్పాట్లు చేశారు. దీంతో బడ్జెట్ మీద ఎదురుచూపులు పెరిగాయి

మరో 19 జిల్లాలకు కార్యదర్శులు



విజయ్

సాక్షి, చెన్నై: మరో 19 జిల్లాలకు కార్యదర్శులను నియమిస్తూ తమిళగ వెట్రి కళగం నేత విజయ్ గురువారం ప్రకటించారు. ఇందులో అతిపెద్ద అసెంబ్లీ నియోజకవర్గాన్ని ఒక జిల్లాగాను, చిన్న నియోజకవర్గాలు రెండింటిని ఓ జిల్లాగాను ప్రకటించారు. పార్టీ బలోపేతం దిశగా ముందుకెళ్తున్న విజయ్ రాష్ట్ర వ్యాప్తంగా 234 అసెంబ్లీ నియోజకవర్గాలను విభజించి పార్టీపరంగా 121 జిల్లాల ఏర్పాటుకు చర్యలు చేపట్టిన విషయం తెలిసిందే. ఇప్పటి వరకు ఐదు విడుతలుగా 95 జిల్లాలకు కార్యదర్శులు, ఇతర కమిటీ సభ్యులను ప్రకటించారు. వీరందరితోనూ పోటోలు దిగుతు ఆ యా పదవుల నియామకానికి సంబంధించిన ఉత్తర్వులను విజయ్ స్వయంగా అందిస్తూ వస్తున్నారు.ఈ పరిస్థితులలో గురువారం మరో 19 జిల్లాల కార్యదర్శులను నియమించారు. దీంతో పార్టీ కార్యాలయం ఆవరణలో సందడి వాతావరణం నెలకొంది. ఈ మరో ఏడు జిల్లాలకు మాత్రమే ఇక కమిటీ ప్రకటించాల్సి ఉంది. ఈ ప్రకటన తరువాయి విజయ్ రాష్ట్ర పర్యటనకు సిద్ధమయ్యే అవకాశాలు ఉన్నాయి. ఇదిలా ఉండగా గురువారం విజయ్‌ను చూసేందుకు తన కుమారుడితో వచ్చిన ఓ మహిళకు అనుమతి దక్కలేదు. దీంతో ఆమె తీవ్ర ఆవేదనతో ఆందోళనకు దిగడంతో అక్కడున్న పార్టీ వర్గాలు అడ్డుకున్నాయి.

పర్యావరణ పరిరక్షణకు గ్రీన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్

- డిప్యూటీ సీఎం ఉదయనిధి
- 50 ఎలక్ట్రిక్ ఆటోల పంపిణీ
- బడులకు గ్రీన్ స్కూల్ సర్టిఫికెట్లు



ఆటోలకు జెండా ఊపుతున్న ఉదయనిధి స్టాలిన్, తంగం తెన్నరసు

సాక్షి, చెన్నై: తమిళనాడు కాలుష్య నియంత్రణ బోర్డు తరపున పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా గ్రీన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను పూర్తిగా అమలు చేయాలని డిప్యూటీ సీఎం ఉదయనిధి స్టాలిన్ ఆదేశించారు. 50 ఎలక్ట్రిక్ ఆటోలను మహిళలకు పంపిణీ చేశారు. బడులకు గ్రీన్ స్కూల్ సర్టిఫికెట్లు అందజేశారు. గురువారం క్యాంప్ కార్యాలయంలో తమిళనాడు కాలుష్య నియంత్రణ బోర్డు, వాతావరణ మార్పు శాఖ తరపున మహిళా స్వయం సహాయక సంఘాలకు 50 విద్యుత్ ఆటోల అందజేత కార్యక్రమం జరిగింది. ఈ ఆటోలకు డిప్యూటీ సీఎం ఉదయనిధి జెండా ఊపారు. అలాగే పర్యావరణ, వాతావరణ మార్పుల శాఖ వెబ్‌సైట్‌ను ఆవిష్కరించారు. ఈ వెబ్‌సైట్ వేదిక ద్వారా పర్యావరణ పరిరక్షణకు పరిష్కారాలను అందించనున్నారు. కొత్త పారిశ్రామిక కంపెనీలను నమోదుకు దోహదకరం కానుంది. అలాగే తమిళనాడు మార్కెట్ అవకాశాలను సృష్టించుకోవడానికి నూతన ఆవిష్కరణల ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ప్రాజెక్ట్‌గా ఈ వెబ్ సైట్ ఉంటుందని ప్రకటించారు. తమిళనాడు తీరంలో జీవనాడి, సంప్రదాయ స్థితి స్థాపకతలు, స్వదేశీ స్థిర ఆవాసాలు- వాతావరణ మార్పు, ఉత్తమ పద్ధతుల పేరిట మూడు పుస్తకాలను ఈ సందర్భంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పర్యావరణాన్ని పరిరక్షించే విధంగా పచ్చదనంతో కూడన వాతావరణం కల్పించిన దిండిగల్ జిల్లా పంచంపట్టి ప్రభుత్వ హయ్యర్ సెకండరీ స్కూల్,కరూర్ జిల్లా పూగలూరులోని ప్రభుత్వ బాలుర ప్రభుత్వ ఉన్నత పాఠశాల, తిరుచ్చి జిల్లా కాంచనాయకన్‌పట్టి ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులను సత్కరిస్తూ, వారికి హరిత పాఠశాలలకు గాను సర్టిఫికెట్లను అందజేశారు.

ఎలక్ట్రిక్ ఆటోలు..

రోజువారీ జీవితంలో వాతావరణాన్ని కాపాడుకోవడానికి అవగాహన కల్పించడం, ప్లాస్టిక్ ఉత్పత్తులకు పర్యావరణ అనుకూల ప్రత్యామ్నాయం వంటి అంశాలపై అవగాహన ప్రచారం ప్రారంభించారు. ఇందుకోసం ప్రత్యేక ఏర్పాటులతో సిద్ధం చేసి, ఎలక్ట్రిక్ ఆటోలను అందజేసి, అందులోని సౌకర్యాలను పరిశీలించారు. ఈసందర్భంగా ఉదయనిధి మాట్లాడుతూ తమిళనాడును పర్యావరణ ముప్పు నుంచి పరిరక్షించే విధంగా వివిధ కార్యక్రమాలను విస్తృతం చేశామన్నారు. పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్ ఉత్పత్తులను పూర్తిగా బహిష్కరించాలని పిలుపు నిచ్చారు. మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు అవగాహన కల్పించాలని, తమిళనాడు కాలుష్య నియంత్రణ బోర్డు తరపున పర్యావరణ పరిరక్షణ లక్ష్యంగా గ్రీన్ ఇన్‌ఫ్రా స్ట్రక్చర్‌ను పూర్తిగా అమలు చేయాలని ఆదేశించారు. 50 ఎలక్ట్రిక్ ఆటలలో ఒకొక్కటి ధర రూ. 4.83 లక్షలుగా పేర్కొంటూ, ఈ ఆటోలు మహిళా స్వయం సహాయక బృందాలకు స్నాక్స్, రీసైకిల్ చేసిన ఉత్పత్తులు, పర్యావరణ అనుకూల వస్తువుల అమ్మకాలు, తదితర వాటికి సైతం ఉపయోగకరంగా ఉంటే రీతిలో ఏర్పాటు జరిగినట్టు వివరించారు. , ఈ ఎలక్ట్రిక్ ఆటోలపై అవగాహన ప్రచారంలో అత్యాధునిక మైక్రోఫోన్ యాంప్లిఫైయర్ వ్యవస్థలు కూడా అందుబాటులో ఉన్నాయన్నారు. పసుపు రంగు బ్యాగ్, బయోడిగ్రేడబుల్ టంబ్లర్లు, ప్లాస్టిక్ ప్లేట్లు, చెక్క స్పూన్లు . రీసైకిల్ చేసిన కార్డ్‌బోర్డ్‌తో తయారు చేసిన గ్లాస్, ప్లేట్లు ఈ ఆటోల ద్వారా ప్రదర్శనకు ఉంచారు. ఈ కార్యక్రమంలో ఆర్థిక మంత్రి తంగం తెన్నరసు, పర్యావరణ , అటవీ శాఖ అదనపు ప్రధానకార్యదర్శి సుప్రియ సాహూ, పంచాయతీ రాజ్ శాఖ అదనపు ప్రధాన కార్యదర్శి గగన్ దీప్ సింగ్ భేడీ, ట్రాన్స్‌ఫర్మేషన్ డైరెక్టర్ ఎ.ఆర్. రకుల్‌నాథ్, తమిళనాడు మహిళ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ శ్రేయ పి సింగ్, కాలుష్య నియంత్రణ బోర్డు చైర్మన్ డాక్టర్ ఎం. జయంతి, చైర్మన్, తమిళనాడు వాతావరణ మార్పు ఉద్యమం అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ వివేక్‌కుమార్, తమిళనాడు కాలుష్య నియంత్రణ మండలిసభ్య కార్యదర్శి ఆర్. కన్నన్ తదితర ప్రభుత్వ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

అప్పులు కాటేశాయి!

- కుటుంబంతో సహా డాక్టర్ ఆత్మహత్య
- తిరుమంగళంలో కలకలం

సాక్షి, చెన్నై : ఆయన డాక్టరు, ఆమె న్యాయవాది. వీరికి ఇద్దరు పిల్లలు..ఎంతో ఆనందకరంగా ఉన్న వీరి జీవితాన్ని అప్పులు కాటేశాయి. అప్పులు రూ. 5 కోట్లకు చేరడంతో చెల్లించ లేని పరిస్థితులలో జీవితాన్ని కుటుంబం అంతా ముగించేశారు. చెన్నై తిరుమంగళంలో గురువారం ఉదయం ఈఘటన స్థానికంగా విషాదాన్ని మిగిల్చింది. వివరాలు.. చెన్నైలో అన్నానగర్, తిరుమంగళం పరిధిలోని 17వ క్రాస్ స్ట్రీట్‌లోని బహుళ అంతస్తుల భవనంలోని ఓ ప్లాట్‌లో డాక్టర్ బాలమురుగన్ (52) కుటుంబం నివాసిస్తూ వచ్చింది. ఆయన భార్య సుమతి (47) హైకోర్టులో న్యాయవాది. ఈ దంపతులకు జశ్వంత్ కుమార్ (19), లింగేశ్‌కుమార్(17) కుమారులు. పెద్దవాడు ప్లస్-2 ముగించి డాక్టరు కావాలన్న కలతో నీట్‌కు సిద్ధమవుతున్నాడు. రెండవ వాడు పదో తరగతి పరీక్షలకు సిద్ధమయ్యాడు. బాలమురుగన్‌కు అన్నానగర్‌లో రెండు, రెడ్ హిల్స్‌లో ఒకటి అంటూ పలు చోట్ల స్కాన్ సెంటర్లు ఉన్నాయి.

రుణాలు అధికమై..

గురువారం ఉదయం బాలమురుగన్ డ్రైవర్ విజయ్ ఇంటికి వచ్చి తలుపు తట్టాడు. ఎంతకు డాక్టర్ తెరవక పోవడంతో పక్కన ఉన్న ప్లాట్‌ల వారి సహకారంతో వారి బంధువులకు సమాచారం అందించాడు. వారు తిరుమంగళం పోలీసులకు సమాచారం ఇచ్చారు. బంధువులు, పోలీసులు ఆ ప్లాట్‌కు చేరుకుని తలుపు పగల కొట్టి వెళ్లి చూడగా ఓ గదిలో ఒకే ఫ్యాన్‌కు సుమతి, చిన్న కుమారుడు లింగేశ్వర్ ఉరివేసుకుని మృత దేహాలుగా బయటపడ్డారు. మరో గదిలో వేర్వేరు ఫ్యాన్‌లకు బాలమురుగన్, పెద్దకుమారుడు జశ్వంత్‌కుమార్ మృత దేహాలుగా వేలాడుతుండటంతో కలకలం రేగింది. వీరి ఆత్మహత్య సమాచారంతో ఆ పరిసరాలలో తీవ్ర విషాదం నెలకొంది. సమాచారం అందుకున్న స్కాన్ సెంటర్‌లలో పనిచేసే సిబ్బంది ఆ ఇంటి వద్దకు పరుగులు తీశారు. కన్నీటి పర్యంతమయ్యారు. తమను ఎంతో ఆప్యాయంగా పలకరిస్తూ, సకాలంలో, నిర్ణీత సమయంలో జీతాలను ఇస్తూ, ఆదరిస్తూ వచ్చిన యజమాని కుటుంబం ఆత్మహత్య చేసుకోవడంతో కన్నీటి పర్యంతమయ్యారు. మృతదేహాలను పోస్టుమార్టంకు తరలించినపోలీసులు కేసు నమోదు విచారణ చేపట్టారు. విచారణలో స్కాన్ సెంటర్ల విస్తరణ కోసం రూ. 5 కోట్ల వరకు అప్పులు చేసినట్టు వెలుగు చూసింది. నెలకు రూ.5 లక్షల వరకు ఈఎంఐలు కడుతుండటం, మరికొందరికి వడ్డీలు చెల్లిస్తుండటం వెలుగు చూసింది. ప్రస్తుతం వడ్డీ చెల్లించ లేని పరిస్థితులలో అప్పులు ఇచ్చిన వారి నుంచి వేధింపులు పెరిగినట్టు గుర్తించారు. అప్పులు కట్ట లేని పరిస్థితులలో తీవ్ర మనోవేదనతో ఉన్న డాక్టర్ కుటుంబంతో కలిసి ఆత్మహత్య చేసుకుని ఉండవచ్చు అన్న నిర్ధారణకు పోలీసులు వచ్చారు. అదే సమయంలో సుమతి, చిన్నకుమారుడు ఒకే ఫ్యాన్‌కు ఉరి పోసుకుని ఉండటంతో వారిని హతమార్చి, ఆతర్వాత పెద్దకుమారుడిని ఉరివేసి హతమార్చి, చివరకు డాక్టరు ఆత్మహత్య చేసుకున్నాడా? అన్న అనుమానాలు సైతం వ్యక్తం అవుతున్నాయి. పోలీసులు ఈ మేరకు దర్యాప్తు చేస్తున్నారు.



డాక్టర్ బాలమురుగన్, సుమతి దంపతులు (ఫైల్)



డాక్టర్ కుటుంబం నివసిస్తున్న అపార్టుమెంట్

క్లుప్తంగా

వేర్‌హౌస్‌లో చెన్నై రికార్డు

సాక్షి,చెన్నై: వేర్‌హౌస్‌లలో చెన్నై 29 శాతం వార్షిక వృద్ధిని సాధించి, రికార్డు నమోదు చేసినట్టు నైట్ ఫ్రాంక్ ఇండియా సర్వేలో తేలింది. అలాగే తయారీ రంగంలో 54 శాతం వాటా కలిగి ఉన్నట్టు ప్రకటించింది. ప్రఖ్యాత అంతర్జాతీయ ఆస్తి కన్సల్టెన్సీ సంస్థ నైట్ ఫ్రాంక్ ఇండియా తాజా సర్వే ఈ వివరాలను గురువారం స్థానికంగా ప్రకటించింది. 2024లో భారతదేశంలోని ఎనిమిది అగ్ర మార్కెట్లలో అత్యధికం, తయారీ రంగం, తద్వారా ఎక్కువగా నడిచే లావాదేవీలు సంబంధింత అంశాలపై జరిపిన సర్వేతో వివరాలు వెల్లడయ్యాయి. పరిశ్రమల వారీగా లావాదేవీల పరిమాణంలో తయారీ రంగం ఆధిపత్యంలో ఉన్నట్టు ప్రకటించింది. మొత్తం లావాదేవీలలో 54 శాతం వాటా కలిగి ఉన్నట్టు పేర్కొంది. ప్రముఖ తయారీ పారిశ్రామిక కేంద్రంగా చెన్నై ఉన్నట్టు, రిటైల్ , ఇ-కామర్స్ రంగాలు కూడా గణనీయమైన వృద్ధిని సాధించినట్టు ప్రకటించింది. ఈ సందర్భంగా నైట్ ఫ్రాంక్ ఇండియా చైర్మన్ శిశిర్ బైజల్ మాట్లాడుతూ తయారీ కేంద్రమైన చెన్నై భారత దేశ ఆర్థిక వ్యవస్థలో, ప్రధానంగా ఆటోమోటివ్ రంగంలో కీలక పాత్ర పోషిస్తుందన్నారు. ఇందులో ఎలక్ట్రానిక్స్, ఇంజినీరింగ్ రంగాలు. ఆటో మొబైల్స్, తయారీ పర్యావరణ వ్యవస్థలు ఉన్నట్టు వివరించారు. తయారీ రంగం, గిడ్డంగులుఃు లాజిస్టిక్స్ మౌలిక సదుపాయాలకు డిమాండ్‌ను మరింత చెన్నైలో పెరిగిందన్నారు.

విద్యార్థులకు వక్తృత్వ పోటీలు ప్రారంభం



మాట్లాడుతున్న తమిళనాడు మైనారిటీ కమిషన్ ఉపాధ్యక్షుడు ఇరయన్‌బన్ కుత్తూష్

తిరువళ్లూరు: తమిళనాడు మైనారిటీ కమిషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లాస్థాయి వక్తృత్వ పోటీలను మైనారిటీ కమిషన్ ఉపాధ్యక్షుడు ఇరయన్‌బన్ కుత్తూష్ లాంఛనంగా ప్రారంభించారు. ఏటా తమిళనాడు మైనారిటీ కమిషన్ ఆధ్వర్యంలో జిల్లా, రాష్ట్రస్థాయి వక్తృత్వ పోటీలను నిర్వహిస్తారు. ఇందులో భాగంగా తిరుప్పాచ్చూర్‌లోని శ్రీవేంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన జిల్లాస్థాయి పోటీలను మైనారిటీ కమిషన్ ఉపాధ్యక్షుడు ఇరయన్‌బన్ కుత్తూష్ ప్రారంభించి, ప్రసంగించారు. జిల్లాస్థాయి వక్తృత్వ పోటీలను ప్రతి జిల్లాలో నిర్వహిస్తున్నామన్నారు. జిల్లాలో మొదటి మూడు స్థానాల్లో నిలిచే వారు రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించడంతోపాటు మొదటి మూడు స్థానాల్లో నిలిచిన వారికి రూ.20 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలు అందిస్తామన్నారు. దీంతోపాటు రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించి విజయం సాధించిన వారికి రూ.లక్ష, రూ.50 వేలు, రూ.25 వేలు అందజేస్తామన్నారు. వక్తృత్వ పోటీల్లో పాల్గొనే విద్యార్థులు సాంఘిక న్యాయం, సమానత్వం, తమిళనాడు అభివృద్ధి, ఆర్థికం, సంక్షేమం, విద్య తదితర అంశాలపై ప్రసంగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వీజీ రాజేంద్రన్ తదితరులు పాల్గొన్నారు.

భార్యాభర్తల అరెస్టు

అన్నానగర్: రూ.10 లక్షల రుణం చెల్లించకుండా మోసం చేసిన కేసులో భార్యభర్తలను పోలీసులు అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళితే.. ఎన్నూర్ ముఖద్వారం కుప్పం ప్రాంతానికి చెందిన సతీష్, శరణ్య (32) మత్స్యకార దంపతులు ఉన్నారు. వీరికి ఇద్దరు కొడుకులు ఉన్నారు. కొన్నేళ్ల క్రితం సతీష్ ప్రమాదంలో చనిపోయాడు. ఆ తర్వాత ప్రమాద బీమా ద్వారా వచ్చిన మొత్తంతో శరణ్య బట్టల వ్యాపారం చేస్తోంది. ఆపై అదే ప్రాంతానికి చెందిన గాంధీకుమార్ (35), అతని భార్య సత్యరాణి (33)తో పరిచయం ఏర్పడింది. ఈ పరిస్థితిలో గాంధీకుమార్, సత్యరాణి వీరిద్దరు శరణ్య వద్ద సుమారు రూ.10 లక్షల వరకు అప్పులు చేశారు. అయితే డబ్బులు అందుకున్న దంపతులు అప్పు తిరిగి ఇవ్వలేదు. ఇదేమిటని ప్రశ్నించగా గాంధీకుమార్, సత్యరాణి శరణ్యను బెదిరించినట్లు తెలుస్తోంది. దీంతో ఆమె ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ఎన్నూర్ అన్ని మహిళా పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి గాంధీకుమార్, సత్యరాణిని గురువారం పోలీసులు అరెస్టు చేశారు.

స్నేహితుల మధ్య వివాదం

ఒకరి హత్య

అన్నానగర్: స్నేహితుల మధ్య తలెత్తిన వివాదం కారణంగా ఒకరు హత్యకు గురైన సంఘటన జరిగింది. వివరాల్లోకి వెళితే.. కోడంబాక్కం శివాలయం వీధిలో రోడ్డు పక్కన నివసించే తాజ్ హుస్సేన్ (25) పాత పేపర్లు సేకరించి దుకాణంలో పెట్టేవాడు. రెండు రోజుల క్రితం, అతను కోడంబాక్కంలోని శివన్ కోవిల్ స్ట్రీట్ ప్రాంతంలో ఒక పేపర్ షాపు వద్ద పడుకున్నప్పుడు, పేపర్ సేకరించి అమ్ముతున్న తన స్నేహితుడు సాదిక్ అలీ (45)తో గొడవ పడ్డాడు. ఆ తర్వాత ఇద్దరి మధ్య వాగ్వాదం ముగియడంతో ఇద్దరూ వంతులవారీగా దాడి చేసుకున్నారు. ఒకానొక సమయంలో, కోపోద్రిక్తుడైన సాదిక్ అలీ తాజ్ హుస్సేన్‌ను పట్టుకుని, కిందకు తోసి దాడి చేశాడు. గాయపడిన తాజ్ హుస్సేన్ రక్తపు మడుగులో ఉన్నాడు. సమాచారం తెలుసుకున్న వడపళని పోలీసులు గాయపడిన తాజ్ హుస్సేన్‌ను రక్షించి చికిత్స నిమిత్తం కీల్పాక్కం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ తాజ్ హుస్సేన్ గురువారం మృతి చెందాడు. అనంతరం కేసును హత్య కేసుగా మార్చి సాదిక్ అలీని అరెస్టు చేసి విచారణ జరుపుతున్నారు.

‘ఫిడే’ విజేతకు ప్రోత్సాహం



ప్రణవ్‌కు చెక్కు అందజేస్తున్న సీఎం స్టాలిన్



సీఎం స్టాలిన్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న శాస్త్రవేత్త సౌమ్య స్వామినాథన్

- రూ.20 లక్షల నజరానా

సాక్షి, చెన్నై: ఫిడే ప్రపంచ జూనియర్ ఛాంపియన్ షిప్‌లో విజయం సాధించిన తమిళనాడుకు చెందిన చదరంగం ఆటగాడు ప్రణవ్ వెంకటేషన్‌కు నగదు ప్రోత్సాహాన్ని సీఎం స్టాలిన్ ప్రకటించారు. గురువారం సచివాలయంలో ఆ క్రీడాకారుడ్ని సత్కరించి రూ. 20 లక్షలు చెక్కును అందజేశారు. విద్య, క్రీడలపరంగా తమిళనాడును అత్యుత్తమ రాష్ట్రంగా ప్రభుత్వం తీర్చిదిద్దిన విషయం తెలిసిందే. క్రీడాకారులను ప్రోత్సహించేలా పలు పథకాలను అమలు చేస్తున్నారు. క్రీడల్లో పతకాలను సాధించిన వారికి నగదు ప్రోత్సాహం అందిస్తున్నారు. ఇందులో భాగంగా గత నెల జరిగిన ఫిడే ప్రపంచ జూనియర్ చాంపియన్ షిప్ టోర్నమెంట్‌లో తమిళనాడుకు చెందిన ప్రణవ్ వెంకటేష్ విజయకేతనం ఎగురవేశాడు. చెన్నైకు చేరుకున్న ప్రణవ్ గురువారం సచివాలయంలో సీఎం స్టాలిన్‌ను కలిసి ఆశీస్సులు అందుకున్నారు. తాను సాధించిన పతకాన్ని సీఎంకు అందజేశారు. ఈ సందర్భంగా ప్రణవ్‌ను సీఎం స్టాలిన్, డిప్యూటీ సీఎం ఉదయనిధి స్టాలిన్‌లు సత్కరించారు. ప్రణవ్‌ను మరింత ప్రోత్సహించే విధంగా రూ. 20 లక్షలు నగదు ప్రోత్సాహానికి గాను చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఎస్ మురుగానందం, క్రీడలశాఖ కార్యదర్శి అతుల్య మిశ్రా, తమిళనాడు స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ అథారిటీ సీఈఓ, సభ్య కార్యదర్శి జె. మేఘనాథరెడ్డి పాల్గొన్నారు. ముందుగా సీఎం స్టాలిన్‌తో ఎంఎస్ స్వామినాథన్ పరిశోధన సంస్థ అధ్యక్షురాలు, శాస్త్రవేత్త సౌమ్య స్వామినాథన్ భేటీ అయ్యారు. చెన్నై రామాపురంలో తన తండ్రి హరిత విప్లవ పితామహుడు ఎంఎస్ స్వామినాథన్ పేరిట పార్కు ఏర్పాటు చేసినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు.

జీరో డయాలసిస్ లక్ష్యం

- ఘనంగా ప్రపంచ కిడ్నీ దినోత్సవ ర్యాలీ

సాక్షి, చెన్నై: ప్రపంచ కిడ్నీ దినోత్సవాన్ని పురస్కరించుకుని వినాయక మిషన్ విశ్వవిద్యాలయం, చెన్నై ఆరుపడై వీడు కాలేజ్ ఆఫ్ టెక్నాలజీ కాంచీపురం క్యాంపస్‌లోని అలైడ్ హెల్త్ సైన్సెస్ కళాశాల, శ్రీ మెడికల్ ఫౌండేషన్, ఏకేజీ ఫెర్టిలిటీ సెంటర్ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం అవగాహన ర్యాలీ జరిగింది. మూత్రపిండాల ప్రాముఖ్యత, వాటి రక్షణ అవసరాన్ని గుర్తు చేస్తూ ఈ ర్యాలీ నిర్వహించారు. ఆ విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ గణేషన్ మార్గదర్శకంలో డీన్ ప్రొఫెసర్ డాక్టర్ సెంథిల్‌కుమార్ పర్యవేక్షణలో ర్యాలీతోపాటుగా అవగాహన శిబిరం జరిగింది. గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ డాక్టర్ నీలమేఘం, కిడ్నీ హెల్త్ ఇండియా ప్రతినిధులు, డాక్టర్ ప్రభు కాంచి, వాలంటీర్ ఆర్గనైజర్ శుభాశాంతిని పళనిస్వామి, చెంగల్పట్టు వైద్య కళాశాల నెఫ్రాలజీ విభాగంలో నిపుణుడు డాక్టర్ నాగరాజన్, మెడికల్ ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ శశికుమార్, డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఈశ్వరి, డైరెక్టర్ శ్రీ ముత్తురాజ్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు భాను, దినేష్ ,మెడికల్ ఫౌండేషన్‌కు చెందిన తౌఫిక్ అహ్మద్, కావ్య ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కిడ్నీ సంబంధిత వైద్య పరీక్షలతో శిబిరం ఏర్పాటు చేశారు. అలాగే, 2050 నాటికి జీరో డయాలసీస్ రాష్ట్రంగా తమిళనాడును తీర్చిదిద్దే రీతిలో అవగాహన బ్రోచర్‌ను ఆవిష్కరించారు.



జీరో డయాలసిస్‌పై అవగాహన ప్రచార బ్రోచర్ ఆవిష్కరిస్తున్న వైద్యులు

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి

అన్నానగర్: మనపాక్కంలో ఓ ప్రైవేట్ కళాశాల బస్సు ద్విచక్రవాహనాన్ని ఢీకొనడంతో పాఠశాల విద్యార్థి బంధువుల కళ్ల ముందే మృతి చెందింది. వివరాల్లోకి వెళితే.. చెన్నై సమీపంలోని మనపాక్కం పక్కన ధర్మరాజపురానికి చెందిన చిదంబరం, అతని సోదరుడు అర్జున్ (52) ఉమ్మడి కుటుంబంగా జీవిస్తున్నారు. చిదంబరం కుమారుడు సెల్వకుమార్ (14) అదే ప్రాంతంలోని పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. అదే పాఠశాలలో 16 ఏళ్ల కుమార్తె కూడా చదువుతోంది. అర్జున్ గురువారం ఇంటి నుంచి ఇద్దరిని మోటర్‌బైక్‌పై ఎక్కించుకుని స్కూల్‌కి వెళుతుండగా మనపాక్కం సత్యనగర్ తిరువళ్లువర్ రోడ్డులో ముందు వెళ్తున్న ఈశ్వర్ ఇంజినీరింగ్ కాలేజీ బస్సును మోటార్‌సైకిల్‌ను ఢీకొంది. ఈ ఘటనలో సెల్వకుమార్ తలపై బస్సు వెనుక చక్రం ఎక్కి దిగడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అర్జున్, అతని కుమార్తె కుడివైపు పడిపోవడంతో గాయాలతో బయటపడ్డారు. ఆ తర్వాత పక్కనే ఉన్నవారు అర్జున్ రక్షించి రాయపేట ప్రభుత్వాస్పత్రిలో, బాలికను సమీపంలోని ఆస్పత్రిలోని ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌లో చేర్పించారు. ఈ ప్రమాదంపై పరంగిమలై ట్రాఫిక్ ఇన్వెస్టిగేషన్ విభాగం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అనంతరం ప్రమాదానికి కారణమైన కళాశాల బస్సు డ్రైవర్ అంబత్తూరుకు చెందిన మోసెస్ (41)ని అరెస్టు చేసి విచారిస్తున్నారు.

గుంటూరు రుచులతో ఫుడ్ ఫెస్టివల్!



సాక్షి, చెన్నై: ఫెదర్స్ హోటల్‌లో గుంటూరు నుంచి గోదావరి వరకు నినాదంతో వంటకాల రుచులు కలిగిన ఫుడ్ ఫెస్టివల్ శుక్రవారం ఏర్పాటు కానుంది. ఆంధ్ర – తెలంగాణ రుచులను భోజన ప్రియులకు అందించేలా మెను సిద్ధం చేశారు. ఆంధ్ర, తెలంగాణ రుచులు, వివిధ వారసత్వ వంటకాలను ఇక్కడి ఆహార ప్రియులకు అందించేందుకు వీలుగా ఏర్పాట్లు చేశారు. గుంటూరు ముచ్చటైన కారంతో ఉండే రుచులు, గోదావరి సుగంధ ద్రవ్యాలు, తీర ప్రాంత రుచికరమైన వంటకాల వరకు, ఈ ఆహార ఉత్సవంలో కొలువు దీర్చనున్నారు. చట్నీలు, కూరలు, సువాసన గల బిర్యానీలు, సంప్రదాయ స్వీట్లు, ఆవకాయ పచ్చడి, గోంగూర మాంసం, మామిడికాయ పప్పు, గుంటూరు కోడి కూర, రొయ్యలు వేపుడు, నెల్లూరు చేప పులుసు, తెలగపిండి ఎండు రొయ్యలు, కోడి పులావ్, ఆవకాయ అన్నం అంటూ బ్రహ్మాండ బఫేగా వంటకాలను అందిస్తున్నారు. ఈనెల 23వ తేదీ వరకు ఫెదర్స్ వాటర్ సైడ్‌లో ఈ ఫుడ్ ఫెస్టివల్ సాగనున్నది.

రాష్ట్ర ప్రజల సంక్షేమమే డీఎంకే ధ్యేయం

మంత్రి దురై మురుగన్



గర్భిణులకు సీమంతం సామగ్రి అందజేస్తున్న మంత్రి దురై మురుగన్

వేలూరు: రాష్ట్ర ప్రజల సంక్షేమమే డీఎంకే ధ్యేయమని రాష్ట్ర సీనియర్ మంత్రి దురై మురుగన్ అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి స్టాలిన్ 72వ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని వేలూరు జిల్లా అనకట్టు నియోజక వర్గంలోని గంగనెల్లూరు గ్రామంలో ఎమ్మెల్యే నందకుమార్ సొంత నిధులతో జిల్లాలోని 1,072 మంది గర్భిణులకు సీమంతం సామగ్రి పంపిణీ, అన్నదానం, సీమంతం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మీ కుటుంబంలో మీకు సీమంతం చేశారో లేదో తనకు తెలియదు గానీ మీ అన్నగా మీ కుటుంబంలో ఒక తమ్ముడిగా, నాన్నగా ఎమ్మెల్యే నందకుమార్ ఇంత మందికి సీమంతం చేయడంతో పాటువస్త్రదానం చేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఇటువంటి సహాయకాలు దేశంలో ఎవరూ చేయబోరని, ఇది డీఎంకేలోని ప్రజా ప్రతినిధులతోనే సాధ్యమన్నారు. వీటిని సద్వినియోగం చేసుకుని మీరు సరైన సమయంలో వైద్యపరీక్షలు చేసుకుని ఈ సమాజానికి ఉపయోగపడేలా పురిటిబిడ్డను ప్రసవించాలని, ఆరోగ్యంగా పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు కార్తికేయన్, అములు, మేయర్ సుజాత, జెడ్పీ చైర్మన్ బాబు, మాజీ ఎంపీ మహ్మద్ సఖీ తదితరులు పాల్గొన్నారు.

గిట్టుబాటు ధర కల్పించాలని ధర్నా



ప్రభుత్వ షుగర్ ఫ్యాక్టరీ ఎదుట ధర్నా చేస్తున్న రైతులు

వేలూరు: చెరుకు రైతులకు గిట్టుబాటు ధర కల్పించి, ఆదుకోవాలని కోరుతూ తమిళనాడు చెరుకు రైతుల సంఘం ఆధ్వర్యంలో కాట్పాడిలోని ప్రభుత్వ షుగర్ ఫ్యాక్టరీ ఎదుట ధర్నా చేసి, నిరసన తెలిపారు. ఈ ధర్నాకు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీధర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర కోశాధికారి మణి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న చెరుకు రైతులకు ఎకరా చెరుకు విత్తనానికి రూ.15 వేలు సబ్సిడీ ఇవ్వాలని, అలాగే ఫ్యాక్టరీ పంపే ఒక టన్ను చెరుకు ధర రూ.5,500 ప్రకటించాలని డిమాండ్ చేశారు. రైతులు అనేక కష్టాలు పడి ఫ్యాక్టరీలకు చెరుకును పంపితే బిల్లులు ఇవ్వడంలో అధికారులు కాలయాపన చేస్తున్నారని, వెంటనే బిల్లులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న రైతులకు గుర్తింపు కార్డులు మంజూరు చేసి, వారికి వైద్య ఖర్చులను ప్రభుత్వమే భరించేలా చూడాలన్నారు. ఈ ధర్నాలో ఆ సంఘం రైతు నాయకులు మణి, కన్నయ్యనాయుడు, రంగనాథన్, బాల వినాయకం రైతులు పాల్గొన్నారు.

సీమాన్ సెక్యూరిటీ, ఉద్యోగికి బెయిల్

– మద్రాసు హైకోర్టు ఆదేశం

తిరువొత్తియూరు: నామ్ తమిళర్ పార్టీ చీఫ్ కో- ఆర్డినేటింగ్ డైరెక్టర్ సీమాన్, ఇంటి ఉద్యోగి, సెక్యూరిటీకి హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. నటి విజయలక్ష్మి ఫిర్యాదు మేరకు నమోదైన లైంగిక వేధింపుల కేసులో విచారణకు హాజరుకావాలని నామ్ తమిళర్ కట్చి కో-ఆర్డినేటర్ సీమాన్‌కు వలసరవాక్కం పోలీసులు సమన్లు జారీ చేశారు. కాగా సీమాన్ ఇంటి తలుపునకు అతికించిన నోటును చింపివేసినందుకు నీలాంగ్-కరై పోలీసులు, సీమాన్ ఉద్యోగి సుభాకర్ అతని సెక్యూరిటీ అమల్ రాజ్‌లను అరెస్టు చేశారు. జైలులో ఉన్న సుబాకర్, అమల్ రాజ్ బెయిల్ కోరుతూ దాఖలు చేసిన పిటిషన్‌ను చెంగల్పట్టు కోర్టు బుధవారం తోసిపుచ్చింది. దీంతో బెయిల్ కోసం ఇద్దరూ మద్రాసు హైకోర్టులో పిటిషన్ వేశారు. అందులో రాజకీయ కారణాలతో అరెస్ట్ చేశారంటూ పోలీసులు చేస్తున్న ఆరోపణలన్నీ అవాస్తమని తుపాకీకి సరైన అనుమతి ఉన్నందున, ఆయుధ నిషేధ చట్టం కింద అరెస్టు చేయలేరని పిటిషన్‌లో తెలియజేశారు. ఈ పిటిషన్‌ను విచారించిన న్యాయమూర్తి సుందర్ మోహన్ ఇద్దరికీ బెయిల్ మంజూరు చేశారు. వారిద్దరూ ప్యారిస్ ఫ్లవర్ బజార్ పోలీస్ స్టేషన్‌లో హాజరై సంతకం చేయాలని ఆదేశించారు.

దీక్షిత్ శెట్టి కోలీవుడ్ ఎంట్రీ



నటుడు దీక్షిత్ శెట్టి హీరోగా నటిస్తున్న చిత్రం ప్రారంభ వేడుకలో యూనిట్ సభ్యులు

తమిళసినిమా: కన్నడం, తెలుగు భాషల్లో నటిగా మంచి గుర్తింపు పొందిన దీక్షిత్ శెట్టి తాజాగా కోలీవుడ్‌లో కథానాయకుడిగా ఎంట్రీ ఇస్తున్నారు. ఈయన ఇంతకు ముందు తెలుగులో నాని కథానాయకుడిగా నటించిన దసరా చిత్రంలో ముఖ్యపాత్రను పోషించి మంచి పేరు తెచ్చుకున్నారు. అలాగే కన్నడంలో ఫినిక్ తదితర ప్రాంతాల్లో నటించారు. కాగా ఇప్పుడు తమిళంలో శ్రీసరవణ ఫిలిం ఆర్ట్స్ పతాకంపై జీ.సరవణన్ నిర్మిస్తున్న చిత్రం ద్వారా కథానాయకుడిగా ఎంట్రీ ఇస్తున్నారు. ఇందులో బిగ్‌బాస్ రియాల్టీ గేమ్ షో ఫేమ్ అయినా జీనత్ కథానాయకిగా పరిచయం అవుతున్నారు. సారా కథ, దర్శకత్వం బాధ్యతలను నిర్వహిస్తున్నారు. కాగా ఇప్పుడు భాషా భేదం లేకుండా దక్షిణాదిని దాటి పాన్ ఇండియా చిత్రాలు రూపొందుతున్న విషయం తెలిసిందే. అలాగే ఈ చిత్రాన్ని పాన్ ఇండియా స్థాయిలో రూపొందిస్తున్నట్లు నిర్మాత తెలిపారు. మలేషియాలో జరిగిన యథార్థ సంఘటన ఆధారంగా తెరకెక్కిస్తున్న కథా చిత్రం ఇదని చెప్పారు. ఈ చిత్రం షూటింగ్‌ను పూజా కార్యక్రమాలతో ప్రారంభించినట్లు తెలిపారు. ఈ చిత్రం కోసం నటుడు దీక్షిత్ శెట్టి తన పాత్ర కోసం మేకోవర్ అయ్యి నటిస్తున్నట్లు చెప్పారు. దీనికి వెంకీ సూరినేని ,ఛాయాగ్రహణం అందిస్తున్నారని, ఇతర వివరాలను త్వరలోనే వెల్లడించనున్నట్లు నిర్మాత పేర్కొన్నారు.

తమిళసినిమా: నటుడు విజయ్ ప్రస్తుతం కథానాయకుడిగా నటిస్తున్న తన 69వ చిత్రం జననాయకన్ చివరిదనే ప్రచారం జరుగుతున్న విషయం తెలిసిందే. అందుకు కారణం విజయ్ రాజకీయ రంగ ప్రవేశం చేయడమే అదే విధంగా ఈయన ప్రారంభించిన తమిళగ వెట్రి కళగం పార్టీ 2026లో జరగనున్న శాసనసభ ఎన్నికల్లో పోటీకి సిద్ధం అవుతోంది. దీంతో ప్రస్తుతం విజయ్ తాను నటిస్తున్న చిత్రాన్ని ఎన్నికలకు ముందు తెరపైకి తీసుకు రావడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఇకపోతే విజయ్ ఇంతకు ముందు కథానాయకుడిగా నటించిన గోట్ చిత్రానికి వెంకట్ ప్రభు దర్శకత్వం వహించిన విషయం తెలిసిందే. అందులో విజయ్ తండ్రి కొడుకులుగా ద్విపాత్రాభినయం చేశారు. అయితే భారీ అంచనాల మధ్య విడుదలైన గోట్ చిత్రం ఆశించిన విజయాన్ని అందుకోలేక పోయింది. అయితే గోట్ చిత్రం చివర్లో గోట్ వెర్సెస్ ఓజీ చిత్రం ఉంటుందని పేర్కొన్నారు. కాగా ఇటీవల ఒక కార్యక్రమంలో పాల్గొన్న దర్శకుడు వెంకట్ ప్రభును గోట్ చిత్రానికి సీక్వెల్ ఎప్పుడు? అసలు అది ఉంటుందా ? అని పాత్రికేయులు అడిగిన ప్రశ్నకు ఆయన బదులిస్తూ గోట్ చిత్రం సీక్వెల్ గోట్ వెర్సెస్ ఓజీ చిత్రానికి సంబంధించిన అప్‌డేట్ 2026 తరువాత ఉంటుందని పేర్కొన్నారు. దీంతో విజయ్ మళ్లీ నటించే అవకాశం ఉందనే అభిప్రాయం వ్యక్తం చేసినట్లు ఆయన సమాధానం ఉండటంతో ఆయన అభిమానుల్లో కొత్త ఆశలు చిగురిస్తున్నాయి. అయితే వెంకట్ ప్రభు వ్యాఖ్యలపై నటుడు విజయ్ వర్గం ఎలా స్పందిస్తారో చూడాలి. కాగా దర్శకుడు వెంకట్ ప్రభు ప్రస్తుతం చెన్నై 28 చిత్రానికి పార్టు – 3 చేసే పనిలో ఉన్నట్లు సమాచారం.

2026 తరువాతే ఆ చిత్ర అప్‌డేట్



దర్శకుడు వెంకట్ ప్రభు, విజయ్

కోలీవుడ్ టాక్స్

ట్రామా విజయం సాధించాలి



ట్రామా చిత్ర ఆడియో ఆవిష్కరణ వేదికపై కె.భాగ్యరాజ్, రాధారవి, సినీ ప్రముఖులతో యూనిట్ సభ్యులు

తమిళసినిమా: టర్మ్ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై ఎస్.ఉమామహేశ్వరి నిర్మించిన చిత్రం ట్రామా. నటుడు వివేక్ ప్రసన్న, నటి పూర్ణిమ రవి, ఆనంద్ నాగ్, చాందిని తమిళరసన్ హీరో హీరోయిన్లుగా నటించారు. నిళల్ గళ్ రవి, మారి ముత్తు, ప్రదోష్, వైయాపురి, రమ, నమో నారాయణన్ తదితరులు ముఖ్యపాత్రలు పోషించిన ఈ చిత్రం ద్వారా తంబి దురై మారియప్పన్ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ఇంతకు ముందు పలు షార్ట్ ఫిలిమ్స్ చేసిన ఈయన ఒక కార్పొరేట్ ఉద్యోగి అన్నది గమనార్హం. అజయ్ శ్రీనివాస్ ఛాయాగ్రహణం, రాజ్ ప్రతాప్ సంగీతం అందించిన ఈ చిత్రం నిర్మాణ కార్యక్రమాలు పూర్తి చేసుకుని, ఈ నెల 21వ తేదీన తెరపైకి రానుంది. కాగా ఈ చిత్రం తమిళనాడు విడుదల హక్కులను ఆల్ఫా 3 ఎంటర్‌టైనర్ సంస్థ అధినేత ఇళమారన్ పొంది విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా ట్రామా చిత్రం ఆడియో ఆవిష్కరణ కార్యక్రమాన్ని బుధవారం సాయంత్రం స్థానిక టీ.నగర్‌లోని పీటీ త్యాగరాజన్ ఆవరణలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దర్శక నటుడు కే.భాగ్యరాజ్, నటుడు రాధారవి, మాజీ శాసనసభ్యురాలు విజయదారణి ముఖ్య అతిథులుగా పాల్గొని ఆడియోను ఆవిష్కరించారు. దర్శకుడు తంబిదురై మారియప్పన్ మాట్లాడుతూ తాను కథలు చేత పట్టి దర్శకుడిగా అవకాశాల కోసం చాలా మంది నిర్మాతల చుట్టూ తిరిగానని, ఎవరూ అవకాశాలు ఇవ్వకపోవడంతో తన ఫ్రెండ్స్ సపోర్ట్ ద్వారా ఈ చిత్రాన్ని రూపొందించినట్లు చెప్పారు. మెడికల్ క్రైమ్ థ్రిల్లర్ నేపథ్యంలో సాగే ఇది మూడు కథలతో కూడిన ఆంథాలజీ కథా చిత్రంగా ఉంటుందన్నారు. దర్శకుడు కే.బాగ్యరాజ్ మాట్లాడుతూ ఎన్ని కథా చిత్రాలు రూపొందినా యువకులు ప్రేమించకపోయినా, ప్రేమ గురించే చర్చించుకుంటారని, అలాంటిది ఈ చిత్రం దర్శకుడు తంబిదురై తొలి ప్రయత్నంలోనే మూడు కథలతో కూడిన వైవిధ్య భరిత ఆంథాలజీ కథా చిత్రం చేయడం విశేషమని అన్నారు. ట్రామా అంటే అర్థం ఏమిటిని అడగ్గా బాధింపు అని దర్శకుడు చెప్పారన్నారు. యూనిట్ సభ్యులు ఎంతో శ్రమించి రూపొందించిన ఈ ట్రామా చిత్రం మంచి విజయాన్ని సాధించాలని కోరుకుంటున్నట్లు చెప్పారు.

ప్రదీప్ రంగనాథన్‌తో ముగ్గురు బ్యూటీస్?



మమితా బైజూ



అను ఇమాన్యువేల్



ఐశ్వర్య శర్మ



ప్రదీప్ రంగనాథన్

తమిళసినిమా: ప్రస్తుతం ట్రెండింగ్‌లో ఉన్న యువ కథానాయకుడు ప్రదీప్ రంగనాథన్. ఈయన కథానాయకుడిగా నటించిన మూడు చిత్రాలు విజయం సాధించాయి. అందులో రెండు చిత్రాలకు ప్రదీప్ రంగనాథన్‌నే దర్శకుడు కావడం విశేషం. ఈయన తాజాగా కథానాయకుడిగా నటించిన చిత్రం డ్రాగన్. అశ్వద్ మారి ముత్తు దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో నటి అనుపమ పరమేశ్వరన్, కయాదు లోహర్ హీరోయిన్లుగా నటించారు. ఏజీఎస్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ నిర్మించిన ఈ చిత్రం ఇటీవల విడుదలై సంచలన విజయం సాధించింది. కాగా ప్రస్తుతం నటుడు ప్రదీప్ రంగనాథన్ నయనతార భర్త విఘ్నేష్ శివన్ దర్శకత్వంలో ఎల్ ఒకే చిత్రంలో నటిస్తున్నారు. ఈ చిత్రం షూటింగ్ చివరి దశకు చేరుకుంది. దీంతో ఈయన తదుపరి చిత్రం ఏమిటన్న ప్రశ్నకు సమాధానం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. తదుపరి ప్రముఖ టాలీవుడ్ చిత్ర నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ నిర్మించనున్న భారీ చిత్రంలో ప్రదీప్ రంగనాథన్ కథానాయకుడిగా నటించడానికి సిద్ధం అవుతున్నారన్నదే ఆ ప్రచారం. మహిళా దర్శకురాలు సుధా కొంగర శిష్యుడు కీర్తీశ్వరన్ ఈ చిత్రం ద్వారా దర్శకుడిగా పరిచయం కాబోతున్నట్లు తెలిసింది. కాగా ఇందులో ప్రేమలు చిత్రం ఫేమ్ మమిత బైజూ నాయకిగా నటించనున్నట్లు ఇప్పటికే ప్రచారంలో ఉంది. కాగా తాజాగా నటి అను ఇమాన్యువేల్, సీరియల్ నటి ఐశ్వర్య శర్మ కూడా కథానాయికలుగా నటించబోతున్నట్లు సమాచారం. కాగా దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన త్వరలో వెలువడే అవకాశం ఉందని తెలుస్తోంది.

క్లుప్తంగా

దళారీ అరెస్టు

తిరువళ్లూరు: నకిలీ వ్యక్తులను చూపి, మహిళా డాక్టర్‌కు రూ.35 లక్షలు విలువ చేసే భూమిని విక్రయించిన దళారీని పోలీసులు అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళితే.. చెన్నై ముగప్పేర్ పుగళేంది నగర్‌కు చెందిన మహిళ డాక్టర్ ఇందు(36) అంబత్తూరు సమీపంలోని సూరపట్టు వద్ద స్థలం కొనుగోలు చేయాలని పోరూర్ మదనపురం గ్రామానికి చెందిన రియల్ ఎస్టేట్ దళారీ జయపాలన్‌ను ఆశ్రయించారు. ఇతను దళారీలు శంకర్, బాలజీ తదితర ముగ్గురు కలిసి కోయముదూరు ప్రాంతానికి చెందిన మురుగేషన్‌కు చెందిన 1200 చదరపు అడుగుల స్థలాన్ని డాక్టర్ ఇందుకు విక్రయించారు. రిజిస్ట్రేషన్ పూర్తయిన క్రమంలో రూ.34 లక్షల మొత్తాన్ని డాక్టర్ ఇందు రియల్‌ఎస్టేట్ దళారీ జయపాలన్‌కు ఇచ్చారు. అయితే ఇటీవల దళారీ జయపాలన్ స్థల యాజమానిని కాకుండా మరో నకిలీ వ్యక్తిని చూపి, స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేయించినట్టు తెలియడంతో బాధితురాలు ఆవడి పోలీసు కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. పోలీసులు రియల్ ఎస్టేట్ బ్రోకర్ జయపాలన్‌ను అరెస్టు చేశారు.

ఆదాయానికి మించి ఆస్తులు

- విశ్రాంత ఆర్డీఓ, భార్యకు జైలు


అరుణాచలం

తిరువళ్లూరు: ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టిన వ్యవహారంలో విశ్రాంత ఆర్డీఓ, అతడి భార్యకు మూడేళ్ల జైలు శిక్ష విధిస్తూ తిరువళ్లూరు కోర్టు గురువారం తీర్పు చెప్పింది. వివరాల్లోకి వెళితే.. తిరువళ్లూరు జిల్లా తిరుత్తణికి చెందిన అరుణాచలం తిరుచ్చి జిల్లా ముసిరిలో 2007-08 వరకు ఆర్డీఓగా పని చేసి ఉద్యోగవిరమణ పొందారు. అయితే ఆర్డీఓగా ఉన్న సమయంలో అరుణాచలం, అతడి భార్య లలిత పేరిట ఆదాయానికి మించి సుమారు రూ.68 లక్షల మేరకు చరస్థిరాస్తులను కూటబెట్టినట్టు కేసు నమోదైంది. ఈ కేసు విచారణ తిరువళ్లూరు విజిలెన్స్ కోర్టులో సాగింది. నేరం రుజువు కావడంతో విశ్రాంత ఆర్డీఓ అరుణాచలం, అతడి భార్య లలితకు మూడేళ్ల జైలుశిక్ష, అరుణాచలానికి రూ.35 లక్షలు, లలితకు రూ.5 లక్షల అపరాధం విధిస్తూ న్యాయమూర్తి మీనాక్షి తీర్పు చెప్పారు. అపరాధం చెల్లించని పక్షంలో అదనంగా మరో ఏడాది శిక్ష అనుభవించాలని పేర్కొన్నారు.


ఇంటి గుమ్మం వద్ద యువకుడి హత్య

అన్నానగర్: ఇంటి గుమ్మం వద్దనే ఓ యువకుడు హత్యకు గురైన సంఘటన కలకలం రేపింది. వివరాల్లోకి వెళితే.. మధురై సమీపంలోని సిల్లమాన్ ప్రాంతానికి చెందిన సుబ్రమణ్యన్ కుమారుడు అళగరస్వామి (19) డ్రమ్మర్‌గా జీవిస్తున్నాడు. ఇతడు నిర్మాణ పనులకు కూడా వెళ్లేవాడు. బుధవారం రాత్రి అళగరస్వామి తన ఇంట్లో నిద్రిస్తున్నాడు. గురువారం తెల్లవారుజామున కొందరు అతని ఇంటి వద్దకు వచ్చి బయటకు రావాలని కోరారు. వెంటనే అళగరస్వామి బయటకు వచ్చి చూశాడు. దీంతో ఆ వ్యక్తులు అతనితో వాగ్వాదానికి దిగారు. తర్వాత తాము దాచుకున్న కొడవలి, కత్తితో సహా ఆయుధాలతో అళగరస్వామిని నరికి పారిపోయారు. అళగరస్వామి తీవ్రంగా గాయపడి, ఇంటి గుమ్మం వద్దే మృతి చెందాడు. సిల్లమాన్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని అళగరస్వామి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మధురై ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు జరిపిన ప్రాథమిక విచారణలో రెండు రోజుల క్రితం అదే ప్రాంతానికి చెందిన కొందరితో కలిసి అళగరస్వామి మద్యం సేవించినట్టు తెలుస్తుంది. వీరి మధ్య మనస్పర్థలున్నాయని, అందుకే హత్య చేసి ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు.

వీఏఓపై హత్యాయత్నం

తిరువొత్తియూరు: తిరుమంగళంలో వీఏఓపై హత్యాయత్నం సంఘటన సంచలనం కలిగించింది. వివరాల్లోకి వెళితే.. మధురై జిల్లా తిరుమంగళంలో ఉన్న ముహమ్మద్ షాపురం నెహ్రూవీధిలో రాజామొహమ్మద్ (45), అతడి భార్య సంరత్ బీవీ (42) ఉన్నారు. వీరికి కుమారుడు రబీక్ రాజా (19), మరో కుమారుడు(16) ఉన్నారు. భార్యతో విభేదాలు కారణంగా రాజా మహమ్మద్ కొన్నేళ్ల కిందట భార్య నుంచి విడిపోయి, ఒంటరిగా నివాసం ఉంటున్నాడు. ఈ క్రమంలో రబీక్ రాజాపై ఒక కేసుకు సంబంధించి సంరత్ బీవీ ఉరప్పనూర్ వీఏఓ ముత్తుపాండియన్ (45)ను కలుస్తూ వస్తున్నారు. ఈ క్రమంలో ఇద్దరి మధ్య పరిచయం ఏర్పడి ఇద్దరు చనువుగా ఉంటున్నారు. ఈ విషయమై సంరత్ బీవీ కుమారులిద్దరూ ఆమెను హెచ్చరిస్తూ వచ్చారు. ముత్తు పాండియన్ తన భార్య చిన్నపొన్నుతో కలిసి తిరుమంగళం మున్సిఫ్ కోర్టు రోడ్డులో నివాసం ఉంటున్నాడు. గురువారం తెల్లవారుజామున రబీక్ రాజా, అతని తమ్ముడు, వీఏఓ ముత్తుపాండియన్ ఇంటికి వచ్చి తలుపు తట్టారు. కానీ తలుపు తెరవలేదు. దీంతో ఇంటి వెనుక వైపు ఉన్న తలుపులు పగలగొట్టి, లోపలికి వెళ్లారు. అక్కడ కింద పడి ఉన్న మిరపకాయ నూరుకునే రాయిని తీసుకుని నిద్రపోతున్న వీఏఓ ముత్తుపాండియన్ తలపై వేశారు. దీంతో అతడు గాయపడ్డాడు. ఈ విషయం గుర్తించిన ముత్తుపాండియన్ భార్య చిన్నపొన్ను కేకలు వేయడంతో ఇరుగుపొరుగువారు వచ్చి, నిందితులను పట్టుకుని, పోలీసులకు అప్పగించారు. దీనికి సంబంధించి రబీక్ రాజా, అతని తమ్ముడు, తల్లి సంరత్ బీవీ ముగ్గురిని పోలీసులు విచారిస్తున్నారు.

మిల్క్ బ్యాంక్ ఏర్పాటు


మిల్క్‌బ్యాంకును పరిశీలిస్తున్న నిర్వాహకులు

సాక్షి, చెన్నై: శ్రీరామచంద్ర మెడికల్ సెంటర్‌లో తల్లిపాల సేకరణ నిమిత్తం బ్రెస్ట్ ఫీడింగ్ మేనేజ్‌మెంట్‌సెంటర్‌ను గురువారం ఏర్పాటు చేశారు. దీన్ని ప్రారంభించి అక్కడి ఏర్పాట్లను ఆ విద్యాసంస్థ చాన్సలర్ వీఆర్ వెంకటాచలం, డాక్టర్ ఉమామహేశ్వరి, డాక్టర్ ఎ ప్రకాష్ పరిశీలించారు.

జేఏసీకి వస్తున్నాం!

- పలు పార్టీల సమాచారం


కేటీఆర్, బీఆర్ఎస్ నేతలతో సమావేశమైన నెహ్రూ తదితరులు

సాక్షి, చెన్నై: లోక్‌సభ నియోజకవర్గ పునర్విభజనకు వ్యతిరేకంగా జరగనున్న జాయింట్ యాక్షన్ కమిటీకి హాజరయ్యేందుకు పలు రాష్ట్రాల పార్టీలు సిద్ధమవుతున్నాయి. తమ తరపున ప్రతినిధులను పంపించేందుకు నిర్ణయించాయి. పునర్విభజన పేరిట కేంద్ర ప్రయత్నాలను అడ్డుకునేందుకు రాష్ట్ర, దక్షిణాది రాష్ట్రాలలోని ఎంపీలతో జాయింట్ యాక్షన్ కమిటీ ఏర్పాటుకు సీఎం స్టాలిన్ నిర్ణయించిన విషయం తెలిసిందే. ఈనెల 22వ తేదిన చెన్నైలో ఈ జాయింట్ యాక్షన్ కమిటీ సమావేశం జరగనున్నది. ఈ సమావేశానికి హాజరు కావాలని ఆయా రాష్ట్రాల పార్టీల నేతలను డీఎంకే మంత్రులు, ఎంపీల బృందం కలిసి స్టాలిన్ తరపున ఆహ్వానాలు అందిస్తూ వస్తున్నాయి. ఇందులో భాగంగా ఒడిశా మాజీ సీఎం నవీన్ పట్నాయక్ జేఏసీ సమావేశానికి బీజేడీ ఎంపీలను పంపించేందుకు నిర్ణయించారు. అలాగే మరికొన్ని పార్టీలు సైతం తమ ప్రతినిధులు హాజరు అవుతారన్న సమాచారం డీఎంకే ప్రభుత్వ అధికారులకు పంపించారు. గురువారం ఆంధ్రప్రదేశ్ మాజీ సీఎం, వైఎస్సార్ కాంగ్రెస్ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మంత్రి వేలు, ఎంపీ విల్సన్ కలిసిన విషయం తెలిసిందే. కర్ణాటక సీఎం సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి శివకుమార్‌ను మంత్రి పొన్ముడి నేతృత్వంలోని బృందం కలిసింది. కాంగ్రెస్ అధిష్టానంకు సమాచారం అందించి ఈ సమావేశానికి ప్రతినిధులను పంపిస్తామని సూచించినట్టు సంకేతాలు వెలువడ్డాయి. గురువారం ఢిల్లీలో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి సీనియర్ మంత్రి పొన్ముడి, ఎంపీ కనిమొళి తదితరులు కలిశారు. పునర్విభజన ప్రక్రియ దక్షిణాది రాష్ట్రాలకు వ్యతిరేకంగా ఉందని రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించడమే కాకుండా సమావేశానికి హాజరవుతామని హామీ ఇవ్వడం విశేషం. అలాగే, మంత్రి పొన్ముడి, ఎంపీ ఎన్ఆర్ ఇలంగోవన్‌లతో కూడిన బృందం సాయంత్రం హైదరాబాద్‌లో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం తెలంగాణ భవన్‌కువెళ్లారు. బీఆర్ఎస్ నేత కేటీఆర్, రావుల చంద్రశేఖర్‌రెడ్డి, మధుసూదనాచారి, వేముల ప్రశాంత్‌రెడ్డి, వద్ది రాజు రవిచంద్ర, దామోదర్ రావులను కలిశారు. కేటీఆర్‌కు సీఎం స్టాలిన్ పంపించిన ఆహ్వాన లేఖను అందజేశారు. జేఏసీ సమావేశానికి హాజరు కావాలని కోరారు. పునర్విభజన రూపంలో ఎదురయ్యే పరిస్థితులను వివరించారు.

సంక్షేమ పథకాలపై అవగాహన


విద్యార్థినులు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను తిలకిస్తున్న ప్రభుత్వ అధికారులు

కొరుక్కుపేట: రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన కల్పిస్తూ శ్రీ కన్యకాపరమేశ్వరి మహిళా కళాశాల (ఎస్‌కేపీసీ) విద్యార్థినులు ప్రత్యేకతను చాటుకుంటున్నారు. ఆటపాటలు, మైమ్ యాక్ట్స్, డ్యాన్స్ వంటి ఆకర్షణీయమైన ప్రదర్శనలతో తమ కళాత్మక నైపుణ్యాలను ప్రదర్శిస్తూ అందరి మన్ననలు పొందుతున్నారు. చెన్నై ఐల్యాండ్ గ్రౌండ్స్ వేదికగా 49వ వాణిజ్య ప్రదర్శన 2025లో ఈనెల 12 నుంచి 14 వరకు శ్రీ కన్యకా పరమేశ్వరి మహిళా ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల పాల్గొని ప్రత్యేక స్టాల్స్ ద్వారా పలు అంశాలపై అవగాహన పెంచుతున్నారు. ఈ ఫెయిర్‌లో టీటీడీసీ డిప్యూటీ సెక్రటరీ వీరు సామి, టిటిడిసి అదనపు డైరెక్టర్ టీఎంటీ ఉమా శంకర్, విద్యాశాఖ అనుసంధాన అధికారులు డాక్టర్ జె. సుల్తైమాన్, డాక్టర్ డబ్ల్యూ శాంతి, డాక్టర్ ఎస్. సెంథిల్ ఎస్‌కేపీసీ స్టాల్స్‌ను సందర్శించి విద్యార్థులు ప్రదర్శించిన ప్రదర్శనలను అభినందించారు. కళాశాల కరస్పాండెంట్ వూటుకూరు శరత్ కుమార్ ప్రభుత్వ అధికారులకు స్వాగతం పలికారు. ప్రిన్సిపాల్ ఇన్‌చార్జ్ డాక్టర్. పి. బి. వనీత, వైస్ ప్రిన్సిపాల్ డా. ఎం. వి. నప్పిన్నై, ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ డా. పి. భరణి కుమారి, డాక్టర్ పి ఎస్ మైథిలి పాల్గొన్నారు.



సత్కారం

దక్షిణ రైల్వే ఉమెన్ హెడ్ క్వార్టర్స్ ఆర్గనైజేషన్ నేతృత్వంలో గురువారం మహిళా దినోత్సవ వేడుకలు జరిగాయి. ఇందులో ఆర్గనైజేషన్ అధ్యక్షులు సోనియా సింగ్, ఉపాధ్యక్షులు రేఖా కౌశల్ పాల్గొని 26 మంది ఉద్యోగినులకు అవార్డులు, సర్టిఫికెట్లతో సత్కరించారు. - సాక్షి, చెన్నై

ఐఐటీలో సీఎఫ్ఐ ఓపెన్ హౌస్ 2025 స్టూడెంట్స్ టెక్ ఎక్స్‌పో


ఎక్స్ పోలో ప్రదర్శనకు సిద్ధమైన ఆవిష్కరణ

సాక్షి, చెన్నై : ఐఐటీ మద్రాసులో సీఎఫ్ఐ ఓపెన్ హౌస్ 2025 స్టూడెంట్స్ టెక్ ఎక్స్ పో జరగనుంది. ఈనెల 15వ తేదీన కొత్త విద్యా సముదాయం (ఎస్ఏసీ)లో ఐఐటీ మద్రాసు డైరెక్టర్ వీ కామకోటి ఈ ఎక్స్‌పోను ప్రారంభించనున్నారు. భారతదేశంలోని విద్యార్థులచే నిర్వహించనున్న అతి పెద్ద ఆవిష్కరణ ప్రయోగశాలల్లో ఒకటైన సెంటర్ ఫర్ ఇన్నోవేషన్(సీఎఫ్ఐ) విభిన్న సాంకేతిక డొమైన్‌లలో విస్తరించి ఉన్న 14 క్లబ్‌లు, జాతీయ, అంతర్జాతీయ ఈవెంట్లలో చురుకుగా పోటీపడే ఎనిమిది పోటీ జట్లను కలిగి ఉన్నట్టు గురువారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. ఏటా నిర్వహించే ఈ కార్యక్రమంలో పూర్తిగా విద్యార్థులే రూపొందించిన, నిర్మించిన ఉత్పత్తులు ప్రదర్శించనున్నారు. ఈ కార్యక్రమం ప్రాజెక్టులు, పరిశ్రమ, పూర్వ విద్యార్థుల నుంచి మరింత మద్దతును ఆకర్షించడానికి ఒక ప్రత్యేకమైన వేదికగా ఈ ఎక్స్‌పో నిలవబోతోందన్నారు.

ఊటీ, కొడైకెనాల్ పర్యటనకు ఆంక్షలు!

- కోర్టు ఆదేశాలు

సాక్షి, చెన్నై : రాష్ట్రంలోని ఊటీ, కొడైకెనాల్‌ను సందర్శించే పర్యాటకులకు ఏప్రిల్ 1 నుంచి ఆంక్షలు అమల్లోకి రానున్నాయి. ఈ పర్యాటక ప్రదేశాల వైపుగా పరిమితంగానే ప్రైవేటు వాహనాలను అనుమతించనున్నారు. ఇందుకు సంబంధించి గురువారం హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. రాష్ట్రంలో ప్రకృతి రమణీయతలో రారాజుగా నీలగిరి జిల్లా ఊటీ, యువరాణిగా దిండుగల్ జిల్లాలోని కొడైకెనాల్ ప్రసిద్ధి చెందిన విషయం తెలిసిందే. ఇక్కడకు వేసవి లో పెరిగిన పర్యాటక రద్దీని కట్టడి చేయడమే కాకుండా, వాహన కాలుష్యం, పర్యావరణ పరిరక్షణ, వన్యప్రాణుల సంరక్షణ లక్ష్యంగా కోర్టు పిటిషన్లు దాఖలై ఉన్నాయి. ఈ విచారణలో భాగంగా గురువారం జరిగిన వాదనల అనంతరం మద్రాసు హైకోర్టు ప్రత్యేక ఆదేశాలు జారీ చేసింది. ఊటీ వైపుగా ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి సాధారణ రోజుల్లో 6 వేలు, వారాంతంలో 8 వేల సందర్శకులు వచ్చే సొంత వాహనాలను అనుమతించాలని ఆదేశించారు. కొడైకెనాల్ వైపు సాధారణ రోజుల్లో 4 వేలు, వారాంతంలో 6 వేల వాహనాలు మాత్రమే అనుమతించేలా ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ బస్సులు, రైళ్లలో వచ్చే సందర్శకులు, స్థానికుల వాహనాలకు ఎలాంటి ఆంక్షలు విధించ వద్దని సూచించారు. అయితే, బయటి ప్రాంతాల నుంచి సొంత వాహనాల్లో వచ్చేవారికి ఈ ఆంక్షలు వర్తించనున్నాయి. అలాగే పర్యావరణ పరిరక్షణ దిశగా మరిన్ని సూచనలు, సలహాలు ఇచ్చారు. వీటి అమలు గురించి సమగ్ర నివేదికను ఏప్రిల్ 27వ తేదీ దాఖలు చేయాలని ఆదేశించారు.

కార్ ర్యాలీ



సాక్షి, చెన్నై: భారత నావికాదళం 'నాటికల్ ట్రైల్' పేరిట కార్ ర్యాలీని గురువారం ఉదయం నిర్వహించారు. చెన్నైలోని నావికాదళ కేంద్రం ఐఎన్ఎస్ అడయార్ ఫ్లాగ్ ఆఫీసర్, తమిళనాడు, పుదుచ్చేరి నావికాదళం రియర్ అడ్మిరల్ సతీష్ షెనాయ్ జెండా ఊపి ప్రారంభించారు. తమిళనాడు, పుదుచ్చేరి నావికాదళ అధికారి ఇన్‌ఛార్జ్ (ఎన్ఓఐసీ), కమోడోర్ సువరత్ మాగోన్, ఐఎస్ఎస్ అడయార్ స్టేషన్ కమాండర్ కెప్టెన్ మనురాయ్ తదితరులు పాల్గొన్నారు.

8 అరుదైన కోతులు, శునకం స్వాధీనం

- ఇద్దరు యువకుల అరెస్టు


స్వాధీనం చేసుకున్న విదేశీ కోతి

అన్నానగర్: మలేషియా నుంచి చెన్నై విమానాశ్రయానికి అక్రమంగా తరలిస్తున్న 8 అరుదైన కోతులు, కుక్కలను కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళితే.. మలేషియా రాజధాని కౌలాలంపూర్ నుంచి చెన్నైలోని మీనంబాక్కం అన్నా అంతర్జాతీయ విమానాశ్రయానికి బుధవారం రాత్రి మలేషియా ఎయిర్‌లైన్స్ విమానం వచ్చింది. విమానంలో అరుదైన జాతులను అక్రమంగా తరలిస్తున్నట్లు చెన్నై విమానాశ్రయ కస్టమ్స్ అధికారులకు సమాచారం అందింది. దీంతో కస్టమ్స్ డిపార్ట్‌మెంట్ అధికారులు స్నిఫర్ డాగ్‌తో నిఘా పెట్టారు. విమానం నుంచి దిగిన ప్రయాణికుల్లో చెన్నైకి చెందిన ఇద్దరు యువకులను అనుమానించిన కస్టమ్స్ శాఖ అధికారులు వారిని విచారించారు. వారిద్దరు అధికారులతో వాగ్వాదానికి దిగడంతో వారు అతని వస్తువులను శోధించారు. వారు తెచ్చిన ప్లాస్టిక్ బుట్టలను వేరు చేయగా ఆ బుట్టల్లో అరుదైన జంతువులు ఉన్నట్లు గుర్తించారు. ఆ తర్వాత వారిద్దరినీ బయటే నిలిపివేసిన అధికారులు, చెన్నైలోని బీసెంట్‌నగర్‌లోని వన్యప్రాణి క్రైం విభాగానికి సమాచారం అందించి సమన్లు జారీ చేశారు. బుట్టల లోపల తనిఖీ చేయగా కోతి-1, మార్బుల్ కోతి-2, తూర్పు బూడిద గిబ్బన్ కోతి-4 ఏషియాటిక్ శునకం 1 ఇందులో 8 అరుదైన జాతులు ఉన్నాయని వెల్లడించారు. ఇవి ఇండోనేషియా, యూరప్, చైనాలోని సుమత్రా, జావా ద్వీపంలో కనిపించే అరుదైన జాతులుగా గుర్తించారు. 8 అరుదైన జాతుల్లో, 3 ఆసియాటిక్ వుడ్‌చక్ 1, తూర్పు సంబల్ గిబ్బన్ 2 చనిపోయాయి. మరో 5 అరుదైన జాతులు సజీవంగా ఉన్నట్లు గుర్తించారు. వీటిని అక్రమంగా తరలించినట్లు అధికారులు గుర్తించారు. అనంతరం సజీవంగా ఉన్న 5 అరుదైన జాతులను మలేషియా రాజధాని కౌలాలంపూర్‌కు తిరిగి పంపించారు. చనిపోయిన జంతువులను దహనం చేశారు. విమానంలో అక్రమంగా జంతువులను తరలించిన చెన్నైకి చెందిన ఇద్దరు యువకులను కస్టమ్స్ డిపార్ట్‌మెంట్ అధికారులు అరెస్ట్ చేశారు.

విద్యుత్‌షాక్‌తో లైన్‌మన్ మృతి

పళ్లిపట్టు: విధి నిర్వహణలో విద్యుత్ షాక్‌కు గురై లైన్‌మన్ మృతి చెందిన ఘటన గురువారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. పళ్లిపట్టు యూనియన్‌లోని నొచ్చిలి టీవీ కండ్రిగ గ్రామానికి చెందిన కృష్ణన్ కుమారుడు వినాయకం(38), కుటుంబంతో అత్తిమాంజేరిపేట సమీపంలోని తొట్టికండ్రలో నివాసముంటున్నాడు. పళ్లిపట్టు విద్యుత్ కార్యాలయంలో లైన్‌మన్‌గా విధులు నిర్వహించేవారు. విధి నిర్వహణలో భాగంగా గురువారం ఉదయం పళ్లిపట్టు షోళింగర్ రోడ్డు బీడీఓ కార్యాలయం ప్రాంతంలో విద్యుత్ స్తంభం ఎక్కి, తీగలకు మరమ్మతులు చేస్తుండగా స్తంభానికి పైన వెళుతున్న హై ఓల్టేజ్ విద్యుత్ తీగ తగలడంతో మృతి చెందాడు. పళ్లిపట్టు పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుత్తణి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పళ్లిపట్టు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భార్య హత్యకేసులో భర్తకు జీవితఖైదు

తిరువళ్లూరు: భార్యను హత్య చేసిన కేసులో భర్తకు జీవిత ఖైదుతోపాటు రూ.5 వేల జరిమానా విధిస్తూ తిరువళ్లూరు మహిళ కోర్టు తీర్పు చెప్పింది. వివరాల్లోకి వెళితే.. తిరువళ్లూరు జిల్లా ఆవడి సమీపంలోని మేల్‌పాక్కం గ్రామానికి చెందిన సరిత(35) రెండో భర్త మదన్(42)తో కలిసి నివాసం ఉంటోంది. ఈ క్రమంలో 2021 జనవరిలో భార్యాభర్తల మధ్య జరిగిన ఘర్షణలో మదన్ ఇనుపరాడ్‌తో సరితను దారుణంగా కొట్టి హత్య చేశాడు. ఈ కేసు విచారణ తిరువళ్లూరు మహిళ కోర్టులో సాగింది. నేరం రుజువు కావడంతో నిందితుడికి జీవితఖైదుతో పాటు రూ.5 వేలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి రేవతి తీర్పు చెప్పారు. అలాగే సరిత కుమార్తె షాలిని(15)కు రూ.లక్ష సాయంగా ఇవ్వాలని తీర్పు చెప్పారు.

మత్తు పదార్థాల కేసులో ఇద్దరి అరెస్టు

తిరువొత్తియూరు: చెన్నై, నొలంపూర్‌లో మత్తుపదార్థాలు విక్రయిస్తున్న ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళితే.. చెన్నై, నొలంబురు పోలీసులు బుధవారం నొలంబురు, పరిసర ప్రాంతాల్లో వాహన తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో ముగపేర్ 60 అడుగుల ప్రధాన రోడ్డులో అనుమానాస్పదంగా తిరుగుతున్న ఇద్దరు యువకులను పోలీసులు అదుపులోకి తీసుకుని, తనిఖీ చేయగా ఇద్దరి వద్ద 2 గ్రాముల మత్తుపదార్థాలు ఉన్నట్లు గుర్తించారు. విచారణలో వారు అయ్యప్పకం ప్రాంతానికి చెందిన రాహుల్ (27), ఆంతోని మోసెస్ (26) అని తెలిసింది. వీరిద్దరూ ఎగ్మూర్ ప్రాంతంలో నుంచి మత్తు పదార్థాలను తీసుకువచ్చి విక్రయిస్తున్నట్లు తెలిసింది. దీంతో వీరి వద్ద నుంచి 2 గ్రాముల మెతబెటమైన్ మత్తు పదార్థం, 2 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని అరెస్టు చేశారు.

ఏరో స్పేస్‌లో రూ. 300 కోట్ల పెట్టుబడి!

సాక్షి,చెన్నై: ఏరోస్పేస్, డిఫెన్స్, హోంల్యాండ్ సెక్యూరిటీకి సంబంధించిన ప్రముఖ ఉత్పత్తి సాంకేతిక సంస్థగా ఉన్న రాంగ్స్‌స్ ఏరోస్పేస్ తన సేవలను విస్తరించేందుకు రూ. 300 కోట్ల పెట్టుబడికి సిద్ధమైంది. గురువారం స్థానికంగా ఈ వివరాలను ఆ సంస్థ ఆర్థిక సలహాదారు ఆనంద్ రతి ప్రకటించారు. రాంగ్స్‌స్ ఏరోస్పేస్‌లో ఈ పెట్టుబడి, థీమాటిక్ రంగ పెట్టుబడులపై దృష్టి సారించి ఆల్టర్నేట్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్ అయిన వాల్యూక్వెస్ట్ ట్రిస్టార్ ఫండ్ కోసం పోర్ట్‌ఫోలియో నిర్మాణంపై దృష్టి పెట్టామన్నారు. వాల్యూక్వెస్ట్ నుంచి ఈ నిధుల సేకరణ ఆనందంగా ఉందన్నారు. ఇది తమ విస్తరణ ప్రణాళికలను వేగవంతం చేయడంలో, ఏరోస్పేస్ , రక్షణ రంగాల్లో పెరుగుతున్న డిమాండ్లను తీర్చే సామర్థ్యానికి సహకారం అందిస్తుందని ఈసందర్భంగా రాంగ్స్‌స్ ఏరోస్పేస్ మేనేజింగ్ డైరెక్టర్ పవన్ రంగ తెలిపారు.. ఈ పెట్టుబడి ప్రపంచ మార్కెట్లలోకి విస్తరించడం , ఏరోస్పేస్ ఆవిష్కరణలను ముందుకు తీసుకెళ్లడానికి దోహద పడుతుందన్నారు. ఫండ్ మేనేజర్ అనికేత్ ధరంషి , వాల్యూక్వెస్ట్ వ్యవస్థాపకుడు రవి ధరంషి , ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకింగ్ డైరెక్టర్ సచిన్ మెహతా పాల్గొన్నారు.

పాలు ప్రియం

లీటరుకు రూ.4 పెరిగి ప్రైవేట్ పాల ధర

కొరుక్కుపేట: ప్రైవేటు పాల ధర లీటరుకు రూ.4 పెరిగింది. అలాగే పెరుగు ధర కూడా రూ.3 అదనంగా పెరిగింది. ఈ మేరకు తమిళనాడు మిల్క్ ఏజెంట్స్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పొన్నుసామి విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయం తెలిపారు. ఫిబ్రవరి మొదటి వారంలో ప్రకటించిన, ప్రైవేట్ పాల కంపెనీల పాలు, పెరుగు విక్రయ ధర నెల తర్వాత అమలులోకి వచ్చాయి. దక్షిణ భారతదేశంలోని ప్రముఖ ప్రైవేట్ పాల కంపెనీ హట్సన్ కంపెనీ శుక్రవారం ఉదయం నుంచి ఆరోగ్య పాలపై లీటరుకు రూ.4, పెరుగు ధరను రూ.3 పెంచుతున్నట్లు పాల ఏజెంట్లకు తెలిపింది.

నయనతారపై ధనుష్ పిటిషన్

- విచారణ ఏప్రిల్ 9కి వాయిదా


ధనుష్, నయనతార

తమిళసినిమా: కోలీవుడ్‌లో నటి నయనతారపై నటుడు ధనుష్ చెన్నై హైకోర్టులో వేసిన పిటిషన్ చర్చనీయాంశంగా మారిన విషయం తెలిసిందే. ఈ కేసులో న్యాయస్థానం ఇచ్చే తీర్పుపై సర్వత్రా ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు. వివరాలు.. విజయ్ సేతుపతి నయనతార జంటగా నటించిన చిత్రం నానుమ్ రౌడీ దాన్. నటుడు ధనుష్ తన వండర్ బార్ ఫిలిమ్స్ పతాకంపై నిర్మించారు. విఘ్నేష్ శివన్ దర్శకత్వం వహించిన ఆ చిత్రం మంచి విజయాన్ని సాధించింది. అంత వరకు అంతా హ్యాపీ. అయితే ఇటీవల నోటా నయనతార తన జీవితంలో జరిగిన ముఖ్య ఘటనలతో నయనతార బిహైండ్ ది ఫెయిరీ పేరుతో డాక్యుమెంటరీ చిత్రాన్ని రూ పొందించారు.దీన్ని నెట్‌ఫ్లిక్స్ ఓటీటీ సంస్థ నయనతార పుట్టినరోజు సందర్భంగా స్ట్రీమింగ్ చేసింది. అయితే అందులో తన అనుమతి లేకుండా తన చిత్రం నానుమ్ రౌడీదాన్‌లోని సన్నివేశాలను పొందుపరిచారని ఆరోపిస్తూ నటుడు ధనుష్ చెన్నై హైకోర్టులో రూ.10 కోట్లు నష్ట పరిహారం కోరుతూ పిటిషన్ దాఖలు చేశారు. అయితే అంతకు ముందే ఈ వ్యవహారంలో నయనతార, నెట్‌ఫ్లిక్స్ సంస్థకు ధనుష్ తరపున సమన్లు జారీ చేశారు. దీంతో నయనతార నటుడు ధనుష్‌ను విమర్శిస్తు బహిరంగంగా ప్రకటనను మీడియాకు విడుదల చేశారు. అంతే కాకుండా ధనుష్ నష్టపహారం వ్యవహారంపై కోర్టు లోనే ఎదుర్కొంటామని పేర్కొన్నారు. కాగా ఈ కేసు మరోసారి గురువారం న్యాయస్థానం విచారణకు వచ్చింది. ఈ సందర్భంగా నయనతార, ధనుష్ తరపు న్యాయవాదులు తీవ్రంగా తమ వాదనను వినిపించారు. నానుమ్ రౌడీ దాన్ చిత్రంలో ఉపయోగించని సన్నివేశాలునే డాక్యుమెంటరీ చిత్రంలో వాడామని, అందువల్ల నటుడు ధనుష్ కో రినట్లుగా నష్ట పరిహారం చెల్లించాల్సిన అవసరం లేదని వాదించారు. అయితే నానుమ్ రౌడీ దాన్ చిత్రంలో ఉపయోగించక పోయినా, అవి తమ చిత్రం కోసం చిత్రీకరించినవేనని ధనుష్ తరపు న్యాయ వాది వాదించారు. అంతే కాకుండా నానుమ్ రౌడీ దాన్ చిత్రం షూటింగ్‌లో నయనతారను ఎలివేట్ చేయడానికి దర్శకుడు విఘ్నేష్ శివన్ పలు టేక్‌లు షూట్ చేసి చిత్ర నిర్మాణ వ్యయం పెంచారని ఆరోపిస్తూ నయనతార డాక్యుమెంటరీపై నిషేధం విధించాలని కోరారు. అయితే నిషేధించాలన్న కోరికను న్యాయస్థానం నిరాకరిస్తూ తదుపరి విచారణను ఏప్రిల్ 9వ తేదీకి వాయిదా వేసింది.

తిరువారూర్‌లో రూ.కోటి గంజాయి స్వాధీనం


సామాజిక మాధ్యమంలో వైరల్ అవుతున్న వీడియో

సేలం: తిరువారూర్‌లో రూ.కోటి విలువ చేసే గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళితే.. తిరువారూర్ జిల్లాలోని తిరువారూర్ - నాగపట్నం జాతీయ రహదారిపై ఒక ప్రైవేట్ హోటల్లో ఉంది. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఐదుగురు వ్యక్తులు అక్కడ ఉంటున్నారని, వారు ఆంధ్రప్రదేశ్ నుంచి శ్రీలంకకు 400 కిలోల గంజాయిని అక్రమంగా తరలించాలని ప్రణాళిక రూపొందిస్తున్నారని చెన్నై సెంట్రల్ నార్కోటిక్స్ కంట్రోల్ యూనిట్ పోలీసులకు రహస్య సమాచారం అందింది. ఆ సమాచారం ఆధారంగా పోలీసులు బుధవారం హోటల్‌లో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. అప్పుడు హాస్టల్ ముందు ఆపి ఉంచిన రెండు కార్లలో దాచిపెట్టిన 400 కిలోగ్రాముల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రెండు కార్లలో వచ్చిన ఐదుగురు వ్యక్తులు ఒక ప్రైవేట్ హోటల్లో గదిని అద్దెకు తీసుకుని, ఆంధ్రప్రదేశ్‌లోని కడపకు చెందిన బి.విష్ణువర్ధరెడ్డి ఆధార్ ఐడీ కార్డును సమర్పించినట్టు, రెండు కార్లలో వచ్చినట్టు దర్యాప్తులో తేలింది. తరువాత గదిలో ఉంటున్న వారిని అరెస్టు చేయడానికి పోలీసులు హోటల్ వెనుక భాగంలోకి ప్రవేశించారు. వారు వెళ్లిన సమయంలో ఆంధ్రప్రదేశ్ నుంచి ప్రజలను తీసుకురావడానికి వచ్చిన ఒక వ్యక్తి వారిని చూశాడు. ఆ తర్వాత ఆ వ్యక్తి హోటల్ తలుపు ఎక్కి అక్కడి నుంచి పారిపోయాడు. ఓ పోలీసు అధికారి అతన్ని వెంబడించి పట్టుకోవడానికి ప్రయత్నిస్తున్న సీసీటీవీ దృశ్యాలు ఆన్‌లైన్‌లో విడుదల కావడం కలకలం రేపుతోంది. ఆ తర్వాత పోలీసులు గదిలో ఉన్న ఐదుగురిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుని, 2 కిలోల బరువున్న 200 గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ గంజాయి విలువ రూ.కోటికిపైగా ఉంటుందని పోలీసులు తెలిపారు. ఇంకా, అరెస్టు చేసిన వ్యక్తులను విచారించినప్పుడు, వారు ఈ గంజాయి ప్యాకెట్లను ముత్తుపేట ప్రాంతంలోని అలయాత్తి అడవుల మీదుగా పడవ ద్వారా నాగపట్నం జిల్లాలోని కొడియక్కరైకు రవాణా చేయబోతున్నట్లు వెల్లడైంది. ఈ కేసును ఇన్‌స్పెక్టర్‌తో సహా ఆరుగురు పోలీసు అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. వారిని శుక్రవారం ఉదయం తిరువారూర్ కోర్టులో హాజరుపరుస్తామని, అరెస్టు చేసే అవకాశం ఉందని పోలీసులు తెలిపారు.

పదేళ్లలో విజయవంతంగా 7500 ప్రసవాలు

- అపోలో ఉమెన్స్ ఆస్పత్రి ఘనత


కేక్ కట్ చేస్తున్న సునీతా రెడ్డి

కొరుక్కుపేట: అపోలో ఉమెన్స్ హాస్పిటల్ ప్రసూతి, గైనకాలజీ అండ్ నియోనేటల్ కేర్‌లో దశాబ్ద కాలం విజయవంతంగా పూర్తి చేసుకుందని అపోలో హాస్పిటల్స్ గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ సునీతారెడ్డి తెలిపారు. ఈ మేరకు గురువారం ఆస్పత్రిలో 10 ఏళ్ల వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా సునీతా రెడ్డి కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఆస్పత్రిలో అప్పటివరకు ప్రసూతి విభాగం 7500 ప్రసవాలు విజయవంతంగా పూర్తి చేయగా, గైనకాలజికల్ బృందం 33 వేల శస్త్ర చికిత్సలను నిర్వహించినట్లు తెలిపారు.

సెల్‌ఫోన్ టవర్ ఏర్పాటు చేయవద్దని గ్రామస్తుల ఆందోళన

తిరువళ్లూరు: నివాస ప్రాంతాల్లో సెల్‌ఫోన్ టవర్ ఏర్పాటు చేయవద్దని నిరసిస్తూ గ్రామస్తులు ఆందోళనకు దిగడంతో ఉద్రిక్తత నెలకొంది. తిరువళ్లూరు జిల్లా అరణ్‌వాయల్‌కుప్పంలోని నత్తకొలను సమీపంలో ప్రైవేటు సెల్‌ఫోన్ టవర్ ఏర్పాటును గ్రామస్తులు వ్యతిరేకిస్తున్నారు. ఈ క్రమంలో గురువారం సెవ్వాపేట పోలీసులను భారీగా మోహరించి టవర్ నిర్మాణ పనులను ప్రారంభించారు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు పెద్ద ఎత్తున టవర్ నిర్మాణం చేస్తున్న ప్రాంతానికి చేరుకుని, పోలీసులతో వాగ్వాదానికి దిగి, ఆందోళనకు చేపట్టారు. విషయం తెలుసుకున్న పూందమల్లి అసిస్టెంట్ కమిషనర్ రవికుమార్, ఇన్‌స్పెక్టర్ జయకృష్ణ గ్రామస్తులతో చర్చలు జరిపారు. అనంతరం తాత్కాలికంగా పనులను నిలిపివేశారు.

రాష్ట్రమహానాడు జయప్రదం చేయండి

వేలూరు: రాష్ట్రంలోని వ్యాపారుల సమస్యల ప్రజా వేదికగా జరగనున్న మహానాడుకు వ్యాపారులు అధిక సంఖ్యలో తరలివచ్చి, జయప్రదం చేయాలని తమిళనాడు అన్ని వ్యాపారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు విక్రమరాజా అన్నారు. వేలూరులోని ప్రైవేటు హోటల్‌లో వేలూరు, తిరుపత్తూరు, రాణిపేట జిల్లాలకు చెందిన అన్ని వ్యాపారుల సంఘం ప్రతినిధుల సమావేశం జిల్లా అధ్యక్షుడు జ్ఞానవేల్ అధ్యక్షతన జరిగింది. అనంతరం విక్రమ రాజా విలేకరులతో మాట్లాడుతూ మే 5వ తేదీన 42వ వ్యాపారుల సంఘం మహానాడు నిర్వహించనున్నామని, అందులో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వ్యాపారులు ఎదుర్కొంటున్న సమస్యలపై తీర్మానం చేసి, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు అందజేయనున్నామని తెలిపారు. ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి గోవిందరాజులు, క్రిష్ణన్, అరుణ్ ప్రసాద్, శరవణన్, రమేష్ బాబు పాల్గొన్నారు.

ఎంగిలాకులపై అంగప్రదక్షిణపై నిషేధం

- హైకోర్టు ఉత్తర్వులు

సేలం: ఎంగిలి ఆకులపై ప్రదక్షిణలు చేయడానికి అనుమతి మంజూరు చేస్తూ జారీ చేసిన ఉత్తర్వులను హైకోర్టు నిలిపివేసింది. కరూర్‌లోని శ్రీసదాశివ బ్రహ్మేంద్రుల జీవ సమాధి రోజున జరిగే వార్షిక కార్యక్రమంలో భక్తులు భోజనం తిన్న తర్వాత ఆ ఎంగిలి ఆకులపై అంగప్రదక్షణ చేయడం ఆచారం. కాగా ఈ ఆచారాన్ని నిలిపివేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్లను విచారించిన సింగిల్ జడ్జి జీఆర్ స్వామినాథన్ పూజ ప్రక్రియలో కోర్టు జోక్యం చేసుకోకూడదని గత సంవత్సరం ఉత్తర్వు జారీ చేశారు. ఈ ఉత్తర్వులకు వ్యతిరేకంగా తిరువన్నామలై ఆలయంలో అర్చకునిగా పని చేస్తున్న అరంగనాథన్ మదురై హైకోర్టులో అప్పీళ్లు దాఖలు చేశారు. ఈ కేసు సుదీర్ఘ విచారణ తర్వాత న్యాయమూర్తులు తుది తీర్పు కోసం కేసును వాయిదా వేశారు. ఈ కేసు గురువారం హైకోర్టు శాఖలో తుది విచారణకు వచ్చింది. ఈ కేసును విచారించిన న్యాయమూర్తులు అంగప్రదక్షిణ ఒక పూజా విధానమే అయినప్పటికీ, అది భక్తుల ఆరోగ్యానికి హానికరం అని తీర్పు ఇచ్చారు. ఈ నేపథ్యంలో దీన్ని అనుమతించలేం. అంతేకాకుండా, కర్ణాటకలోని ఒక జిల్లాలో ఇలాంటి సంఘటన జరగకుండా సుప్రీం కోర్టు నిషేధించింది. ఈ కేసు కూడా ప్రస్తుతం పెండింగ్‌లో ఉంది. అటువంటి పరిస్థితుల్లో, సింగిల్ జడ్జి అభిప్రాయం కొట్టివేస్తున్నట్లు తెలిపింది. ఈ కార్యక్రమానికి అనుమతి ఇవ్వడాన్ని నిషేధిస్తూ న్యాయమూర్తి ఉత్తర్వులు జారీ చేశారు.

కాట్పాడిలో ఫైనాన్సియర్‌పై హత్యాయత్నం


కాట్పాడి గాంధీనగర్‌లోని ఫైనాన్సియర్ ఇంటి వద్ద విచారణ జరుపుతున్న పోలీసులు

వేలూరు: జిల్లాలోని కాట్పాడి సమీపంలో ఉన్న వంజూరుకు చెందిన అరుణ్ అనే ఫైనాన్సియర్‌పై హత్యాయత్నం ఘటనకు సంబంధించి పోలీసులు విచారణ జరుపుతున్నారు. వివరాల్లోకి వెళితే.. వేలూరు జిల్లా కాట్పాడి సమీపంలోని గాంధీనగర్‌లో వంజూరుకు చెందిన అరుణ్ అనే వ్యక్తి ఫైనాన్స్ కార్యాలయం నడుపుతున్నాడు. బుధవారం రాత్రి కాట్పాడి వీజీరావ్ నగర్‌కు చెందిన జాన్‌సన్ ఫైనాన్సియర్ అరుణ్‌తో కార్యాలయంలో కలిసి మాట్లాడుతున్నాడు. ఆ సమయంలో ఇద్దరి మధ్య ఘర్షణ జరిగింది. జాన్‌సన్ తోసి వేయడంతో అరుణ్ కింద పడి స్పృహతప్పాడు. ఆ సమయంలో అరుణ్ కడుపులో కమ్మీ గుచ్చుకుని రక్తపు మడుగులో పడి ఉండడంతో అతన్ని వేలూరులోని సీఎంసీ ఆస్పత్రికి జాన్‌సన్ తరలించాడు. ఆస్పత్రిలో అరుణ్‌కు చికిత్స చేస్తున్న సమయంలో అతని కడుపులో బుల్లెట్ ఉన్నట్లు గుర్తించి వెంటనే పోలీసులకు సమాచారం అందజేశారు. వెంటనే విరుదంబట్టు పోలీసులు ఆస్పత్రికి చేరుకుని విచారణ జరిపారు. ఈ నేపథ్యంలో గురువారం ఉదయం అదనపు ఎస్పీ భాస్కరన్, డీఎస్పీ పయణి, పోలీసులు ఫైనాన్స్ దుకాణం వద్దకు చేరుకుని విచారణ జరపడంతోపాటు వేలి ముద్రలను సేకరించారు. జాన్‌సన్‌ను విచారణ చేస్తున్నారు.

రెంటచింతల@ 42.8 డిగ్రీలు

రెంటచింతల: పల్నాడు జిల్లా రెంటచింతలలో ఉష్ణోగ్రతలు భగ్గుమంటున్నాయి. గురువారం రెంటచింతలలో గరిష్ట ఉష్ణోగ్రత 42.8 డిగ్రీలు, కనిష్ట ఉష్ణోగ్రత 28.4 డిగ్రీలుగా నమోదైంది. ఏటా రాష్ట్రంలోనే అత్యధిక ఉష్ణోగ్రత నమోదయ్యే ప్రాంతాల్లో ఒకటైన రెంటచింతలలో ఎండలకు ప్రజలు హడలిపోతున్నారు. గతంలో రెంటచింతలలో గరిష్ట ఉష్ణోగ్రత 49 డిగ్రీలకుపైగా నమోదైంది.

ఎన్టీపీసీ మరో ఫ్లోటింగ్ సోలార్ ప్లాంటు!


- పరవాడలో 18.75 మెగావాట్లతో ఏర్పాటు
- సింహాద్రి ఎన్టీపీసీ హెడ్ సమీర్‌శర్మ

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం: నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్ (ఎన్టీపీసీ) మరో ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేయనుంది. రా–వాటర్ రిజర్వాయర్‌లో ఇప్పటికే 25 మెగావాట్ల ప్లాంట్ ఉండగా.. 18.75 మెగావాట్లతో కొత్త ప్లాంట్‌ను నెలకొల్పనున్నట్లు ఎన్టీపీసీ సింహాద్రి ప్రాజెక్ట్ హెడ్, ఈడీ సమీర్‌శర్మ తెలిపారు. గురువారం విశాఖలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పూడిమడక గ్రీన్ హైడ్రోజన్ ప్లాంట్ పూర్తిస్థాయి ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) సిద్ధమైందని.. నెలాఖరు నాటికి లే–అవుట్ ప్లాన్ పూర్తవుతుందని వివరించారు. 1200 ఎకరాలతో పాటు మరో 400 ఎకరాల కోసం మారిటైం బోర్డుకు లేఖ రాశామని, నీటి సరఫరా కోసం ఒప్పందం కుదిరిందని చెప్పారు. ఇది అందుబాటులోకి వస్తే హైడ్రోజన్ మాత్రమే కాక ఇథనాల్, మిథనాల్, ఏవియేషన్ ఫ్యూయల్, యూరియా కూడా ఉత్పత్తి చేస్తామన్నారు. తద్వారా పరిశ్రమలు, వ్యవసాయ రంగానికే కాక విమానయాన రంగానికీ ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. 2032 నాటికి 130 గిగావాట్ల సామర్థ్యం కలిగిన కంపెనీగా ఎన్టీపీసీ అవతరించనుందని, ఇందుకోసం థర్మల్, సోలార్, గ్రీన్ హైడ్రోజన్ వంటి ప్లాంట్లను ఏర్పాటు చేస్తున్నట్లు సమీర్‌శర్మ పేర్కొన్నారు.

సీఎంతో డీఆర్‌డీవో మాజీ చైర్మన్ భేటీ

సాక్షి, అమరావతి: డీఆర్‌డీవో మాజీ చైర్మన్, ఏరోనాటికల్ సొసైటీ ఆఫ్ ఇండియా ప్రెసిడెంట్ డాక్టర్ జి.సతీశ్ రెడ్డి గురువారం సచివాలయంలో సీఎం చంద్రబాబును మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో పారిశ్రామిక అభివృద్ధికి అవకాశాలు, డిఫెన్స్ రంగంలో పరిశ్రమలు నెలకొల్పడంపై సీఎంకు ప్రజెంటేషన్ ఇచ్చారు. 50 మంది ఔత్సాహిక పారిశ్రామికవేత్తలతో రాష్ట్రంలో పరిశ్రమలు స్థాపించేలా సహకారం అందిస్తానని, ఇందుకు రాష్ట్ర ప్రభుత్వ తోడ్పాటు కావాలని కోరగా... సీఎం సానుకూలంగా స్పందించారు.

మీ కిడ్నీలు భద్రమేనా?



ప్రపంచ కిడ్నీ దినోత్సవం సందర్భంగా విశాఖ బీచ్‌రోడ్డులో ప్రజలకు అవగాహన కల్పిస్తూ సైకత శిల్పాన్ని ఏర్పాటు చేశారు. ఏసియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నెఫ్రాలజీ అండ్ యూరాలజీ ఆధ్వర్యంలో బీచ్‌రోడ్డులో ప్రత్యేకంగా సైకత శిల్పాన్ని రూపొందించారు. దీన్ని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్, సీపీ శంఖబ్రత బాగ్చి ప్రారంభించారు. ఈ ఏడాది ప్రపంచ కిడ్నీ దినోత్సవాన్ని 'ఆర్ యువర్ కిడ్నీస్ ఓకే?' అనే నినాదంతో నిర్వహిస్తున్నారు.

– ఏయూ క్యాంపస్

వెటర్నరీ జూడాల మానవహారం



గౌరవ వేతనం పెంచాలంటూ ఎస్వీ వెటర్నరీ వర్సిటీ జూడాలు గత 39 రోజులుగా నిరవధిక సమ్మెలో ఉన్నారు. రాష్ట్ర వెటర్నరీ జూడాల అసోసియేషన్ పిలుపు మేరకు గురువారం అన్ని పట్టణ ప్రాంతాల్లో మానవహారం చేపట్టారు. ఇందులో భాగంగా తిరుపతి ఎస్వీ వెటర్నరీ కళాశాల విద్యార్థులు బాలాజీ కాలనీ సర్కిల్ వద్ద పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేస్తూ మానవహారం నిర్వహించారు. నాలుగు రోడ్ల కూడలిలో వాహనాలను స్తంభింపజేయడంతో నగరంలో సుమారు గంట పాటు ట్రాఫిక్ స్తంభించింది.

– తిరుపతి సిటీ

ముగిసిన శ్రీవారి తెప్పోత్సవాలు



తిరుమలలో ఐదురోజులపాటు నిర్వహించిన శ్రీవారి వార్షిక తెప్పోత్సవాలు గురువారం ముగిశాయి. చివరిరోజు శ్రీ మలయప్పస్వామి శ్రీదేవి, భూదేవి సమేతంగా తెప్పపై విహరించి భక్తులకు కనువిందు చేశారు. ముందుగా స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను ఆలయ నాలుగు మాడ వీధుల్లో ఊరేగించి శ్రీవారి పుష్కరిణి వద్దకు తీసుకొచ్చారు. రాత్రి 7 గంటలకు విద్యుద్దీపాలతో అలంకరించిన తెప్పపై శ్రీదేవి, భూదేవి సమేతంగా మలయప్ప స్వామివారు ఆశీనులై పుష్కరిణిలో ఏడుచుట్లు విహరించి భక్తులను కటాక్షించారు.

– తిరుమల

కూటమి ఎమ్మెల్యే దురాక్రమణపై డప్పు కొట్టి నిరసన



తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తన వాహనాల పార్కింగ్ కోసం ఏకంగా రోడ్డునే ఆక్రమించారు. తన నివాసం సమీపంలో 35 అడుగుల మేర పొడవు వున్న కాలువతో పాటు రోడ్డును ఆక్రమించి రేకుల షెడ్డు వేయడం విమర్శలకు తావిస్తోంది. ఈ దురాక్రమణపై వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. తిరుపతి స్కావెంజర్స్ కాలనీలో డప్పుకొట్టి కూటమి ఎమ్మెల్యే చేస్తున్న అరాచకాలపై వినూత్నంగా నిరసన తెలిపారు.

– తిరుపతి మంగళం

టమాటా ధర ధమాల్!

- పలమనేరులో 15 కిలోల బాక్సు రూ.50 మాత్రమే
- టమాటాను కొంటున్నామంటూ ప్రగల్భాలు పలికిన ప్రభుత్వం
- కేవలం ఒక్క రోజు కొని.. ఆ తర్వాత పట్టించుకోని అధికారులు
- దిక్కుతోచని స్థితిలో టమాటా రైతులు



పలమనేరు: చిత్తూరు జిల్లాలో టమాటా ధరలు భారీగా పతనమయ్యాయి. పలమనేరులోని టమాటా మార్కెట్‌లో గురువారం 15కిలోల బాక్సు ధర కేవలం రూ.50 పలికింది. దీంతో ఎకరాకు రూ.లక్షకు పైగా పెట్టుబడులు పెట్టి టమాటా సాగుచేసిన రైతులు తమకు భారీ నష్టాలు తప్పవని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలమనేరు హార్టికల్చర్ డివిజన్‌లో 4వేల హెక్టార్లలో టమాటా సాగు చేశారు. వెయ్యి హెక్టార్లలో పంట కోత దశకు వచ్చింది. ప్రస్తుతం స్థానిక రైతులు రోజూ పలమనేరు మార్కెట్‌కు 40టన్నుల వరకు టమాటాలు తీసుకొస్తున్నారు. అనంతపురం జిల్లా నుంచి రోజూ మరో 40టన్నుల వరకు టమాటా వస్తోంది. అయితే, కొనుగోలు చేసేందుకు పొరుగు రాష్ట్రాల నుంచి వ్యాపారులు రాకపోవడంతో ధరలు తగ్గిపోయాయి.

బయటి రాష్ట్రాల్లో టమాటా సీజన్ మొదలు

మన రాష్ట్రంలో టమాటా అత్యధికంగా పండించే ఉమ్మడి చిత్తూరు జిల్లాకు ఏటా పొరుగు రాష్ట్రాల వ్యాపారులు వచ్చి కొనుగోలు చేస్తారు. ప్రస్తుతం కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాల్లో టమాటా సీజన్ మొదలైంది. అక్కడి అవసరాలకు స్థానిక సరుకు సరిపోతోంది. ఆయా రాష్ట్రాల నుంచి వ్యాపారులు చిత్తూరు జిల్లాకు రావడం లేదు. మరోవైపు వేసవి మొదలుకావడంతో తోటల్లో టమాటా మాగడం మొదలైంది. వెంటనే అమ్ముకోవాలని రైతులు మాగినవాటిని కోసి మార్కెట్‌కు తీసుకొస్తున్నారు. వాటిని కొనుగోలు చేసేందుకు పొరుగు రాష్ట్రాల నుంచి వ్యాపారులు రాకపోవడం, డిమాండ్ కంటే సరఫరా ఎక్కువగా ఉండటంతో ధర తగ్గిపోయిందని మార్కెటింగ్ శాఖ అధికారులు చెబుతున్నారు.

ఒక్కరోజుతో చేతులెత్తేసిన ప్రభుత్వం

రాష్ట్రంలోని టమాటా రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు ఇటీవల ప్రకటించారు. రైతులకు నష్టం రాకుండా మార్కెటింగ్ శాఖ ద్వారా టమాటాను కొనుగోలు చేస్తామని చెప్పారు. ఆ మేరకు చర్యలు తీసుకోవాలని టెలీకాన్ఫరెన్స్‌లో కలెక్టర్లకు ఆదేశాలిచ్చారు. కానీ, మార్కెటింగ్‌శాఖ అధికారులు ఇటీవల ఒక్కరోజు మాత్రం తూతూ మంత్రంగా రైతుల నుంచి టమాటాలను కొనుగోలు చేసి రైతుబజార్లకు పంపించారు. ఆ తర్వాత చేతులెత్తేశారు. దీంతో రైతులు దిక్కుతోచక అల్లాడుతున్నారు.

ఈ ధరలతో అప్పులపాలే..



ఎకరా పొలంలో టమాటా సాగుకు రూ.1.20లక్షలు పెట్టుబడి పెట్టాలి. బాగా పండితే ఎకరాకు 800 బాక్సులు దిగుబడి రావొచ్చు. ఇప్పుడున్న ధర రూ.50 ప్రకారం అయితే రైతుకు దక్కేది రూ.40వేలు మాత్రమే. రైతులు అప్పులపాలవడం ఖాయం. ప్రభుత్వమే టమాటాను మద్దతు ధరకు కొని రైతులను ఆదుకోవాలి.

– గోవిందు, బేరుపల్లి, పలమనేరు మండలం

ప్రభుత్వం పట్టించుకోలేదు..



రూ.లక్షలు ఖర్చుపెట్టి టమాటా సాగుచేసిన రైతులకు 15కిలోల బాక్సు ధర రూ.400 ఉంటే లాభమే. ఇప్పుడు బాక్సు ధర రూ.50 ఉంది. ఈ లెక్కన చూస్తే పూర్తిగా నష్టం తప్పదు. ఇటీవల మార్కెటింగ్‌శాఖ అధికారులు ఒక రోజు టమాటాను కొని రైతుబజార్లకు పంపారు. ఆ తర్వాత పట్టించుకోలేదు. నిత్యం అధికారులు సరుకు కొంటే బయటి వ్యాపారులు సైతం ఎక్కువ ధరకు కొనే అవకాశం ఉంటుంది. రైతులకు లాభం వస్తుంది.

– టీఎస్ బుజ్జి, టమాటా వ్యాపారి, పలమనేరు

ఈడీబీలో భారీ వేతనాలతో 22 మంది నియామకం

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ ఎకనామిక్ డెవలప్‌మెంట్ బోర్డు (ఏపీఈడీబీ)లో భారీ వేతనాలతో కాంట్రాక్టు విధానంలో 22 మంది నియామకానికి రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఈ మేరకు సాధారణ పరిపాలన శాఖ (రాజకీయ) ముఖ్య కార్యదర్శి ముఖేశ్‌కుమార్ మీనా గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఐదుగురు అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్‌లు, పది మంది జనరల్ మేనేజర్లు, ఏడుగురు మేనేజర్లను నియమించేందుకు అనుమతించింది. అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్‌లకు నెలకు రూ.2.50 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు వేతనం ఇవ్వనున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. జనరల్ మేనేజర్లకు నెలకు రూ.2 లక్షల నుంచి 2.50 లక్షల వరకు, మేనేజర్లకు నెలకు రూ.1.50 లక్షల నుంచి రూ.2 లక్షల వరకు వేతనాలు ఇవ్వనున్నట్లు స్పష్టం చేశారు. ఏపీ రంగాల్లో పెట్టుబడులను ఆకర్షించేలా పనిచేయాలో కూడా ఉత్తర్వుల్లో సూచించారు. ఎలక్ట్రానిక్స్, ఏరోస్పేస్, ఫుడ్ ప్రాసెసింగ్, ఆటోమొబైల్, ఫార్మా, టెక్స్‌టైల్స్, ఇండస్ట్రియల్ పార్క్, కెమికల్–పెట్రో కెమికల్, పునరుత్పాదక శక్తి రంగాల్లో పెట్టుబడులను ఆకర్షించే బాధ్యతలను నిర్వహిస్తారని పేర్కొన్నారు. అలాగే జనరల్ మేనేజర్లు అమెరికా, జర్మనీ, ఫ్రాన్స్, కొరియా, జపాన్, తైవాన్ దేశాల పెట్టుబడులపై దృష్టి పెడతారని ఉత్తర్వుల్లో తెలిపారు.

కాశినాయన ఆశ్రమానికి అనుమతులకు ప్రయత్నిస్తాం

వైఎస్సార్ జిల్లా కలెక్టర్ శ్రీధర్

కాశినాయన: వైఎస్సార్ జిల్లాలోని కాశినాయన ఆశ్రమంలో కూల్చివేసిన కట్టడాలు, నిర్మాణాలకు అటవీశాఖ అనుమతుల కోసం కృషి చేస్తామని కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ చెప్పారు. గురువారం జ్యోతిక్షేత్రంలో కూల్చివేసిన కట్టడాలను ఆయన పరిశీలించారు. ప్రభుత్వానికి తెలియకుండానే అటవీ అధికారులు కూల్చివేశారని మంత్రి లోకేశ్ చెబుతున్నారని మీడియా ప్రతినిధులు అడగ్గా.. ఆ విషయం తన దృష్టికి రావడం వల్లే ఇక్కడికి వచ్చానన్నారు. కట్టడాలను కూల్చివేయాలంటూ జనవరి 1న అధికారులకు మీరు జారీచేసిన ఉత్తర్వులను ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి మీడియాకు చూపించారని విలేకరులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా.. కేంద్ర అటవీ శాఖ అధికారుల ఆదేశాల ప్రకారం ఉత్తర్వులు జారీ చేశామన్నారు. ఆయన వెంట బద్వేలు ఆర్డీఓ చంద్రమోహన్, తహసీల్దార్ నరసింహులు, ఫారెస్ట్ సిబ్బంది ఉన్నారు. ఆశ్రమంలో కూల్చివేసిన క్షౌరశాల నిర్మాణానికి ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. కూల్చివేసిన కట్టడాలను అనుమతులు లేకుండా ఎలా నిర్మిస్తారని ఫారెస్ట్ అధికారులు ప్రశ్నించారు. మంత్రి లోకేశ్ ఆదేశాల మేరకు ఏర్పాట్లు చేస్తున్నామని ఖాదీ, విలేజ్ ఇండస్ట్రీస్ చైర్మన్, మంత్రి పర్సనల్ సెక్రటరీ కేకే చౌదరి ఆదేశాలతో నిర్మాణానికి పూనుకున్నామని ఆలయ పూజారి తెలిపారు.

వైఎస్సార్‌సీపీ నేతపై హత్యాయత్నం

- మాజీ సర్పంచ్ కుటుంబంపై టీడీపీ గూండాల మూకుమ్మడి దాడి
- ఇనుప రాడ్లు, కర్రలు, గొడ్డలితో చెలరేగిన పచ్చ మూకలు
- వైఎస్సార్‌సీపీ నేత లోకేశ్వరరెడ్డి, ఆయన తండ్రి వెంకట్రామిరెడ్డికి తీవ్రగాయాలు
- నంద్యాల జిల్లా కంపమల్లలో దారుణం

కోవెలకుంట్ల: వైఎస్సార్‌సీపీకి చెందిన మాజీ సర్పంచ్‌పై టీడీపీ గూండాలు హత్యాయత్నం చేశారు. ఈ దారుణం నంద్యాల జిల్లా కంపమల్లలో బుధవారం రాత్రి జరిగింది. వివరాలు.. కంపమల్లకు చెందిన సోముల లోకేశ్వరరెడ్డి వైఎస్సార్‌సీపీ ఆవిర్భావం నుంచి పార్టీలో కొనసాగుతున్నారు. 2021లో గ్రామ సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పదవికి రాజీనామా చేశారు. అయినా కూడా లోకేశ్వరరెడ్డిపై కక్షగట్టిన స్థానిక టీడీపీ నాయకులు ఆయనను ఎలాగైనా అడ్డు తొలగించుకోవాలనుకున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం రాత్రి భోజనం చేసిన తర్వాత లోకేశ్వరరెడ్డి పొలం వద్దకు వెళ్లగా.. తండ్రి వెంకట్రామిరెడ్డి ఇంటి ఆవరణలో, తమ్ముడు వెంకటేశ్వరరెడ్డి లోపల గదిలో నిద్రపోయారు. రాత్రి 10 గంటల తర్వాత అక్కడికి చేరుకున్న టీడీపీ గూండాలు ఇనుప రాడ్లు, కర్రలతో వెంకట్రామిరెడ్డిని విచక్షణారహితంగా కొట్టి గాయపరిచారు. ఆ వెంటనే గొడ్డలితో వెంకటేశ్వరరెడ్డి ఉన్న గది తలుపులు పగలగొట్టి లోపలికి ప్రవేశించారు. దాడి చేస్తున్న సమయంలో వెంకటేశ్వరరెడ్డి గూండాల బారి నుంచి తప్పించుకున్నాడు. ఇంతలో లోకేశ్వరరెడ్డి ఇంటికి రాగా.. పక్కనే పొలంలో మాటు వేసిన గూండాలు ఆయనపై ఇనుప రాడ్లతో విరుచుకుపడ్డారు. లోకేశ్వరరెడ్డి రక్తపుమడుగులో పడిపోవడంతో.. మరణించి ఉంటాడని భావించిన వారంతా అక్కడి నుంచి పారిపోయారు. కుటుంబ సభ్యులు, చుట్టుపక్కల వారు లోకేశ్వరరెడ్డిని, వెంకట్రామిరెడ్డిని కోవెలకుంట్ల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నంద్యాలలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. లోకేశ్వరరెడ్డి తలకు బలమైన గాయమై.. రక్తం గడ్డకట్టడంతో వైద్యులు శస్త్రచికిత్స చేశారు. లోకేశ్వరరెడ్డి ప్రాణాపాయస్థితిలో ఉన్నట్లు బంధువులు తెలిపారు.

కాటసాని పరామర్శ..

దాడి విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఆస్పత్రికి చేరుకుని లోకేశ్వరరెడ్డి కుటుంబసభ్యులను పరామర్శించారు. లోకేశ్వరరెడ్డి ఆరోగ్య పరిస్థితిని డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. టీడీపీ గూండాల దాడిని తీవ్రంగా ఖండించారు. కాగా, టీడీపీకి చెందిన చిన్న సుబ్బారెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, సురేశ్, రవి, కృష్ణమోహన్, సుబహాన్, కిరణ్‌కుమార్‌రెడ్డి, రామిరెడ్డిగారి చిన్న సుబ్బారెడ్డి, సూర వెంకటసుబ్బారెడ్డితో పాటు మరికొంత మంది తమను హత్య చేసేందుకు ప్రయత్నించారని వెంకటేశ్వరరెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ట్రిపుల్ ఎక్స్ సోప్స్ అధినేత కన్నుమూత



మాణిక్యవేల్ (ఫైల్)

నగరంపాలెం (గుంటూరు వెస్ట్): ట్రిపుల్ ఎక్స్ సోప్స్ అధినేత డాక్టర్ అరుణాచలం మాణిక్యవేల్ (77) అనారోగ్యంతో కన్నుమూశారు. కొంతకాలంగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆయన గురువారం సాయంత్రం తుదిశ్వాస విడిచారు. మాణిక్యవేల్‌కు భార్య పర్మిళ, కుమారుడు పర్విన్‌రాజు, కుమార్తె దివ్యభారతి ఉన్నారు. చెన్నైకి చెందిన మాణిక్యవేల్ 1981లో గుంటూరు వచ్చి స్థిరపడ్డారు. ట్రిపుల్ ఎక్స్ సోప్ పేరిట ప్రారంభమైన వ్యాపార ప్రస్థానం అంచెలంచెలుగా ఎదిగింది. ఐదుగురు కార్మికులతో చిరు వ్యాపారాన్ని ప్రారంభించి వందలాది కార్మికులు, సిబ్బందికి ఉపాధి కల్పించారు. దైవభక్తి గల ఆయన సేవా కార్యక్రమాల్లోనూ ముందుండేవారు. మాణిక్యవేల్ అంత్యక్రియలు శుక్రవారం గుంటూరులో జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన మరణవార్త తెలిసి ప్రముఖులు, రాజకీయ నాయకులు, వ్యాపారులు ఆయన నివాసానికి చేరుకుని నివాళులర్పించారు.

అన్నదాత ఆత్మహత్య

తుగ్గలి: అప్పుల బాధతో ఓ రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన కర్నూలు జిల్లా తుగ్గలి మండలం మార్లెల్లలో చోటుచేసుకుంది. మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పుండుకూర రామాంజినేయులు (45) తనకున్న కొద్దిపాటి భూమితో పాటు మరో ఐదెకరాలు కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నారు. గత ఖరీఫ్‌లో వేరుశనగ, కంది పంటలు సాగు చేసి నష్టపోయాడు. ఈక్రమంలో కుటుంబ పోషణ, పంట సాగుకు చేసిన అప్పులు రూ.10 లక్షలు దాటాయి. వీటిని తీర్చే మార్గం లేక రామాంజినేయులు బుధవారం రాత్రి ఇంటికి సమీపంలోని పశువుల పాకలో ఉరేసుకున్నాడు. కుటుంబ సభ్యులు అతడిని పత్తికొండ ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడు.

తుంగభద్ర డ్యాం కొత్త గేట్ల డిజైన్ ఖరారు

ఒక్కో గేటు బరువు 48 టన్నులకు మించకూడదన్న సీడబ్ల్యూసీ

సాక్షి, అమరావతి: కాలం చెల్లిన తుంగభద్ర డ్యాం గేట్ల స్థానంలో అమర్చే కొత్త గేట్ల డిజైన్ (ఆకృతి)ని కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) ఖరారు చేసింది. ఒక్కో గేటు 53 టన్నుల బరువుతో తుంగభద్ర బోర్డు ఓ ప్రైవేటు సంస్థ ద్వారా రూపొందించిన డిజైన్‌ను తోసిపుచ్చింది. ప్రస్తుతం ఉన్న గేట్ల బరువు 48 టన్నులేనని, కొత్త గేట్ల బరువు కూడా అంతకు మించకూడదని తేల్చిచెప్పింది. 14 ఎంఎం మందంతో కూడిన స్కిన్ ప్లేట్ (ఇనుప రేకు)తో త్రీ గిడ్డర్ సిస్టమ్, 300 ఎంఎం ఓడీ బేరింగ్‌లు ఉన్న ఆరు చక్రాలను అడుగు భాగంలో అమర్చేలా కొత్త గేట్లను సీడబ్ల్యూసీ ఖరారు చేసింది. ఈ డిజైన్ ప్రకారమే డ్యాం 33 గేట్లు ఉండాలని స్పష్టం చేస్తూ తుంగభద్ర బోర్డుకు సీడబ్ల్యూసీ డైరెక్టర్ (గేట్ల డిజైన్ డైరెక్టరేట్) అమిత్ రంజన్ లేఖ రాశారు. డిజైన్‌కు సంబంధించి సందేహాలుంటే తమను సంప్రదించాలని సూచించారు.

తుంగభద్ర డ్యాంకు ఆగస్టు 10న ఆకస్మికంగా భారీ వరద రావడంతో ఆ ఉద్ధృతికి బలహీనంగా ఉన్న 19వ గేటు కొట్టుకొనిపోయింది. అనంతరం డ్యాంను తనిఖీ చేసి భద్రత చర్యలపై నివేదిక ఇవ్వాలని సీడబ్ల్యూసీని కర్ణాటక ప్రభుత్వం కోరింది. దాంతో ఏకే బజాజ్ నేతృత్వంలోని నిపుణుల కమిటీతో డ్యాంను సీడబ్ల్యూసీ తనిఖీ చేయించింది. ఆ కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగా.. గేట్ల కాల పరిమితి 45 ఏళ్లేనని, కానీ తుంగభద్ర డ్యాం గేట్లు 70 ఏళ్ల క్రితం ఏర్పాటుచేసినవని, దీంతో బలహీనంగా మారడం వల్లే 19వ గేటు కొట్టుకుపోయిందని సీడబ్ల్యూసీ తేల్చింది. ఆ గేట్లన్నీ మార్చాల్సిందేనని, సులభంగా ఎత్తడానికి, దించడానికి వీలుగా కొత్త గేట్లను ఏర్పాటు చేయాలని సూచించింది. ఈ నేపథ్యంలోనే కొత్త గేట్ల డిజైన్‌ను రూపొందించింది.

తిరుపతిలో అక్రమ మద్యం విక్రేతల అరెస్ట్

తిరుపతి క్రైం: తిరుపతి లీలామహల్ సమీపంలోని మధురానగర్‌ను కేంద్రంగా చేసుకుని అక్రమ మద్యం విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను ఎక్సైజ్ పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. వారినుంచి సుమారు రూ.1.28 లక్షల విలువైన 109 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్టు ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ విజయ్‌శేఖర్ వెల్లడించారు. ఢిల్లీ నుంచి ప్రీమియం బ్రాండ్ మద్యం కొనుగోలు చేసి తిరుపతిలో విక్రయిస్తున్నట్టు చెప్పారు. ఢిల్లీకి చెందిన గజేంద్రశర్మ, స్థానికంగా కూల్‌డ్రింక్ షాపు నిర్వహించే బాబు అనే ఇద్దరిని అరెస్ట్ చేశామన్నారు.

పింఛన్ రాలేదన్న ఆందోళనతో ప్రాణాలు విడిచింది

- అవ్వ వేలిముద్ర పడలేదని పింఛన్ ఇవ్వని అధికారులు
- పది రోజులైనా నగదు అందకపోవడంతో ఆందోళన చెంది మృత్యువాత
- ప్రకాశం జిల్లాలో ఘటన



మృతిచెందిన పిల్లి మంగమ్మ

పొన్నలూరు: పింఛన్ నగదు కోసం పది రోజులుగా ఎదురు చూసిన వృద్ధురాలు చివరకు మనోవేదనతో ప్రాణాలు విడిచింది. ప్రకాశం జిల్లా పొన్నలూరు మండలం రాజోలుపాడు పంచాయతీ కొత్తపాలెంలో ఈ విషాదం జరిగింది. గ్రామానికి చెందిన పిల్లి మంగమ్మ(84) గత 12 ఏళ్లగా ఎలాంటి ఆటంకం లేకుండా పింఛన్ నగదు తీసుకుంటోంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో వలంటీర్ల ద్వారా ప్రతి నెలా మొదటి రోజే ఇంటి వద్దే మంగమ్మ పింఛన్ అందుకుంది. అయితే, టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చాక వలంటీర్లను తొలగించి స్థానిక పంచాయతీ అధికారులతో పింఛన్ నగదు అందిస్తున్నారు. లబ్ధిదారులను ఒక చోటుకు పిలిచి పింఛన్లు ఇస్తున్నారు. దీంతో వృద్ధులు, వికలాంగులు, అనారోగ్యంతో ఉన్న వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నెల 2వ తేదీన సచివాలయ వెటర్నరీ అసిస్టెంట్..మంగమ్మ చేతి వేలిముద్రలు, ఐరిస్ పడకపోవడంతో పింఛన్ ఇవ్వలేదు. వెల్ఫేర్ అసిస్టెంట్ వచ్చి ఇస్తాడని చెప్పి వెళ్లిపోయాడు. గత ఫిబ్రవరి నెలలో కూడా మంగమ్మ వేలిముద్ర వేసి పింఛన్ తీసుకుంది. కానీ, మార్చి నెలలో వేలిముద్ర, ఐరిస్ తీసుకోవడం లేదని పింఛన్ ఇవ్వలేదు. వాస్తవానికి లబ్ధిదారుని వేలిముద్ర, ఐరిస్ తీసుకోకపోతే ఆర్‌బీఐఎస్ ఆన్‌లైన్ పద్ధతి ద్వారా పింఛన్ నగదు అందజేయాలి. కానీ, రోజులు గడుస్తున్నా పింఛన్ నగదు ఇవ్వకపోవడంతో కుటుంబ సభ్యులు, గ్రామస్తులకు చెప్పుకొంటూ వారం రోజులుగా బాధపడుతోంది. అధికారుల తీరుతో మనోవేదనకు గురైన మంగమ్మ.. గురువారం ప్రాణాలు విడిచిందని కుటుంబ సభ్యులు చెప్పారు. దీనిపై మంగమ్మ కుటుంబ సభ్యులు, గ్రామస్తులు సచివాలయ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై ఎంపీడీవో సుజాతను వివరణ కోరగా.. విచారించి తగు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ఓ మాస్టారు గుంజీలు తీయగా.. మరో సార్ బెత్తంతో కొట్టుకున్నారు!

- విద్యార్థులు మాట వినడం లేదంటూ ఉపాధ్యాయుల ఆవేదన
- పిల్లల ఎదుటే స్వీయ దండన



గుంజీలు తీస్తున్న రమణ మాస్టారు




బెత్తంతో దెబ్బలు కొట్టుకుంటున్న విజయమోహనరావు మాస్టారు

బొబ్బిలి : విద్యార్థులు మాట వినడం లేదని ఓ ఉపాధ్యాయుడు గుంజీలు తీయగా, మరో ఉపాధ్యాయుడు బెత్తంతో తనను తానే కొట్టుకున్నాడు. విజయనగరం జిల్లా బొబ్బిలి నియోజకవర్గం పెంట, నందబలగ జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో గురువారం ఈ ఘటనలు జరిగాయి. బొబ్బిలి మండలం పెంట గ్రామ జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల మాట వినడం లేదు. విద్యా ప్రమాణాలు దిగజారి పోతున్నాయంటూ హెచ్‌ఎం రమణ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం ఉదయం పాఠశాల ప్రార్థన సమయంలో 'ఉపాధ్యాయులమైనా మిమ్మల్ని కొట్టలేం, తిట్టలేం! అసలేమీ చేయలేం! రెండు చేతులూ కట్టుకుని మీ ఎదురుగా ఇలా ఉండాల్సిన పరిస్థితి మాకు వచ్చింది. క్రమశిక్షణలోనూ, చదువులోనూ మేం చెప్పిన విషయాలను వినడం లేదు. ఎన్ని సార్లు చెప్పినా మీ చదువులో, ప్రవర్తనలో మార్పు లేదు. అసలేంటి సమస్య? మీలో ఉందా, మాలో ఉందా? మాదైతే చెప్పండి! గుంజీలు తీస్తాం.. అంటూ విద్యార్థుల ఎదురుగానే గుంజీలు తీయడం ప్రారంభించారు. మాస్టారు గుంజీలు తీస్తున్నంత సేపూ విద్యార్థులు వద్దు సార్.. అంటూ అరుస్తూనే ఉన్నారు. దాదాపు అలసిపోయేంత వరకూ గుంజీలు తీశారు. ఇదిలా ఉండగా.. తెర్లాం మండలం నందబలగ జెడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు మింది విజయమోహనరావు కూడా ఇలాంటి శిక్షే వేసుకున్నారు. ఎంత చెబుతున్నా విద్యార్థులు మాట వినడం లేదని బాధపడుతూ తరగతి గదిలో విద్యార్థుల ముందే తన చేతిపై తానే బెత్తంతో కొట్టుకున్నారు.

ఓ మాస్టారు గుంజీలు తీయగా.. మరో సార్ బెత్తంతో కొట్టుకున్నారు.. వీడియో కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

పెట్రోల్, డీజిల్ నిక్షేపాల వెలికితీతకు ట్రయల్ రన్

శాటిలైట్ ద్వారా నిర్ధారించిన పాయింట్లలో బోరుబావుల తవ్వకాలు



లింగాలలో బోర్లు తవ్వుతున్న ట్రాక్టర్, బోరు బండ్లు

లింగాల: వైఎస్సార్ జిల్లా లింగాల మండలంలో డీజిల్, పెట్రోలు నిక్షేపాలను కనుగొనేందుకు బోరుబావుల తవ్వకాల ద్వారా ట్రయల్ రన్ ప్రారంభించారు. శాటిలైట్ ద్వారా నిర్ధారించిన పాయింట్లలో ఈ తవ్వకాలకు నాలుగు రోజుల క్రితం శ్రీకారం చుట్టారు. సుమారు 80–200 అడుగుల లోతు వరకు ఈ బోరుబావులను తవ్వుతున్నారు. ఆ తర్వాత వాటి అడుగు భాగంలో డైనమైట్లు, జిలెటిన్ స్టిక్స్, మందుగుండు సామాగ్రి పంపి పేలుస్తున్నారు. అనంతరం పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ పేలుళ్లవల్ల చుట్టుపక్కల వ్యవసాయ బోరుబావులకు భవిష్యత్‌లో ఇబ్బందులు తలెత్తుతాయేమోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. మరోవైపు.. రైతుల అనుమతుల్లేకుండా వారి పంట పొలాల్లో ఈ కార్యక్రమం చేపట్టారు. ఉదా.. లింగాల మండల కేంద్రంలోని ఎ.వి. శ్రీనివాసరెడ్డి పొలంలో అనుమతిలేకుండా తొమ్మిది బోరు బావులు తవ్వారు. జిల్లా కలెక్టర్ అనుమతులతో ఓఎన్‌జీసీ సంస్థ బోరుబావులు తవ్వుతోందని తహసీల్దార్ ఈశ్వరయ్య తెలిపారు. రెండ్రోజుల క్రితం కలెక్టర్ ఇచ్చిన అనుమతుల కాపీని తనకు అందించారన్నారు. ఇక ముదిగుబ్బ నుంచి జమ్మలమడుగు వరకు బోరుబావుల తవ్వకాల కాంట్రాక్టును బీజేపీ ఎంపీ సీఎం రమేష్ సోదరుడు సురేష్ పొందినట్లు సమాచారం.

హోలీ స్పెషల్



అమ్మ శ్రమలో ఎన్ని రంగులో!

ఉదయాన్నే అమ్మ వేసే ముగ్గు రంగు తెలుపు. చల్లే కళ్లాపి ఆకుపచ్చ.
గడపకు రాయాల్సింది పసుపు. నాన్నకు పెట్టాలి గోధుమ రంగు టీ.
బాబు షూస్ పాలిష్ చేయాలి కదా నల్లగా. పాపాయికి కట్టాలి ఎర్ర రిబ్బన్.
బట్టల సబ్బు రంగు నీలం. వంట గది నిండా మెటాలిక్ కలర్ పాత్రలే.
కాటుక, తిలకం కంటే ముందు అమ్మకు అంటేది శ్రమ తాలూకు రంగులే.
లోకానికి ఒకటే హోలీ. అమ్మకు నిత్యం హోలీ.
నేడు అమ్మకే చెప్పాలి రంగు రంగుల కృతజ్ఞత.

ప్రతి ఒక్కరి జీవితంలో రంగు రంగుల కలలు ఉంటాయి. అయితే స్త్రీలు ఆ రంగుల కలలను అందుకోవడంలో కొన్ని అడ్డంకులు ఉంటాయి. పరిమితులు ఎదురవుతాయి. వారు ఈ రంగులకు మాత్రమే అర్హులు అనే కనిపించని నియమాలు ఉంటాయి. పరిస్థితి చాలా మారినా స్త్రీ ఏదో ఒకదశలో రాజీ పడాలి. అయితే భారతీయ స్త్రీ ఆ రాజీని ఇష్టంగానే స్వీకరిస్తుంది. ముఖ్యంగా వివాహం అయ్యాక, తల్లిగా మారాక తాను కన్న రంగుల కలలన్నీ తన సంతానానికి ఇచ్చేస్తుంది. భర్త, పిల్లల సంతోషంలో తన సంతోషం వెతుక్కుంటుంది. వారి కేరింగ్ కోసం రోజూ అంతులేని శ్రమ చేస్తుంది. ఆ పనుల్లోనే ఆమెకు రంగుల ప్రపంచం తెలియకుండానే ఎదురవుతుంటుంది. అమ్మకు రంగులు తోడవుతాయి. అవి ఆమెను అంతో ఇంతో ఉత్సాహ పరచడానికి ప్రయత్నిస్తాయి. కావాలంటే గమనించండి.

అమ్మ శ్రమలో తెలుపు రంగు అడుగడుగునా ఉంది. ఆమె నిద్ర లేవడమే పాలు పోయించుకోవాలి. ముగ్గు వేయాలి. పిల్లలకు స్కూలుకు సిద్ధం చేసి తెల్లటి పౌడర్ రాయాలి. వెన్న కంటే తెల్లనైన ఇడ్లీల కోసం రాత్రే పిండి గ్రైండర్‌లో వేసుకోవాలి. తెల్ల యూనిఫామ్ ఉతికి సిద్ధం చేయాలి. తెల్లటి ఉప్పు, పంచదార తాకకుండా ఆమెకు జీవితం గడవదు. మునివేళ్లకు ఆ తెల్లరంగు పదార్థాలు తాకుతూనే ఉంటాయి. ఎండలో వడియాలూ? టెంకాయ తెచ్చి పగులగొట్టి కొబ్బరి తీయడం ఆమెకు గాక ఇంటిలో ఎవరికీ రాదు. రాత్రిళ్లు అత్తామామలకు పుల్కాల కోసం ఆశీర్వాద్ ఆటాతో చేతులు తెల్లగా చేసుకోవాలి. ఆమే అన్నపూర్ణ. తెల్లటి అన్నం ఆమె చేతి పుణ్యం. ఆ వెంటనే ఆమెకు ఆకుపచ్చ ఎక్కువగా కనపడుతుంటుంది. కూరగాయలన్నీ ఆ రంగువే. ఇంట్లో మొక్కలకు ఆమే నీరు పోయాలి. ఆకుపచ్చ డిష్ వాషర్‌ను అరగదీసి గిన్నెలు కడిగి కడిగి చేతులు అరగదీసుకోవాలి. హెల్త్ కాన్షియస్‌నెస్ ఉన్న భర్త రోజూ ఆకుకూరలు ఉండాల్సిందే అంటాడుగాని పొన్నగంటి కూరో, కొయ్య తోటకూరో ఆకులు తుంచి కవర్‌లో వేయమంటే వేయడు. చేస్తే తప్ప ఆ పని ఎంత పనో తెలియదు.

ఎరుపు రంగు అమ్మ పనిలో భాగం. ఇంటికి ఆమె ఎర్రటి జాజుపూతను అలుకుతూ ఉంటే వాకిలి నిండా మోదుగుపూలు రాలినట్లు అనిపిస్తుంది. అమ్మ ఉదయాన్నే స్నానం చేసి, దేవుడి పటాల ముందు నిలిచి అరుణ కిరణం లాంటి ఎర్రటి కుంకుమను వేలికొసతో అందుకొని, నుదుటి మీద దిద్దుకొని, దీపం వెలిగించాకే దేవుడు ఆవులిస్తూ నిద్రలేచేది. అమ్మ మునివేళ్ల మహిమకు సూర్యుడు కూడా ఆమె పాపిట్లో సిందూరమై ఒదిగిపోతాడు. ఎర్రటి ఆవకాయలు, పచ్చళ్ల చేతులను మంట పుట్టించినా అమ్మ చిర్నవ్వు నవ్వుతూనే ఉంటుంది. ఆమె చేయి కోసిన టొమాటోలు ఎన్ని వేలో కదా.

పసుపు
ఇంటికీ, అమ్మకూ శుభకరం.
పిల్లలకు చిన్న దెబ్బ తగిలినా పసుపు డబ్బా తీసుకుని అమ్మ పరిగెడుతుంది. తీరిక ఉన్నప్పుడు గడపలకు రాస్తుంది. తను తాగినా తాగకపోయినా పిల్లలకు పాలలో కలిపి ఇస్తుంది. ఇక బ్లూ కలర్ అమ్మకే అంకితం. గ్యాస్ స్టవ్ మీద నీలం రంగు మంట ఆమెను ఎప్పటికీ వదలదు. ఇక జీవితాంతం బట్టల సబ్బు, సర్ఫ్‌ను వాడుతూ బట్టలు శుభ్రం చేయడమో చేయించడమో చేస్తూనే ఉండాలి. కనీసం హార్పిక్ వేసి టాయిలెట్లు కడగరు ఇంటి సభ్యులు. అదీ అమ్మ చాకిరే. నీలి మందు వేసి తెల్లవి తళతళలాడించడం, ఇస్త్రీ చేయించడం ఆమెకు తప్పదు. బట్టల హోమ్‌వర్క్‌లు చేయిస్తే బాల్‌పాయింట్ పెన్నుల నీలి గుర్తులు ఆమె చేతుల మీద కనిపిస్తాయి. ఇక నలుపు ఆమెకు ఏం తక్కువ. బూజు నుంచి అంట్ల మసి వరకు ఆమెకు ఎదురుపడుతూనే ఉంటుంది.

అయితే అమ్మకు తనకంటూ కొన్ని రంగులు ఇష్టం. గోరింట పండితే వచ్చే ఎరుపు ఇష్టం.. మల్లెల తెలుపు ఇష్టం... తన ఒంటిపై మెరిసే నగల బంగారు వర్ణం ఇష్టం, మట్టి గాజుల రంగులు ఇష్టం, పట్టీల వెండి వర్ణం ఇష్టం, గోర్ల రంగులు ఇష్టం, కురుల నల్ల రంగు ఇష్టం, తాంబూలపు ఎరుపు ఇష్టం, కొద్దిగా మొహమాట పడినా లిప్‌స్టిక్ రంగులూ ఇష్టమే.

ఇవాళ హోలీ. కనీసం ఇవాళ అయినా అమ్మకు విశ్రాంతినిచ్చి ఆమెకు ఇష్టమైన రంగుల్లో ఇష్టమైన బహుమతులు ఇచ్చి థ్యాంక్స్ చెప్పండి.

భువిపై విరిసే ఇంద్రధనుస్సు

ఇంద్ర ధనుస్సు నేలకు దిగి వచ్చిందా... అనిపించే రోజు హోలీ.
సప్తవర్ణాలలో ఒక్కొక్కరికి ఒక్కో ప్రత్యేకమైన ఇష్టం ఉంటుంది.
ఆ ఇష్టాన్ని తమ డ్రెస్సుల ద్వారా చూపుతుంటారు.
సినిమా తెరపైన రంగు రంగుల దుస్తుల్లో కనిపించే
తారలు తమకు ప్రత్యేకించి ఇష్టమైన రంగు గురించి
ఈ హోలీ సందర్భంగా మనతో పంచుకుంటున్నారు.



గ్రీన్ అండ్ పర్పుల్

నాకు చాలా ఇష్టమైనది ఎల్లో. దీనిలోనే మరింత బ్రైట్‌గా ఉండే డ్రెస్సులను ఎంచుకుంటాను. దీంతో పాటు పర్పుల్, బ్లూ, గ్రీన్ కలర్స్ ఇష్టపడతాను. ఈ రంగులోనే పీచ్ కలర్ డ్రెస్సులు ధరించినప్పుడు ఉల్లాసంగా అనిపిస్తుంది. అవి నన్ను ప్రత్యేకంగా చూపుతాయి అనే భావన ఉంటుంది

- రెజీనా కసండ్రా



మల్టీ కలర్స్

నా జీవితంలో ఇంద్ర ధనస్సు రంగులన్నీ ఉండాలనుకుంటాను. ఎందుకంటే, మనలోని భావోద్వేగాలను తెలియజేస్తేవే రంగులు. సప్తవర్ణాలన్నీ నాకు ఇష్టమైనవే. అందుకే నా డ్రెస్సులలో మల్టీ కలర్స్ ఉండేలా ప్లాన్ చేసుకుంటాను. ఒక ప్లెయిన్ కలర్ శారీ లేదా డ్రెస్ వేసుకుంటే దాని మీదకు మల్టీకలర్ బ్లౌజ్, దుపట్టా ఉండేలా చూసుకుంటాను.

- సంయుక్త మీనన్



బ్లూ అండ్ పింక్

నాకు నచ్చిన రంగు పింక్. పెరుగుతున్న కొద్దీ అన్ని రంగులు నచ్చుతుంటాయి. కానీ, ఎక్కువ భాగం అయితే పింక్, బ్లూ కలర్స్ నా డ్రెస్సింగ్‌లోనూ చోటు చేసుకుంటుంటాయి.

- శివాత్మిక రాజశేఖర్



అన్ని రంగులను స్వాగతించే తెలుపు

నాకు తెలుపు రంగు చాలా ఇష్టం. శాంతి, కొత్త ప్రారంభాలు, అంతులేని అవకాశాలకు చిహ్నం తెలుపు. రంగులతో నింపుకోవడానికి వేచి ఉండే ఖాళీ కాన్వాస్ లాంటిది తెలుపు. ఇది అన్నింటినీ స్వాగతించే రంగు. అందుకే ఈ రంగు నాకు స్ఫూర్తిమంతమైనది కూడా. ప్రేమ, దయ, ఆనందాన్ని వ్యాప్తి చేసే ఈ వేడుక సందర్భంగా తెల్లని మన హృదయాలపైన అందమైన రంగులను చిలకరించుకుందాం.

- వైష్ణవి చైతన్య

హోలీ పండగ అంటే రంగులే కాదు జానపద సరాగాలు కూడా. 'హోలీ హోలీల రంగ హోలీ చెమ్మకేళీల హోలీ' 'కాముడొచ్చిందు వలలో... కందులెయ్యండీ వలలో'... ఎన్నెన్ని జానపదాలో! హోలీ అంటే వర్ణ వర్ణ సంబరమే కాదు... పురాణాల దగ్గరకు తీసుకువెళ్లే ద్వారం. హోలీ అంటే... బృందావనంలో రాధ ముఖానికి కృష్ణుడు రంగు పూసి, ఆకాశంలో ఇంద్రధనస్సును పూయించిన రోజు. ఆకాశమంత ప్రేమను వర్ణరాగాలతో చెప్పిన రోజు. హోలీ అంటే... మంచికి ఉన్న మహత్తర శక్తి ఏమిటో చెప్పిన రోజు. కొండంత హోలిక పిడికెడు బూడిదగా మారి... చెడుపై మంచి విజయాన్ని మళ్లీ మళ్లీ గుర్తు తెచ్చే రోజు. వసంత కాల అందాలతో అల్లరిగా పల్లవించి అద్భుతమైన రోజు....

కలర్స్ ఎంపిక ఎందుకంటే!



నవ్యశ్రీ మండవ,
ఫ్యాషన్ డిజైనర్,
హైదరాబాద్

ప్రతి ఒక్కరికి కొన్ని రంగులు అంటే ప్రత్యేకమైన ఇష్టం ఉంటుంది. అయితే, దుస్తుల విషయంలో మాత్రం కొన్ని రంగులు మాత్రమే వారి శరీరానికి నప్పే విధంగా ఉంటాయి. ఏ రంగు డ్రెస్ ఎవరికి నప్పుతుందంటే...

సాధారణంగా చీరలు ఎంపిక చేసుకుంటున్నప్పుడు వాటిని మన మీద వేసుకొని, కలర్ బాగుంటుందా లేదా అని ఒకటికి రెండుసార్లు చెక్ చేసుకొని తీసుకుంటుంటాం.

- కొంత మంది చర్మం ఫెయిర్‌గా ఉంటుంది. కానీ, డార్క్ కలర్స్ సెట్ అవవు. అలాంటప్పుడు లైట్ షేడ్స్ లేదా మల్టీ కలర్స్‌ని ఎంపిక చేసుకోవచ్చు. వీరు సేమ్ స్కిన్ టోన్ కలర్ డ్రెస్సులు ఈవెనింగ్ పార్టీలకు ధరిస్తే మరింత ఆకర్షణీయంగా కనిపిస్తారు
- డార్క్ స్కిన్ ఉన్నవారికి లేత రంగులు బాగుంటాయి అనుకుంటారు. కానీ, వీరికి డార్క్ కలర్స్ బాగుంటాటాయి
- తమకు నప్పే కలర్ డ్రెస్ ఎంపికకు డిజైనర్ సలహాలు తీసుకుంటారు. అలాంటి వారికి కలర్ కాన్సెప్ట్ గురించి వివరిస్తాం. వారి శరీర రంగు, సందర్భం, పార్టీ .. ఇవన్నీ పరిగణనలోకి తీసుకొని డిజైన్ చేస్తాం.

రీ యూజ్... • రంగులు చల్లుకున్నాక వేసుకున్న డ్రెస్ మల్టీకలర్‌తో నిండిపోతుంది. ఆ డ్రెస్ పైన ఏ కలర్ భాగం ఎక్కువుందో చూసుకొని, ఆ రంగుతో డైయింగ్ చేయించి, తిరిగి వాడుకోవచ్చు.



రంగుల సంబరం

వర్చువల్ హోలి



హోలి అంటే యువతరం పండగ. ఆనందం ఆకాశాన్ని అంటే పండగ. దీన్ని దృష్టిలో పెట్టుకొని వర్చువల్ హోలిని ముందుకు తెచ్చాయి శాంసంగ్,స్నాప్‌చాట్. సాంకేతికతకు, సంప్రదాయాన్ని జోడిస్తూ హోలి వేడుకలకు కొత్త రంగు జోడించాయి శాంసంగ్, స్నాప్‌చాట్ సంస్థలు. ఏఐ ఆధారిత ఏఆర్ లెన్స్‌తో హోలీ వేడుకలకు డిజిటల్ రంగును జోడించాయి. ఇంటరాక్టివ్ ఫేస్–పెయింటింగ్ ఎఫెక్ట్ ద్వారా హోలీ రంగులు వర్చువల్‌గా అనుభవంలోకి వస్తాయి. ఫైనల్ స్క్రీన్ డిస్‌ప్లేలో 'హోలి మెసేజ్' కనువిందు చేస్తుంది. '77 శాతం మంది హోలి వేడుకలను సృజనాత్మకంగా, కొత్తగా జరుపుకోవడానికి ఇష్టపడుతున్నారు. ఈ నేపథ్యంలోనే వారు ఏఆర్ లెన్స్‌లను ఇష్టపడుతున్నారు' అంటుంది స్నాప్ ఇంక్ ఇండియా అడ్వర్‌టైజింగ్ హెడ్ నేహా జోలి. 'ప్రతి సంవత్సరం మా ఫ్రెండ్స్‌తో కలిపి హోలి బాగా ఆడేవాడిని. వారు విదేశాల్లో ఉండడం వల్ల ఆ సంతోషాన్ని మిస్ అవుతున్నాను' అని ఇక ముందు బాధ పడనక్కర్లేదు. ఫ్రెండ్స్ ఆ మూల ఒకరు ఈ మూల ఒకరు ఉన్నా సరే, వర్చువల్ హోలి పుణ్యమా అని పండగ సంతోషాన్ని సొంతం చేసుకోవచ్చు. వర్చువల్ హోలి పార్టీలు ఇప్పుడు ట్రెండ్‌గా మారాయి!

నలభై రోజుల హోలీ!

- ఉత్తరాఖండ్‌లో హోలీని 'కుమావోనీ' హోలీగా జరుపుకుంటారు. ఇది బసంత్ పంచమితో ప్రారంభమయ్యే నెలరోజుల ఉత్సవం. దీన్ని బైతక్ హోలీ, నిర్వాన్ హోలీ అని కూడా పిలుస్తారు
- శివుడు కొలువు తీరిన వారణాసిలో శ్మశానంలో దొరికే బూడిదతో హోలీ వేడుకలు జరుపుకుంటారు. ఈ హోలిని 'మసన్ హోలీ' అని పిలుస్తారు
- రాజస్థాన్‌లోని జోథ్‌పూర్‌లో చారిత్రాత్మకమైన 'ఘన్‌శ్యామ్ జీ మందిర్' ప్రాంతంలో హోలీ ఉత్సవాన్ని 40 రోజుల పాటు జరుపుకుంటారు. ఈ హోలీ ఉత్సవాలను చూడడానికి స్థానికులే కాదు విదేశీయులు కూడా వస్తారు. ఈ ఆలయాన్ని 1718లో నిర్మించారు
- పండగకి రెండు రోజుల ముందే ఉత్తర్‌ప్రదేశ్‌లోని బృందావన్‌లో వితంతువులు హోలీ వేడుకలు మొదలుపెడతారు
- ఉత్తర్‌ప్రదేశ్‌లో 'లాత్మార్ హోలీ' వేడుకలు జరుగుతాయి. పురుషులను కర్రలతో తరుముతూ, వారిని రెచ్చగొట్టేలా మహిళలు పాటలు పాడతారు
- హోలీని మన దేశంలోనే కాదు నేపాల్, శ్రీలంకలాంటి దేశాల్లోనూ జరుపుకుంటారు. నేపాల్‌లో 'ఫోటే ఉత్సవ్' అని, శ్రీలంకలో 'పులంగి' అనీ పిలుస్తారు.

హోలీ... అరవై వేల కోట్ల వ్యాపారం!

గత ఏడాదితో పోల్చితే 20 శాతం వృద్ధితో ఈ సంవత్సరం హోలీ పండగకు సంబంధించి రూ.60,000 కోట్ల వ్యాపారం జరుగుతుందని అంచనా. మూలికరంగులు, పండగ వస్తువులు, స్వీట్లు, వాటర్ గన్స్, బెలూన్లు, వైట్ టీ–షర్ట్‌లు, కుర్తా–పైజామాలు, హ్యాపీ హోలి స్లోగన్‌లతో ఉన్న టీ–షర్ట్‌లు... మొదలైన వాటికి పెరిగిన డిమాండ్ దేశవ్యాప్తంగా హోలీ పండగ వాణిజ్యాన్ని పెంచింది. ఈ డిమాండ్ రిటైలర్‌లు, చిన్న వ్యాపారులకు గణనీయంగా ప్రయోజనం చేకూరుస్తుందని కాన్ఫెడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా ట్రేడర్స్(సిఎఐటి) తెలియజేసింది.

'రంగుల' రాట్నం

- పురాతన కాలంలో గ్రీస్‌లో 'నీలం' రంగుకు నేరుగా సరిపోయే పదం లేదు. దగ్గరి వర్ణనలు మాత్రమే ఉండేవి
- ఆఫ్రికా ఎడారి తెగ ప్రజలు 'ఎరుపు' వర్ణాన్ని ఆరు పేర్లతో పిలుస్తారు
- పురాతన కాలంలో ఈజిప్షియన్‌లు, మాయన్‌లు వేడుకలలో తమ ముఖానికి ఎరుపు రంగు పూసుకోవడం తప్పనిసరిగా ఉండేది. రోమన్ సైన్యాధిపతులు తమ విజయాలను సెలబ్రేట్ చేసుకోవడానికి శరీరానికి ఎరుపురంగు వేసుకునేవారు
- కలర్ అసోసియేషన్‌ల ద్వారా వ్యక్తిత్వ లోపాలను నిర్ధారించేవాడు... డాక్టర్ మాక్స్ లుషర్.
- వన్స్ అపాన్ ఏ టైమ్ రోమన్‌ల కాలంలో క్యారెట్‌లు ఉదా, తెలుపు రంగులలో ఉండేవి. మధ్య యుగాలలో నలుపు, ఆకుపచ్చ రంగులలో కూడా ఉండేవి
- కలర్ మ్యాజిక్ వర్డ్స్: సెలాడాన్–లేత ఆకుపచ్చ రంగు, ల్యూటీయన్–డీప్ ఆరెంజ్, కెర్మెస్–ప్రకాశవంతమైన ఎరుపు, సినోపర్–ముదురు ఎరుపు–గోధుమ రంగు, స్మాల్ట్–డీప్ బ్లూ.

71 సంవత్సరాల సినీ హోలీ పాట!

తెలుగు సినిమా పాటల్లో హోలీ సంబరం కనిపిస్తుంది. మచ్చుకు కొన్ని పాటలు...

- మణిరత్నం–కమల్ హాసన్ 'నాయకుడు' సినిమాలోని హోలీ పాట 'సందె పొద్దు మేఘం పూలజల్లు కురిసెను నేడు' ప్రతి హోలీ సందర్భంగా ఎక్కడో ఒకచోట వినిపిస్తూనే ఉంటుంది
- జూనియర్ ఎన్టీఆర్ సినిమా 'రాఖీ'లో 'రంగ్ బర్‌సే' హోలీ పాట బాగా పాపులర్
- నాగార్జున 'మాస్' సినిమాలోని 'రంగు తీసి కొట్టు' హోలీ పండగ రోజున చెవిన పడాల్సిందే
- వెంకటేష్ 'జెమిని'లో 'దిల్ దివానా... మై హసీనా' హోలీ నేపథ్యంలో వినిపిస్తుంది
- 71 సంవత్సరాల హోలీ సాంగ్... ప్రణయ విలాసములే. శివాజీ గణేశన్ సినిమా 'మనోహర' సినిమాలోనిది ఈ పాట.

పురాణాల్లో హోలీ

కృతయుగంలో రఘునాథుడనే సూర్యవంశపు రాజు ఉండేవాడు. పసిపిల్లలను 'హోలిక' అనే రాక్షసి హింసిస్తోందని ప్రజలు రాజుకు విన్నవించుకున్నారు. అదే సభలో ఉన్న నారద మహాముని 'ప్రతి సంవత్సరం ఫాల్గుణ పౌర్ణమినాడు హోలికను పూజించిన పసిపిల్లలకు బాధలు ఉండవు' అని చెప్పాడు. ఆనాటి నుంచి ఈ హోలీ ఉత్సవం జరుగుతోందని ప్రతీతి.

కాముని పున్నం

శివుని భార్య సతీదేవి దక్ష ప్రజాప్రతి యజ్ఞంలో దేహాన్ని విసర్జింపగా శివుడు విరాగియై హిమవత్ పర్వతంపై తపస్సు చేయసాగాడు. రాక్షసుల బాధలు పడలేని దేవతలు తపస్సులో ఉన్న శివుడి దీక్షను విరమింపజేసేందుకు ప్రయత్నించారు. పార్వతిగా పుట్టిన సతీదేవిపై శివుడికి ప్రేమ కలిగించవలసిందిగా దేవతలు మన్మథుణ్ణి కోరారు. మన్మథుడు తన భార్య రతీదేవి మిత్రుడు వసంతుడితో కలిసి హిమవంతం చేరాడు. పార్వతీదేవి సపర్యలు చేస్తున్న సమయంలో శివుడిపై మన్మథుడు పుష్పబాణాలు ప్రయోగించాడు. తన దివ్యదృష్టితో కాముని చర్యలు గ్రహించిన శివుడు కోపంతో ముక్కంటితో దహించాడు. కాముడి రూపంలో ఉన్న మన్మథుడిని దహించి వేయడాన్ని 'కాముని దహనం' 'కాముని పున్నం'గా ఫాల్గుణ శుద్ధ పౌర్ణమి రోజున ప్రజలు పండుగ చేసుకుంటారు.

చెడు అంతానికి సంకేతం

వద్దని చెప్పినా శ్రీమహావిష్ణువునే స్మరిస్తున్న ప్రహ్లాదుడిని చంపాలని తన సోదరి హోలికను ఆదేశిస్తాడు హిరణ్యకశిపుడు. ప్రహ్లాదుడిని ఒడిలో కూర్చోబెట్టుకొని హోలిక మంటల్లో దూకుతుంది. విష్ణునామ స్మరణలో ఉన్న ప్రహ్లాదుడికి చీమ కుట్టినట్లు కూడా కాదు. హోలిక మాత్రం కాలి బూడిద అవుతుంది, ఆ బూడిదే చెడు అంతానికి సంకేతం.

– యంబ నర్సింహులు, సాక్షి, ప్రతినిధి, యాదాద్రి భువనగిరి

యువర్స్

● యంగ్ టాలెంట్



గెలుపు కెరటం

జల ప్రపంచంలో అలలే పాఠాలు. అలలే అరుదైన గురువులు. అలా ఎంతో మంది గురువుల దగ్గర ఎన్నో గెలుపు పాఠాలు నేర్చుకున్న నాగాయలంకకు చెందిన నాగిడి గాయత్రి వాటర్ స్పోర్ట్ 'కయాకింగ్'లో సత్తా చాటుతుంది. జాతీయ స్థాయిలో రాణిస్తోంది.

చేపల వేటలో తనకు తానే సాటి

నాగాయలంక కృష్ణానదిలో తండ్రి నాగబాబు సాగించే చేపల వేటలో గాయత్రి సాయపడుతూ ఉంటుంది. రాత్రి వేళల్లో సైతం తండ్రితో పాటు బోట్‌పై సాగర సంగమ ప్రాంతంలోకి వెళ్ళి చేపల వేటలో గాయత్రి తన నైపుణ్యం ప్రదర్శిస్తుంటుంది. వేటలో తలపండిన మత్స్యకారులు చేయలేని పనులను ఆమె సునాయాసంగా చక్కబెడుతుంది. మగవారితో దీటుగా పడవ నడుపుతూ అవసరమైన చోట లంగరు వేసేస్తుంటుంది. గాలం తాడు వేటలో గాలానికి రొయ్యను ఒడుపుగా గుచ్చడంలో ఆమెది అందె వేసిన చెయ్యి. నాగాయలంక రేవులో గాలానికి రొయ్య గుచ్చడంలో నలుగురైదుగురికే నైపుణ్యం ఉంటే వారిలో ఒకరు గాయత్రి కావడం విశేషం.

టార్గెట్ ఒలింపిక్స్

మా కుటుంబానికి చేపల వేటే జీవనాధారం. నాన్న ఎంతో కష్టపడి నాకు శిక్షణ ఇప్పించాడు. ఏపీ వాటర్ స్పోర్ట్స్ అసోసియేషన్ అడ్వయిజర్ తిప్పిరెడ్డి శివారెడ్డి ప్రోత్సాహం మర్చిపోలేనిది. మొదట్లో కోచ్‌లు శ్రీనివాస్, నాగబాబు, చినబాబు ఇచ్చిన శిక్షణ మెలకువలే నన్ను ఈ స్థాయికి తెచ్చాయి. ఎప్పటికైనా ఒలింపిక్స్ వాటర్ స్పోర్ట్స్‌లో పాల్గొని బంగారు పతకం సాధించాలన్నదే నా లక్ష్యం.

– నాగిడి గాయత్రి



సాగర సంగమ తీరం నాగాయలంకలో 'వాటర్ స్పోర్ట్స్ అకాడమీ' నెలకొల్పడంతో గ్రామీణప్రాంతాలకు అంతగా పరిచయం లేని కయాకింగ్–కెనోయింగ్ జలక్రీడలు దివిసీమ వాసులకు చేరువయ్యాయి.

కృష్ణా జిల్లా తీరప్రాంత నాగాయలంక గ్రామానికి చెందిన నాగిడి గాయత్రి 'వాటర్ స్పోర్ట్స్ అకాడమీ'లో శిక్షణ పొంది కయాకింగ్–కెనోయింగ్ జలక్రీడల్లో మెలకువలను ఒడిసి పట్టుకుంది. జల క్రీడలలో జాతీయ స్థాయిలో సత్తా చాటుతోంది.

మొదట నాటు పడవతోనే శిక్షణ పొందిన గాయత్రి 2022లో గుజరాత్‌లో జరిగిన 36వ జాతీయ స్థాయి కయాకింగ్ పోటీలలో 4వ స్థానంలో నిలిచి పతకాల బోణీ కొట్టింది.

గత సంవత్సరం మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో జరిగిన 5వ 'ఖేలో ఇండియా యూత్ గేమ్స్' కయాకింగ్ విభాగంలో జాతీయ స్థాయిలో రజత పతకం గెలుచుకుంది. గోవాలో జరిగిన నేషనల్ వాటర్ స్పోర్ట్స్ పోటీల్లో మరోసారి రజత పతకం గెలుచుకుంది.

గత నెల ఉత్తరాఖండ్‌లో జరిగిన 38వ కెనోయ్ స్లాలమ్–2025 నేషనల్స్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్‌కు జాతీయ స్థాయిలో బంగారు పతకం అందించి తన సత్తా చాటింది.

కయాకింగ్–కెనోయింగ్‌లోనే కాదు...కరాటే, థైక్వాండోలోనూ గాయత్రి ప్రతిభ చూపుతూ ఎన్నో పతకాలు సాధించింది. 2017లో ఢిల్లీలో జరిగిన 33వ నేషనల్ తైక్వాండో పోటీల్లో కాంస్య పతకం, 2021లో రాష్ట్ర స్థాయి రోయింగ్ పోటీల్లో బంగారు పతకం గెలుచుకుంది. ఇటీవల నాగాయలంక పర్యటించిన కృష్ణాజిల్లా కలెక్టర్ డికె బాలాజీ వాటర్ స్పోర్ట్స్‌లో గాయత్రి చూపుతున్న ప్రతిభను ప్రశంసించారు. ఆమెకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

'ఒలింపిక్స్‌లో పతకం సాధించడమే నా లక్ష్యం' అంటున్న ఇరవై సంవత్సరాల గాయత్రి కల నెరవేరాలనే ఆశిద్దాం.

– సింహాద్రి కృష్ణప్రసాద్, సాక్షి, నాగాయలంక

● టెక్... టాక్



మెటా గ్లాసెస్

తమ నెక్స్ట్–జెనరేషన్ గ్లాసెస్ అరియ జెన్ 2 గురించి ప్రకటించింది సోషల్ మీడియా దిగ్గజం మెటా. 'అరియ జెన్2 గ్లాసెస్‌కు సంబంధించి మా ప్రయాణంలో తదుపరి దశ గురించి ప్రకటించడానికి సంతోషిస్తున్నాం. మెషిన్ పర్సెప్షన్, కంటెక్ష్చువల్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, రోబోటిక్స్‌తో సహా పరిశోధన రంగాలలో కొత్త అవకాశాలకు ద్వారాలు తెరుస్తుంది' అని మెటా తన బ్లాగ్ పోస్ట్‌లో పేర్కొంది.



లెనోవా... సోలార్ పవర్డ్ ల్యాప్‌టాప్

మొబైల్ వరల్డ్ కాంగ్రెస్(ఎండబ్ల్యూసీ–2025)లో పర్సనల్ కంప్యూటింగ్‌లో కొత్త బెంచ్ మార్క్‌లను నెలకొల్పే వినూత్న పీసీ, ఏఐ ఆధారిత సాంకేతిక పరిజ్ఞానాన్ని లెనోవో ఆవిష్కరించింది.

యోగా సోలార్ పీసీ కాన్సెప్ట్, సోలార్–పవర్డ్ ల్యాప్‌టాప్, భిన్నమైన సందర్భాల కోసం ప్రత్యేకంగా కనిపించే ల్యాప్‌టాప్ స్క్రీన్‌లు ఇందులో ఉన్నాయి.

యోగా ప్రో 9ఐ ఆరా ఎడిషన్ అనేది క్రియేటర్‌ల కోసం నిర్మించిన 16 అంగుళాల పవర్ హౌజ్. ఇందులో ఇంటెల్ కోర్ అల్ట్రా ప్రాసెసర్,ఆర్‌టీఎక్స్ 5070 జీపీయు ఉన్నాయి. విజువల్ క్లారిటీని అందిస్తుంది. యూజర్‌ల అవసరాలకు అనుగుణంగా ఏఐ ఆధారిత ఫీచర్‌లు ఉంటాయి.

● అవును... ఇది నిజమే!

✓ 1917లో అర్జెంటీనాలో ఫుల్ లెంగ్త్ యానిమేటెడ్ ఫీచర్ ఫిల్మ్ తీశారు. 58,000 డ్రాయింగ్స్‌తో కూడిన 'ఎల్ అపోస్టోల్' అనే ఈ రాజకీయ వ్యంగ్య చిత్రం రన్ టైమ్...70 నిమిషాలు.

✓ 2002లో స్లోవేనియాలో 5,350 సంవత్సరాల కలప చక్రాన్ని కనుగొన్నారు. ఈ చక్రాన్ని మ్యూజియంలో భద్రపరిచారు.

✓ 0.05, 0.07 ఔన్సుల బరువు ఉండే బంబుల్బీ గబ్బిలం ప్రపంచంలోనే అతి చిన్న క్షీరదం. ఇవి థాయ్‌లాండ్‌లోని సున్నపు రాయి గుహల్లో కనిపిస్తాయి.



✓ భూగ్రహం ఉపరితలంలో ఎక్కువ భాగం(71 శాతం) నీటితో నిండి ఉంది. అయితే ఈ నీటిలో 0.007 శాతం మాత్రమే ఉపయోగించుకోగలుతున్నాం. ఎందుకంటే ఈ నీటిలో 2.5 శాతం మాత్రమే మంచి నీరు. అందులో ఒక శాతం మాత్రమే అందుబాటులో ఉంది.

ఆట మొదలైంది...

● గేమింగ్

యాక్షన్–అడ్వెంచర్ గేమ్ 'స్ప్లిట్ ఫిక్షన్' విడుదల అయింది. స్ప్లిట్ స్క్రీన్ కో ఆపరేటివ్ మల్టీప్లేయర్‌గా ఈ గేమ్‌ను రూపొందించారు. ఫలితంగా వేరే ప్లేయర్స్‌తో లోకల్, ఆన్‌లైన్ ప్లేలో ఆడవచ్చు. మియో, జోయి అనే రచయితలు ప్రధాన పాత్రలుగా ఉండే గేమ్ ఇది. మియో సైన్స్ ఫిక్షన్, జో ఫాంటసీ రచయితలు. ఈ ఇద్దరు ఎన్నో సవాళ్లను కలిసి కట్టుగా ఎదుర్కోవలసి ఉంటుంది. ఇద్దరూ ఒక దశలో డ్రాగన్‌లను కమాండ్ చేస్తూ, మరొక దశలో లేజర్ కత్తిని ఉపయోగిస్తారు. ప్రతి దశలో రెండు పాత్రల శక్తిసామర్థ్యాలు భిన్నంగా ఉంటాయి. ఇద్దరూ ఒకరికొకరు సహకరించుకోవడం తప్పనిసరి. ప్రతి దశలో సైడ్ స్టోరీలు ఉంటాయి.



ఇంజిన్: అన్‌రియల్ ఇంజిన్ 5

మోడ్స్: మల్టీప్లేయర్

జానర్స్: యాక్షన్–అడ్వెంచర్

ప్లాట్‌ఫామ్స్: మైక్రోసాఫ్ట్ విండోస్, ప్లేస్టేషన్ 5, ఎక్స్‌బాక్స్ సిరీస్ ఎక్స్/ఎస్


సాక్షి సినిమా



విజయ్ ఆంటోని నటించిన తాజా చిత్రం 'భద్రకాళి'. అరుణ్ ప్రభు దర్శకత్వంలో మీరా విజయ్ ఆంటోని సమర్పణలో విజయ్ ఆంటోని నిర్మించారు. గురువారం ఈ సినిమా టీజర్‌ను రిలీజ్ చేశారు. 'పిల్లి కూడా ఒక రోజు పులి అవును' అనే డైలాగ్‌తో ఈ టీజర్ ప్రారంభమైంది.

పిల్లి కూడా పులి అవును

''ఈ సినిమాలో విజయ్ ఆంటోని కిట్టు పాత్ర చేశారు. ఇంతకీ కిట్టు ఎవరు? ఫ్యామిలీమేనా? గ్యాంగ్‌స్టరా? ఉన్నతాధికారినా? ఈ విషయాలపై స్పష్టత రావాలంటే సినిమా చూడాలి.



● విజయ్

రూ. 190 కోట్ల కుంభకోణం చుట్టూ ఈ కథ తిరుగుతుంది. విజయ్ స్టైలిష్ యాక్షన్ హీరోగా కనిపిస్తారు. ఈ చిత్రానికి ఆయనే సంగీతం అందించారు. 'భద్రకాళి'ని త్వరలో రిలీజ్ చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం'' అని యూనిట్ పేర్కొంది.

కాన్స్ కాలింగ్

కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో పాల్గొనాలంటూ ఆలియా భట్‌కు కాల్ వచ్చింది. ఈ ఏడాది మే 13 నుంచి మే 24 వరకు ఫ్రాన్స్‌లో 78వ కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ జరగనుంది. ఈ చిత్రోత్సవాలకు ఆలియా భట్ హాజరు కానున్నారు. ఈ బ్యూటీ కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌కి వెళ్లడం ఇదే తొలిసారి కావడం విశేషం. ఇక తాను కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో పాల్గొననున్న విషయాన్ని ఆలియా భట్ ధృవీకరించారు. ఈ నెల 15న ఆమె బర్త్ డే సందర్భంగా ముంబైలో గురువారం జరిగిన ప్రీ బర్త్ డే సెలబ్రేషన్స్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆలియా భట్ మాట్లాడుతూ– ''నేను తొలిసారిగా కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో పాల్గొనబోతున్నందుకు చాలా హ్యాపీగా ఉంది. నా కాస్ట్యూమ్స్‌ను ప్రత్యేకంగా డిజైన్ చేయమని నా సిబ్బందికి చెప్పాను'' అన్నారు.



● ఆలియా

సప్తగిరి హీరోగా అభిలాష్ రెడ్డి గోపిడి దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'పెళ్లి కాని ప్రసాద్'. ప్రియాంకా శర్మ హీరోయిన్‌గా నటించారు. చాగంటి సినిమాటిక్ వరల్డ్ సమర్పణలో కేవై బాబు, భానుప్రకాశ్ గౌడ్, సుక్కా వెంకటేశ్వర్ గౌడ్, వైభవ్ రెడ్డి ముత్యాల నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 21న విడుదల కానుంది. నిర్మాత 'దిల్' రాజు శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ ఈ చిత్రాన్ని విడుదల చేస్తోంది. ''నాన్నా...

పెళ్లైన ప్రసాద్‌గా చేయమనీ...

34... 36..., నీకు ఏజ్‌తో పాటుగా వర్క్ ఎక్స్‌పీరియన్స్ కూడా పెరుగుతోంది కదా... దాన్నే చూపించి, ఎక్కువ కట్నం డిమాండ్ చేయవచ్చు నాన్నా..', 'ఈ పెళ్లి కాని ప్రసాద్‌ను కాస్త పెళ్లైన ప్రసాద్‌గా చేయమని... మిమ్మల్ని వేడుకుంటున్నాను స్వామి' అనే డైలాగ్స్ ట్రైలర్‌లో ఉన్నాయి.



● సప్తగిరి

''కోర్ట్' సినిమా నచ్చకపోతే, తాను హీరోగా నటించిన 'హిట్ 3' సినిమా చూడొద్దని నానిగారు వేదికపై మాట్లాడినప్పుడు మేం షాక్ అయ్యాం. కానీ నాని అలా అన్నారంటే.. 'కోర్ట్' సినిమాపై నమ్మకం ఉంది కాబట్టే అంత కాన్ఫిడెంట్‌గా చెప్పగలిగారు. పైగా రెండు (కోర్ట్, హిట్ 3) సినిమాలకూ నానియే ఓ నిర్మాత... సో ప్రాబ్లమ్ లేదు'' అని అన్నారు దీప్తి గంటా. ప్రియదర్శి ప్రధాన పాత్రలో, రోషన్, శ్రీదేవి, శివాజీ ఇతర ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'కోర్ట్: స్టేట్ వర్సెస్ ఎ నోబడీ'. రామ్ జగదీశ్ దర్శకత్వంలో వాల్ పోస్టర్ సినిమా పతాకంపై నాని సమర్పణలో ప్రశాంతి తిపిర్నేని నిర్మించిన ఈ చిత్రం నేడు (శుక్రవారం) విడుదలవుతోంది. ఈ చిత్రానికి నాని సోదరి దీప్తి గంటా సహనిర్మాత. కాగా ఈ సినిమా విడుదలకు రెండు రోజులు ముందుగానే ప్రీమియర్స్ ప్రదర్శించారు. ఈ సందర్భంగా గురువారం విలేకరుల సమావేశంలో ఈ ప్రశాంతి తిపిర్నేని, దీప్తి గంటా చెప్పిన విశేషాలు.



● దీప్తి గంటా, ప్రశాంతి తిపిర్నేని

అక్కా తమ్ముళ్లు సెట్స్‌లో ఉండకూడదు - దీప్తి గంటా

''నాని, ప్రశాంతిగారు స్క్రిప్ట్ విని ఈ సినిమాను ఓకే చేశారు. ఈ కథ నాకూ నచ్చింది. దర్శకుడు జగదీశ్ రాసిన 'కోర్ట్' కథలో చాలా లేయర్స్ ఉన్నాయి. ఈ సినిమాకు నేను ఆన్‌సెట్ ప్రొడ్యూసర్‌గా జాయిన్ అయ్యాను. సెట్స్‌కు రోజూ వెళ్లేదాన్ని. జగదీశ్ చాలా పరిశోధన చేసి, ఈ సినిమా చేశారు. అందుకే నేచురల్‌గా వచ్చింది. పోక్సో చట్టం గురించి ఆయన చాలా వివరంగా స్క్రీన్‌పై ప్రజెంట్ చేశారు. ఇక మంగపతి క్యారెక్టర్‌లో శివాజీగారు అద్భుతంగా నటించారు. ఇంకా ప్రియదర్శి, రోషన్, శ్రీదేవి... ఇలా ప్రతి పాత్రకు సినిమాలో ప్రాముఖ్యత ఉంది. 'మీట్ క్యూట్' తర్వాత నేను యూఎస్‌కి వెళ్లిపోయాను. ఈ సినిమా కోసం మళ్లీ వచ్చాను. కొన్ని కథలు ఉన్నాయి. భవిష్యత్‌లో మళ్లీ దర్శకత్వం వహిస్తాను'' అన్నారు దీప్తి. నాని 'వాల్‌పోస్టర్ సినిమా' బ్యానర్‌లోనే మీ డైరెక్షన్ మూవీ ఉండొచ్చా? అన్న ప్రశ్నకు– ''నేను సినిమా చేస్తే నానితో చేయను. అక్కాతమ్ముళ్లు సెట్స్‌లో ఉండకూడదు'' అని నవ్వుతూ సమాధానం ఇచ్చారు దీప్తి.

నానిగారు పెద్దగా లెక్కలు వేయరు - ప్రశాంతి తిపిర్నేని

''కోర్ట్' సినిమా ప్రీమియర్స్‌కు ఆడియన్స్ నుంచి అద్భుతమైన స్పందన వస్తోంది. మేం అనుకున్నదానికంటే ఎక్కువ రెస్పాన్స్ వస్తుండటం హ్యాపీగా ఉంది. ఈ తరహా జానర్‌లోని మూవీని ఆడియన్స్ ఆదరించి, సక్సెస్ చేయడం కూడా మంచి పరిణామం. ప్రస్తుతానికి ఈ సక్సెస్‌ని ఎంజాయ్ చేస్తున్నాం. నాని, నేను ఇద్దరం కథలు వింటాం. మా నమ్మకం అంతా నానిగారి జడ్జిమెంట్ మీదే ఆధారపడి ఉంటుంది. నానిగారు పెద్దగా లెక్కలేమీ వేయరు. జానర్ ఏదైనా కథలో నిజాయితీ ఉండి, డైరెక్టర్‌లో క్లారిటీ ఉంటే చాలు ముందుకు వెళ్తాం. ఒక కథ థియేటర్స్‌లో చూడాలనిపించేలా ఉంటే చాలు... సినిమా చేసేందుకు నానిగారు ఒప్పుకుంటారు. నానిగారి సినిమాలు థియేటర్స్‌కు ముందే ఓటీటీ డీల్స్‌ను పూర్తి చేసుకుంటున్నాయంటే అది కథలపై తనకు ఉన్న జడ్జిమెంటే కారణం. ఇక 'కోర్ట్'లో పోక్సో చట్టం ఎలా దుర్వినియోగం కావొచ్చనే పాయింట్‌ను దర్శకుడు జగదీశ్ అద్భుతంగా చూపించారు'' అని ప్రశాంతి చెప్పారు.

శత్రువుల్లా చూడక్కర్లేదు


''దిల్ రూబా' సినిమా కథలో ప్రేమ ఒకటే కాదు... స్నేహం, తండ్రీకొడుకులు, తండ్రీ కూతుళ్ల భావోద్వేగాలు కూడా ఉన్నాయి. మాజీ ప్రేయసి, ప్రేమికుడు... వీరిని శత్రువుల్లా చూడక్కర్లేదు. వారితోనూ స్నేహాన్ని కొనసాగించవచ్చనే ఫీల్‌గుడ్ అంశాలను ఈ సినిమాలో చూపించే ప్రయత్నం చేశాం'' అని కిరణ్ అబ్బవరం అన్నారు. కిరణ్ అబ్బవరం హీరోగా నటించిన చిత్రం 'దిల్ రూబా'. ఈ చిత్రంలో రుక్సార్ ధిల్లాన్, ఖ్యాతీ డేవిసన్ హీరోయిన్లుగా నటించారు. విశ్వ కరుణ్ దర్శకత్వంలో రవి, జోజో జోస్, రాకేష్ రెడ్డి, సారెగమ నిర్మించిన ఈ చిత్రం నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా గురువారం విలేకరుల సమావేశంలో కిరణ్ అబ్బవరం మాట్లాడుతూ–''ఈ మూవీలో నటించిన తర్వాత నటుడిగా మరింత పరిణితి సాధించాననిపించింది. ఈ సినిమాలో ఇబ్బందికర డైలాగ్స్, సన్నివేశాలు లేవు. ఫ్యామిలీతో చూడొచ్చు'' అని అన్నారు. విశ్వ కరుణ్, ఖ్యాతి, డీవోపీ డేనియల్ విశ్వాస్ మాట్లాడారు.



● కిరణ్, ఖ్యాతి

ఫుట్‌బాల్ ఛాంపియన్

రోషన్ హీరోగా ప్రదీప్ అద్వైతం దర్శకత్వంలో రూపొందుతున్న పీరియాడికల్ స్పోర్ట్స్ డ్రామా 'ఛాంపియన్'. జీ స్టూడియోస్ సమర్పణలో స్వప్న సినిమా, ఆనంది ఆర్ట్ క్రియేషన్స్, కాన్సెప్ట్ ఫిల్మ్స్ పతాకాలపై ప్రియాంకా దత్, జీకే మోహన్, పి. కిరణ్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. గురువారం (మార్చి 13) రోషన్ బర్త్ డే. ఈ సందర్భంగా 'ఛాంపియన్' సినిమా గ్లింప్స్ వీడియోను రిలీజ్ చేశారు. ''స్ట్రాంగ్ విల్ పవర్ ఉన్న ఇంటెన్స్ ఫుట్‌బాల్ ఆటగాడిగా రోషన్ కనిపిస్తాడు. మైదానంలో అతని ప్రయాణం, బ్రిటిష్ వలస పాలనకు వ్యతిరేకంగా ధైర్యంగా నిలబడటం, జీవితంలో నిజమైన ఛాంపియన్‌గా ఎదగడం... వంటి అంశాల నేపథ్యంలో ఈ సినిమా ఉంటుంది. యాక్షన్ సన్నివేశాలు అలరిస్తాయి. ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలను త్వరలోనే వెల్లడిస్తాం'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: మిక్కీ జే మేయర్.



● రోషన్



గౌరీస్ప్రాట్‌తో రిలేషన్‌షిప్‌లో ఉన్నాను: ఆమిర్ ఖాన్

బాలీవుడ్ ప్రముఖ నటుడు, దర్శక–నిర్మాత ఆమిర్‌ఖాన్ తన 60వ బర్త్ డే సందర్భంగా వెల్లడించిన కొన్ని విషయాలు ముంబై సినీ పరిశ్రమలో చర్చనీయాంశమయ్యాయి. నేడు (మార్చి 14) ఆమిర్‌ఖాన్ బర్త్ డే. ఈ సందర్భంగా గురువారం ముంబైలో తన ప్రీ బర్త్ డే సెలబ్రేషన్స్ నిర్వహించారాయన. గౌరీ స్ప్రాట్ అనే మహిళతో తాను రిలేషన్‌షిప్‌లో ఉన్నట్లు అధికారికంగా వెల్లడించారాయన. రెండు దశాబ్దాలుగా గౌరి తనకు తెలుసునని, గత ఏడాదిగా మరింత దగ్గర అయ్యామని పేర్కొన్నారు. అంతేకాదు.. ప్రీ బర్త్‌డే ఈవెంట్‌లో గౌరిని సల్మాన్‌ఖాన్ – షారుక్‌ఖాన్‌లకు పరిచయం చేశారు ఆమిర్. అలాగే గౌరీతో తన రిలేషన్‌షిప్ కుటుంబ సభ్యులకు కూడా తెలుసునని, తమ రిలేషన్‌షిప్ గురించి, వాళ్లు కూడా హ్యాపీగానే ఉన్నారని తెలిపారు. అలాగే గౌరి ఫోటోలు తీయవద్దని అక్కడి కెమెరామేన్‌లకు విజ్ఞప్తి చేశారాయన. కాగా ఆమె ప్రస్తుతం ఆమిర్ నిర్మాణ సంస్థ అయిన ఆమిర్‌ఖాన్ ప్రొడక్షన్స్ సంస్థలో వర్క్ చేస్తున్నారు. ఆమెకు ఇదివరకే పెళ్లి అయిందని, ఆరు సంవత్సరాల బాబు కూడా ఉన్నాడనే వార్తలు బాలీవుడ్‌లో వినిపిస్తున్నాయి. ఇక 1986లో రీనా దత్తాను వివాహం చేసుకున్నారు ఆమిర్‌ఖాన్. 2002లో ఆమెకు విడాకులు ఇచ్చారు. ఆ తర్వాత కిరణ్ రావును పెళ్లాడారాయన. కిరణ్ రావుతో పదిహేను సంవత్సరాల దాంపత్య జీవితం అనంతరం 2021లో ఆమెకు కూడా విడాకులు ఇచ్చారు. ఇప్పుడు గౌరీకి దగ్గరయ్యారు ఆమిర్. 60 సంవత్సరాల వయసులో ఆయన కొత్త రిలేషన్‌షిప్‌ని ప్రకటించడం పట్ల బాలీవుడ్‌లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇక సినిమాల విషయానికొస్తే... తాను యాక్ట్ చేసిన 'సితారే జమీన్ పర్' మూవీ జూన్‌లో రిలీజ్‌కు రెడీ అవుతోందని తెలిపారు ఆమిర్. అలాగే 'మహాభారతం' ఆధారంగా తాను చేయాలనుకుంటున్న మూవీ పనులు కూడా ప్రారంభం అయినట్లు పేర్కొన్నారు.

స్టాక్‌ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్‌ ▽	201	73,829
నిఫ్టీ ▽	73	22,397

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11:30 ముగింపు)

సూచీ	విలువ		మార్పు
నాస్‌డాక్‌	17,267	▽	380
డోజోన్స్‌	40,735	▽	161
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,543	△	2
డాక్స్‌	22,567	▽	109
షాంఘై	3,359	▽	13
నికాయ్‌	36,790	▽	29

•అమెరికా •బ్రిటన్‌ •జర్మనీ •చైనా •జపాన్‌

బులియన్‌ (రూ.లలో)

ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	86,843	△	700
బంగారం (99.5 స్వచ్ఛత)	86,495	△	697
వెండి (కిలో)	98,322	△	222

ఫారెక్స్‌ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్‌ డాలర్‌	ఎస్‌టీటీ	86.75	87.77
£	బ్రిటన్‌ పౌండ్‌	ఎస్‌టీటీ	111.50	114.41
€	యూరో	ఎస్‌టీటీ	93.68	96.37
¥	జపాన్‌ ఎన్‌ (100)	ఎస్‌టీటీ	58.14	59.63
AU$	ఆస్ట్రేలియా డాలర్‌	ఎస్‌టీటీ	52.37	57.13
S$	సింగపూర్‌ డాలర్‌	క్యాష్‌కరెన్సీ	62.84	67.48
SAR	సౌదీ రియాల్‌	క్యాష్‌కరెన్సీ	22.30	23.86
UAE D	యూఏఈ దిర్హామ్‌	క్యాష్‌కరెన్సీ	22.80	24.58
¥	చైనా యువాన్‌	క్యాష్‌కరెన్సీ	11.13	12.95

హల్దీరామ్స్‌లో టెమాసెక్‌కు వాటా



10 శాతం కొనుగోలుకి ఒప్పందం

న్యూఢిల్లీ: ప్రయివేట్‌ రంగ కంపెనీ హల్దీరామ్స్‌ స్నాక్స్‌ ఫుడ్‌లో సింగపూర్‌ సావరిన్‌ ఇన్వెస్ట్‌మెంట్‌ దిగ్గజం టెమాసెక్‌ 10 శాతం వాటా కొనుగోలు చేస్తోంది. కంపెనీ విలువను 10 బిలియన్‌ డాలర్లు (సుమారు రూ. 85,000 కోట్లు)గా మదింపు చేసి వాటాను సొంతం చేసుకుంటున్నట్లు పరిశ్రమ వర్గాలు తెలియజేశాయి. ఈ వారం మొదట్లో ఇందుకు తప్పనిసరి ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు వెల్లడించాయి. అంటే 10 శాతం వాటాకు సుమారు బిలియన్‌ డాలర్లు(రూ. 8,500 కోట్లు) వెచ్చించనున్నట్లు అంచనా. దేశీయంగా ప్యాకేడ్‌ స్నాక్, స్వీట్స్‌ తయారీలో దిగ్గజంగా నిలుస్తున్న హల్దీరామ్స్‌ రెస్టారెంట్లను సైతం నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. 2023–24లో రూ. 12,500 కోట్ల టర్నోవర్‌ సాధించింది. కంపెనీలో మరింత వాటా విక్రయం ద్వారా ప్రమోటర్లు అగర్వాల్‌ కుటుంబం మరో ఇన్వెస్టర్‌కు సైతం చోటు కల్పించనున్నట్లు తెలుస్తోంది. కొద్ది నెలలుగా పీఈ దిగ్గజాలు బ్లాక్‌స్టోన్, అల్ఫావేవ్‌ గ్లోబల్, బెయిన్‌ క్యాపిటల్‌ కన్సార్షియం తదితరాలతో వాటా విక్రయానికి హల్దీరామ్స్‌ చర్చలు నిర్వహించింది. కాగా.. వచ్చే ఆర్థిక సంవత్సరం(2025–26)లో పబ్లిక్‌ ఇష్యూ చేపట్టే అవకాశముంది. తొలుత మెజారిటీ వాటాను విక్రయించాలని భావించిన ప్రమోటర్లు తదుపరి మైనారిటీ వాటా విక్రయానికే ఆసక్తి చూపుతున్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి.


మళ్లీ పసిడి పరుగు

- 10 గ్రాములకు రూ.89,450
- ఒకే రోజులో రూ.600 ర్యాలీ
- అంతర్జాతీయంగా కొత్త గరిష్టానికి...



న్యూఢిల్లీ: బంగారం ర్యాలీ మళ్లీ మొదలైంది. గురువారం ఢిల్లీలో 99.9 శాతం స్వచ్ఛత బంగారం 10 గ్రాములకు రూ.600 లాభపడడంతో.. మునుపటి గరిష్ట స్థాయి అయిన రూ.89,450కి మరోసారి చేరుకుంది. బుధవారం బులియన్‌ మార్కెట్లో రూ.88,850 వద్ద ముగియడం గమనార్హం. 99.5 శాతం స్వచ్ఛత బంగారం సైతం రూ.600 లాభపడి రూ.89,050కి చేరింది. ఫిబ్రవరి 20న 99.9 శాతం స్వచ్ఛత బంగారం రూ.89,450, 99.5 శాతం స్వచ్ఛత బంగారం రూ.89,050 స్థాయిలను నమోదు చేయగా.. మూడు వారాల వ్యవధిలో మళ్లీ గరిష్టాలను అందుకుంది. వెండి సైతం కిలోకి రూ.1,000 లాభపడింది. ఐదు నెలల గరిష్ట స్థాయి రూ.1,01,200ను తాకింది. ఎంసీఎక్స్‌ మార్కెట్లో ఏప్రిల్‌ నెల డెలివరీ గోల్డ్‌ కాంట్రాక్ట్‌ (10 గ్రాములు) రూ.210 పెరిగి రూ.86,896కు చేరింది. అంతర్జాతీయంగా చూస్తే, పసిడి సరికొత్త ఆల్‌టైమ్‌ గరిష్టాన్ని తాకింది. 50 డాలర్లు లాభపడి 2,998 డాలర్ల స్థాయి వద్ద ట్రేడవుతోంది.

వెల్త్‌టెక్‌ ప్లాట్‌ఫామ్‌లకు ఏఐ దన్ను



వ్యక్తిగత రుణంపై 20 శాతం పైగా భారీ వడ్డీ రేటుతో సతమతమవుతున్న ఓ ఐటీ ప్రొఫెషనల్‌కి కృత్రిమ మేధ (ఏఐ) రూపంలో సమస్యకు ఓ పరిష్కారం లభించింది. మ్యూచువల్‌ ఫండ్‌ పోర్ట్‌ఫోలియోను ఏఐ ఆధారిత వెల్త్‌టెక్‌ ప్లాట్‌ఫాంకు అనుసంధానించడం ద్వారా తన దగ్గరున్న ఫండ్స్‌పై అత్యంత చౌకగా 10.5 శాతానికే రుణాన్ని పొందే అవకాశం ఉన్నట్లు తెలుసుకున్నారు. ఆర్థిక భారాన్ని తగ్గించుకోవడంతో పాటు ఏఐ టెక్నాలజీతో ఆదా చేసుకునే మార్గాలను కూడా అందిపుచ్చుకున్నారు. ఇక ఏళ్ల తరబడి మ్యూచువల్‌ ఫండ్‌లో ఇన్వెస్ట్‌ చేస్తున్న మరో ఇన్వెస్టరుకు.. సదరు ఫండ్‌ పనితీరు అంత గొప్పగా లేదనిపించింది. దీంతో ఓ వెల్త్‌టెక్‌ ప్లాట్‌ఫాం మానిటరింగ్‌ సాధనాలను ఉపయోగించుకుని మరింత మెరుగైన రాబడినిచ్చే ఫండ్‌కి మారగలిగారు. మంచి ప్రయోజనం పొందారు.

– సాక్షి, బిజినెస్‌ డెస్క్‌

ఇలా సాధారణంగా సంస్థాగత ఇన్వెస్టర్లకే లభ్యమయ్యే పెట్టుబడుల పరిజ్ఞానాన్ని సామాన్య మదుపరులు కూడా అందుకోవడంలో వెల్త్‌టెక్‌ స్టార్టప్‌లు దన్నుగా నిలుస్తున్నాయి. అధునాతనమైన కృత్రిమ మేధ (ఏఐ), మెషిన్‌ లెర్నింగ్‌ (ఎంఎల్‌), జనరేటివ్‌ ఏఐ (జెన్‌ఏఐ) సాంకేతికతల వినియోగంతో ఈ అంకురాలు దూసుకెళ్తుండటంతో దేశీయంగా వెల్త్‌ మేనేజ్‌మెంట్‌ విభాగంలో పెను మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ఈ ప్లాట్‌ఫాంలు చిన్న స్థాయి నుంచి పెద్ద స్థాయి వరకు వివిధ రకాల మదుపరులకు సంపద నిర్వహణ విషయంలో మరింత వ్యక్తిగత స్థాయిలో సలహాలు ఇస్తున్నాయి. ఆర్థిక నిర్ణయాలు తీసుకోవడంలోను, రిస్కులను అధిగమించడంలోను తోడ్పాటునిస్తున్నాయి. టెక్‌సై రీసెర్చ్‌ నివేదిక ప్రకారం దేశీయంగా వెల్త్‌ మేనేజ్‌మెంట్‌ సేవల మార్కెట్‌ 2023లో 429.1 బిలియన్‌ డాలర్లుగా ఉంది. ఇది 2025 నుంచి 2029 మధ్య కాలంలో వార్షిక ప్రాతిపదికన 4.56 శాతం చొప్పున వృద్ధి చెందనుంది. ఈ ఏడాదే ఏఐ అప్లికేషన్స్‌ తోడ్పాటుతో ఈ రంగం 1–2 బిలియన్‌ డాలర్ల మేర పెరగవచ్చనే అంచనాలు ఉన్నాయి. రిటైల్‌ ఇన్వెస్టర్లు, ద్వితీయ..తృతీయ శ్రేణి నగరాల్లో సంపన్నులు, టెక్నాలజీ వినియోగం విస్తృతంగా పెరుగుతుండటంలాంటి అంశాలు ఇందుకు దోహదపడనున్నాయి.

- సాధారణ ఇన్వెస్టర్ల నుంచి సంపన్నుల వరకు సేవలు
- లిస్టులో ఇన్వెస్టర్‌ ఏఐ, మైఫై, డిజర్వ్‌ తదితర సంస్థలు
- 2023లో 429 బిలియన్‌ డాలర్లుగా వెల్త్‌ మేనేజ్‌మెంట్‌ మార్కెట్‌

వందకు పైగా అంకురాలు..

అధ్యయన సంస్థ ట్రాక్షన్‌ ప్రకారం ప్రస్తుతం దాదాపు 122 అంకురాలు ఈ తరహా సేవలు అందిస్తున్నాయి. ఇన్వెస్టర్‌ఏఐ అనే సంస్థ నేరుగా బ్రోకరేజ్‌ ప్లాట్‌ఫాంలతో అనుసంధానమై సర్వీసులు అందిస్తోంది. చాట్‌జీపీటీ తరహా టెక్నాలజీని ఉపయోగిస్తున్నట్లు సంస్థ సహ వ్యవస్థాపకుడు, సీఈవో బ్రూస్‌ కీత్‌ వెల్లడించారు. దీనితో ట్రేడింగ్‌లో 70% వరకు విజయం సాధించే అవకాశాలు ఉంటున్నాయన్నారు. మైఫై అనే మరో స్టార్టప్‌ సంస్థ, మార్కెట్‌ ధోరణులను విశ్లేషించి, తగిన పెట్టుబడి వ్యూహాలను సూచించేందుకు ఏఐ, జెన్‌ఏఐ సాంకేతికతలను ఉపయోగిస్తోంది. ఆటోమేటెడ్‌ అసిస్టెంట్లు, రియల్‌ టైమ్‌ విశ్లేషణలతో ఆర్థిక లక్ష్యాలకు అనుగుణంగా ఉండే కచ్చితమైన ఫలితాలనిచ్చే సలహాలను అందిస్తోంది.

పెట్టుబడుల జోరు..

వెల్త్‌టెక్‌ స్టార్టప్‌లకున్న సామర్థ్యాలను గుర్తించి, వాటిల్లో పెట్టుబడులు పెట్టేందుకు వెంచర్‌ క్యాపిటలిస్టులు ముందుకొస్తున్నారు. డిజర్వ్‌ అనే సంస్థలో 2024 జులైలో ప్రేమ్‌జీ ఇన్వెస్ట్‌ సారథ్యంలో ఇన్వెస్టర్లు 32 మిలియన్‌ డాలర్లు పెట్టుబడులు పెట్టారు. ఇది పోర్ట్‌ఫోలియోను సమర్ధవంతంగా తీర్చిదిద్దేందుకు లక్షల కొద్దీ డేటా పాయింట్లను విశ్లేషించి, తగు సలహాలిస్తుంది. ఇక గురుగ్రామ్‌కి చెందిన సెంట్రిసిటీ అనే మరో స్టార్టప్‌ .. 20 మిలియన్‌ డాలర్లు సమీకరించింది. ఇది అత్యంత సంపన్నులు, స్వతంత్ర ఫైనాన్షియల్‌ ప్రొడక్ట్‌ డిస్ట్రిబ్యూటర్లకు ఆర్థిక సలహాలు అందిస్తోంది.

సాధారణ బీమాలోకి పతంజలి

- మ్యాగ్మా ఇన్సూరెన్స్‌ కొనుగోలుకి సై
- ఒప్పందం విలువ రూ. 4,500 కోట్లు



న్యూఢిల్లీ: ఎఫ్‌ఎంసీజీ, హెర్బల్‌ ప్రొడక్టుల దిగ్గజం పతంజలి ఆయుర్వేద్‌ సాధారణ బీమా రంగంలోకి ప్రవేశిస్తోంది. ఇందుకు వీలుగా మ్యాగ్మా జనరల్‌ ఇన్సూరెన్స్‌ను కొనుగోలు చేయనుంది. మ్యాగ్మా కొనుగోలుకి అదార్‌ పూనావాలా సంస్థ సనోటీ ప్రాపర్టీస్‌తో షేరు కొనుగోలు ఒప్పందం(ఎస్‌పీఏ) కుదుర్చుకుంది. రైజింగ్‌ సన్‌ హోల్డింగ్స్‌తో ఏర్పాటైన భాగస్వామ్య కంపెనీ(జేవీ) మ్యాగ్మా జనరల్‌ ఇన్సూరెన్స్‌లో సనోటీకి మెజారిటీ వాటా ఉంది. వెరసి మ్యాగ్మా కొనుగోలుకి ధరమ్‌పాల్‌ సత్యపాల్‌(డీఎస్‌) గ్రూప్‌తో కలసి పతంజలి రూ. 4,500 కోట్లు వెచ్చించనుంది. సెలికా డెవలపర్స్, జాగ్వార్‌ అడ్వయిజరీ సర్వీసెస్‌తో కలసి డీల్‌కు సనోటీ బోర్డు ఆమోదముద్ర వేసింది. సాధారణ బీమా రంగంలో 70 ప్రొడక్టులతో కార్యకలాపాలు విస్తరించిన మ్యాగ్మా 2023–24లో రూ. 3,295 కోట్ల స్థూల ప్రీమియం(జీడబ్ల్యూపీ)ను అందుకుంది. ఈ ఏడాది(2024–25) రూ. 3,700 కోట్ల జీడబ్ల్యూపీ సాధించగలమని భావిస్తోంది.

ఆటో, రియల్టీ షేర్లలో అమ్మకాలు

సెన్సెక్స్‌ 201 పాయింట్లు డౌన్‌



ముంబై: ఆటో, రియల్టీ షేర్లలో అమ్మకాలు తలెత్తడంతో స్టాక్‌ సూచీలు గురువారం కూడా నష్టపోయాయి. సెన్సెక్స్‌ 201 పాయింట్లు పతనమై 73,829 వద్ద స్థిరపడింది. ఈ సూచీకిది వరుసగా అయిదో రోజూ నష్టాల ముగింపు. నిఫ్టీ 73 పాయింట్లు క్షీణించి 22,397 వద్ద నిలిచింది. అంతర్జాతీయ మార్కెట్ల సానుకూల సంకేతాలతో సూచీలు ఉదయం లాభాలతో మొదలయ్యాయి. ఒక దశలో సెన్సెక్స్‌ 371 పాయింట్లు పెరిగి 74,401 వద్ద గరిష్టాన్ని తాకింది. నిఫ్టీ 87 పాయింట్లు బలపడి 22,558 గరిష్టాన్ని తాకింది.

- హోలీ సందర్భంగా శుక్రవారం బీఎస్‌ఈ, ఎన్‌ఎస్‌ఈలకు సెలవు అయితే బులియన్, ఫారెక్స్, కమోడిటీ మార్కెట్లు మాత్రం సాయంత్రం సెషన్‌లో పనిచేస్తాయి.
- డాలర్‌ మారకంలో రూపాయి విలువ 17 పైసలు బలపడి 87.05 వద్ద స్థిరపడింది. క్రూడాయిల్‌ ధరలు దిగిరావడం, మెరుగైన స్థూల ఆర్థిక గణాంకాలు నమోదు కావడం, అమెరికా డాలర్‌ ఇండెక్స్‌ బలహీనత వంటి అంశాలు దేశీయ కరెన్సీ బలోపేతానికి కారణమయ్యాయి. ఒక దశలో 28 పైసలు పెరిగి 86.94 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకింది.

'సాక్షి ప్లస్‌' ఈ-పేపర్‌లో ..
ఓలా ఎస్‌1 స్కూటర్లపై డిస్కౌంట్లు | ఐపీఓకు ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్‌ రెడీ



పోరాడి ఓడిన యూకీ జోడీ

కాలిఫోర్నియా: ఇండియన్‌ వెల్స్‌ మాస్టర్స్‌–1000 టెన్నిస్‌ టోర్నీలో భారత డబుల్స్‌ స్టార్‌ యూకీ బాంబ్రీ పోరాటం ముగిసింది. గురువారం జరిగిన పురుషుల డబుల్స్‌ క్వార్టర్‌ ఫైనల్లో యూకీ బాంబ్రీ (భారత్‌)–ఆంద్రీ గొరాన్సన్‌ (స్వీడన్‌) ద్వయం 6–7 (5/7), 6–3, 8–10తో 'సూపర్‌ టైబ్రేక్‌'లో ఫెర్నాండో రాంబోలి (బ్రెజిల్‌)–జాన్‌ ప్యాట్రిక్‌ స్మిత్‌ (ఆస్ట్రేలియా) జంట చేతిలో పోరాడి ఓడిపోయింది. 1 గంట 48 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో యూకీ–గొరాన్సన్‌ ఏడు ఏస్‌లు సంధించి, ఆరు డబుల్‌ ఫాల్ట్‌లు చేశారు. తమ సర్వీస్‌ను ఒకసారి కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను రెండుసార్లు బ్రేక్‌ చేశారు. యూకీ–గొరాన్సన్‌లకు 65 వేల డాలర్ల (రూ. 56 లక్షల 67 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 180 ర్యాంకింగ్‌ పాయింట్లు లభించాయి. కెరీర్‌లో తొలిసారి మాస్టర్స్‌ సిరీస్‌ టోర్నీలో ఆడిన యూకీ తాజా ప్రదర్శనతో రెండు స్థానాలు మెరుగుపర్చుకొని 37వ ర్యాంక్‌కు చేరుకుంటాడు.

ముంబై మెరిసె...

డబ్ల్యూపీఎల్‌ ఫైనల్లో ముంబై ఇండియన్స్‌

- ఎలిమినేటర్‌ మ్యాచ్‌లో గుజరాత్‌ జెయింట్స్‌పై విజయం
- రేపు జరిగే టైటిల్‌ పోరులో ఢిల్లీ క్యాపిటల్స్‌తో 'ఢీ'
- హేలీ మాథ్యూస్‌ ఆల్‌రౌండ్‌ షో
- అదరగొట్టిన సివర్‌ బ్రంట్, హర్మన్‌ప్రీత్‌


హేలీ మాథ్యూస్‌ | సివర్‌ బ్రంట్‌

సమష్టి ప్రదర్శనతో సత్తా చాటిన ముంబై ఇండియన్స్‌ జట్టు మహిళల ప్రీమియర్‌ లీగ్‌ (డబ్ల్యూపీఎల్‌) టి20 క్రికెట్‌ టోర్నీ మూడో సీజన్‌లో టైటిల్‌ పోరుకు దూసుకెళ్లింది. ఏకపక్షంగా జరిగిన ఎలిమినేటర్‌ మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్‌ 47 పరుగుల తేడాతో గుజరాత్‌ జెయింట్స్‌పై ఘనవిజయం సాధించింది. బ్యాట్‌తో హేలీ మాథ్యూస్, నాట్‌ సివర్‌ బ్రంట్, హర్మన్‌ప్రీత్‌ కౌర్‌ చెలరేగడంతో ముంబై భారీ స్కోరు చేసింది. అనంతరం బంతితోనూ ముంబై బౌలర్లు హడలెత్తించారు. దాంతో లక్ష్య ఛేదనలో గుజరాత్‌ జెయింట్స్‌ దీలా పడింది. ముంబై ఇండియన్స్‌ జట్టుతో ఆడిన ఏడోసారీ గుజరాత్‌ జట్టు పరాజయాన్నే మూటగట్టుకుంది.

ముంబై: మాజీ చాంపియన్‌ ముంబై ఇండియన్స్‌ జట్టు మహిళల ప్రీమియర్‌ లీగ్‌ (డబ్ల్యూపీఎల్‌)లో రెండోసారి ఫైనల్లోకి దూసుకెళ్లింది. గురువారం జరిగిన ఎలిమినేటర్‌ మ్యాచ్‌లో హర్మన్‌ప్రీత్‌ కౌర్‌ సారథ్యంలోని ముంబై ఇండియన్స్‌ 47 పరుగుల తేడాతో గుజరాత్‌ జెయింట్స్‌పై గెలిచి తుదిపోరుకు చేరింది. శనివారం జరిగే టైటిల్‌ పోరులో గత ఏడాది రన్నరప్‌ ఢిల్లీ క్యాపిటల్స్‌తో ముంబై ఆడుతుంది. టాస్‌ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన ముంబై నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 213 పరుగులు చేసింది. హేలీ మాథ్యూస్‌ (50 బంతుల్లో 77; 10 ఫోర్లు, 3 సిక్స్‌లు), నాట్‌ సివర్‌ బ్రంట్‌ (41 బంతుల్లో 77; 10 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్ధశతకాలతో విజృంభించారు. కెప్టెన్‌ హర్మన్‌ప్రీత్‌ కౌర్‌ (12 బంతుల్లో 36; 2 ఫోర్లు, 4 సిక్స్‌లు) మెరిపించింది. గుజరాత్‌ జెయింట్స్‌ బౌలర్లలో గిబ్సన్‌ 2 వికెట్లు పడగొట్టింది. అనంతరం లక్ష్యఛేదనలో గుజరాత్‌ జెయింట్స్‌ జట్టు 19.2 ఓవర్లలో 166 పరుగులకు ఆలౌటైంది. గిబ్సన్‌ (24 బంతుల్లో 34; 5 ఫోర్లు, 1 సిక్స్‌), లిచ్‌ఫీల్డ్‌ (20 బంతుల్లో 31; 4 ఫోర్లు, 1 సిక్స్‌), భారతి (20 బంతుల్లో 30; 3 ఫోర్లు, 1 సిక్స్‌) పోరాడినా ఫలితం లేకపోయింది. ముంబై బౌలర్లలో హేలీ 3, అమేలియా కెర్‌ 2 వికెట్లు పడగొట్టింది. హేలీ మాథ్యూస్‌కు 'ప్లేయర్‌ ఆఫ్‌ ద మ్యాచ్‌' అవార్డు దక్కింది.

బాదుడే బాదుడు..

మొదట బ్యాటింగ్‌కు దిగిన ముంబైకి శుభారంభం దక్కలేదు. గుజరాత్‌ బౌలర్లు కట్టుదిట్టమైన బంతులు వేయడంతో పవర్‌ప్లే ముగిసేసరికి యస్తిక భాటియా (15; 3 ఫోర్లు) వికెట్‌ కోల్పోయిన ముంబై 37 పరుగులే చేసింది. గిబ్సన్‌ వేసిన ఏడో ఓవర్‌లో సివర్‌ బ్రంట్‌ రెండు ఫోర్లతో జోరు పెంచగా... ప్రియా ఓవర్‌లో హేలీ 'హ్యాట్రిక్‌' ఫోర్లతో విరుచుకుపడింది. గుజరాత్‌ బౌలర్లను సమర్థవంతంగా ఎదుర్కొన్న ఈ జోడీ వీలు చిక్కినప్పుడల్లా బౌండరీలు బాదడంతో 11 ఓవర్లు ముగిసేసరికి ముంబై జట్టు 100/1తో నిలిచింది. ఈ క్రమంలో హేలీ 36 బంతుల్లో, సివర్‌ 29 బంతుల్లో అర్ధశతకాలు పూర్తి చేసుకున్నారు. ఆ తర్వాత ఈ జంట మరింత ధాటిగా ఆడటంతో స్కోరు బోర్డు పరుగులు పెట్టింది. గిబ్సన్‌ వేసిన 15వ ఓవర్‌లో సివర్‌ రెండు భారీ సిక్సర్లు బాదగా... ప్రియ ఓవర్లో హేలీ వరుసగా 6, 6, 4 కొట్టింది. రెండో వికెట్‌కు 71 బంతుల్లో 133 పరుగులు జోడించిన అనంతరం హేలీ అవుట్‌ కాగా... హర్మన్‌ వచ్చీరావడంతోనే భారీ షాట్లతో విరుచుకుపడింది. తనూజ వేసిన 18వ ఓవర్లో 2 సిక్స్‌లు, 2 ఫోర్లు కొట్టిన హర్మన్‌... చివరి ఓవర్‌లో మరో 2 సిక్స్‌లు బాదింది. దీంతో ముంబై భారీ స్కోరు చేసింది. చివరి 5 ఓవర్లలో ముంబై జట్టు 73 పరుగులు రాబట్టింది.

స్కోరు వివరాలు

ముంబై ఇండియన్స్‌ ఇన్నింగ్స్‌: యస్తిక భాటియా (సి) భారతి (బి) గిబ్సన్‌ 15; హేలీ మాథ్యూస్‌ (సి) మూనీ (బి) కాశ్వీ గౌతమ్‌ 77; సివర్‌ బ్రంట్‌ (సి) లిచ్‌ఫీల్డ్‌ (బి) గిబ్సన్‌ 77; హర్మన్‌ప్రీత్‌ కౌర్‌ (రనౌట్‌) 36; సజన (నాటౌట్‌) 1; ఎక్స్‌ట్రాలు 7; **మొత్తం** (20 ఓవర్లలో 4 వికెట్లకు) 213. **వికెట్ల పతనం:** 1–26, 2–159, 3–198, 4–213. **బౌలింగ్‌:** కాశ్వీ గౌతమ్‌ 4–0–30–1; ఆష్లీ గార్డ్‌నర్‌ 2–0–15–0; తనూజ కన్వర్‌ 4–0–49–0; గిబ్సన్‌ 4–0–40–2; ప్రియా మిశ్రా 3–0–40–0; మేఘనా సింగ్‌ 3–0–35–0.

గుజరాత్‌ జెయింట్స్‌ ఇన్నింగ్స్‌: బెత్‌ మూనీ (సి) హేలీ మాథ్యూస్‌ (బి) షబ్నిమ్‌ 6; గిబ్సన్‌ (రనౌట్‌) 34; హర్లీన్‌ డియోల్‌ (రనౌట్‌) 8; ఆష్లీ గార్డ్‌నర్‌ (బి) హేలీ మాథ్యూస్‌ 8; లిచ్‌ఫీల్డ్‌ (స్టంప్డ్‌) యస్తిక (బి) కెర్‌ 31; భారతి (బి) హేలీ 30; కాశ్వీ గౌతమ్‌ (రనౌట్‌) 4; సిమ్రన్‌ (సి) హర్మన్‌ప్రీత్‌ (బి) కెర్‌ 17; తనూజ (సి) అమన్‌జ్యోత్‌ (బి) సివర్‌ 16; మేఘన (సి) సివర్‌ (బి) హేలీ 5; ప్రియ (నాటౌట్‌) 0; ఎక్స్‌ట్రాలు 7; **మొత్తం** (19.2 ఓవర్లలో ఆలౌట్‌) 166. **వికెట్ల పతనం:** 1–6, 2–34, 3–43, 4–81, 5–107, 6–112, 7–142, 8–157, 9–165, 10–166. **బౌలింగ్‌:** షబ్నిమ్‌ 4–0–35–1; సివర్‌ 4–0–31–1; సైకా 1–0–8–0; హేలీ 3.2–0–31–3; అమన్‌జ్యోత్‌ 3–0–32–0; అమేలియా కెర్‌ 4–0–28–2.

ఛేజింగ్‌లో జెయింట్స్‌ రనౌట్‌..

భారీ లక్ష్యఛేదనలో గుజరాత్‌ ప్రభావం చూపలేకపోయింది. తొలి ఓవర్‌లోనే ఓపెనర్‌ బెత్‌ మూనీ (6) పెవిలియన్‌ చేరగా... కెప్టెన్‌ ఆష్లీ గార్డ్‌నర్‌ (8), హర్లీన్‌ డియోల్‌ (8) ఎక్కువ సేపు నిలవలేకపోయారు. దీంతో గుజరాత్‌ 43 పరుగులకే 3 వికెట్లు కోల్పోయింది. ఈ దశలో గిబ్సన్, లిచ్‌ఫీల్డ్‌ కాస్త పోరాడినా... ముంబై బౌలర్లు వరుస విరామాల్లో వికెట్లు పడగొడుతూ ఒత్తిడి పెంచారు. క్రమశిక్షణతో కూడిన బౌలింగ్‌కు చక్కటి ఫీల్డింగ్‌ తోడవడంతో ముంబై జట్టు స్పష్టమైన ఆధిక్యం కనబర్చింది. భారతి, సిమ్రన్‌ (8 బంతుల్లో 17; 2 ఫోర్లు, 1 సిక్స్‌) మెరుపులు ఓటమి అంతరాన్ని తగ్గించేందుకే పరిమితమయ్యాయి. పేలవ ఫీల్డింగ్‌తో ముంబై బ్యాటర్లు ఇచ్చిన 4 క్యాచ్‌లు వదిలేసిన గుజరాత్‌ జట్టు... వికెట్ల మధ్య చురుకుగా పరిగెత్తలేక రనౌట్‌ రూపంలో 3 వికెట్లు కోల్పోయి మూల్యం చెల్లించుకుంది.


లక్ష్య సేన్‌

లక్ష్య సేన్‌ సంచలనం

- ప్రపంచ రెండో ర్యాంకర్, డిఫెండింగ్‌ చాంపియన్‌ జొనాథన్‌ క్రిస్టీపై విజయం
- పురుషుల సింగిల్స్‌ క్వార్టర్‌ ఫైనల్లో భారత నంబర్‌వన్‌

బర్మింగ్‌హామ్‌: ప్రతిష్టాత్మక ఆల్‌ ఇంగ్లండ్‌ బ్యాడ్మింటన్‌ చాంపియన్‌షిప్‌లో భారత నంబర్‌వన్, ప్రపంచ 15వ ర్యాంకర్‌ లక్ష్య సేన్‌ సంచలనం సృష్టించాడు. గురువారం జరిగిన పురుషుల సింగిల్స్‌ ప్రిక్వార్టర్‌ ఫైనల్లో లక్ష్య సేన్‌ 21–13, 21–10తో ఇండోనేసియా స్టార్, ప్రపంచ రెండో ర్యాంకర్, డిఫెండింగ్‌ చాంపియన్‌ జొనాథన్‌ క్రిస్టీని బోల్తా కొట్టించాడు. లక్ష్య సేన్‌ ధాటికి తట్టుకోలేక జొనాథన్‌ క్రిస్టీ 36 నిమిషాల్లో చేతులెత్తేశాడు. ఈ గెలుపుతో గత ఏడాది ఇదే టోర్నీలో సెమీఫైనల్లో క్రిస్టీ చేతిలో ఎదురైన ఓటమికి లక్ష్య సేన్‌ బదులు తీర్చుకున్నాడు. గతంలో క్రిస్టీ చేతిలో నాలుగుసార్లు ఓడిపోయిన లక్ష్య సేన్‌ ఈసారి మాత్రం ఆరంభం నుంచే పూర్తి ఆధిపత్యం చలాయించాడు. లక్ష్య ఆటకు జవాబివ్వలేక క్రిస్టీ అనవసర తప్పిదాలు చేశాడు. దాంతో తొలి గేమ్‌లో ఒక్కసారి కూడా ఇద్దరి స్కోర్లు సమం కాలేదు. రెండో గేమ్‌లోనూ లక్ష్య తన దూకుడు కొనసాగించాడు. స్కోరు 11–6 వద్ద లక్ష్య సేన్‌ ఒక్కసారిగా చెలరేగి వరుసగా ఆరు పాయింట్లు నెగ్గి 17–6తో ఆధిక్యంలోకి వెళ్లాడు. అదే జోరులో రెండో గేమ్‌తోపాటు మ్యాచ్‌ను దక్కించుకున్నాడు. నేడు క్వార్టర్‌ ఫైనల్లో 6వ ర్యాంకర్‌ లీషి ఫెంగ్‌ (చైనా)తో లక్ష్య సేన్‌ ఆడతాడు.

వైదొలిగిన సాత్విక్‌–చిరాగ్‌ జోడీ

పురుషుల డబుల్స్‌లో ఏడో సీడ్‌ సాత్విక్‌ సాయిరాజ్‌–చిరాగ్‌ శెట్టి (భారత్‌) జోడీ ప్రిక్వార్టర్‌ ఫైనల్లో వెనుదిరిగింది. హావో నాన్‌ జియె–హాన్‌ జెంగ్‌ వె (చైనా)తో గురువారం జరిగిన మ్యాచ్‌లో సాత్విక్‌–చిరాగ్‌ తొలి గేమ్‌ను 16–21తో కోల్పోయారు. రెండో గేమ్‌లో స్కోరు 2–2 వద్ద ఉన్నపుడు చిరాగ్‌ వెన్ను నొప్పితో ఆటను కొనసాగించలేకపోయాడు. దాంతో సాత్విక్‌–చిరాగ్‌ ద్వయం మ్యాచ్‌ మధ్యలోనే వైదొలిగింది. మహిళల సింగిల్స్‌ ప్రిక్వార్టర్‌ ఫైనల్లో మాళవిక బన్సోద్‌ (భారత్‌) 16–21, 13–21తో ప్రపంచ మూడో ర్యాంకర్‌ అకానె యామగుచి (జపాన్‌) చేతిలో ఓడిపోయింది. మిక్స్‌డ్‌ డబుల్స్‌ ప్రిక్వార్టర్‌ ఫైనల్లో గద్దె రుత్విక శివాని–రోహన్‌ కపూర్‌ (భారత్‌) ద్వయం 10–21, 12–21తో జె ఫెంగ్‌ యాన్‌–జిన్‌ వె యా (చైనా) జంట చేతిలో ఓడిపోయింది.


జొనాథన్‌ క్రిస్టీ

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్‌ స్పోర్ట్స్‌ ఈ-పేపర్‌లో

క్లుప్తంగా...

24న హెల్త్ వర్సిటీ అసిస్టెంట్ లైబ్రేరియన్ పరీక్ష

సాక్షి, అమరావతి: డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య యూనివర్సిటీలో లైబ్రేరియన్ పోస్టుల భర్తీకి ఈనెల 24, 25 తేదీల్లో మెయిన్స్ పరీక్ష నిర్వహించనున్నట్టు ఏపీపీఎస్సీ ఓ ప్రకటనలో తెలిపింది. 24న ఉదయం 9.30 నుంచి 12 గంటలకు వరకు పేపర్–2, 25న ఉదయం పేపర్–1 ఉంటుందని పేర్కొంది. అభ్యర్థులు 17 నుంచి https://psc.ap.gov.in నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

25న అసిస్టెంట్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ పరీక్ష

ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలిలో అసిస్టెంట్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ పోస్టుల భర్తీకి ఈనెల 25న మెయిన్స్ పరీక్ష నిర్వహించనున్నట్టు కమిషన్ ఓ ప్రకటనలో తెలిపింది. ఆరోజు ఉదయం పేపర్–1, మధ్యాహ్నం పేపర్–2 ఉంటుంది. అభ్యర్థులు 18 నుంచి ఏపీపీఎస్సీ వెబ్‌సైట్ నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

ఇంజనీరింగ్ యువతకు మైక్రోసాఫ్ట్ ఏఐ నైపుణ్య శిక్షణ

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని యువతకు ప్రత్యేకించి ఇంజనీరింగ్ విద్యార్థులు, అధ్యాపకులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, అధునాతన సాంకేతిక పరిజ్ఞానాల్లో నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇచ్చేందుకు మైక్రోసాఫ్ట్‌తో ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. అమరావతి సచివాలయంలో మంత్రి నారా లోకేశ్ సమక్షంలో మైక్రోసాఫ్ట్ ప్రతినిధులు, ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అధికారులు ఎంఓయూపై సంతకాలు చేశారు. లోకేశ్ మాట్లాడుతూ ఈ ఒప్పందం ప్రకారం ఏడాది వ్యవధిలో 2 లక్షలమంది యువతకు మైక్రోసాఫ్ట్ స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ ఇస్తుందన్నారు.

అగ్నివీర్ నియామకాలకు నమోదు ప్రక్రియ ప్రారంభం



సాక్షి, అమరావతి: ఆర్మీ విభాగంలో అగ్నివీర్ సిబ్బంది నియామకానికి 2025–26కు నమోదు ప్రక్రియ చేపట్టినట్టు గుంటూరు ఆర్మీ రిక్రూటింగ్ ఆఫీస్ డైరెక్టర్ కల్నల్ పునీత్ కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్ ఉమ్మడి ప్రవేశ పరీక్ష (సీఈఈ)ను మొదటిసారి తెలుగుతో సహా 13 భాషల్లో నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. అన్ని కేటగిరీల ఎన్‌సీసీ సర్టిఫికెట్ ఉన్నవారు, ప్రతిభావంతులైన క్రీడాకారులు, అగ్నివీర్ టెక్నికల్ కేటగిరీలో ఐటీఐ/డిప్లొమా అర్హత కలిగిన అభ్యర్థులకు అదనపు మార్కులు ఇవ్వనున్నట్టు తెలిపారు. గుంటూరు, కర్నూలు, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు, అనంతపురం, వైఎస్సార్, ప్రకాశం, చిత్తూరు, బాపట్ల, పల్నాడు, నంద్యాల, తిరుపతి, అన్నమయ్య, శ్రీ సత్యసాయి జిల్లాలకు చెందిన ఆసక్తిగల అభ్యర్థులతో అగ్నివీర్ జనరల్ డ్యూటీ, అగ్నివీర్ టెక్నికల్, అగ్నివీర్ కార్యాలయ సహాయకులు/స్టోర్ కీపర్ టెక్నికల్, అగ్నివీర్ వృత్తి నిపుణుల పోస్టులను భర్తీ చేయనున్నట్టు పేర్కొన్నారు. అభ్యర్థులు ఏప్రిల్ 10లోగా www.joinindianarmy.nic.in ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

పవన్.. సనాతన ధర్మమంటే ఇదేనా?: సీపీఎం

సాక్షి, అమరావతి: సనాతన ధర్మాన్ని కాపాడటం అంటే అన్నదాన సత్రాలను కూల్చడమా? అని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ను సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ప్రశ్నించారు. వైఎస్సార్ జిల్లా బద్వేల్ నియోజకవర్గ పరిధిలోని కాశీనాయన క్షేత్రానికి చెందిన స్నానపు గదులు, కుమ్మరుల, రజకుల అన్నదాన సత్రాన్ని, గోశాల గెస్ట్ హౌస్‌లను అటవీ శాఖ అధికారులు కూల్చివేయడాన్ని ఖండిస్తూ గురువారం ఆయన ప్రకటన విడుదల చేశారు. సనాతన ధర్మం కాపాడతానని కంకణం కట్టుకున్న పవన్‌కళ్యాణ్ బాధ్యత వహిస్తోన్న అటవీ శాఖ ఆధ్వర్యంలోనే కూల్చివేతలు జరగడం దారుణమన్నారు.

'విశాఖ ఉక్కు'పరిరక్షణ నిరసనలకు సీపీఐ మద్దతు

సాక్షి, అమరావతి: విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం ఈ నెల 14న నిర్వహిస్తోన్న నిరసనలకు మద్దతు ఇస్తున్నట్లు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ గురువారం తెలిపారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేట్ పరం చేయరాదని, దానికి క్యాప్టివ్ మైన్స్ కేటాయించి ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్త నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

సీజీఎఫ్ కింద మ్యాచింగ్ విరాళాలు వసూలు చేయం


మంత్రి ఆనం రాంనారాయణ్‌రెడ్డి

సాక్షి, అమరావతి: కామన్ గుడ్ ఫండ్ (సీజీఎఫ్) కింద నూతన దేవాలయాల నిర్మాణానికి ఎలాంటి మ్యాచింగ్ విరాళాలు వసూలుచేయబోమని దేవదాయ శాఖ మంత్రి ఆనం రాంనారాయణ్‌రెడ్డి గురువారం 'మండలి'లో తెలిపారు. సీజీఎఫ్ గ్రాంట్ ఉపసంహరణపై ప్రభుత్వం వద్ద ఎలాంటి ప్రతిపాదనల్లేవన్నారు. మైదుకూరు నియోజకవర్గంలో పురాతన దేవాలయం పునర్నిర్మాణానికి టెండర్లు ఖరారైనప్పటికీ పనులు మాత్రం ముందుకెళ్లడంలేదని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ రమేశ్‌యాదవ్ మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. మంత్రి స్పందిస్తూ.. కాంట్రాక్టర్లు ముందుకు రావడంలేదని.. సమస్య పరిష్కారానికి కృషిచేస్తామని చెప్పారు.

కెరీర్ కౌన్సెలింగ్, గైడెన్స్‌లే పరిష్కారం

విద్యార్థుల్లో ఒత్తిడి నివారణకు ఇవే మార్గాలు

- పాఠశాలలు మానసిక వికాస ప్రాంగణాలుగా మారాలి
- బాహ్య ప్రపంచంలో ఎదురయ్యే సవాళ్లను తట్టుకునేలా శిక్షణ ఇవ్వాలి
- తల్లిదండ్రులు కూడా తమ పిల్లల ఆకాంక్షలను గుర్తించాలి
- తమ సమస్యలను స్వేచ్ఛగా చెప్పుకునే వాతావరణాన్ని కల్పించాలి
- ఐసీ3 మూమెంట్ వ్యవస్థాపకులు గణేశ్ కోహ్లి



'నేటి విద్యా వ్యవస్థతో విద్యార్థులు ఎదుర్కొంటున్న మానసిక ఒత్తిడిని పోగొట్టాలంటే.. వారికి పాఠశాల స్థాయి నుంచే కెరీర్ గైడెన్స్ అందించాలి. వారి నైపుణ్యాలపై కౌన్సెలింగ్ ఇవ్వాలి. పోటీ వాతావరణం, పరీక్షల్లో వచ్చిన మార్కులనే ప్రతిభకు కొలమానంగా భావించడం, ఇతరులతో పోల్చుకోవడం వంటి పలు కారణాలతో విద్యార్థులు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారు. వారి మానసిక ఆరోగ్యం కూడా దెబ్బతింటోంది. ఈ ఒత్తిడిని తట్టుకోలేక ఆత్మహత్యలకు సైతం పాల్పడుతున్నారు. ఈ నేపథ్యంలో దీనికి పాఠశాల స్థాయి నుంచే పరిష్కారం చూపాలి' అని అంటున్నారు.. ఐసీ3 (ఇంటర్నేషనల్ కాలేజ్ అండ్ కెరీర్ కౌన్సెలింగ్) మూమెంట్ వ్యవస్థాపకులు, ప్రముఖ కెరీర్ కౌన్సెలర్, టెడెక్స్ స్పీకర్.. గణేశ్ కోహ్లి. 'కౌన్సెలింగ్ ఇన్ ఎవ్రీ స్కూల్' అనే ఉద్దేశంతో ఐసీ3 మూమెంట్‌కు రూపకల్పన చేసి, దాదాపు 90 దేశాల్లో ఈ సంస్థ ద్వారా విద్యార్థులకు కౌన్సెలింగ్, కెరీర్ గైడెన్స్ కార్యక్రమాలు నిర్వహిస్తున్న గణేశ్ కోహ్లి విద్యార్థుల మానసిక ఒత్తిడి నివారణకు అందిస్తున్న సూచనలు..

– సాక్షి, ఎడ్యుకేషన్

విద్యార్థుల ఒత్తిడి నివారణకు పాఠశాలలు అనుసరించాల్సిన వ్యూహాలు..



గేట్‌కీపర్ ట్రైనింగ్: పిల్లల్లోని ఒత్తిడిని ప్రారంభ దశలోనే గుర్తించేలా టీచర్లకు శిక్షణనివ్వాలి.

భావోద్వేగ ప్రజ్ఞలో శిక్షణ: విద్యార్థులు తమ భావోద్వేగాలను నియంత్రించుకోవడం, స్వీయ అవగాహన పెంపొందించుకోవడంపై బోధించాలి.

కెరీర్ కౌన్సెలింగ్: మాధ్యమిక పాఠశాల స్థాయి నుంచే కెరీర్ కౌన్సెలింగ్‌ను కరిక్యులంలో భాగం చేయాలి.

సురక్షిత వాతావరణం: విద్యార్థులు సహచరులతో మానసిక సమస్యల గురించి చర్చించుకునే పరిస్థితిని, ఎక్స్‌ట్రా కరిక్యులర్ యాక్టివిటీస్‌లో పాల్గొనే వాతావరణాన్ని కల్పించాలి.

మానసిక ఒత్తిడికి ప్రధాన కారణాలివే..

విద్యార్థుల మానసిక ఒత్తిడికి అకడమిక్స్‌తోపాటు మరెన్నో అంశాలు కారణమవుతున్నాయి. ఆర్థిక అస్థిరత, వ్యక్తిగత ఆహార్యం, సహచరులు – బంధువుల ఒత్తిడి, వైఫల్యం అంటే విపరీతమైన భయం వంటివి వీటిలో ముఖ్యమైనవి. సంపూర్ణ వికాసం కల్పించడం కంటే అత్యున్నత గ్రేడ్స్‌కే విలువనిచ్చే విద్యావ్యవస్థ కూడా మరో కారణం. ఒక చిన్న గదిలో కూర్చోబెట్టి నిరంతరం పాఠాలకే పరిమితమవుతుండటంతో సమస్యలకు తామే విద్యార్థులు పరిష్కారం వెతుక్కోవాల్సి వస్తోంది. అలాగే తల్లిదండ్రులు చిన్నతనం నుంచే తమ పిల్లలను వారి సహచరులతో పోల్చుతున్నారు. దీంతో తమ సామర్థ్యంపై అపనమ్మకం ఏర్పడి విద్యార్థులు దీర్ఘకాలిక ఒత్తిడికి గురవుతున్నారు. దీన్ని ఎవరూ గుర్తించకపోవడంతో చివరకు వారు ఆత్మహత్యలకు కూడా పాల్పడుతున్నారు.

పాఠశాలలదే ప్రధాన పాత్ర

పాఠశాలలు విద్యార్థులకు విద్యా అభ్యసన కేంద్రాలుగా మాత్రమే ఉంటున్నాయి. అయితే అవి విద్యార్థుల సామాజిక, మానసిక సమస్యలను తీర్చే ప్రాంగణాలుగా రూపొందాలి. విద్యార్థుల్లో పెరుగుతున్న మానసిక, అనారోగ్య సమస్యలను తీర్చేలా, తరగతి గదిలో, బాహ్య ప్రపంచంలో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కొనేలా పాఠశాలలు చర్యలు తీసుకోవాలి. మానసిక పరిపక్వత, భావోద్వేగ నియంత్రణ వంటి అంశాల్లో విద్యార్థులకు శిక్షణ ఇవ్వాలి. కెరీర్ కౌన్సెలింగ్ కూడా వారి ఒత్తిడిని తగ్గించి ఆత్మవిశ్వాసం పెంపొందించడానికి తోడ్పడుతుంది. విద్యార్థులు ఎదుర్కొంటున్న ఒత్తిడి, మానసిక సమస్యలకు కౌన్సెలింగ్ ప్రోగ్రామ్స్ ఎంతో సత్ఫలితాలనిస్తాయి. ఈ చర్యలను చేపడుతున్న దేశాల్లో ఇది నిరూపితమైంది. మన దేశంలోనూ కౌన్సెలింగ్ కార్యక్రమాలను విస్తృతం చేస్తే దృఢమైన ఆలోచనలతో సవాళ్లను స్వీకరించే స్థాయికి విద్యార్థులు ఎదుగుతారు.

ఇతర దేశాల్లో ఇలా..

ఇతర దేశాల్లో విద్యార్థుల మానసిక ఆరోగ్య పరిరక్షణపై ఆయా దేశాలు దృష్టి సారించాయి. ఫిన్‌లాండ్, కెనడా, నెదర్లాండ్స్ తదితర దేశాల్లో పరీక్షల్లో మార్కుల కంటే సామర్థ్య ఆధారిత అభ్యసనానికే ప్రాధాన్యం ఇస్తున్నారు. కౌన్సెలింగ్, మెంటార్‌షిప్, ప్రయోగాలతో కూడిన అభ్యసనం వంటి వాటి ద్వారా భవిష్యత్ అవకాశాలపై విస్తృత అవగాహన కల్పిస్తున్నారు.

తల్లిదండ్రులు పిల్లల ఆకాంక్షలను గుర్తించాలి

తమ పిల్లల ఎదుగుదలలో ఉపాధ్యాయుల తర్వాత తల్లిదండ్రులకే కీలకపాత్ర. పిల్లలు తమ సమస్యలను, ఆలోచనలను స్వేచ్ఛగా పంచుకునే వాతావరణాన్ని కల్పించాలి. దీనికి భిన్నంగా పిల్లల మాటలను తీసిపారేసేలా ప్రవర్తిస్తే వారు మరింత ఆత్మన్యూనతకు గురవుతారు. ఈ క్రమంలో తల్లిదండ్రులు తమ పిల్లల బలాలు, ఆకాంక్షలను గుర్తించి.. ఆ దిశగా వారిని ప్రోత్సహించాలి.

పరీక్షల విధానంపై పునరాలోచన చేయాలి

మన దేశంలోని పరీక్షల విధానంపైనా పునరాలోచన అవసరం. పరీక్షలు కేవలం సబ్జెక్ట్ నాలెడ్జ్‌నే పరీక్షించే విధంగా ఉండడంతో విద్యార్థులపై తీవ్ర ఒత్తిడి ఉంటోంది. విద్యార్థులు కూడా ఆయా పాఠ్యాంశాల భావనలను.. నిజ జీవిత పరిస్థితుల్లో అన్వయించే నైపుణ్యాలను పొందడం కంటే మార్కులు సాధించేందుకు బట్టీ పట్టి చదువుతున్నారు. పర్యవసానంగా వాస్తవ పరిస్థితుల్లో ఆ అంశం ప్రాధాన్యత ఏంటో తెలియట్లేదు. విద్యార్థుల నైపుణ్యాలను వారిలోని ఆలోచనలు, సృజనాత్మకతల ఆధారంగా ఉపాధ్యాయులు గుర్తించాలి.

ఇంటర్‌లో కొత్త గ్రూపు ఎంబైపీసీ

మ్యాథ్స్-ఏ, బీ ఒక సబ్జెక్ట్...
బోటనీ-జువాలజీ ఒక సబ్జెక్టు

- ఫిబ్రవరి చివరి వారంలోనే వార్షిక పరీక్షలు
- 2025–26 విద్యా సంవత్సరం నుంచి నూతన మార్పులు అమలు
- ఇంటర్ బోర్డు సమావేశంలో నిర్ణయం



సాక్షి, అమరావతి: వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఇంటర్మీడియెట్ విద్యలో పలు మార్పులు రానున్నాయి. జూన్ ఒకటో తేదీకి బదులు ఏప్రిల్ ఒకటి నుంచే ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ప్రారంభమవుతాయి. ఏప్రిల్ 7 నుంచి మొదటి సంవత్సరం విద్యార్థుల అడ్మిషన్ల ప్రక్రియ మొదలవుతుంది. అదేవిధంగా డిజిలాకర్, వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా సజావుగా ఆన్‌లైన్ యాక్సెస్ ఉండేలా 1973 నుంచి 2003 వరకు ఇంటర్మీడియెట్ బోర్డు ఫలితాల డేటాను డిజిటలైజ్ చేయనున్నారు. ఈ మేరకు మంత్రి లోకేశ్ అధ్యక్షతన గురువారం అసెంబ్లీ ప్రాంగణంలోని ఆయన కార్యాలయంలో జరిగిన ఇంటర్మీడియెట్ విద్యా మండలి 77వ సమావేశంలో నిర్ణయించారు. ఈ సమావేశంలో విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్, కాలేజియేట్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ నారాయణ భరత్‌గుప్తా, ఇంటర్మీడియెట్ విద్య డైరెక్టర్ కృతికా శుక్లా, పాఠశాల విద్య డైరెక్టర్ విజయరామరాజు, సమగ్ర శిక్ష స్పెషల్ ప్రాజెక్ట్ డైరెక్టర్ బి.శ్రీనివాస్‌రావు, ఎంప్లాయిమెంట్ అండ్ ట్రైనింగ్ డైరెక్టర్ జి.గణేష్‌కుమార్, ఉన్నత విద్యామండలి చైర్మన్ మధుమూర్తి, వివిధ యూనివర్సిటీల వీసీలు పాల్గొన్నారు.

ఇవీ నూతన మార్పులు...

- 2025–26 విద్యా సంవత్సరంలో ఇంటర్ వార్షిక పరీక్షలను 2026 ఫిబ్రవరి చివరి వారం నుంచే నిర్వహిస్తారు.
- కొత్త విద్యా సంవత్సరంలో మొదటి సంవత్సరం విద్యార్థులకు ఎలక్టివ్ సబ్జెక్టులను 2వ సబ్జెక్టుగా ప్రవేశపెట్టనున్నారు. లాంగ్వేజెస్, సైన్స్, హ్యూమానిటీస్ విభాగాల్లోని 24 ఆప్షన్స్‌లో ఒక సబ్జెక్టును 2వ సబ్జెక్టుగా ఎంపిక చేసుకోవచ్చు.
- జూనియర్ కళాశాలల్లో ఆరు సబ్జెక్టులతో ఎంబైపీసీ గ్రూప్‌ను ప్రవేశపెట్టనున్నారు.
- సీబీఎస్ఈ విధానంలోకి వెళుతున్నందున మొదటి సంవత్సరం విద్యార్థులకు 14 సబ్జెక్టులకు (సైన్స్, హ్యూమానిటీస్, లాంగ్వేజెస్ సహా) కొత్త సిలబస్‌తో పాఠ్యపుస్తకాలు అందించనున్నారు.
- ప్రస్తుతం రెండు సబ్జెక్టులుగా ఉన్న మ్యాథ్స్–ఏ, బీ పేపర్లను ఒక సబ్జెక్టుగాను, బోటనీ–జువాలజీలను కలిపి ఒకే సబ్జెక్టుగాను మార్చారు.
- ప్రభుత్వ కాలేజీల విద్యార్థులకు నీట్, ఐఐటీ పరీక్షల మెటీరియల్‌ను ఇంటర్మీడియెట్ బోర్డు పోర్టల్‌లో అందుబాటులో ఉంచడంతోపాటు విద్యార్థులకు మెటీరియల్‌ను ఉచితంగా అందజేస్తారు.
- కాంపిటేటివ్ బేస్డ్ అసెస్‌మెంట్ కోసం సైన్స్, హ్యూమానిటీస్ విభాగాల ప్రశ్నల్లో 10శాతం తప్పనిసరిగా బహుళ ఎంపిక ప్రశ్నలు, ఖాళీలను పూరించే రూపంలో ఒక మార్కు ప్రశ్నలు ఉండేలా ప్రశ్నపత్రాలు రూపొందించాలని నిర్ణయించారు.
- నేషనల్ స్కిల్ క్వాలిఫికేషన్ ఫ్రేమ్‌వర్క్ (ఎన్ఎస్‌క్యూఎఫ్) ప్రకారం సిలబస్ సవరణ, వృత్తి విద్య విద్యార్థుల కోసం డ్యుయల్ సర్టిఫికేషన్ ప్రవేశపెట్టనున్నారు. వృత్తి విద్య కోర్సుల పాఠ్యాంశాలను పరిశ్రమల అవసరాలకు తగ్గట్టుగా సవరించాలని, ఆయా ప్రాంతాల్లో ఏర్పాటయ్యే పరిశ్రమలతో ఒప్పందాలు చేసుకోవాలని నిర్ణయించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మానసిక ఆరోగ్య కౌన్సెలర్లు

- సమగ్ర శిక్ష ద్వారా 255 మంది నియామకం
- జూన్ నుంచి పూర్తిస్థాయిలో విధుల్లోకి..

సాక్షి, అమరావతి: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల మానసిక ఒత్తిడిని తగ్గించేందుకు సమగ్ర శిక్ష చర్యలు చేపట్టింది. విద్యార్థుల ప్రవర్తనలో మార్పులను గమనించి అవసరమైన సూచనలు చేసేందుకు మానసిక ఆరోగ్య కౌన్సెలర్లను నియమిస్తోంది. రాష్ట్రంలోని పలు విశ్వవిద్యాలయాల్లో తాజాగా సైకాలజీ పూర్తి చేసిన అభ్యర్థులను ఇందుకోసం ఎంచుకుంది. మొత్తం 255 మందిని విధుల్లోకి తీసుకోనుంది. వచ్చే నెలలో వీరికి శిక్షణ పూర్తి చేసి జూన్ 12 నుంచి విధుల్లో చేరేలా సమగ్ర శిక్ష.. ప్రణాళిక సిద్ధం చేసింది. ఆరో తరగతి నుంచి ఇంటర్ విద్యార్థుల వరకు వీరు పర్యవేక్షిస్తారు. రాష్ట్రంలోని జిల్లాల వారీగా పాఠశాలల సంఖ్య ఆధారంగా జిల్లాకు ముగ్గురి నుంచి 10 మందిని నియమిస్తున్నారు. పరీక్షలంటే భయం, తీవ్ర ఒత్తిడి, మానసిక, వ్యక్తిగత సమస్యలతో చదువుపై దృష్టి పెట్టలేకపోతున్న విద్యార్థులకు వీరు కౌన్సెలింగ్ ఇస్తారు. అలాగే ఆ విద్యార్థుల గురించి ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు తగిన సూచనలు కూడా చేయాల్సి ఉంటుంది. తమకు కేటాయించిన స్కూళ్లల్లో మానసిక శ్రేయస్సు, కెరీర్‌పై అవగాహన సదస్సులు నిర్వహిస్తారు. వారానికి రెండు, మూడు గంటలు ఇందుకోసం కేటాయించాలని.. ఈ మేరకు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని సమగ్ర శిక్ష దిశానిర్దేశం చేసింది. పిల్లలతో జరిగే కౌన్సెలింగ్ సదస్సుల్లో తల్లిదండ్రులను కూడా భాగస్వాములు చేయాలని నిర్ణయించింది.

ఎస్సీ వర్గీకరణ నివేదిక పరిశీలనకు మంత్రుల కమిటీ

సాక్షి, అమరావతి: ఎస్సీ వర్గీకరణపై ఏకసభ్య కమిషన్ (రాజీవ్ రంజన్‌మిశ్రా) సమర్పించిన నివేదికను పరిశీలించి, సూచనలు చేసేందుకు ఐదుగురు మంత్రులతో కమిటీని ఏర్పాటు చేస్తూ సీఎస్ విజయానంద్ గురువారం ఉత్తర్వులిచ్చారు. కమిటీలో సభ్యులుగా మంత్రులు డీబీవీ స్వామి, అనిత, బీసీ జనార్దనరెడ్డి, నాదెండ్ల మనోహర్, సత్యకుమార్ ఉన్నారు. కమిటీ సమావేశాలు, కార్యక్రమాలను సమన్వయానికి కన్వీనర్‌గా సాంఘిక సంక్షేమశాఖ కార్యదర్శిని నియమించింది.

సెలవైనా సర్వేల్లో పాల్గొనాల్సిందే

సచివాలయాల సిబ్బందికి ఆదేశాలు

సాక్షి, అమరావతి: పీ–4 వంటి ఇంటింటి సర్వేలను సెలవు రోజుల్లోనూ కొనసాగించాలని గ్రామ/వార్డు సచివాలయాల సిబ్బందికి ఎంపీడీవోల ద్వారా అధికారులు మౌఖిక, ఎస్ఎంఎస్‌ల రూపంలో ఆదేశాలిస్తున్నట్లు సచివాలయాల ఉద్యోగ సంఘాల నేతలు తెలిపారు. శుక్రవారం హోలీ సెలవైనప్పటికీ.. అధికారులు సచివాలయాల సిబ్బందిని సర్వే విధుల్లో పాల్గొనాలని అందులో పేర్కొన్నట్లు తెలిపారు. సర్వే విధుల్లో పాల్గొనని వారి జాబితాలను కలెక్టర్ ఆఫీస్‌లకు పంపాలని ఆదేశాల్లో చెప్పినట్లు పేర్కొన్నారు.

యథాతథస్థితి కొనసాగించండి

విశాఖ హయగ్రీవ భూములపై ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం



సాక్షి, అమరావతి: విశాఖపట్నం ఎండాడలోని హయగ్రీవ భూముల స్వాధీనం విషయంలో నాలుగు వారాల పాటు యథాతథస్థితి (స్టేటస్ కో) కొనసాగించాలని హైకోర్టు గురువారం అటు రాష్ట్ర ప్రభుత్వాన్ని, ఇటు పిటిషనర్లను ఆదేశించింది. భూ కేటాయింపుల రద్దు విషయంలో పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. తదుపరి విచారణను రెండు వారాల తరువాతకు వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ తూటా చంద్ర ధనశేఖర్ గురువారం మధ్యంతర ఉత్తర్వులు జారీచేశారు. తమ భూముల కేటాయింపులను రద్దుచేస్తూ విశాఖ జిల్లా కలెక్టర్ ఈనెల 10న జారీచేసిన ఉత్తర్వులను సవాలుచేస్తూ హయగ్రీవ ఫార్మ్స్ అండ్ డెవలపర్స్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. అలాగే, తనకు చెందిన 385 చదరపు గజాల స్థలాన్ని కూడా స్వాధీనం చేసుకుంటున్నట్లు కలెక్టర్ ప్రొసీడింగ్స్‌ను సవాలుచేస్తూ ఆ స్థల యజమాని ఐనంపూడి నాగేశ్వరరావు మరో పిటిషన్ దాఖలు చేశారు. ఈ రెండు వ్యాజ్యాలపై గురువారం జస్టిస్ ధనశేఖర్ విచారణ జరిపారు. హయగ్రీవ తరఫున సీనియర్ న్యాయవాది బి.ఆదినారాయణరావు, నాగేశ్వరరావు తరఫున న్యాయవాది జవ్వాజి శరత్‌చంద్ర వాదనలు వినిపించారు. హయగ్రీవ భూ కేటాయింపులపై దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యంలో సీజే ధర్మాసనం ఆ భూముల విషయంలో నిర్ణయాధికారాన్ని ప్రభుత్వానికి కట్టబెట్టిందన్నారు. ధర్మాసనం ఆదేశాలకు విరుద్ధంగా కలెక్టర్ స్వాధీన ఉత్తర్వులిచ్చారని తెలిపారు. ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ (ఏజీ) దమ్మాలపాటి శ్రీనివాస్ వాదనలు వినిపిస్తూ.. భూ కేటాయింపు నిబంధనలను హయగ్రీవ ఉల్లంఘించిందని, అందుకే ఆ కేటాయింపులను రద్దుచేశామన్నారు. వాటిని రద్దుచేయాలని ప్రభుత్వం నిర్ణయించి మెమో ఇచ్చామని.. ఆ మేరకు ఉత్తర్వులు జారీచేయాలని కలెక్టర్‌ను ఆదేశించామన్నారు. ఇప్పటికే ఆ భూమిని స్వాధీనంలోకి తీసుకున్నామన్నారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి భూముల స్వాధీనం విషయంలో నాలుగు వారాలపాటు యథాతథ స్థితిని కొనసాగించాలని ఇరుపక్షాలను ఆదేశించారు.

ప్రభుత్వానికి కాపులపై వివక్ష తగదు

- పవన్ పక్కన ఉంటే కాపులంతా తమతోనే ఉంటారని చంద్రబాబు ధీమా
- సీఎం చంద్రబాబుకు కాపు ఐక్యవేదిక బహిరంగ లేఖ

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం కాపులపై వివక్షను, సవతి తల్లి ప్రేమను చూపడం తగదని కాపు ఐక్యవేదిక పేర్కొంది. ఈ విషయమై సీఎం చంద్రబాబుకు రాసిన లేఖను కాపు ఐక్యవేదిక చైర్మన్ రావి శ్రీనివాస్, కన్వీనర్ బోడపాటి పెదబాబు, కో–కన్వీనర్ కాకిలేటి హరనాథ్ గురువారం మీడియాకు విడుదల చేశారు. ఎన్నికల ముందు కాపుల్లో భావోద్వేగాన్ని రెచ్చగొట్టి అధికారంలోకి రావడం, ఆ తర్వాత కాపుల ప్రయోజనాలను పూర్తిగా గాలికి వదిలేయడం సర్వసాధారణమైపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో అత్యంత అమాయకులు, భావోద్వేగం కలిగిన వారు కాపులు మాత్రమేనని, వారిని అడ్డుపెట్టుకుని పాలకపక్షాలు అధికారంలోకి వస్తున్నాయని పేర్కొన్నారు. పవన్‌కళ్యాణ్ సాయంతో 2014లో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు కాపులకు బీసీ (ఎఫ్) ద్వారా 5శాతం రిజర్వేషన్లు ఇస్తామని ఒకసారి, ఈడబ్ల్యూఎస్ 10 శాతంలో కాపులకు 5 శాతం సబ్‌కోటా ఇస్తానని మరోసారి చెప్పి చాలా పకడ్బందీగా మోసం చేశారన్నారు. 2024 ఎన్నికల్లో తిరిగి పవన్‌కళ్యాణ్‌ను అడ్డుపెట్టుకుని కాపుల్లో భావోద్వేగాలను రెచ్చగొట్టి 95 శాతం కాపుల ఓట్లను పొంది మళ్లీ అదే వివక్షను టీడీపీ కొనసాగిస్తోందన్నారు. పవన్‌కళ్యాణ్ తమ వెంట ఉన్నంత వరకు కాపులు వారితోనే ఉంటారన్న ధీమాతో వ్యవహరిస్తున్న చంద్రబాబు కాపులపై తీవ్రమైన నిర్లక్ష్య వైఖరి అవలంభిస్తున్నారని మండిపడ్డారు.

ఆ గంటే.. కీలకమంట



గోల్డెన్ అవర్‌లో కంప్లైంట్‌తో మేలు

- సైబర్ నేరగాళ్లను పట్టుకునేందుకు ఆ సమయమే ప్రధానం



శ్రీకాకుళం క్రైమ్ : గోల్డెన్ అవర్.. ఇప్పటివరకు రోడ్డు ప్రమాదాలు సంభవించేటప్పుడు మాత్రమే ఈ పదం వినుంటారు. ప్రమాదాలు సంభవించిన గంటలోపే క్షతగాత్రులను ఆస్పత్రికి చేర్చడం దీని ఉద్దేశం. ఇదే తరహాలో సైబర్ మోసాలకు గురయ్యే బాధితులు సైతం నేరం జరిగిన గంటలోగా ఫిర్యాదు చేయగలిగితే.. మన ఖాతాలో పోగొట్టుకున్న సొమ్మును తిరిగి రాబట్టుకునే వీలుంటుంది. బాధితులు చేయాల్సిందల్లా గోల్డెన్ అవర్‌లో సైబర్‌సెల్‌కు ఫిర్యాదు చేయడమే. నేషనల్ క్రైమ్ రికార్డ్ బ్యూరో (ఎన్‌సీఆర్‌బీ) ఇచ్చిన నివేదిక ప్రకారం జిల్లాలో ఇప్పటి వరకు ఐదువేలలోపు సైబర్ నేరాలకు సంబంధించి ఫిర్యాదులు వెళ్లాయి. తాము మోసానికి గురవుతున్న నిమిషాల్లోనే ఎన్‌సీఆర్బీకి, 1930 సైబర్ సెల్ నంబర్‌కు డయల్ చేసి ఫిర్యాదు ఇవ్వడం వలన సుమారు రూ. 4.09 కోట్ల వరకు సేవ్ అయినట్లు ఈ నివేదికలు చెబుతున్నాయి. జిల్లాలో తొలిసారిగా ఐదు సైబర్ కేసులకు సంబంధించి రూ. 10.13 లక్షలు బాధితులకు అందించినట్లు ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ఇటీవల వెల్లడించారు.

ఫిర్యాదు చేయాలిలా..

- మనం మోసపోయిన క్షణానే 1930 నంబర్‌కు కాల్ చేయాలి.
- లేదంటే హెచ్‌టీటీపీఎస్://సీవైబీఇఆర్‌సీఆర్ఐఎంఇ.జీఓవీ.ఐఎన్ అనే పోర్టల్‌ను క్లిక్ చేయాలి. హోమ్‌పేజీలోకి వెళ్లి ఫైల్ ఎ కంప్లైంట్ ఆప్షన్‌పై క్లిక్ చేస్తే అక్కడ కొన్ని నియమాలు షరతులు చూపిస్తుంది. వాటిని చదివి యాక్సెప్ట్ చేసి రిపోర్ట్ అదర్ సైబర్ క్రైమ్ బటన్‌పై క్లిక్ చేయాలి.
- తర్వాత సిటిజన్ లాగిన్ ఆప్షన్ సెలెక్ట్ చేసి పేరు, ఫోన్ నంబర్, ఈ–మెయిల్ వివరాలు ఎంటర్ చేస్తే రిజిస్టర్ మొబైల్ నెంబర్‌కు ఓటీపీ వస్తుంది.
- ఓటీపీ ఎంటర్ చేసి క్యాప్చా కోడ్‌ను బాక్స్‌లో ఫిల్ చేసి సబ్మిట్ బటన్ నొక్కాలి. తర్వాత పేజీలోకి తీసుకెళ్తుంది. అసలు ప్రక్రియ మొదలయ్యేది ఇక్కడే.
- ఈ పేజీలో ఒక ఫారం కనిపిస్తుంది.. దానిలో మనకు జరిగిన సైబర్ మోసం గురించి రాయాలి. కాకపోతే నాలుగు సెక్షన్లుగా విభజించి ఉంటుంది. సాధారణ సమాచారం (విక్టిమ్ ఇన్ఫర్మేషన్), సైబర్ నేరానికి సంబంధించి సమాచారం (సైబర్ క్రైమ్ ఇన్ఫర్మేషన్), ప్రివ్యూ అనే సెక్షన్లు ఉంటాయి.
- ప్రతి సెక్షన్‌లో అడిగిన వివరాలను సమర్పిస్తూ.. ప్రక్రియను పూర్తిచేయాలి. మూడు సెక్షన్లు పూర్తయ్యాక ప్రివ్యూను వెరిఫై చేయాలి. అన్ని వివరాలు సరిగా ఉన్నాయమని భావిస్తే సబ్మిట్ బటన్ క్లిక్ చేయాలి.
- తర్వాత ఘటన ఎలా జరిగిందనేది వివరాలు నమోదుచేయాలి. నేరానికి సంబంధించిన స్క్రీన్ షాట్లు (అకౌంట్ ట్రాన్సాక్షన్ తదితర) ఫైల్స్ వంటి ఆధారాలు, సాక్ష్యాలు అందులో పొందుపర్చాలి. వివరాలు సేవ్ చేసి నేరగాళ్ల గురించి ఏదైనా సమాచారం తెలిస్తే ఫిల్ చేయాలి.
- అంతా వెరిఫై చేసుకున్నాక సబ్మిట్ బటన్ క్లిక్ చేస్తే కన్ఫర్మేషన్ మెసేజ్ వస్తుంది. కంప్లైంట్ ఐడీతో పాటు ఇతర వివరాలతో కూడిన ఈ–మెయిల్ వస్తుంది. తర్వాత అధికారులు దర్యాప్తు ప్రారంభిస్తారు.
- ఫిర్యాదు చేయడం ఆలస్యమైతే దుండగుడు డబ్బును వేర్వేరు ఖాతాల్లో మళ్లించేస్తాడు. లేదంటే క్రిప్టో కరెన్సీగా మార్చుకునే ప్రమాదముంది.



క్షణాల్లో ఫిర్యాదు చేయండి..



సైబర్ మోసానికి గురయ్యేవారు వెంటనే గుర్తించాలి. క్షణాల్లో ఫిర్యాదు చేస్తే మన డబ్బులు వెనక్కి వచ్చే అవకాశాలెక్కువ. లేదంటే ఎక్కడ ఉంటారో.. వారి ఖాతాలు ఏ రాష్ట్రానికి చెందినవి.. ఇవన్నీ కనుక్కోవడం పెద్ద ప్రాసెస్. 1930కు గానీ, ఎన్‌సీఆర్‌బీకి గానీ ఫిర్యాదు చేసి బ్యాంకు వాళ్లను, దగ్గరలో ఉన్న పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలి.

– కేవీ మహేశ్వరరెడ్డి, ఎస్పీ

సైబర్ మోసానికి గురైతే 1930 నంబర్‌కు కాల్ చేయాలి.

Published and printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza,2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22.Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708.
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943 Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.